# తెలంగాణ జీవనది

# ప్రొ॥ జయశంకర్

## (ప్రముఖుల వ్యాసాలు, అభిప్రాయాలు)



జననం 06-08-1934 మరణం 21-06-2011

తెలంగాణ రిసోర్స్ సెంటర్

హైదరాబాద్

# తెలంగాణ జీవనది ప్రొ॥ జయశంకర్

Telangana Jeevanadi Pro. Jayashankar


| | | |
|---|---|---|
| ప్రచురణ కాలం | : | జూలై, 2011 |
| Edition | : | July, 2011 |
| ప్రచురణ | : | తెలంగాణ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్ |
| Published by | : | Telangana Resource Centre |
| ప్రచురణ కర్త | : | **ఎం. వేదకుమార్,** చైర్మెన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Publisher | : | M. Vedakumar, Chairman, Telangana Resource Centre |
| సంకలన కర్త | : | **బొనకుర్తి సోమేశ్వర్,** కో-ఆర్డినేటర్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Collected by | : | Bonakurthi Someshwar, Co-ordinator,<br>Telangana Resource Centre |
| ప్రతులకు | : | **తెలంగాణ రిసోర్స్ సెంటర్**<br>"చంద్రం" 490, స్ట్రీట్ నెం. 11, హిమయత్‌నగర్, హైదరాబాద్.<br>telanganaresource@gmail.com; Mobile : 9030626288<br>దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి<br>సహచర బుక్‌మార్క్, బాగ్‌లింగంపల్లి<br>ధరణి బుక్‌స్టాల్ ఫీవర్ హాస్పిటల్<br>నవయుగ బుక్ హౌస్, సుల్తాన్‌బజార్<br>నవోదయ బుక్ హౌస్, కాచిగూడ |
| Copies | : | Telangana Resource Centre<br>"CHANDRAM" 490, Street No. 11, Himayathnagar,<br>Hyderabad. Mobile : 9030626288<br>telanganaresource@gmail.com |
| | : | Disha Pustaka Kendram, Chikkadpally<br>Sahachara Bookmark, Baghlingampalli<br>Navayuga Book House, Sultan Bazaar<br>Navodaya Book House, Kachiguda |
| కంపోజింగ్ | : | ధరణి గ్రాఫిక్స్ |
| వెల | : | **రూ. 25/-** |

Printed at :
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph.+91-040-27678411
e-mail : deccan.press@yahoo.com

# తెలంగాణ జీవనది

# ప్రొ॥ జయశంకర్

## ప్రముఖుల వ్యాసాలు, అభిప్రాయాలు




తెలంగాణ రిసోర్స్ సెంటర్

హిమాయత్‌నగర్

హైదరాబాద్

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| తెలంగాణ రిసోర్స్ సెంటర్ మాట : ఆచార్యుడి అస్తమయం | – వేదకుమార్. యం | 3 |
| ముందుమాట : జయశంకర్ వ్యక్తిత్వం – సామాజిక స్పందన | – ప్రొ॥ జి. హరగోపాల్ | 4 |
| సీమాంధ్ర మీడియావన్నీ వక్రీకరణలే ... | – ప్రొ॥ జయశంకర్ | 7 |
| కరుణామయుడు | – కట్టా శేఖర్ రెడ్డి | 13 |
| చరిత్రకు ఒక పాఠం | – గద్దర్ | 14 |
| తౌరక్యాంధ్రం అనడం న్యాయమా? | – ప్రొ॥ జయశంకర్ | 17 |
| స్నేహశీలి, నిరాడంబరుడు | – ప్రొ॥ జి. హరగోపాల్ | 19 |
| తెలంగాణ రహ్‌న జాయే సహ్‌న జాయే భాత్ అధీ | – వరవరరావు | 21 |
| మన తరం మార్గదర్శి | – ప్రొ॥ ఘంటా చక్రపాణి | 25 |
| మరపు రాని తెలంగాణ బిడ్డ | – ఎన్. వేణుగోపాల్ | 28 |
| తెలంగాణ తీర్పరి! | – మల్లెపల్లి లక్ష్మయ్య | 30 |
| నాలుగు తరాలతో నడిచిన యోధుడు | – వి. ప్రకాశ్ | 32 |
| విడిపోవడం అనివార్యం | – ఎబిఎన్ ఆంధ్రజ్యోతి | 36 |
| నేలకొరిగిన శిఖరం | – నమస్తే తెలంగాణ | 40 |
| తీరని లోటు | – ఆంధ్రజ్యోతి | 44 |
| మాటలురాని దుఃఖం | – వార్త దినపత్రిక | 46 |
| సి.కె.ఎం కళాశాలలో జయశంకర్ సార్‌తో ... | – ఎస్. జీవన్ కుమార్ | 48 |
| తెలంగాణ జీవనది | – బోనకుర్తి సోమేశ్వర్ | 53 |
| నిరంతర మార్గదర్శకులు | – ప్రొ॥ ఇ. రేవతి | 55 |
| అజాత శత్రువు | – చుక్కా రామయ్య | 57 |
| తొలితరం దార్శనికుడు | – ప్రొ॥ జి. లక్ష్మణ్ | 59 |
| తీరనిలోటే కానీ, తీర్చవలసిన లోటు కూడా | – కె. శ్రీనివాస్ | 62 |
| జయశంకర్ మార్గం ... 'తెలంగాణ'కు ఆదర్శం | – ఆదిత్య | 65 |
| మనకాలం యోధుడు | – డాక్టర్ వెల్పాల కొండలరావు | 68 |
| మూడు తరాల ఉద్యమానికి ఊపిరి... | – శ్రీధరరావు దేశ్‌పాండే | 71 |
| తెలంగాణ రాష్ట్రం సాధనే ప్రొ॥ జయశంకర్‌కు నివాళి | – అమర్ | 73 |
| జనమెరిగిన జయశంకర్ ! 'తెలంగాణ' వచ్చేవరకు బతికుంటే ... | – వెల్చాల చంద్రశేఖర్ | 75 |
| మన సాంస్కృతిక ఉద్యమ తల్లిపేగు జయశంకర్ | – జూలూరు గౌరీశంకర్ | 77 |
| వారం వారం మారనివాడు | – దేశపతి శ్రీనివాస్ | 79 |
| మహోన్నత వ్యక్తిత్వం | – అప్పరసు రమాకాంతరావు | 82 |
| ఒక దీపస్తంభం | – తెలకపల్లి రవి | 84 |
| ఋషితుల్యుడు | – లోచన్ | 87 |
| మహోన్నత వ్యక్తి జయశంకర్ | – సి.హెచ్. హనుమంతరావు | 89 |
| తెలంగాణ శిఖరం | – జూలురు గౌరీశంకం | 90 |
| ఓరుగల్లు పోరుబిడ్డ | – పెసరు లింగారెడ్డి | 91 |
| జీవనది ఆగిపాయే ... | – వనపట్ల సుబ్బయ్య | 92 |
| జయశంకర్! జయ తెలంగాణ!! | – జూకంటి జగన్నాథం | 93 |
| **అనుబంధం** | | |
| విషాద తెలుగు సమాజం | – ప్రొ॥ జి. హరగోపాల్ | 94 |

## తెలంగాణ రిసోర్స్ సెంటర్ మాట

# ఆచార్యుడి అస్తమయం

ప్రొ॥ జయశంకర్ సార్ చనిపోయిన గుర్తుగా పుస్తకం వేయాల్సిన పరిస్థితి ఇంత తొందరగా వస్తుందనుకోలేదు. తెలంగాణ కోసమే జీవితాంతం ఆలోచించన వ్యక్తి, పనిచేసిన శక్తి ప్రొ॥ జయశంకర్. తెలంగాణ ఉద్యమజ్యోతిని వెలిగించిన శ్వాస ఆగిపోయింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించి, జీవితాన్ని ధారపోసిన విద్యావంతుడు, మహామేధావి, విలువలు గల రాజనీతిని పాటించిన వాడు, తెలంగాణ సమస్యలపై లోతుగా అధ్యయనం చేసి విశ్లేషించి జనానికి అర్థమయ్యే భాషలో వాటిని వివరించి చైతన్య పరిచినవాడు జయశంకర్ సార్. ప్రాంతీయ వివక్ష కారణంగా ఇక్కడి ప్రజలు ఎలా నష్టపోతున్నారో గ్రహించుకుని అందరికీ తేటతెల్లంగా వివరించేవాడు. తెలంగాణ సమస్యలపై తెలుగు, ఇంగ్లీషు భాషలలో అనేక అధ్యయన పత్రాలు విడుదల చేశాడు. ఎన్నో సంస్థలు, వేదికల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి నేటి తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసి, ఎగిసిపడుతున్న ఉద్యమానికి దారి చూపినవాడు.

1952లో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించాడు. నాన్ ముల్కీ ఉద్యమంలో ఇడ్లీ సాంబార్ గో-బ్యాక్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. ఆనాటి నుంచి డిశంబర్ 9, 2009లో తెలంగాణ ప్రకటన తెచ్చే వరకు తెలంగాణ ఉద్యమం వేసిన ప్రతి అడుగులో కార్యకర్తగా భాగం పంచుకున్నారు ప్రొ॥ జయశంకర్.

అంతేకాక క్రమశిక్షణకు అమిత ప్రాధాన్యతనిచ్చిన విద్యావేత్త. అవతలి వ్యక్తుల అభిప్రాయాలను గౌరవించడంలో, మనుష్యులను ప్రేమించడంలో మనపై ఓ ముద్ర వేశాడు. నాకు ప్రొ. జయశంకర్ సార్‌ను ప్రొ. హరగోపాల్ గారు పరిచయం చేశారు. పలు సందర్భాల్లో చర్చల్లో పాల్గొనడమే కాక, నేను నిర్వహించిన భారతదేశంలో విద్యా విధానం సెమినార్‌లో అధ్యక్షత వహించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కొన్ని సలహాలు, సూచనలు తీసుకోవడం జరిగింది. ఆయన ఆరోగ్యం క్షీణించినా అదే ధీమాతో ఉద్యమంలో చివరి శ్వాస వరకు పాలు పంచుకుంటూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కాకముందే మనకు దూరమయ్యారు. ఆయన మరణవార్తవిని, మేమంతా దిగ్భ్రాంతికి గురయ్యాము. వెంటనే హన్మకొండకు పయనమయ్యాం. అక్కడి జన సముద్రం ఆయనకు నివాళి అర్పించడాన్ని కళ్ళార చూస్తూ, ఆయన భౌతికకాయంపై శపథం చేశాము. తెలంగాణ సాధించడం కోసం శ్రమించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి. ఆయనపై వచ్చిన వ్యాసాలను ఈ జీవనది పుస్తకంగా టి. ఆర్. సి. తెలంగాణ సమాజానికి అందిస్తూ, ఆయనకు ఇవే మా అశ్రునివాళి...

**– వేదకుమార్. యం**

చైర్మన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్

## ముందుమాట

# జయశంకర్ వ్యక్తిత్వం - సామాజిక స్పందన

*- ప్రొ॥ జి. హరగోపాల్*

జయశంకర్ గారి మరణం మీద తెలంగాణ సమాజ స్పందన కొంత అనూహ్యంగా ఉంది. అయితే ఆయన అంతిమ యాత్రలో కాని, లేదా మీడియాలో కాని వచ్చిన స్పందన తెలంగాణలో ఇంకా విలువల కొరకు, విశ్వాసాల కొరకు బ్రతికిన వారి పట్ల చూపిన అభిమానం తెలంగాణ సమాజ భవిష్యత్తు మీద విశ్వాసాన్ని కలిగించేలా ఉంది. ఆయన విచారధార, ఆయన విస్తృత వ్యక్తిత్వం, ఆయన నిలబడ్డ లక్ష్యానికుండె విశాల మద్దతు స్పష్టంగా ఈ పుస్తకంలోని భిన్న వ్యాసాల్లో మనం చూడవచ్చు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలి అని పోరాడే వాళ్ళందరు, వాళ్ళు ఏ భావజాలానికి చెందినా, జయశంకర్ రాజకీయ విశ్వాసాల పట్ల ఎంత విముఖత వున్నా, ఆయన వ్యక్తిత్వాన్ని గౌరవించారు. ఇలా వ్యక్తిగా అంగీకరించబడి, భావాలతో విభేదముండడం అనేది ఒక సంక్లిష్ఠ సామాజిక అనుభవం. చాలా వరకు వ్యక్తిత్వాన్ని వ్యక్తి రాజకీయ విశ్వ్వాసాలని కలగలిపి గందరగోళపడే వాళ్ళు చాలా మంది ఉంటారు. ఇలా వ్యక్తిగత విలువల పట్ల గౌరవమనేది వ్యక్తి నిజాయితీ నుండి జీవన శైలి నుండి వస్తుంది. ఆయనకు గౌరవించే వాళ్ళందరికి ఆయనకున్న నిజాయితీ లేకున్న ఎదుటి వారి నిజాయితీని గౌరవించే ఒక సంస్కృతి సమాజంలో పెరగాలి. ఒక ఫిలాసఫర్ ఒక సందర్భంలో వ్రాస్తూ "హిపోక్రసి చెడు మంచి పట్ల తన విధేయతను గౌరవాన్ని ప్రకటించడమే" అన్నాడు. నిజానికి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటున్న చాలా మంది కళాకారులు, విద్యావంతులు, రచయితలు, జర్నలిస్టులు ఇతర వర్గాల్లో ఈ హిపోక్రసి చాలా తక్కువ అనే విషయాన్ని గమనించినప్పుడు నూతన తెలంగాణ సమాజానికి కావలసిన ముడి సరుకు ఈ ప్రంతంలో చాలా ఉంది అనికూడా అనిపిస్తుంది.

విశిష్ఠ వ్యక్తిత్వాన్ని గురించి, ఆయనలోని చాలా పార్శ్వాల గురించి, తెలంగాణ పట్ల వుండే అపార అభిమానాన్ని గురించి, ఆయన జీవన విధానాన్ని గురించి, ఆయన ధృఢ సంకల్పాన్ని గురించి, ఆయన రాజకీయ పరిస్థితి గురించి, ఆయన సభలో చేసే ప్రసంగాలలో వుండే స్పష్ఠత గురించి, సరళత గురించి, ఎదుటివారిని ఒప్పించే వాదనా పటిమ గురించి, ఆయన పనిచేసిన వ్యవస్థలలో చూపిన పాలనా సామర్థ్యాన్ని గురించి, విశ్వ విద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తి గురించి, స్నేహాన్ని గురించి, విశ్వసనీయత గురించి ... ఇంకా ఇంకా ఆయనకు సంబంధించిన వాళ్ళ వాళ్ళకుండే ప్రత్యక్ష అనుభవాలు వ్రాశారు. అన్ని వ్యాసాలు చదివితే జయశంకర్ గురించి ఒక సమగ్ర అవగాహన ఏర్పడుతుంది.

అయితే జయశంకర్ గురించి, లేదా ఏ విశిష్ఠ వ్యక్తి గురించి విశ్లేషించినా ఆ వ్యక్తి పుట్టి, పెరిగిన సామాజిక వ్యవస్థ గురించి ఈ రెండింటికుండే అవినాభావ సంబంధాన్ని గురించి చాలా తక్కువ విశ్లేషణ జరుగుతుంటుంది. ఇది ఒక రకంగా మనందరిలో వుండే ఒక పరిమితి. ఒక వ్యక్తిని అర్థం చేసుకుంటున్నపుడు ఆ వ్యక్తిని రూపొందించిన సమాజాన్ని విస్మరించడం వలన ఆ వ్యక్తి విశిష్ఠత ఎంత గొప్పగా వుందో ఆ సమాజ పునాదులలో ఆ విశిష్ఠతకు సంబంధించిన మూలాలు ఉంటాయి అని కూడా గుర్తించాలి.

ఈ మధ్యకాలంలో మరణించిన విలక్షణమైన, విశిష్ఠమైన వ్యక్తులందరిమీద తెలుగు సమాజం ముఖ్యంగా

తెలంగాణ చైతన్య ప్రభావముంది. మొన్న సిద్దిపేటలో జరిగిన మంజీర రచయితల రజతోత్సవాలలో ఈ అంశాన్ని రాంచంద్రమూర్తిగారు ప్రస్తావిస్తే, దానికి కె. శ్రీనివాస్, దేవిప్రియ, శివారెడ్డి గార్లు స్పందించారు. శివారెడ్డి అద్భుత కవిత్వానికి, దేవీప్రియ విలువైన రచనలకి తెలంగాణ పోరాటాలే స్ఫూర్తి అని ఒక కృతజ్ఞతా పూర్వక ప్రకటన చేశారు. వాళ్ళు ఆ మాటలో ఎవరినో సంతృప్తి పరచడానికి అన్నది కాదు. శివారెడ్డిలాంటి కవికి అలా మాట్లాడవలసిన అవసరం లేదు. అంటే పోరాటాలు, ఉద్యమాలు వ్యక్తులను ఎంత ప్రభావితం చేస్తాయో విశదమవుతుంది.

జయశంకర్ తెలంగాణలో రాజకీయ చైతన్యస్థాయి అతి ఉన్నత దశలో వుండే కాలంలో తాను పుట్టి పెరిగిన వరంగల్‌కు ఉద్యోగ రీత్యా తిరిగి రావడం, భావ ఘర్షణతో కూడిన సి.కె.యం. కాలేజీకి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు తెలంగాణ ఉద్యమంలోని విభిన్న అభిప్రాయాల పట్ల సమన్వయాన్ని సాధించడానికి ఎంతో ఉపయోగపడ్డాయి. తె.రా.స. పార్టీలో సంక్షోభం నచ్చినపుడు ఆ పార్టీ ఆయన మీద ఆధారపడింది. నిజానికి ఆర్.యస్.యు. నుండి ఆర్.ఎస్.ఎస్. దాకా ఎవ్వరు తెలంగాణకు మద్దతు ఇచ్చినా తనను మాట్లాడమని అంటే తనకు అభ్యంతరం లేదని చాలా సందర్భాల్లో అన్నాడు. అంటే సి.కె.యం. కాలేజి బాగా నడచినంతకాలం, అధ్యాపకుల రాజకీయ విశ్వాసాలతో సంబంధం లేకుండా అందరిని కలుపుక తీసుక పోవాలని ప్రయత్నించాడు. ఒక టీవీ ఛానల్ చేసిన ఇంటర్వ్యూలో తనను ప్రభావితం చేసిన వ్యక్తులు ఎవరు అంటే వరవరరావు అని నిస్సంకోచంగా అనడంలోనే జయశంకర్ విశిష్ఠ వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. జయశంకర్ ఏ స్థాయిలో పని చేసినా లక్ష్యం పట్ల ఒక స్పష్టత కలిగుండే వారు. దానికొరకు నిజాయితీగా నిరంతరంగా, అలసట లేకుండా కృషి చేశారు. బహుశ ఆయన వ్యక్తిత్వం వరంగల్లు రాజకీయ చైతన్యం, తెలంగాణ కుండే పోరాట చరిత్ర, ఈ సామాజిక అనుభవం నుండి పుట్టుక వచ్చిన విలక్షణ వ్యక్తిత్వాల ప్రభావాల ద్వారా రూపొందిందన్న అంశాన్ని అర్థం చేసుకుంటే, ఎందుకు ఆయనకు ఇంత విస్తృత అభిమానులున్నారో అర్థమవుతుంది. అయితే అందరమూ అదే సందర్భంలో జీవిస్తున్న కొందరే ఇలా ఎందుకు ఇంత ఎత్తుకు ఎదుగుతారు అన్న ప్రశ్నకు ఇంత వరకు సామాజిక విశ్లేషణలో సంతృప్తికర సమాధానం లేదు.

**– ప్రొ॥ జి. హరగోపాల్**

బర్రెంటె నవ్వులాట
గేదంటేనే పాలు,
పెండంటె కొంప మునుగు
పెండంటే ఎరువు
రెండున్నర జిల్లాలదె దండి భాష తెలుగు, తక్కినోళ్ల యాస త్రొక్కి నొక్కి పెట్టు తీర్పు
వహ్వారే! సమగ్రాంధ్ర వాదుల ఔధార్యమ్ము
ఎంత చెప్పినా తీరదు స్నేహము సౌహార్థమ్ము

**– కాళోజీ**

పదరా పదరా పోదాం పదరా
తెలంగాణ సాధిద్దాం పదరా
దొంగల దూరం కొడదాం పదరా
వేరే రాజ్యం చేద్దాం పదరా

**– కాళోజీ**

# జయశంకర్ మహాప్రస్థానం

పూర్తి పేరు : కొత్తపల్లి జయశంకర్

పుట్టిన తేదీ : 1934 ఆగస్టు 6

తల్లిదండ్రులు : మహాలక్ష్మి, లక్ష్మీకాంతారావు

జన్మస్థలం : అక్కంపేట, ఆత్మకూరు మండలం, వరంగల్ జిల్లా.

విద్యాభ్యాసం : బెనారస్, అలీగఢ్ యూనివర్శిటీల నుంచి ఎకనామిక్స్‌లో ఎమ్మే, ఉస్మానియా నుంచి బీఈడీ, పీహెచ్‌డీ.

పదవులు : వైస్ ఛాన్సలర్, కాకతీయ వర్శిటీ, వరంగల్ (1991–94), రిజిస్ట్రార్, కాకతీయ వర్సిటీ, వరంగల్ (1978–81), రిజిస్ట్రార్, సీఫెల్, హైదరాబాద్ (1982–91), నేషనల్ కమీషన్ ఫర్ ఎంటర్ ప్రైజెస్ సభ్యుడు (2004–06). ఎల్‌ఐసీ సలహా మండలి సభ్యుడు. సీఫెల్, కాకతీయ, ఉస్మానియా, కేరళలోని మహాత్మాగాంధీ వర్సిటీల్లో పలు హోదాల్లో పని చేశారు. పలు సంస్థలు, పరిశోధన, అధ్యయన కేంద్రాల్లో జీవిత కాల సభ్యుడు.

ఉద్యోగ సంఘాలు : గవర్నమెంటు కాలేజీ టీచర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి : తెలంగాణ గవర్నమెంటు కాలేజీ టీచర్ల సంఘం ప్రధాన కార్యదర్శి, ఆలిండియా ఫెడరషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజీ టీచర్స్ ఆర్గనైజేషన్స్ జాతీయ కమిటీ సభ్యుడు. తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు.

ఉద్యమ జీవితం : 1952లో విద్యార్థి దశలోనే నాన్ ముల్కీ ఉద్యమం. విశాలాంధ్ర ఉద్యమానికి వ్యతిరేకంగా పోరాటం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలంటూ 1954లో ఎస్సార్సీకి విన్నపం. 1968–69లో ఉపాధ్యాయునిగా ఉంటూనే తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం. తెలంగాణ డెవలప్ మెంట్ ఫక్షరం (టీడీఎఫ్) ఆహ్వానం మేరకు అమెరికాలో 10 పెద్ద పట్టణాల్లో తెలంగాణ ఉద్యమంపై ఉపన్యాసాలు. తెలంగాణ ఐక్య వేదిక వ్యవస్థాపక, కార్యవర్గ సభ్యుడు.

వ్యాసకర్త : తెలంగాణ సమస్యలపై పుస్తకాలు, పరిశోధన గ్రంథాలు, వందలాది వ్యాసాలు, పరిశోధన గ్రంథాలు, వందలాది వ్యాసాలు రాశారు. 'తెలంగాణ రాష్ట్రం – ఒక డిమాండు' పుస్తకం ఉద్యమకారులకు కరదీపిక. ప్రాంతీయ తత్వాలు, అభివృద్ధిపై విస్తృతంగా పరిశోధన చేశారు.

# సీమాంధ్ర మీడియావన్నీ వక్రీకరణలే ...

**- ప్రొ॥ జయశంకర్**

సుదీర్ఘ తెలంగాణ ఉద్యమానికి ప్రత్యక్ష సాక్షి ప్రొఫెసర్ జయశంకర్! సీమాంధ్రుల కుట్రలకు బలైన తొలితరం ఉద్యోగి కూడా ఆయనే. ఇక్కడి భూమి ... ఇక్కడి వనరులు ... ఇక్కడి ఉద్యోగాలు ... ఇక్కడి సంస్కృతి ... వలసవాదుల దోపిడీకి గురవుతుంటే ... ఐదు దశాబ్దాల క్రితమే తెలంగాణ సాధన కోసం ... కదన రంగంలోకి అడుగు వేసిన తొలి సైనికుడు! ఇప్పుడు జయశంకర్ పేరు ... తెలంగాణ ఉద్యమ బావుటా. ఆయన భావజాలంతో ... ఆయన చూపిన 'సిద్ధాంత' బాటలో తెలంగాణ చైతన్యవంతంగా పరుగులు పెడుతోంది. ఆయన ... తెలంగాణ సాధికారిక స్వరం. సమస్త తెలంగాణ ఉద్యమానికి పెద్ద దిక్కు... 'నమస్తే తెలంగాణ' ప్రారంభ సంచికకు ప్రత్యేకకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇవీ ఆ విశేషాలు.

- తెలంగాణ అస్తిత్వ ఆకాంక్ష అర్థం కాలేదు.
- ఇదంతా కుట్రపూరితంగానే జరిగింది.
- నమస్తే తెలంగాణను జనం గుండెలకు హత్తుకుంటారు.
- నమస్తే తెలంగాణతో ఇతర పత్రికలూ పంథా మార్చుకుంటాయి.
- తెలంగాణ రాజకీయ నాయకత్వంపై కూడా ఒత్తిడి పెరుగుతుంది.
- ఉద్యమానికి చోదకశక్తి కేసీఆరే.
- తెలంగాణ వాగ్గేయకారులది గొప్ప సేవ.
- శ్రీశ్రీకిచ్చిన గౌరవం దాశరథికి ఇవ్వలేదు
- రాజధానిలో అన్నింటికీ సీమాంధ్ర నేతల పేర్లేనా ...?
- నమస్తే తెలంగాణకు ప్రొఫెసర్ జయశంకర్ ప్రత్యేక ఇంటర్వ్యూ...

రాష్ట్రంలో ఇప్పటిదాకా సీమాంధ్ర పెట్టుబడిదారుల గుత్తాధిపత్యంలోనే మీడియా ఉంది. వారికి ఈ పెత్తనం ఎలా వచ్చిందంటే ... ఆంధ్ర ప్రదేశ్ అవతరణ అయిన తర్వాత మొదటిసారిగా నీళ్లను వాడుకున్నది వాళ్లే ... దీంతో సంపద పెరిగింది. ఆ పెరిగిన సంపదతోనే హైదరాబాద్‌కు వచ్చారు. అందుకే సినిమా, మీడియా, కార్పొరేట్ రంగంలో పెత్తనం నిలుపుకొనేందుకు ప్రయత్నించారు. వాళ్ళ పెత్తనాన్ని కాపాడుకునేందుకు మీడియాను ప్రధాన సాధనంగా ఎంచుకున్నారు. అయితే మీడియా ఎప్పుడైనాగానీ వాస్తవాలను చెప్పాలి. కానీ సీమాంధ్ర పెత్తందార్ల గుప్పిట్లో ఉన్న మీడియా తెలంగాణ విషయానికొచ్చేసరికి ... వాస్తవాలను వక్రీకరించడం ... కప్పిపుచ్చడం చేసింది. దీనితో ఏమైందంటే ... సీమాంధ్ర సగటు మనిషికి తెలంగాణ ప్రాంతం సమస్య అర్థం కాలేదు. ఈ రోజుకు కూడా సీమాంధ్రలో ఉన్న సామాన్య ప్రజలకు తెలంగాణ పట్ల వ్యతిరేకత లేదు. అయితే మీడియా వారందర్నీ ఏమార్చింది. తెలంగాణవాదులకు కూడా వాటిని తిప్పికొట్టేందుకు మీడియా లేదు. దీనితో బయటవారికి వాస్తవాలను తెలపడంలో మీడియా విఫలమైంది. అయితే ఇదంతా ఒక పథకం, ప్రణాళిక ప్రకారం ... కుట్ర పూరితంగానే జరిగింది.

అందుకే తెలంగాణ సమస్యను సీమాంధ్రలోని సాధారణ ప్రజలుఅర్థం చేసుకోలేకపోయారు.

ఇంతకాలం మనకున్న పెద్ద కొరత మీడియా లేకపోవడమే ... ఇప్పటికే టీ–న్యూస్ రావడం వల్ల చాలా మార్పు కనిపిస్తోంది. ఈ చానల్‌ను సీమాంధ్ర వారు కూడా బాగా చూస్తున్నారు. తెలంగాణలో మీడియా పెరిగితే ఇక్కడి ప్రజలను మరింత చైతన్యం చెయ్యొచ్చు. అదే విధంగా మన సమస్యలను ఇతర ప్రాంతాలకు తెలిపే అవకాశం ఉంటుంది. సీమాంధ్రులు నడిపే న్యూస్ పేపర్లు ఎలా ఉన్నాయంటే ... పెట్టుబడిదారులు వాళ్ళు ... ఎడిటర్లను మన వాళ్ళనే పెడుతారు. క్షేత్రంలో పనిచేసేవారూ మనవాళ్లే కానీ ... వారు రాసినదాన్ని వీరు వేయరు. నిజం చెప్పాలంటే ఇదొక విషవలయం. ఇందులో నుంచి బయటపడాలంటే ఆంధ్ర పెత్తనం లేని పత్రికలు ఎక్కువగా రావాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో వస్తున్న నమస్తే తెలంగాణను ప్రజలు గుండెలకు హత్తుకుంటారు. ఇదొక ప్రారంభం. అంతేకాదు ... నమస్తే తెలంగాణ రావడం వల్ల ... ఇతర పేపర్లు కూడా పంథా మార్చుకోవాల్సిన ఒత్తిడి పెరుగుతుంది. తెలంగాణ రాజకీయ నాయకత్వంపై కూడా ఒత్తిడి పెరుగుతుంది. నాటి నుంచి నేటి దాకా ఇక్కడి రాజకీయ నాయకుల దుస్థితి ఏంటంటే ... వారిని ఏ పార్టీ నాయకత్వం కూడా ఎదగనివ్వలేదు. ఎదిగిన నాయకత్వాన్ని నిలవనియ్యలేదు. పీవీ, చెన్నారెడ్డి లాంటి జాతీయ స్థాయికి ఎదిగిన నాయకులను కూడా ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించి మూడు రోజులకే ఇండ్లకు పంపిండ్లు. దీనితో మన నాయకుల్లో పరాధీనత బాగా పెరిగింది. ఇప్పటికైనా మన నాయకులు మాకు ఉప ముఖ్యమంత్రి పదవి కావాలంటున్నారు. కానీ ... ముఖ్యమంత్రి పదవి కావాలని కోరుకోవడం లేదు. ఇంతటి పరాధీనతలో మన రాజకీయ నాయకులున్నారు. అందుకే ఇక్కడి నాయకత్వం కూడా ఎదగాలి. వారికీ ఓ సొంత గొంతుక కావాలి. ఈ సందర్భంలో కూడా తెలంగాణకు కొత్త పత్రిక అనేది చాలా అవసరం.

## ప్రజల్లో చైతన్యం పెరిగింది

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర భావన అనేది చాలా కాలం క్రితమే నాటుకున్నది. ఒక విధంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ కంటే ముందే ... 1952లో తెలంగాణను విశాలాంధ్రలో కలపడం దగ్గరే కిరికిరి మొదలయ్యింది. సరే ... ఆ తర్వాత రాష్ట్రం ఏర్పడ్డది. ఒప్పందాల ఉల్లంఘన జరిగింది. ఆ తర్వాత చాలా మంది ఉద్యమం సమసిపోయిందంటారు గానీ నేనొప్పుకోను. ఉద్యమం అంటే కేవలం ఆందోళనలు మాత్రమే కాదు ... భావజాల వ్యాప్తి కూడా ... ఉద్యమానికి మూడు పార్శ్వాలుంటాయి. అందులో ఒకటి భావజాల వ్యాప్తి ... రెండోది ఆందోళనలు ... మూడోది రాజయీయ ప్రక్రియ. ఇందులో ఆందోళనలు నిరంతరం కొనసాగలేవు ... ఒకసారి ఉవ్వెత్తున లేస్తాయి. మరోసారి చప్పబడిపోతాయి. రాజకీయ ప్రక్రియ కూడా అంతే... ప్రతీసారి ఆ ప్రక్రియను వాడుకోలేం. కానీ భావజాల వ్యాప్తి మాత్రం నిరంతరం కొనసాగింది. కొనసాగుతూనే ఉంటుంది. దానికి ఎప్పుడూ అంతరాయం కలగలేదు. ఈ భావజాల వ్యాప్తివల్లే ఉద్యమాలకు ఊతం లభించింది. రాజకీయ ప్రక్రియ కూడా అంతే ... ప్రతీసారి ఆ ప్రక్రియను వాడుకోలేం. కానీ భావజాల వ్యాప్తి మాత్రం నిరంతరం కొనసాగింది.... కొనసాగుతూనే ఉంటుంది. దానికి ఎప్పుడూ అంతరాయం కలగలేదు. ఈ భావజాల వ్యాప్తి వల్లే ఉద్యమాలకు ఊతం లభించింది. రాజకీయ ప్రక్రియలు ప్రభావితం అయినయి. కనుక 1970 తర్వాత ఉద్యమం లేదనడం అర్థరహితం. అయితే ఉద్యమంలో 1996 నుంచి 2001 వరకు ఒక దశ. ఏమిటా దశ అంటే ... ఈ దశలో కూడా భావజాల వ్యాప్తి విస్తృతంగా జరిగింది. అనేక వేదికలొచ్చాయి. అనేక మంది విద్యావంతులు, విద్యార్థులు అందులో పాల్గొన్నారు. అపారమైన సాహిత్యం వచ్చింది. అలాగే ప్రజల్లో చైతన్యం బాగా పెరిగింది. తెలంగాణ గురించి అందరూ మాట్లాడటం మొదలైంది. దేశంలోనేగాక, విదేశాల్లో కూడా తెలంగాణ గురించి చర్చించుకున్నారు. కాబట్టే నాలాంటి వాణ్ణి అమెరికాకు పిలిపించుకుని సభలు పెట్టారు. ఆ క్రమంలోనే మరికొన్ని వేదికలొచ్చాయి. విప్లవ పార్టీల సపోర్టు ఉన్నదనే వేదికలు కూడా వచ్చాయి. అవన్నీ ఒక దశకైతే వచ్చాయిగానీ రాష్ట్ర సాధన అనే ధ్యేయం నెరవేరలేదు.

ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చేసరికి దాశరథి ఆస్థాన కవిగా ఉండేవారు. ఎన్టీఆర్ ఆయనను తొలగించి, అవమానపరిచారు. ఆ అవమాన భారంతోనే ఆయన చనిపోయారు. సరే ... ఎలాగూ చంపేశారు. కనీసం ఆయన విగ్రహమైనా పెట్టమని అడిగితే పట్టించుకోలేదు.

## కేసీఆర్‌తో పరిచయం ...

2001లో అమెరికాలో తెలంగాణ అవగాహన సదస్సులలో పాల్గొంటుంటే ... మీరు తిరిగి రావాలని కేసీఆర్ నుంచి పిలుపు వచ్చింది. అంతకు ముందు నాకు కేసీఆర్‌తో పరిచయం లేదు. తర్వాత చాలా మీటింగ్‌లు మా మధ్య జరిగాయి. తెలంగాణ విషయంలో నేను అప్పటికే చాలా మందితో కలిసి పని చేశా. చెన్నారెడ్డి నుంచి చిన్నారెడ్డిదాకా ... అయితే కేసీఆర్ ఏ విషయం కూడా కన్విన్స్ కాంది ఒప్పుకోడు. అంతగా అవగాహన ఉన్నవాడు నా మొత్తం అనుభవంలో ... రాజకీయ నాయకుల్లో ఫస్ట్ పర్సన్ కేసీఆరే. తెలంగాణ సమస్యను లోతుగా అధ్యయనం చేసి, ప్రజల భాషలో, ప్రజల నుడికారంతో ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కేసీఆర్ సక్సెస్ అయ్యారు. సమస్యను అవగాహన చేసుకుని ... దాన్ని ప్రజల దగ్గరికి చక్కగా తీసికెళ్లడంతో నేను కేసీఆర్ పట్ల ఆకర్షితుణ్ణయ్యా. ఇక రాజకీయ ప్రక్రియపై నాకు పెద్దగా ఆసక్తి లేదు. రాజకీయ ప్రక్రియ లేనిదే రాష్ట్ర ఏర్పాటు కాదనేది తేలిపోయింది. రాజకీయ ప్రక్రియ జరగాలంటే రాజకీయ నాయకుడే రావాలి. సమకాలీన రాజకీయాలను గమనిస్తూ ... ఎలాంటి సమస్యనైనా తట్టుకునే శక్తి కేసీఆర్‌కు ఉంది. అంతెందుకు ఏ రాజకీయ నాయకుడు కూడా పదేళ్ల పాటు ఉద్యమాన్ని పట్టుకుని లేరు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, వెన్నుపోట్లు పొడిచినా, విమర్శించినా, ఆరోపణలు వచ్చినా ... పట్టుదలగా నిలబడిన ఏకైక నాయకుడు కేసీఆర్. ఒక బలమైన ఆయుధంగా ఆయన జాతీయ స్థాయిలో తన వాణిని గట్టిగా వినిపించారు. ఆయన పాత్రను ఆయన సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఉద్యమానికి ఆయనొక చోదకశక్తిగా ఉన్నారు.

ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చేసరికి దాశరథి ఆస్థాన కవిగా ఉండేవారు. ఎన్టీఆర్ ఆయనను తొలగించి, అవమానపరిచారు. ఆ అవమాన భారంతోనే ఆయన చనిపోయారు. సరే ... ఎలాగూ చంపేశారు. కనీసం ఆయన విగ్రహమైనా పెట్టమని అడిగితే పట్టించుకోలేదు.

## పదేళ్లలో ప్రజల్లోకి ఉద్యమం ...

2001లో టిఆర్ఎస్ వచ్చింది. ఈ దశాబ్దకాలంలో ఉద్యమానికుండే మూడు పార్శ్వాలు సమాంతరంగా సాగాయి. రాజకీయ ప్రక్రియ అనివార్యం అనే వాస్తవాన్ని గ్రహించడం జరిగింది. దీన్ని కొంత మంది ఒప్పుకోకపోయినా అది వేరే సంగతి. ఈ పదేళ్ల కాలంలో ఉద్యమం స్థిరపడిపోయింది. విస్తృతమైంది. వ్యవస్థీకృతమైంది. ఇదో గొప్ప మార్పు. అయితే గతంలో ఎన్ని ఉద్యమాలు వచ్చినప్పటికీ జాతిని ఏ మేరకు ఆకర్షించాలో ఆ మేరకు ఆకర్షించలేకపోయాయి. 2004 ఎన్నికల తర్వాత ప్రధాన పరిణామం ఏంటంటే ... తెలంగాణ సమస్య మొదటి సారిగా జాతీయ స్థాయికి వెళ్ళింది. తెలంగాణ జాతీయ అజెండాగా మారింది. దాదాపు అన్ని పార్టీలూ తెలంగాణపట్ల సానుకూలంగా స్పందించాయి. ఆనాటి పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఉంటే ... కాంగ్రెస్ సపోర్టు చేసి ఉంటే ... మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటేసేవారు. ఇందులో అతివాద పార్టీలున్నాయి. మితవాద పార్టీలున్నాయి. ఇక్కడ ఓ విశేషం ఏమిటంటే ... అందరి దగ్గరికి బహిరంగంగా వెళ్లాం .... గుసగుసలు పెట్టలేదు. ఆర్.ఎస్.ఎస్‌తో పాటు ... జైళ్లలో వున్న మావోయిస్టు ప్రతినిధుల అభిప్రాయాలను కూడా సేకరించడం జరిగింది. జైల్లో ఉన్న మావోయిస్టు ప్రతినిధి దగ్గరికి ఓ కేంద్ర మంత్రి పోవడం అనేది అంతకు ముందు ఎప్పుడూ జరగలేదు. ఇదో రికార్డెడ్ హిస్టరీ ... చరిత్రలో చెరిగిపోని సత్యం. మొత్తంగా గత పదేళ్లలో జరిగిన పరిణామాలు ఏంటంటే ... తెలంగాణ అంశం దేశం దృష్టిని ఆకర్షించింది.

రెండోది ... ఆయా కమిటీలు మాట తప్పడం వల్ల మళ్లీ ఉద్యమంలోకి వెళ్లక తప్పలేదు. అయితే 1996 కన్నా పూర్వం తెలంగాణ గురించి మాట్లాడేవారు, రచనలు చేసినవారు తక్కువ మంది కనిపించేవారు. కానీ ఇప్పుడలా కాదు. అధ్యయనాలు, పరిశోధనలు, విశ్లేషణలు, రచనలు నిరంతరం సాగుతున్నాయి. ఈ రోజు తెలంగాణ సమస్య గురించి అందరూ చెప్పగలుగుతున్నారు. మాట్లాడగలుగుతున్నారు ... విశ్లేషిస్తున్నారు. ఈ ఉద్యమంతో ఆబాలగోపాలం మమేకం అయ్యింది. కాబట్టి మాలాంటివారి ప్రసంగాలు ఇప్పుడక్కర్లేదు. ఉద్యమం ప్రజల్లోకి వెళ్లి విస్తృతమై, స్థిరపడి పోయింది. ఇది మా తరం వాళ్లకు తృప్తి.

## గేయ సాహిత్యం ... గొప్ప కాంట్రి బ్యూషన్ ...

గేయ సాహిత్యంలో ఉన్న విశేషం ఏంటంటే ... నాలాంటి వాళ్లు వంద వ్యాసాలు రాసినా, ఉపన్యాసాలిచ్చినా మర్చిపోతారు. కానీ వాటిని పాటల రూపంలోకి మల్చడం వల్ల ఉద్యమం గ్రాస్ రూట్స్‌లోకి వెళ్లింది. ప్రతీ ఒక్కరి నోళ్లలో ఈ పాటలు నానుతున్నాయి. తెలంగాణ వాగ్గేయ కారులు పెద్ద సంఖ్యలో వచ్చారు. తెలంగాణ నుడికారంతో వీళ్ల కలం నుంచి వచ్చిన సాహిత్యం సంఖ్యాపరంగానే కాదు ... గుణాత్మకంగా కూడా గొప్పది. అందుకే చదువురాని వాళ్లు, సామాన్యులకు కూడా తెలంగాణ గురించి తెలిసింది. నేటి వాగ్గేయకారులకు ... పాత వాగ్గేయ కారులకు తేడా ఏంటంటే ... అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు లాంటి వాళ్లు భగవంతులు ... వారి లీలల గురించి రాశారు.

కానీ ఈనాటి తెలంగాణ వాగ్గేయకారులు మానవుల వెతల గురించి రాశారు. మానవ సమాజంలో ఉండే వెతలను, వాస్తవాలను అధ్యయనం చేసి వీరు అద్భుతంగా గేయాలు రాశారు. ఉద్యమానికి ఇది గొప్ప కాంట్రిబ్యూషన్.

## అందరూ పంథా మార్చుకున్నరు ...

ఒకప్పుడు 1996లో ఉద్యమం మొదలు పెట్టినప్పుడు, వరంగల్‌లో సభ పెట్టినప్పుడు ... ప్రత్యేక వాదాన్ని ఉక్కుపాదంతో నలిపేస్తానన్నాడు ఇదే చంద్రబాబు. ఇప్పుడేమైంది? అలాంటి చంద్రబాబు తెలంగాణ ఉద్యమ ఉక్కుపాదం కింద నలిగిపోయిండు. ఇది కూడా గొప్ప పరిణామమే కదా. చంద్రబాబులాంటివాడు కూడా ప్రజాభిప్రాయానికి తలవంచక తప్పలేదు. అట్లాగే సీపీఐ తన పంథా మార్చుకుంది. న్యూడెమోక్రసీ తన పంథా మార్చుకుంది. ఈ రోజు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఇలా మాట్లాడుతున్నారంటే ఒత్తిడి పెరగబట్టేకదా. ఇప్పుడు తెలంగాణకు నో అనే పార్టీలు ఏమీలేవు. ఉద్యమంలో ఇదో గొప్ప విజయం. ఇక ఉద్యమంలో చారిత్రాత్మక సన్నివేశం డిసెంబర్ 9 ప్రకటన. కాబట్టి ఇక తెలంగాణకు ఢోకాలేదు. ఈ ఉద్యమాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదు.

## శ్రీశ్రీ సరే ... దాశరథి మాటేమిటి ...?

చాలాకాలంగా చర్చ దోపిడీ గురించి జరిగింది. అయితే దోపిడీతో పాటు దాడి కూడా మొదలైంది. తెలంగాణ సంస్కృతిపైన ... యాసపైన, భాష పైన, ఇక్కడి నుడికాంపైన, ఇక్కడి పండగలపైన వారు దాడి చేశారు. వీళ్లకు చరిత్ర లేదు అనే పరిస్థితి సృష్టించే ప్రయత్నం చేశారు. ట్యాంక్‌బండ్ మీద విగ్రహాల విషయంలో అలనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో అప్పుడే గొడవపడ్డాం. ఎం.ఐ.ఎం. వాళ్లయితే ఏ విగ్రహాలు పెట్టినా కూల్చేస్తామని అప్పుడే అన్నారు. మనుషులకు లేని రక్షణ విగ్రహాలకు ఎందుకన్నారు. ఈ విషయం ఇటీవల అసెంబ్లీలో అక్బరుద్దీన్ కూడా ప్రస్తావనకు తీసుకొచ్చాడు. కవులు శ్రీశ్రీ, జాషువాలు గొప్పవారే ... అందులో మాకు ఎలాంటి సందేహం లేదు. కానీ దాశరథి కూడా శ్రీశ్రీ అంతటి గొప్పవాడే. ఎందుకు ఆయన విగ్రహం పెట్టలేదు? ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చేసరికి దాశరథి ఆస్థాన కవిగా ఉండేవారు. ఎన్టీఆర్ ఆయనను తొలగించి, అవమానపరిచారు. ఆ అవమాన భారంతోనే ఆయన చనిపోయారు. సరే ... ఎలాగూ చంపేశారు కనీసం ఆయన విగ్రహమైనా పెట్టమని అడిగితే పట్టించుకోలేదు.

అల్లూరి సీతారామరాజులాగే కొమురం భీం కూడా గొప్పవాడే అని ఆనాడే చెప్పాం. అయినా తిరస్కరించారు. తెలంగాణ వైతాళికుల్లో దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామిలు కూడా గొప్పవారే. వాళ్లిద్దరూ నిజామాబాద్ జైల్లో ఉన్నప్పుడు దాశరథి గోడలమీద నిజాంకు వ్యతిరేకంగా నినాదాలు రాసేవారు. ఆయనను చూసి వట్టికోట ఆళ్వారుస్వామి కూడా రాస్తానంటే ఆయన్నూ పోలీసులు కొట్టారు. ఈ విధంగా నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వారి విగ్రహాలు పెట్టలేదు.

ఇక్కడ కొన్ని చారిత్రక వాస్తవాలు మర్చిపోకూడదు... నిజాం దర్బారులో కొంత కాలంఒ కొలువ చేసిన శ్రీశ్రీకి ఇచ్చిన గౌరవం ... నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామికివ్వలేదు. ఇది మన చారిత్రక నేపథ్యాన్ని తుడిచివేసే ప్రయత్నమే. అలాగే విద్యావేత్త, ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీగా పని చేసిన కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహం పెట్టారు కానీ ... అంతకన్నా గొప్ప పేరున్న ఉస్మానియా యూనివర్సిటీకి వీసీగా చేసిన నవాబ్ అలీ యవర్‌జంగ్ విగ్రహం ఎందుకు పెట్టలేదు? నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వాళ్లలో ముస్లింలు కూడా ఉన్నారు కదా ... జర్నలిస్టు షోయబుల్లాఖాన్‌ను విస్మరించారు. ఇక పార్కులకు, రోడ్లకు అన్నింటికీ ఆంధ్రప్రాంతం వారి పేర్లు పెట్టారు కానీ ఒక్క తెలంగాణ ప్రముఖుడి పేరైనా పెట్టారా? వాళ్లకన్నా గొప్పవాళ్లు అనేక మంది ఇక్కడ వున్నారు. అయినా తెలంగాణ వైతాళికులను కావాలని పక్కన పెట్టారు.

ఈ సాంస్కృతిక దాడిలో కుట్ర ఏంటంటే ... తెలంగాణ వైతాళికులను మరుగున పడేయటం ...

అంతెందుకు ... వావిలాల, కాళోజీ దాదాపుగా ఒకేసారి చనిపోయారు. ఇందరూ గొప్పవాళ్లే ... సందేహం లేదు. కానీ వావిలాల చనిపోతే ఆయన స్మారకార్థం కొంత స్థలం కేటాయించారు... విగ్రహాలు పెట్టారు. అది చేయవలసిన పని ... ధర్మం కూడా ... అదే కాళోజీ స్మారకార్థం వరంగల్‌లో వెయ్యి గజాలు ఇవ్వమని అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిని అడిగితే ఇవ్వలేదు. హన్మకొండ, వరంగల్‌లో వెయ్యి గజాలు ఇవ్వడం కష్టమా? చివరికి ఆయన విగ్రహాన్ని అక్కడి ప్రజల సహకారంతో పెడితే ... దాన్ని కూడా రోడ్డు విస్తరణ పేరుతో మూలన పడేశారు. వావిలాలను మేం గౌరవించాం. కానీ మా వాళ్ళకు మీరిచ్చిన గౌరవం ఏంటి? హుస్సేన్ సాగర్ తీరాన్ని ఎన్టీఆర్ కోసం ఘాట్‌గా మార్చారు. పీవీ నర్సింహారావు చితి దగ్గర కనీసం కాటికాపరిని కూడా పెట్టలేదు ... ఇదెక్కడి న్యాయం?

## సామాజిక న్యాయం ... తెలంగాణలోనే సాధ్యం ...

సామాజిక న్యాయం జరగాలనేది ఉద్యమంలో ఒక భాగం. సామాజిక న్యాయం అనేది సమైక్యాంధ్రలో అసాధ్యం. తెలంగాణలో మాత్రమే సాధ్యమవుతుంది. సామాజిక న్యాయం అంటే బడుగు బలహీన వర్గాల నుంచి ఓ నాయకుడు తనకు తానుగా నిలబడి ముఖ్య మంత్రి కావాలి. ఇప్పటిదాకా సమైక్యాంధ్రలో అలా ఎవరైనా అయ్యారా? తెలంగాణలో ఎట్ల సాధ్యమంటే ... తెలంగాణలో బడుగు బలహీన వర్గాల్లో చైతన్యం బాగా పెరిగింది. దీనికి అనేక ఉద్యమాలు తోడ్పడ్డాయి. దానికి ఏమిటి నిదర్శనం అంటే ... అప్పటికీ కూడా ఆంధ్ర ప్రాంతంలో దళితులను ఊచకోత కోస్తున్నారు. కానీ తెలంగాణలో దళితుల్లో ఉన్న చైతన్యం వారిని కాపాడుతోంది. ఈ వాస్తవాన్ని తెలంగాణలోని ఓ సామాజిక వర్గం గుర్తించింది. కనుక మాకేం వస్తది అని ఇప్పుడు కాదు ... తెలంగాణ వచ్చిన తర్వాత ప్రశ్నించాలి. ఎప్పుడైనా యాచిస్తే హక్కులు రావు ... పోరాడితే వస్తాయి.

## హైదరాబాద్ ... ఎవడబ్బ సొత్తు ... ?

సీమాంధ్రుల స్వార్థ చింతన ఎంత దూరం పోతోందంటే ... తెలుగు వాళ్లంతా ఒకే రాష్ట్రంలో ఉండాలంటారు ... కానీ విడిపోతే మాత్రం హైదరాబాద్ మాకు కావాలంటున్నారు. ఇదెక్కడి తర్కం? హైదరాబాద్‌కు దాదాపుగా 500 ఏళ్ల చరిత్ర ఉంది. ఎట్ల డెవలప్‌మెంట్ అయ్యిందిది? కుతుబ్‌షాహీల నుంచి ... నిజాం ప్రభువుల దాకా

గొప్ప చరిత్ర ఉంది. అయితే ఇప్పటి చట్టం చెబుతున్నది ఏంటంటే ... ఇప్పుడు చంద్రబాబు నాయుడు , రాజశేఖర్ రెడ్డి స్థానికులట ... జయశంకర్ స్థానికేతరుడు. ఇక్కడి వాళ్లు పరాయి వాళ్లయిన ఘోర సన్నివేశమిది. నిజానికి హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది 5 శతాబ్దాల కాలంలో తెలంగాణవాసులే. తమ రక్తం, చెమటతో దీనిని నిర్మించుకున్నారు. 1953లో మద్రాసు నుంచి ఆంధ్ర విడిపోయినప్పుడు ... రాజధాని కర్నూలులో ఉన్నప్పుడు వాళ్లు మనల్ని ప్రాధేయపడ్డారు. నీలం సంజీవరెడ్డితో పాటు అగ్రనాయకులంతా ఏమన్నారంటే ... ఆంధ్రప్రదేశ్ ఏర్పడకపోతే, హైదరాబాద్ లేకపోతే మనం బతకలేం ... అని మనకు కల్లబొల్లి మాటలు చెప్పారు. మనం నమ్మాం ... వాళ్లను రానిచ్చాం ... అదీ మన ఔదార్యం. తీరా ఇంటికొచ్చి తిన్నింటి వాసాలు లెక్కపెట్టి ... చివరికి మీరెవరు? అని ప్రశ్నించే దుస్థితిని తెచ్చారు. అందుకే తెలంగాణ వాళ్లు ఇక వాళ్ళను సహించాల్సిన అవసరం లేదు.

ఇక ఉమ్మడి రాజధాని అనేది ఓ ఫార్స్. ఈ ఉమ్మడి రాజధాని ఎవరి కోసం? ప్రజల సౌకర్యం కోసమా? పెట్టుబడిదారుల లాభాల కోసమా? రాజకీయ నాయకుల సౌఖ్యాల కోసమా? ఒకవేళ హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని అనుకుంటే ... అటు రాయలసీమ వారుగానీ ... కోస్తాంధ్ర వారు గానీ రాజధానికి రావాలంటే రెండు రాష్ట్రాలు దాటి రావాలి. అదే రాయల సీమ కూడా రాష్ట్రమైతే మూడు రాష్ట్రాలు దాటి రావాలి. సాధారణ పౌరుడు ఇంత ఇబ్బంది పడటం అవసరమా? మరి హైదరాబాద్ ఎవరి ప్రయోజనం? పెట్టుబడిదారుల ప్రయోజనం. రాజకీయ నాయకులు, పెట్టుబడిదారులు ఎక్కడ ఉన్నా నడిపిస్తారు. బెంగళూరులో ఉన్నా ప్యాలెస్‌లు కట్టుకుంటారు. కానీ సాధారణ ప్రజలు ఎందుకు ఇబ్బంది పడాలో ఆలోచించాలి.

మహారాష్ట్ర, గుజరాత్ విడిపోయేటప్పుడు బొంబాయి విషయంలో అంబేద్కర్ ఓ మంచి మాట అన్నారు. 'వ్యాపారం చేసుకోవడానికి వచ్చిన వారు కిరాయిదారులేగానీ యజమానులు కారు' అని. అదే ప్రశ్న మనమిప్పుడు అడుగుతున్నాం.

అంబేద్కర్ పరిభాషలో చెప్పాలంటే ... మీరు కిరాయిదారులేగానీ, యజమానులు కారు. రెండోది ... హైదరాబాద్‌ను విడదీస్తే నీళ్లు, కరెంట్ ఎక్కడినుంచి వస్తాయి? గోదావరి, కృష్ణ వాటర్ రావాలంటే ... తెలంగాణ దాటి రావాలి. అయితే వాళ్లు ట్రిబ్యునల్ ఉంటుందంటారు ... బాగానే ఉంది. అలకేషన్ అమలైందా? ఉదాహరణకు రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌కు బచావత్ ట్రిబ్యునల్ కొంత నీటిని కేటాయించింది. కానీ అవి రావట్లేదు కదా! ఎందుకు రావట్లేదంటే ... ఆంధ్ర ప్రాంతం వాళ్లు గేట్లు పగలగొట్టారు. రేపు కృష్ణా నీటిని హైదరాబాద్‌కు రానివ్వాలంటే నల్గొండ వాళ్లు రానిస్తారా? ఇదే పద్ధతిలో నీవు నేర్పిన విద్యే నీరజాక్షా ... అని ప్రజలంటారు. మద్రాస్ వాళ్లు 24 గంటల్లోనే వెళ్ళి పొమ్మన్నారు. కానీ మేమలా అనడం లేదు కదా ... పోతే ఆంధ్ర ప్రజలకూ రాజధాని కావాలి ... వారు కూడా డెవలప్ కావాలి కదా! ఇక్కడ ఉంటే లాభం లేదు ... కాబట్టి ఉమ్మడి రాజధాని అనేది తాత్కాలికంగా బాగుంటుంది. కానీ శాశ్వతంగా ఉంటే ఆచరణయోగ్యం కాదు ... చాలా సమస్యలొస్తాయి.

ఇక కేంద్ర పాలిత ప్రాంతమంటున్నారు ... అది దేనికి? ఒకవేళ కేంద్ర పాలిత ప్రాంతం చేస్తే ... పరిస్థితి మరింత క్లిష్టం అవుతుంది. అందులో చిక్కులు చాలా వుంటాయి. సీమాంధ్రులు ఒక్కరే ఇక్కడ పెట్టుబడులు పెట్లఏదు కదా ... మీకంటే ఎక్కువగా గుజరాతీలు, మార్వాడీలు పెట్టుబడులు పెట్టారు. దేశంలోని అన్ని ప్రాంతాల వాళ్లు హైదరాబాదులో వున్నారు. వారికి లేని అభద్రతా భావం, అపోహలు మీకెందుకు? ఇక్కడ పెట్టుబడులు పెట్టినట్లే బెంగుళూరులో కూడా పెట్టారు కదా ... అక్కడ లేని అభద్రత ఇక్కడెందుకు వస్తోంది? అంటే .... సీమాంధ్ర నాయకులు వ్యాపారాలు చేసుకుంటూ హైదరాబాద్‌ను గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నారు. అప్పుడు హైదరాబాద్ పెట్టుబడిదారుల రాష్ట్రమవుతుందిగానీ ... ప్రజల హైదరాబాద్ కాదు.

ఇంతకీ హైదరాబాద్ అంటే పాత హైదరాబాదా ... గ్రేటర్ హైదరాబాదా ... పాత హైదరాబాద్ అంటే చిన్నది ... గ్రేటర్ హైదరాబాద్ అంటే ఏమిటీ ... ఇదెట్లాంటిదంటే ... కంపాస్‌తో చిన్న వృత్తం మీద పెద్ద వృత్తం

గీసి ... ఇదంతా మేమే డెవలప్ చేశాం అంటున్నారు. ఎక్కడి నుంచి వచ్చింది ఈ భూమి. కడప నుంచి కట్టకట్టుకొచ్చిండ్లా ...? ఏలూరు నుంచి ఎత్తుకొచ్చిండ్ల? భూమి ఇక్కడిదేనాయే! మనుషులు ఇక్కడివాళ్లేనాయే! వనరులూ ఇక్కడివేనాయే! ఇక వాళ్లు డెవలప్ చేసిందేమిటి? ఉన్న వాళ్లను నిరాశ్రయులను చేసి వెళ్లగొట్టిండ్లు ... దీని వల్ల సామాజిక సమస్యలు ఎక్కువయ్యాయి.

**ప్రొ॥ జయశంకర్**

నమస్తే తెలంగాణ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ యథాతథంగా
7 జూన్, 2011

---

# కరుణామయుడు

జయశంకర్‌సార్ లెని తెలంగాణ ఉద్యమాన్ని ఊహించడం భారంగా అనిపిస్తున్నది. సంక్షోభాల్లో, ఆపత్కాలాల్లో ధైర్యం చెప్పి దిక్కును చూపిన పెద్ద దిక్కు ఇప్పుడు లేరు. వరంగల్ మహాగర్జన సభ తర్వాత కొద్ది రోజులకు జయశంకర్ సార్‌కు ఫోను చేశాను. ఏసార్ వరంగల్ సభకు అంతమంది జనం వచ్చారు. ఆ జనాన్ని చూసి మీరు భావోద్వేగంతో బర్స్ట్ అయి మాట్లాడతారనుకున్నాను. మీరు మృత్యువు సరిహద్దులో వుండి వరంగల్ సభలో మాట్లాడారు. అయినా ఎప్పటిలాగే గంభీరంగా మాట్లాడి కూర్చున్నారు. ఎందుకు సార్' అని అడిగాను. 'బాబూ ... తెలంగాణ ఇప్పటి దాకా అనుభవించిన గర్భశోకం చాలు. ఇప్పటి వరకు బలైన పిల్లలు ఎప్పుడూ నా కళ్లలో మెదలుతూ వుంటారు. నేను ఎమోషనలైజ్ అయి మాట్లాడితే ఈ తరం తెలంగాణ పిల్లలు భరించే స్థితిలో లేరని నాకు తెలుసు. మేమెవరమూ ఆవేశపడకుండా మాట్లాడినా సభా వేదిక వద్దే ఒక యువకుడు ఆత్మత్యాగం చేశాడు. ఇక నేను కూడా ఆవేశపడితే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకో ... మనకు బేలతనం వద్దు. ధైర్యంగా పోరాడాలన్నదే నా ఆకాంక్ష' అన్నారు. మృత్యు ద్వారం చివరి మెట్టుపై నిలబడి తెలంగాణ పిల్లల గురించి అంతటి కరుణతో, అంతటి లోతుగా, ధీరోదాత్తంగా మాట్లాడగలిగిన శక్తి ఎందరికి ఉంటుంది? కానీ ఆయన చివరి నిమిషం వరకు అంతే గంభీరంగా వున్నారు. దవాఖాన నుంచి చివరిసారిగా ఇంటికి తీసుకెళ్లే రోజు ఫోటోగ్రాఫర్‌ను ఫోటోలు తీసుకు రమ్మని పంపాం. కానీ ఆయన సున్నితంగా తిరస్కరించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక ఆవిష్కరణ రోజు పోడియం వద్దకు తీసుకెళ్లడానికి ముందుకు వచ్చినప్పుడు కూడా ఆయన అయిష్టంగానే చేయి అందుకున్నారు. తను దీనంగా కనిపించడం, ఒకరిపై ఆధారపడే విధంగా కనిపించడం ఆయనకు నచ్చేది కాదు. కడ నిమిషం దాకా ఆయన అస్తిత్వం స్పృహ అటువంటిది. సార్‌కు జోహార్!

**– కట్టా శేఖర్ రెడ్డి**
(మాటకు మాట)

నమస్తే తెలంగాణ దినపత్రిక
25 జూన్, 2011

# చరిత్రకు ఒక పాఠం

**- *గద్దర్,*** ప్రజా యుద్ధనౌక

జయశంకర్ సార్‌కు తెలంగాణ నేల నేర్పిన విషయాలను తిరిగి తెలంగాణ మట్టి మనుషులకే ఆయన అందించాడు. తన కళ్లతో చూసిన తెలంగాణను ఆసాంతం అర్థం చేసుకొని ఈ బాధల, గాథల కన్నీళ్లు చెరిగిపోయే విధంగా ఏం చేయాలో ఆలోచించి తెలంగాణ భవిష్యత్తుకు కొత్త చిత్రపటాన్ని గీసిన శిల్పి జయశంకర్. అన్ని విషయాలు అందరికీ తెలియవు. కుంపటి, కొలిమి గురించి తెలిసిన వారికి మట్టితో కుండను చేసే నేర్పరితనం తెలియకపోవచ్చును. కాని అన్ని వర్గాల బాధలను అర్థం చేసుకోవటం దానిని ఆర్థిక శాస్త్రంతో విశ్లేషించటం, రాజకీయ శాస్త్రంతో విరుగుళ్లను ఆలోచించటం సామాజిక విశ్లేషణలు చేయగల ఏ కొద్ది మందికో తెలుస్తాయి. ఆ కొద్ది మందిలో జయశంకర్ ఒకరు. ఆయన అట్టడుగు వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన వాడు. ఒక మంచి అర్థశాస్త్ర బోధకుడు. రాజకీయ పరిణతి చెందిన వ్యక్తి. తెలంగాణకు కావాల్సిన ఓ సైద్ధాంతిక భూమికను అందించిన సిద్ధాంతకర్త. మార్గాలలో భిన్నత్వం ఉండవచ్చును. కానీ గమ్యం చేరటానికి అన్ని దార్లను లక్ష్యం వైపుకు మళ్లించే పని చేసిన కార్యసాధకుడు జయశంకర్.

జయశంకర్ నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నేర్చుకున్న విషయాలు లేదా జయశంకర్ అందించిన గుణపాఠాలు ...

(అ) ప్రజా ఉద్యమాలు జరుగుతున్నప్పుడు ఆ ఉద్యమాల కోసం మేధావి తన మేధస్సును కాంట్రిబ్యూట్ చేయాలి. అది అనివార్యమైనది. ఎందుకంటే తనకున్న మేథో సంపత్తి అంతా అనేక మంది ప్రజల ఆచరణల జ్ఞానం, ఆ జ్ఞానమే మేధావులకు జ్ఞాననేత్రమవుతుంది. ఈ విషయాలను ఆయన ఎప్పుడో గ్రహించాడు. కాబట్టి తన జీవితాన్ని, తన జ్ఞానాన్ని తెలంగాణకు అంకితం చేశాడు.

(ఆ) ప్రజల నుంచి నేర్చుకున్న జ్ఞానంతో లేదా ప్రజా ఉద్యమాలు భిన్న వాదాలతో సంఘర్షించేటప్పుడు ప్రజా ఉద్యమాల నుంచి వచ్చిన మేధావులే ఉద్యమ లక్ష్యం దశ దిశను నిర్దేశిస్తారు. మేధావుల జ్ఞానం జనం సంపద కదా! అట్లాగే జయశంకర్ చేసింది ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల జ్ఞానాన్ని సంశ్లేషణ (సింథసైజ్) చేసి తిరిగి ఆ ప్రజలకు అందజేశాడు. ఈ అందించే క్రమం నుంచే విషయాలు నేర్చుకోవాలి.

ఒక మేధావి నిష్పక్షపాతంగా, నిస్వార్థంగా ఉద్యమం వైపు నిలవాలి. ఆ ఉద్యమం నుంచి ఎలాంటి లాభాలు కోరుకోకూడదు. రాజకీయ, ఆర్థిక, వ్యక్తిగత పలుకబడి కోరకూడదు. ఆ కోరిక ఉంటే తన మేథోసంపత్తిలో భజన్నత్వం ఏర్పడుతుంది. జయశంకర్‌ను ఈ కోణం నుంచి విశ్లేషించి చూడాలి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తనకున్న పరిధులు ఆయనకు తెలుసు. అందుకే ఆయన ఉద్యమంలో ఎక్కడా రాజీపడకుండా తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ముందుకు నడిపించే శక్తులన్నిటికీ తన శక్తిని అందించేందుకు ప్రయత్నించాడు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రజలతో ఆయన అడుగులు వేశాడు. అందుకే ఈ ఉద్యమంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అటు విప్లవోద్యమంతో, ఇటు బూర్జువా రాజకీయ పార్టీలతో మమేకం కావటం వలన తన మార్గాన్ని స్పష్టంగానే ఎన్నుకున్నాడు.

బూర్జువా ఎన్నికల ప్రక్రియను కూడా ఆయన తన ఆలోచనలతో పరిగణనలోకి తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చాడు. ఈ ఎన్నిక ప్రక్రియ కూడా ఉద్యమ పునాదుల మీద జరగాలని కోరుకున్నాడు. అయితే తాను కోరుకున్నట్లు ఎన్నికల ప్రక్రియ కొంత వరకు తెలంగాణ ఉద్యమాన్ని కొంత దూరం నడిపింది. కానీ ఆ అభివృద్ధంతా రాశి (క్వాంటిటేటివ్) లో అభివృద్ధిగానే మిగిలిందనేదే నా అభిప్రాయం. ఎందుకంటే? ఉద్యమాల్ని ఓట్లుగా మార్చుకున్న తెలంగాణ ఉద్యమం అంటే 1969 నుంచి ఇప్పటిదాకా, తిరిగి మహత్తర తెలంగాణ ఉద్యమం చేయటంలో ఆ ప్రక్రియ ఉద్యమానికి సంబంధించి పూర్తి నిర్మాణం చేయలేకపోయింది. ఈ దశలో జయశంకర్ ఆ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనక పోవటం వలన అశేషమైన ప్రజలకు అతని ఉద్యమ ఆలోచనపట్ల కూడా ప్రగాఢ విశ్వాసం కలిగింది. ఇదే అతని అంతిమయాత్రలో మనకు కనిపిస్తుంది.

ఉద్యమకారులు, ప్రజాస్వామికవాదులు, సామాన్య ప్రజలు, కవులు, రచయితలు, కళాకారులు, న్యాయమూర్తులు, సబ్బండ వర్ణాల అశేష ప్రజలు వచ్చారు. అతని అంతిమ యాత్రలో తెలంగాణ పటాన్నే ఆయన దేహంపై కప్పబడింది. ఏ పార్టీ జెండాలు లేవు. ఏ సంఘం జెండా లేదు. అది ఒక్క తెలంగాణ జెండానే కప్పారు. ఇది తెలంగాణ ఉద్యమంలో అరుదైన సంఘటన. అందుకే ఆయన త్యాగాన్ని అతని కలను విజయవంతం చేయటానికి ఈ మలిదశ ఉద్యమం విశాలమైన ప్రజాస్వామిక ఉద్యమ స్వరూపం తీసుకోవాలని తమ అంతిమ వీడ్కోలు యాత్ర అశేష ప్రజలకు సందేశాన్ని ఇచ్చి వెళ్లింది.

తెలంగాణ వరంగల్ డిక్లరేషన్ సభలో జయశంకర్ ఉపన్యాస సారాంశం కూడా అదే. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఒక ప్రత్యేక పరిస్థితి, ఒక ప్రత్యేక నిర్మాణం ఉండాలనేదే ఆయన ఆలోచన, ఆయన సందేశం. ఈ మార్గంలో అనేక మంది కవులు, రచయితలు, కళాకారులు గత పదేండ్లుగా పైన పేర్కొన్న రెండు ధారల మధ్య ఉద్యమం కొనసాగుతూనే ఉన్నది. ఈ రెండు ధారలు సమన్వయం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించే క్రమంలో ఆయన లేకుండా పోవటం నేటి ఉద్యమ దశకు నష్టమే. నేటి మేధావి వర్గం సమష్టిగా ఆ నష్టాన్ని పూరించటానికి నడుము బిగించాలి. అంతేకాదు, తెలంగాణ తప్పక సాధిస్తాం. సాధించిన తర్వాత అశేష ప్రజల కలల్ని, స్వప్నాల్ని నిజం చేసే ఒక దీర్ఘ కాలిక ఆర్థిక, రాజకీయ, సాంఘిక పునర్నిర్మాణాన్ని కూడా తెలంగాణ ప్రజల ముందు ఉంచే బాధ్యతను మనముందు జయశంకర్ వదిలి వెళ్లాడు. ఈ సవాల్‌ను తీసుకునే వాళ్లు ఆయన నిజమైన వారసులవుతారు. తెలంగాణ సాధిస్తారని ఆశిద్దాం.

నాకు తెలిసిన జయశంకర్ ఉద్యమకారుల్ని ప్రేమిస్తాడు. ప్రజలను ప్రేమించేవాడు. ఉద్యమకారుల పట్ల తపన పడతాడు. 1996లో మూడవ దశ ఉద్యమంలో ఉద్యమకారుల్ని వెతుక్కుంటూ జయశంకర్ తిరిగారు. ఉద్యమంలో బిడ్డల్ని వెతుక్కుంటూ పోతారు. పాశం యాదగిరి, మల్లేపల్లి లక్ష్మయ్యలతో కలిసి జయశంకర్ నా ఇంటికి వచ్చారు. నీ ఆయుధమే పాట, నీ పాటను ఎక్కుపెట్టమని జయశంకర్ నన్ను కోరారు. తెలంగాణ గెజిట్స్‌ను నాకందించారు.

అప్పుడు నేను రాసిన పాట "అమ్మా తెలంగాణ మా ఆకలి కేకల గానమా" ... రాశాను. ఆ తర్వాత రెండవ పాట "దగాపడ్డ తెలంగాణ మా గుండె చప్పుడినుడో" అన్నది రాశాను.

"మా అమ్మల్లారా
తెలంగాణలో బడులే లేవు, ఉన్నబడులకు భవంతిలేదు.
చెట్ల కింద మా పోరగాండ్లురా,
నీడ తిరిగినట్లు తిరుగుతంటారు
పంతులు వస్తే పిల్లలురారు, పిల్లలువస్తే పంతులురారు
పంతులు పిల్లలు ఇద్దరు వస్తే
రాయనీకి మా పంతులుగానికి చాకిపీసు లేదో

మా అమ్మల్లారా ..."

ఆ పాటను విన్న జయశంకర్ ఇలా అన్నాడు. ఎంత పెద్ద పుస్తకమైనా జనంలోకిపోదు . ఒక వాగ్గేయకారుడిగా నువ్వు రాసిన ఈ పాట జనం గుండెల్లోకి హత్తుకుపోతోందన్నాడు. భువనగిరి సభ తర్వాత, నాపై కాల్పుల తర్వాత జయశంకర్ ఆస్పత్రికి వచ్చాడు. ఐసియులోంచి నన్ను చూశాడు. ఆయన కళ్లలో బాధ, ఉద్యమకారుల పట్ల ప్రేమను ఆ సందర్భంలో జయశంకర్‌లో చూడగలిగాను. ప్రేమ ఉండేది. నిక్కచ్చిగా విమర్శ కూడా వుండేది.

"శాంతి చర్చలప్పుడు", ఎస్.ఆర్. శంకరన్ గారి దగ్గర జయశంకర్‌ని కలిసినప్పుడు విప్లవకారులు చర్చలకు రావాలా? వద్దా? అన్న చర్చ వచ్చింది. విప్లవకారులు నిజమైన శాంతికాముకులైతే చర్చలకు రావాలని మాతో ఆయన వాదించారు.

శాంతి చర్చలకు వెళ్లాలని, శాంతిని కాంక్షించే ఉద్యమకారులుగా ముందుకు రావాలని కోరాడు. ఉద్యమాలు, ఆ సంబంధ చర్చలు జరిగినప్పుడు జయశంకర్‌ను అనేకసార్లు కలిశాను. ఎవరైతే తాను నమ్మిన ఆశయం కోసం తన చివరి ఊపిరి వరకు ... ఆశయ సాధన కోసం పోరాడి ప్రాణాల్ని ధారపోస్తారో వాళ్లే చరిత్రను మార్చగలిగారు. వాళ్లే చరిత్రలో ఒక పాఠంగా మిగిలిపోయారు. అలాంటి కోవలోకి వచ్చిన జయశంకర్‌కు తెలంగాణ ప్రజల కన్నీటి వందనాలు.

***– గద్దర్***
ప్రజా యుద్ధ నౌక

ఆంధ్రజ్యోతి దినపత్రిక
26 జూన్, 2011

---

# అశ్రునివాళి

తెలంగాణ రాష్ట్ర సాధనకై 52 ఏళ్ళ స్వచ్ఛంద కార్యకర్తగా పనిచేసి మూడు కమిషన్‌లకు నివేదిక ఇచ్చిన మహోన్నత వ్యక్తి ప్రొఫెజర్ జయశంకర్. 19ఏళ్ళ ప్రాయంలో ఫిజల్ అలీ కమిషన్‌కు నివేదిక ఇచ్చిన సందర్భంలో తెలంగాణకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి. ఎలా బతుకుతారు అని కమిషన్ సభ్యులు అడిగినపుడు, అడుక్కుతిని అయినా బతుకుతాం ఆంధ్రోసల్ల పాలన వద్దని చెప్పిన మహానీయుడు ఆయన తెలంగాణ. రాష్ట్రాన్న సాధించడమే ఆయనకు నిజమైన నివాళి.

***– ప్రొఫెసర్ కోదండరాం,*** *రాజకీయ జేఏసీ చైర్మన్*

జయశంకర్‌లేని వరంగల్‌ను ఊహించలేను. ఆయనతో మూడు దశాబ్దాల అనుబంధం నాది. వరంగల్‌కు వస్తే ఆయనను కలువంది వెళ్లే వాడిని కాను. విలువలకు నిబద్ధతకు నిరాడంబరతకు జయశంకర్ నిదర్శనం. తన అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పే దీశాలి. సామాజిక సమస్యల పరిష్కరంలో విశ్వవిద్యాలయాలు కీలకపాత్ర పోషించేలా జయశంకర్ ఎంతో కృషి చేశారు.

***– ప్రొఫెసర్ హరగోపాల్***

మనందరికీ దుర్దినం. నాలుగుకోల్లు ప్రజల శ్రేయాభిలాషి లేరు అనే నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం. యావత్ తెలంగాణ దు:ఖ సాగరంలో మునిగింది. ఉద్యమం తీవ్ర రూపం దాల్చుకున్న క్రమంలో ఆయన లేని లోటు ఎవరూ పూడ్చలేనిది.

***– నాయిని నర్సింహారెడ్డి,*** *మాజీ మంత్రి*

# తౌరక్యాంధ్రం అనడం న్యాయమా?

**- ప్రొ॥ జయశంకర్**

తెలంగాణా సమస్యలో ఆర్థిక, రాజకీయ అంశాలతో పాటు సాంస్కృతిక అంశాలు కూడా ఇమిడి వున్నాయి. తెలంగాణ వైతాళికుడు ప్రజా కవి కాళోజి ఎప్పుడూ అనేవాడు – “ఆర్థికంగా వెనుకబడిపోతే మళ్ళీ నిలదొక్కుకోవచ్చు. రాజకీయంగా నిర్లక్ష్యానికి గురి అయితే మళ్ళీ నిలదొక్కుకోవచ్చు. రాజకీయంగా నిర్లక్ష్యానికి గురయితే మళ్ళీ తెప్పరిల్లుకోవచ్చు, కానీ సాంస్కృతిక గుర్తింపు చెరిగిపోతే అస్తిత్వాన్నే కోల్పోతాం’, యాభై ఏళ్ళ సమైక్యాంధ్రలో తెలంగాణా భాషా సంస్కృతులు నిరాదరణ, అవహేళనకు గురయి కనుమరుగైపోతున్నాయి. చివరకు తెలంగాణ తన అస్తిత్వాన్నే కోల్పోయే దశకు చేరుకున్నది. ఈ విషయంలో కూడా అంబేద్కర్ సూత్రీకరణను అన్వయించుకోవాలి. ‘ఒక రాష్ట్రంలో రెండు భాషలు మాట్లాడేవాళ్ళుంటే, మెజారిటీ నిరంకుశత్వం వల్ల మైనారిటీ అణచివేతకు గురవుతుంది’. ఈ తర్కాన్ని ఇంకా కాస్త విపులీకరిస్తే, ఒక రాష్ట్రంలో అందరు ఒకే భాష మాట్లాడుతున్నప్పటికీ, ఆ భాషలో మాండలిక వైవిధ్యాలు ప్రస్ఫుటంగా వుంటే, ఇక్కడ కూడా మెజారిటీ, మైనారిటీ సమస్య తలెత్తుతుంది. తెలంగాణలో సరిగ్గా ఇదే జరుగుతున్నది. తెలంగాణ మాండలికం ఎంత తీవ్రమైన అవహేళనకు గురి అయిందో ప్రతి రోజూ సినిమాల్లో టీవీలలో చూస్తూనే వున్నాం.

తెలంగాణవారు మాట్లాడే తెలుగు గురించి ఆంధ్ర ప్రాంతం వారికి కొన్ని విచిత్రమైన అభిప్రాయాలున్నాయి. ఇక్కడ మాట్లాడే తెలుగు అసలు తెలుగే కాదని కొందరు, కాకపోతే కల్తీ తెలుగు, నకిలీ తెలుగు, ఉర్దూ మయమయిన తెలుగని మరికొందరు అంటారు. ఈ సందర్భంగా ఒక సంఘటనను ప్రస్తావించడం ఉచితంగా వుంటుందనుకుంటున్నాను.

1968–69లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా నడుస్తున్నప్పుడు ఒక అనుభవం ఎదురైంది. ఆ రోజుల్లో జంధ్యాల పాపయ్యశాస్త్రి ఒక గేయంలో, ఒకవేళ ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే, అది దక్షిణ పాకిస్తానం అవుతుందని రాశాడు. అది అర్థం కాక నేను, ఇంకో మిత్రుడు ఆయన దగ్గరికి వెళ్ళి ‘శాస్త్రిగారూ, మీ బాధేమిటని’ అడిగాము. దానికి ఆయన సమాధానమిస్తూ ప్రత్యేక తెలంగాణలో తెలుగంతా భ్రష్టుపట్టిపోయి, అది పూర్తిగా తౌరక్యాంధ్రం అవుతుందని అన్నాడు. తౌరక్యాంధ్రం అంటే తురకలు మాట్లాడే ఉర్దూమయమయిన తెలుగు అని ఆయన వివరించాడు. దానికి మేము స్పందిస్తూ ఉర్దూ కేవలం తురకల భాషే కాదని, అది ఒక సంపన్నమైన, మధురమైన భారతీయ భాష అని చెప్పాము. అంతేగాక మతానికి భాష అవసరం కావచ్చు కానీ, భాషకు ఒక మతమంటూ ఉండదని అన్నాము. ఒకవేళ ఉర్దూ ముస్లింల భాషైతే, ఇంగ్లీషు ఏ మతం వారి భాష అవుతుంది? అది కేవలం క్రైస్తవుల భాషే అని అనగలమా? అటువంటప్పుడు హిందువులది ఏ భాష అని చెప్పాలి? ఈ దేశంలో మాట్లాడే భాషలన్నీ హిందువుల భాషలు కావా? ఉర్దూ కూడా భారతదేశంలో పుట్టి, విస్తరించి అనేక భారతీయ భాషలను ప్రభావితం చేసి, వాటితో ప్రభావితమైన భాషే కదా! నిజానికి తెలంగాణ వారికంటే ఆంధ్ర ప్రాంతం వారు మాట్లాడే తెలుగులోనే ఎక్కువ ఉర్దూ పదాలు వుంటాయి అని పాపయ్య శాస్త్రి గారికి వివరించే ప్రయత్నం చేశాము. కానీ ఆయన నమ్మే పరిస్థితిలో లేరు. అప్పుడు ఒక తెలుగు దినపత్రికను తీసి మొదటి పేజీలో వున్న ఒక

హెడ్‌లైన్ ఆయనకు చూపించాము. అది 'నిజామాబాద్ జైలు నుండి 5గురు ఖైదీల పరారి' అని వుంది. ఇందులో జైలు, ఖైదీ, పరారీ, అన్నీ ఉర్దూ పదాలే. దానికి శాస్త్రిగారు 'అట్లానా' అన్నారు. మా చర్చను కొనసాగిస్తూ, శాస్త్రిగారితో మీ కవిత్వంలో కూడా ఉర్దూ పదాలున్నాయి కదా అన్నాము. 'ఎక్కడ?' అని ఆయన ఆశ్చర్యంగా అడిగాడు. అప్పుడు మేము పాపయ్య శాస్త్రిగారి రచనల నుండే కొన్ని ఉదాహరణలు చూపించాము. ఒక పద్యంలో 'రాజాజీ మున్నగు పెద్దలకు మా రాష్ట్రమ్ము మాటంటేనే బేజారెత్తును గుండె' అని అన్నాడు. బేజారు అన్నది ఉర్దూ పదమే కదా! అదే విధంగా విజయశ్రీలో జెండా, పంఖా అనే పదాలను వాడాడు. ఇవి కూడా ఉర్దూ పదాలే! ఈ చర్చను మరింత కొనసాగిస్తూ మీరే కాదు, చాలా మంది ప్రసిద్ధ తెలుగు కవులు అనేక ఉర్దూ పదాలను వాడినారు. ఉదాహరణకు గుర్రం జాషువా 'ఫకీరుల, బీదల శూన్య పాత్రలన్' అని రాశాడు. ఫకీరు కూడా ఉర్దూ పదమే కదా! ఇక మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంలో పారశీ భూయిష్టమైన ఉర్దూ పదాలను చాలా విరివిగా వాడినాడు. తారీఖులు, దస్తావేజులు, మతలబులు, కైఫీయత్తులు, కదం, దగా మొదలగు పదాలు శ్రీశ్రీ కవిత్వానికి సౌందర్యంతో పాటు అమరత్వాన్ని కూడా ప్రసాదించాయి.

ఇక వ్యవహార భాష విషయానికి వస్తే ఆంధ్ర ప్రాంతపు తెలుగువారు, తెలంగాణ ప్రాంతపు తెలుగు వారికంటే ఉర్దూ పదాలను చాలా విరివిగా వాడతారు. ఈ వాస్తవానికి తెలుగు ప్రసార మాధ్యమాలు దర్పణం పడతాయి. తెలుగు వాడుక భాషలో మిళితమైన ఉర్దూ పదాలు కోకొల్లలు. కానీ అవి ఉర్దూ పదాలనే విషయం వాటిని వాడే వారికి బహుశ తెలియదు. ఈ సందర్భంగా మచ్చుకి కొన్ని పదాలు పాపయ్య శాస్త్రి గారికి వినిపించాము. అవి – దరఖాస్తు, మంజూరు, ఫిర్యాదు, అర్జీ, పైరవీ, తనిఖీ, తనఖా, ముసాయిదా, వకాల్తా, వకీలు, తర్జుమా, జవాబు, సవాళ్ళు, తాఖీదు, తయారు, తాలూకు, ఇలాకా, సిఫార్సు, నకలు, సిపాయి, మహజరు, కదం, కందకం, బురుజు, ఖాతరు, బేతరు, బేఖాతరు, బేవార్సు, హైరానా, నజరానా, పేషీ, అజమాయిషీ, రాజీ, రాజీనామా, జమీందారు, ఖబర్దారు, జబర్దస్తీ, కలేజా, కుస్తీ, దగాకోరు, దగుల్బాజీ, ఖాలీ, ధోకా, నామోషీ, మజాకా, బహదూరు, బినామీ, బేకారు, బాపతు, బద్‌నామ్, తడాక, వాపసు, పరారీ, గోరీ, పంచాయితీ, ఫైసలా, కసరత్తు, మద్దతు, వాయిదా, ఆదా, బందు, గూండా, పహిల్వాన్, బద్మాష్, దాదాగిరీ, కితాబు, నమూనా, నకిలీ, నగిషీ, లడాయి, కబ్జా, తమాషా, షికారు, జల్సా, పుకారు, నిషా, ఖుషీ, మజా, మిఠాయి, ఖారా, ఖూనీ, ఖజానా, ఖాతా, జమా, ఖర్చు, చిల్లర, నగదు, బాకీ, వసూళ్ళు, దుకాణం, బజారు, చందా, జరిమానా – ఇంకా ఎన్నో వందల పదాలు వున్నాయి.

ఆంధ్ర అంతటా వాడే తెలుగు భాషలో ఉర్దూ పదాలు ఇంత విరివిగా ప్రవేశించిన నేపథ్యంలో, తెలంగాణలో మాట్లాడే తెలుగును తౌరక్యాంధ్రం అనడం ఎక్కడి న్యాయం, ఎంతటి న్యాయం అని అంటే, పాపయ్య శాస్త్రి నివ్వెరపోయాడు. అధిక సంఖ్యలో ఉన్న ఆంధ్రులు ఏమి అన్నా చెల్లుతుంది. కానీ అల్ప సంఖ్యలో వున్న తెలంగాణ వారు నిజం చెప్పినా చెల్లదు. దీనినే అంబేద్కర్ పరిభాషలో చెప్పాలంటే మైనారిటీ వర్గంపై మెజారిటీ పెత్తందారీతనం అవుతుంది.

**– ప్రొ॥ జయశంకర్**

('సింగిడి' ముస్లిం ప్రత్యేక సంచిక నుంచి)

ఆంధ్రజ్యోతి దినపత్రిక (వివిధ)
27 జూన్, 2011

# స్నేహశీలి, నిరాడంబరుడు

**- ప్రొ॥ జి. హరగోపాల్**

జయశంకర్ స్నేహాన్ని, ఆయన వెచ్చని ఆప్యాయతను దగ్గరగా చూసిన వాళ్లలో, అనుభవించిన వాళ్లలో నేనొకణ్ణి. చాలా మందికి జయశంకర్ తెలంగాణ ఉద్యమంలో నిర్వహించిన పాత్ర గురించే తెలుసు. కాని జయశంకర్ వ్యక్తిగత జీవితం గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. వరంగల్ వెళ్తే తప్పక తన దగ్గరే ఉండాలని ఒత్తిడి చేసేవాడు. రాత్రిపూట గంటల తరబడి మాట్లాడినా ఇంకా ఏదో మిగిలినట్లుగా ఉండేది. నేను తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించని సమయంలో కూడా ఆయన దగ్గరే ఉన్నా ఉద్యమంలోకి రమ్మని కాని, మద్ధతు ఇవ్వమని కాని ఒత్తిడి చేసేవాడు కాదు. ఇంకొకరి అభిప్రాయాలను చాలా గౌరవించేవాడు. అభిప్రాయ బేధాలను, స్నేహాన్ని వేరుచేసి చూడడం జయశంకర్ నుండే నేర్చుకోవాలి. అందుకే ఆయన ఏ స్నేహితుడిని కోల్పోలేదు. ఎవరైనా జయశంకర్‌కు దూరమైతే అది వాళ్ల బలహీనతే కాని జయ శంకర్ ఏ స్నేహితుడిని కోల్పోవడానికి ఇష్టపడేవాడు కాదు.

జయశంకర్ వ్యక్తిగత జీవితంలోని నిజాయితీ, నిబద్ధత, నిరాడంబరత ఒక్కొక్కసారి ఆశ్చర్యపరిచే విధంగా ఉండేవి. పెద్ద సౌఖ్యాలను, సుఖాలను కోరుకున్న మనిషి కాదు. చాలా సింపుల్ జీవితం ఇష్టపడేవాడు. వరంగల్‌లో ఇల్లైనా, హైదరాబాద్ వచ్చినా, చివరకు ఢిల్లీలో ప్రతిష్ఠాత్మకమైన సంఘంలో సభ్యుడుగా వున్నా పెద్దగా పదవి నుండి వచ్చే ఏ సౌకర్యాన్ని తీసుకోలేదు.

ఒక్క కారును మాత్రం వాడుకునేవాడు. ఒకసారి నేను ఢిల్లీ వెళ్లినప్పుడు ఎవరో స్నేహితుడు విదేశాలకు వెళితే ఆ ఇంట్లో ఉన్నాడు. అక్కడ కనీస సౌకర్యాలు కూడా లేవు. నన్ను రాత్రి అక్కడే ఉందామని భోజనం క్యారియర్‌లో బయటి నుండి తెప్పించాడు. ఆ పదవిని అంగీకరించింది కేవలం తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకపోవడానికని, కారులో దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలను కలిసి, తెలంగాణకు మద్దతును సమీకరిచడానికి కృషి చేస్తున్నానని చెప్పాడు.

జయశంకర్ పదవీ విరమణ తర్వాత ఆయన పెన్షన్ గురించి సిఫెల్‌లోని కొందరు వివాదాన్ని లేవదీయడం వలన దాదాపు పది సంవత్సరాలు పెన్షన్ విషయంపై ఏ నిర్ణయం తీసుకోకపోవడం వలన నెలసరి ఆదాయం లేకుండా పోయింది. పదవీ విరమణప్పుడు వచ్చిన కొద్ది డబ్బును ఒక స్నేహితుడి దగ్గర పెడితే ఆ స్నేహితుడు ఆర్థిక ఇబ్బందుల్లో పడడం వలన అవి తిరిగి ఇవ్వమని ఎలా అడిగేది అని మొహమాటపడ్డాడు. ఆయనే ఇబ్బందుల్లో ఉంటే మనం మన డబ్బు ఇవ్వమని ఎట్లా అడుగుతాం. డాక్టర్ సాబ్ (నన్ను జయశంకర్ ఒక్కడే డాక్టర్ సాబ్ అని పిలిచేవాడు) అనేవాడు. తెలంగాణ కొరకు తిరగడానికి కారు ఉపయోగిస్తే ఖర్చు ఎక్కువని బస్సులల్లో ప్రయాణం చేస్తూ కాలికి దెబ్బతగిలి కొంతకాలం బాధపడ్డాడు. హైదరాబాద్‌లో మేము ఎప్పుడైనా కలిస్తే ఆటోలో వచ్చేవాడు. ఒక్కసారి తె.రా.స ఆఫీసు నుండి ఆటోలో వచ్చాడు. ఏం ఆటోలో వచ్చారు అంటే ఆ పార్టీ వాహనాన్ని ఉపయోగిస్తే వాళ్లు రమ్మన్నప్పుడల్లా మనం వెళ్లవలసి వుంటుంది. లేకపోతే నా ఇష్టం వచ్చినపుడు నేను వెళతాను అని అనేవాడు.

బహుశా ఈ వ్యక్తిగత విలువలు ఆ జయశంకర్‌ను ఈ జయశంకర్‌గా మలిచాయనిపిస్తుంది. లేకపోతే ప్రాథమిక పాఠశాలలో ఒక సామాన్య ఉపాధ్యాయుడుగా తన జీవితాన్ని ప్రారంభించి కాకతీయ విశ్వవిద్యాలయ

ఉప కులపతిగా ఎదగడం సాధారణ విషయం కాదు. అలాగే విద్యార్థి దశలో తెలంగాణ సామాన్య కార్యకర్తగా ప్రారంభమై ఆ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా, ఒక దిక్సూచిగా మారడం కూడా అసాధారణమైన విషయమే. ఈ పరిణామం వలన ఆయనలో కన్పించిన ఆత్మ విశ్వాసం నమ్మశక్యం కానిది. ప్రధాన మంత్రితో మాట్లాడినా, చిదంబరంతో మాట్లాడినా, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడినా ఆ పద్ధతిలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం తొణికిసలాడేవి. బహుశా తెలంగాణ ఆత్మగౌరవాన్ని గురించి మాట్లాడినప్పుడు అంతే ఆత్మవిశ్వాసంతో మాట్లాడేవాడు.

వ్యక్తిగా జయశంకర్‌చాలా విశ్వాసపాత్రుడు. ఆయనకు జరిగిన ఒక సన్మానంలో నన్ను మాట్లాడమని అడిగినప్పుడు ఈ విషయమే ప్రస్తావించాను. తనయుడుగా తల్లిదండ్రులకు, అన్నగా తన తమ్ముడిని, ప్రిన్సిపాల్‌గా తన సహచరులకి, స్నేహితుడిగా ఇతర స్నేహితులకి అన్ని సంబంధాలలో అదే విలువ పాటించాడు. అందుకే టి.ఆర్.ఎస్ పార్టీకి కెసిఆర్‌కి కూడా విశ్వాసపాత్రుడుగా ఉన్నాడు. అయితే అన్ని ఇతర సంబంధాలలో విశ్వసనీయత ఆయన బలమైతే టి.ఆర్.ఎస్. విషయంలో విశ్వసనీయత బలహీనత అన్నాను. అప్పుడు నవ్వి ఊరుకున్నాడు. తెలంగాణ రాజకీయాలు మాట్లాడితే ఆర్.ఎస్.యూ నుండి ఆర్.ఎస్.ఎస్ దాకా ఎవ్వరు మద్ధతు ఇచ్చినా స్వీకరించవలసిందే అనేవాడు. ఈ విషయంలో ఆయనకు మాకు ఎంత అభిప్రాయ భేదాలున్నా, వాదించడం మానలేదు. గట్టిగా వాదిస్తే మరి నన్నిప్పుడు ఏం చేయమంటారు డాక్టర్ సాబ్, ఇంకేం ప్రత్యామ్నాయముంది అని ఎదురు ప్రశ్న వేసేవాడు.

ఆయన నక్సలైట్ రాజకీయాల పట్ల కూడా ఎప్పుడూ వ్యతిరేకంగా మాట్లాడడం నేను చూడలేదు. వాళ్ల మద్ధతు కూడా తెలంగాణకు అవసరమనే భావించాడు. పౌర స్పందన వేదికలో భాగంగా తెలంగాణ పల్లెల్లో తిరుగుతున్నప్పుడు పోలీసుల ప్రవర్తన గురించి వాళ్లు చేసిన ఆకృత్యాల గురించి పేద ప్రజలు వివరిస్తున్నప్పుడు అది విని 'మన ప్రాంతంలో పోలీసులకు వ్యతిరేకంగా ఎవ్వరు మాట్లాడినా ప్రజల్లో చాలా పలుకుబడి పెరిగిపోతుంది' అని నాతో అన్నారు. తెలంగాణలో శాంతి నెలకొనాలని మనసారా కోరుకున్న వాడు జయశంకర్. ఆయన తెలంగాణ ప్రాంతాన్ని, తెలంగాణ ప్రజలను అభిమానించినంతగానే తెలంగాణ ప్రజలు కూడా జయశంకర్‌ను అభిమానిస్తారు. విద్యారంగానికి చెందిన జయశంకర్ ప్రజా రాజకీయ రంగంలో చేసిన కృషిని గమనించిన ఎవరికైనా రెండు జీవన రంగాలకున్న అవినాభావ సంబంధాన్ని ఒక గొప్ప వారసత్వంగా, ఇటు విద్యా రంగానికి అటు ప్రజా జీవన రంగానికి ఆదర్శనీయమే, ఆచరణీయమే.

ప్రజా జీవనంలో ముఖ్యంగా రాజకీయ జన జీవన స్రవంతిలో వస్తున్న మార్పులు, అవకాశవాద రాజకీయాలు, దిగజారుతున్న మనుషులు, విధ్వంసమవుతున్న విలువల సందర్భంలో వీటి ప్రభావాలన్నింటిని తట్టుకుంటూ బురదలో తామరపువ్వులా పుష్పించి, వికసించిన మనిషి జయశంకర్. తెలంగాణ ప్రాంత ఆత్మగౌరవానికి, ప్రాంతీయ అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలకు న్యాయం జరగాలని అవిశ్రాంతంగా కృషి చేసిన జయశంకర్ తెలంగాణ రాష్ట్ర నిర్మాణం జరగకముందే మన మధ్యన లేకపోవడం తెలుగు సమాజపు విషాదం. ఆయన వ్యక్తిగత విలువలు, జీవన శైలి, పట్టుదల, రాజీలేని వ్యవస్థీకృతమైతే జయశంకర్ కృషి ఫలించినట్లే.

**- ప్రొ॥ జి. హరగోపాల్**

నమస్తే తెలంగాణ దినపత్రిక
22 జూన్, 2011

# తెలంగాణ రహ్‌న జాయే సహ్‌న జాయే భాత్ ఆధీ

**- వరవరరావు**

తెలంగాణ ఒడిలో పుట్టి బుద్ధి తెలిసిన దగ్గర్నించి తెలంగాణ కోసమే నిరీక్షించి ఆ తెలంగాణ సాకారమే చేసుకోకుండా, ఆ కలవరింతతో, ఆ పలవరింతతో, ఆకాంక్షతో, విశ్వాసంతో కొన్నేళ్లుగా ముఖ్యంగా 'నమస్తే తెలంగాణ' ఆవిష్కరణ సభలో ఆఖరిసారిగా మాట్లాడి, అప్పటి నుంచి 'అంపశయ్య' మీద ఉన్న మనిషిలో ఈ రెండువారాలు ఎన్ని మరులు ముప్పిరిగొని ఉంటాయి. ఎవరైనా మనిషిలోకి మనసులోకి దూరి చెప్పగలవాళ్లు ఉంటే తెలంగాణ మట్టి పొరల్లోకి కన్ను దూర్చిచూడగల వాళ్లుంటే ఈ మట్టి మీద ప్రేమ, ఈ మనుషుల మీద ప్రేమ, ఇక్కడే తన నిలువెల్లా ప్రహించి తనది కాకుండా పోయిన గంగా జలాల మీద ప్రేమ

'శిశువుకు దక్కని స్తన్యంలా గోదావరి నదీ నాం సాగరే గతి కాదు. ఇందిరాసాగర్ పాలవుతుంటే ఆ శిశువు జయశంకరా? అది సర్వనామమైన తెలంగాణ? 'నమస్తే తెలంగాణ' ఆవిష్కరణ సభలో ఆయనను చూసి ఆప్రతిభూణ్ణయ్యాను. ఆయనకు క్యాన్సర్ అని తెలిసినప్పటి నుంచీ తరచు కలుస్తూనే ఉన్నాను, మాట్లాడుతూనే ఉన్నాను. కాని అవదనిపంచింది. మాట తప్పశరీరంలో ఇంకేశక్తి మిగలలేదు. మనసు బలం వల్ల వచ్చిన మాట మాత్రం ఉన్నది.

మర్నాడే వెళ్లి తార్నాకలో మిత్రుడు ఆనందరావుతోట ఇంట్లో కలిసాను ఇద్దరమే. గంటకు పైగా మాట్లాడడు. ఎన్ని విషయాలో, ఎన్నెన్ని జ్ఞాపకాలో... జైపాల్‌రెడ్డి కూడా ఆరు నెలల్లో తెలంగాణ వస్తుందన్నాడు. ఇక వస్తుంది. లెండి మీరు చూస్తారు. అన్నారు. అది అబద్ధమని నాకు తెలుసు ఆ మార్నాడే జైపాల్‌రెడ్డి దానిని అబద్ధం చేసాడు. జయశంకర్ కు ఒక రాజకీయ విశ్లేషణ ఉంటుంది. 'బొత్స సత్యనారాయణను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుణ్ని చేసారంటే ఆంధ్ర ప్రాంతానికి, ఆయన మాటల్లో సీమాంధ్రకు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిని తయారు చేసుకుంటున్నది. కనుక కేంద్రం తెలంగాణ ఇవ్వడానికి మానసికంగా సిద్ధపడుతున్నది' అనే ధోరణిలో సాగిందది. ఇటువంటి విషయాల్లో నలభై ఏళ్ల రాజకీయ అవగాహన వల్లనే కాదు. విద్యార్థి దశలోనే చలం ప్రభావం వల్ల నాకు ఎప్పుడు ఎస్టాబ్లిష్‌మెంట్ మీద అవిశ్వాసమే, కాని ఇప్పుడు జయశంకర్ ఆరోగ్యానికి అది అవసరం.

ఆయన మాట్లాడడానికి చాలా ఆయసపడుతున్నాడు. కాని మాట్లాడుతున్నారు. చక్రపాణి విదేశాల నుంచి వచ్చారు. ప్రయోణబడలిక తీరాక రేపు వస్తానన్నాడు. మీరేది. తోస్తే అది మాట్లాడండి. కన్నబీరాన్ 24 గంటలు లాగ రాసి రికార్డు చేయించి (వీడియో కూడా) ఆ తర్వాత అవసరాన్ని బట్టి ఎడిట్ చేస్తే పుస్తకం తెస్తానన్నాడు. కానీ ఓపిక లేదు. నాలుగయిదు రోజుల తర్వాత మాళ్లా అస్పత్రికి వెళ్లి వచ్చాక కూచుంటాను అన్నాడు. వేణు కన్నబీరాన్ ఆత్మకథ అక్షరీకరించినట్లుగా చక్రపాణి తన ఆత్మకథ అక్షరీకరించడమే కాదు, దృశ్యీకరణ కూడా చేస్తాడన్న విశ్వాసం మా ఇద్దరికీ కలిగింది.

ఆయనకు క్యాన్సర్ అని తెలిసి మొదటిసారి నుంచి నేను ఆత్మకథ రాయమని అడుగుతున్నాను. ఆయన రాస్తానని. చెప్తున్నాడు. ప్రతిసారీ ఆ స్కీములోనే చర్చిస్తున్నాడు, తాను మర్కజీలో ఆరో తరగతిలోనో ఏమో .. ఉదయం ప్రార్థన అయ్యాక, వందేమాతరమ్' అంటే రషీదుల్ హసన్ హెడ్‌మాస్టర్ రూపంలోకి పలిచి నువ్వు

చెప్పిన మాటకు అర్థమేమిటో తెలుసా? అని అడిగిన దగ్గర్నించీ అది ప్రభుత్వం దృష్టిలో నేరమని తెలుసా అని చెప్పి, నీ కొడుకు స్థిరత్వానికి ముచ్చటపడ్డాను. కాని తండ్రి లా పరిణామాలకు మీరు సిద్ధం కావాలని మాత్రమే చెప్తున్నాన్న రషీదుల్ హసన్ వ్యక్తిత్వం తన బాల్యం మీద ఒక ప్రభావం అని మొదలుపెట్టి తెలంగాణ ఉపాధ్యాయ ఉద్యమం, సికెఎం కాలేజీ ప్రిన్సిపాల్ మొదలు తాను నిర్వహించిన పరిపాలనా బాధ్యతలు మూడు అంశాలుగా తన జీవిత చరిత్ర ఉంటుందన్నాడు.

తెలంగాణ గురించి చెప్పినప్పుడు మీరు భాష గురించి కూడా విస్తారంగా రాయాలి. ఎందుకంటే కాళోజీ స్మారకోపన్యాసంలో మీరు తెలంగాణలో కాదు. సర్కారు జిల్లాల్లో కూడా నైజాం సర్కారు భాష అనుకునే ఉర్దూ ప్రభావం ఎట్లా ఉందో జంధ్యాల పాపయ్యశాస్త్రి పద్యాల నుంచి కూడా ఉదహరించి చెప్పారు. గదా అని సూచించాను. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో జయశంకర్ పట్టుకు సికెఎం కాలేజిలో ఆయనతో ఉన్న సాన్నిహిత్యంతో ఎన్నో సార్లు అబ్బురపడ్డానో, నాకు తీరినప్పుడు కాలేజి క్లాసులో ఇంగ్లీషు చెప్పాలని ఉంటుందండి. కాని నాకు ఎకనామిక్స్ చెప్పే డిగ్రీ మాత్రమే ఉంది కదా అనేవాడు.

ఒకరకంగా రషీదుల్ హసన్ అంటే ఆయన హెడ్‌మాస్టర్‌గా పనిచేసిన మర్కజీయే నాకు జయశంకర్ ను పరోక్షంగా పరిచయం చేసింది. నేను అదే మర్కజీలో 1950 నుంచి 53 వరకు చదివాను నేనింక మర్కజీలో ఉండగానే 'నాన్ మాల్కీ గో బ్యాక్' ఉద్యమం వచ్చింది. మొట్టమొదటి సారి మర్కజీ నుంచి క్లాసులు బాయ్ కాట్ చేసి ఆ ఊరేగింపులో పాల్గొన్నప్పుడు జయశంకర్ పేరు విన్నాను. ఉద్యమనాయకుల్లో ఒకనిగా ఇద్దరమూ కాంగ్రెస్ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లం. ఆయన తండ్రి స్వాతంత్ర్య సమరయోధదు, మా అన్నయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. హయగ్రీవచారి అనుయాయులు. చిత్రమేమిటంటే సికెఎం కాలేజిలో చేరినప్పటి నుంచి ఇద్దరమూ హయగ్రీవచారికి బద్ధ విరోధులమయ్యాను.

ఉస్మానియా యూనివర్సిటీ ఎ హాస్టల్‌లో ఆనందరావు తోట నా సహధ్యాయి. ఆయనది ఇంగ్లీషు నాది తెలుగు. ఆయన అప్పటికీ ఉపాధ్యాయ ఉద్యమంలో తిరిగి సెలవు మీద ఎం.ఎ చేయడానికి వచ్చాడు. ఆయన వివేకానంద శిష్యుడు. నేను శ్రీశ్రీ శిష్యుణ్ని. కాని మంచి మిత్రులమయ్యాం. 1967 –68లో నేనింకా జడ్చర్ల కళాశాలలో ఉండగానే ఆయన నేను, స్వామిరెడ్డి మొదలైన మిత్రులు కలిసి ట్యాక్టా (తెలంగాణ అఫ్లియేటెడ్ కాలేజి టీచర్స్ అసోసియేషన్) పెట్టాం. దానికి నేను అధ్యక్షునిగా ఎన్నికయ్యాను. 68లో సికెఎం కాలేజి వరకు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మా కాలేజి ఇంటర్వ్యూ జరిగిన రోజే ప్రారంభమైంది. మేమంతా కలిసి ఇంగ్లీషులో తెలంగాణాకు సంబంధించిన రాజకీయార్థిక వనర్ల సమస్యలన్నిటిపై ఒక సంకలనం తెచ్చాం. అందులో ప్రధాన వ్యక్తుల ఆనందరావు, జయశంకర్‌లే. జయశంకర్ బహూశా అప్పుడు అదిలాబాద్ కాలేజిలో లెక్చరర్‌గా ఉన్నాడు. వరంగల్ ఆర్ట్స్ కాలేజి ఆడిటోరియంలో ఉస్మానియా ఔటా అధ్యక్షులు, ఆంధ్రమహాసభ నాయకుడు ఆచార్య రావాడ సత్యనారాయణ ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అట్లా మళ్లీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో జయశంకర్ నాకు దగ్గరయ్యాడు. గానీ అప్పటికే నేను ట్రిగ్గర్ మీద వేళ్లతో ... రక్త చలన సంగీత శ్రుతి సృజనతో ఉన్నాను. అయితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రజా వెల్లువలో లెనిన్‌ను చూస్తున్నాను. 1975 మే నెలలో నేను కండీషనల్ బెయిల్ మీద హైదరాబాదులో ఉన్నాను. శ్రీపతి ఇంటి నుంచి రెడ్డికాలేజీ పక్క నుంచి ఆర్టిస్టు చంద్ర ఇంటికి పోతున్నాను. జయశంకర్ కలిసాదు. 'మీరెక్కడుంటారో తెలియక చివరకు ఎవరో శ్రీపతి అనే రచయిత ఇంట్లో ఉంటారంటే వెతుక్కుంటూ వస్తున్నాను. వెతకపోయిన తీగ ఎదురయ్యింది అన్నాడు. ఇద్దరమూ వెళ్లి ఇరానీ హోటల్లో కూర్చున్నాం. "నన్ను సికెఎం కాలేజీకి డిప్యూటేషన్ మీద ప్రిన్సిపాల్‌గా రమ్మంటున్నారు. కాలేజీ సర్వీసులోనూ ... సికెఎంలోనూ ... నా కన్నా సీనియర్ వరవరరావుగారితో మాట్లాడకుండా రానని చెప్పాను. అని ఆయన వాక్యం ఇంకా పూర్తి చేయలేదు. అదేంటి నాకు, నేను సస్పెండ్ అయి ఉన్న లెక్చరర్‌ను. సికిందరాబాదు కుట్ర కేసులో ముద్దాయిని, ఎన్నటికి కేసు ముగిసి మళ్లీ నేను కాలేజీలో

చేరేను, అయినా నేను ప్రిన్సిపాల్‌ను కాదల్చుకుంటే 73లోనే ఎందుకు వదులుకుంటానని చెప్పాను. మీరు రావడం కన్నా కావాల్సింది ఏముంటుంది అన్నాను. ఇద్దరమూ ఎంతో బరువు దించుకున్నట్లు విడిపోయాం. అంతే ... నెల రోజుల్లో ఎమర్జెన్సీ వచ్చింది. ఎమర్జెన్సీలోనే డిప్యూటేషన్‌పై ఆయన సికెఎం కాలేజీ ప్రిన్సిపల్‌గా వచ్చాడు. 21 నెలల ఎమర్జెన్సీ తర్వాత మార్చ్ 23, 1977న చంచల్‌గూడ నుంచి విడుదలయి, మళ్లా అరెస్టయి వరంగల్ జైల్ నుంచి మార్చ్ 27న విడుదలై ... ఏప్రిల్ 1న సికెఎం కాలేజీకి పోయాను. జస్ట్ ఫర్ ఫన్.

జయశంకర్ ప్రిన్సిపాల్ సీటు నుంచి లేచి ఎదురువచ్చి బిగ్గరగా కావలించుకున్నాడు. ఆ ఆత్మీయత మూడున్నర దశాబ్దాలయినా కళ్లలో తిరుగుతున్నది. 'వెల్ కమ్ టు కాలేజీ' అన్నాడు. కూర్చుని కాఫీ తాగాక నాకు ఒక తెల్లకాగితం ఇస్తూ 'జాయినింగ్ రిపోర్టు రాయండి' అన్నాడు. అదే సార్ ఊరక మిమ్మల్ని కలుద్దామని వచ్చాను. నేనింకా సికిందరాబాద్ కుట్రకేసులో ముద్దాయినికదా' అన్నాను. 'సస్పెన్షన్‌లో ఉన్నాను కదా' అన్నాను. మీరిద్దరు ఆ టెక్నికాలిటీస్ అన్నీ ఎందుకు? అన్నాడు. నేను ఇచ్చాను.

1970 నుంచే వరవరరావును తీసివేయపోతే కాలేజీ ఫండ్స్ ఆపేస్తా' అని వెంగళరావు మేనేజ్ మెంట్ మీద ఒత్తిడి తెస్తున్న నేపథ్యం. కాకపోతే ఎమర్జెన్సీ తొలగిన ఒక ప్రజాస్వామిక వాతావరణమున్నది. మర్నాడే జయశంకర్ హైదరాబాద్‌కు పోయాడు. ముఖ్యమంత్రి వెంగళరావుతో కలిసి నన్ను జాయిన్ చేసుకున్నానని చెప్పాడు. ఏం చెప్పాడో, ఎట్లా ఒప్పించాడో ఆయన హెచ్.ఎం.టీ.వీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించే ఉన్నాడు. కాని నెలతిరగకుండా నాకు ఎరియర్స్ కూడా వచ్చేసినవి. ఈ ఉదాహరణతో నా వలె నే అఫ్లియేటెడ్ కాలేజీల్లో పని చేస్తున్న కెవిఆర్, త్రిపురనేని మధుసూధన్‌రావు, ఎం.టి.ఖాన్ కూడా ఉద్యోగాల్లో చేరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మలక్‌పేటలో పనిచేస్తున్న చెరబండ రాజుకు ఉద్యోగం ఇచ్చారు. కానీ అప్పటి ఇంటెలిజెన్స్ డి.ఐ.జి ఆ ఉద్యోగాన్ని ఆపించాడు. అదివేరే కథ.

ఇంకా రెండు సంవత్సరాలు సికెఎం కాలేజీలో మాది పరస్పర భిన్నమైన విశ్వాసాల మధ్య ఆరోగ్యకరమైన విలువలతో కత్తుల బాటపై ప్రయాణం. ఎంత విచిత్రమో – జయశంకర్ ప్రయాణం ముగిసింది. సుదీర్ఘమైన కత్తులబాటపై ఇప్పుడే నెత్తుటి కన్నీళ్లు కురిసినవి. ఇంతదాకా ఇంక జయశంకర్ లేడు అని రాయలేకపోయాను. ఇప్పటికీ జయశంకర్ చనిపోయాడని కూడా రాయలేకపోతున్నాను.

జూన్ 7 సాయంత్రం కలిసినపుడు ఒక గంటకు పైగా మాట్లాడి మీకు ఆయాసమవుతున్నది, 'ఇబ్బందవుతున్నది వెళ్తానన్నపుడు', 'ఒక్క నిమిషం కూర్చోండి – ఒక్కపర్సనల్ రెక్వెస్ట్' అన్నారు. ఆయన నన్ను జీవితంలో ఎన్నడూ ఏ వ్యక్తిగత అవసరమూ అడుగలేదు. ఆయనకు నా అవసరమూ వచ్చిందనుకోను. వచ్చినా నేను తీర్చగలవాణ్ణి కూడా కాదు. కనుక ఆశ్చర్యపోయాను. బ్రహ్మంను నా దగ్గరగా చేరిన దగ్గర్నించీ ఒకరికొకరం ఎంత విశ్వాసంతో కలిసి ఉన్నామో ..., అతనిపై నేనింక ఆధారపడి ఉన్నానో మీరు చూస్తూనే ఉన్నారు. అతణ్ని దత్తత తీసుకొని, ఒక అనాథ పిల్లనే చూసి పెళ్లి చేసాను. ఇద్దరూ నన్ను కన్నబిడ్డవలె చూసుకున్నారు. నాకు వాళ్లిద్దరూ వ్యక్తిగత విషయాల్లో రెండు కళ్లు. మీ వంటి మిత్రుల దోసిళ్లలో ... ఆ కళ్ల నుంచి పోతున్నాను. మీరంతా కనురెప్పల వలె కాపాడాలి" అన్నాడు.

హరగోపాల్, శివలింగ ప్రసాద్ వంటి మిత్రులను కూడా ఆయన మనసులో పెట్టుకొని మాట్లాడాడని నాకు తెలుసు. అందుకే వాళ్లిద్దరికి చెప్పాను. ఆ మర్నాడే జూన్ ఎనిమిదిన ఆయన ఆరోగ్యం విషమించిందని ఆస్పత్రిలో చేరాడు. జూన్ 11, శివలింగప్రసాద్ సహచరితో (ఆదిలాబాదులోను, సికెఎంలోను ఆయన సహధ్యాపకుడుగా జయశంకర్‌కు ఎంతో సన్నిహిత మిత్రులైన వాళ్లలో ఆయనొకరు) నేను నా సహచరి వెళ్లి ఆస్పత్రిలో చూశాం. అప్పటికే ఆయనకు, మాకూ అర్థమయింది. ఇంక ఆఖరి రోజులని మాట్లాడే స్థితిలో కూడా లేడు. అయినా 'తెలంగాణ చూస్తారు సారు' అని మళ్లీ ఒక అబద్ధం చెప్పి వచ్చాం.

ఆర్.ఎస్.రావు గారు సీరియస్‌గా ఉన్నారని తెలిసి ఢిల్లీకి పోతూ జూన్ 17న బ్రహ్మంకు ఫోన్ చేశాను.

'సార్‌కు శ్వాస కష్టమై రాత్రి ఐసియుకు మార్చారు. ఇప్పుడు స్టేబుల్‌గా ఉన్నాడు, ఈ రోజు వరంగల్‌కు తీసుకు పోతున్నాం అన్నాడు. అంటే ఆయన హనుమకొండలో తన ఇంట్లో, తాను బ్రహ్మానికి ఇచ్చిన ఇంట్లో కన్నుమూయదల్చుకున్నాడని అర్థమైంది. నిన్న రాఘవాచారి చెప్పాడు. ఆదివారం జూలై 19న హనుమకొండకు వెళ్లి వచ్చాను. నిద్రపోతున్నాడని చెప్పారు. నోరు తెరుచుకునే ఉన్నాడని అన్నాడు. జయశంకర్ తెలంగాణ వచ్చేదాక తెలంగాణ కోసం నోరు తెరుచుకుని, కళ్లు తెరచుకుని మన మధ్య సజీవంగా ఉంటాడు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా మన వనర్లు, మన కొలువులు, మన పాలన మనకు దక్కే దాకా మన మధ్యన చలిస్తూనే ఉంటాడు.

**– వరవరరావు**

నమస్తే తెలంగాణ దినపత్రిక
22 జూన్, 2011

---

# అశ్రునివాళి

ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతకర్తే కాదు. తెలంగాణ యువకుల తలరాతను మార్చిన అపరబ్రహ్మ యూపీఏ ప్రభుత్వం డిసెంబర్ 9న ఇచ్చిన ప్రకటనకు కట్టుబడి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయకపోతే జయశంకర్ స్ఫూర్తితో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.

**– సీహెచ్. విద్యాసాగర్‌రావు,** *కేంద్ర మాజీ మంత్రి*

తెలంగాణ జీతిపిత జయశంకర్. మూడు తరాల ఉద్యమనేత. ఆయన వేసిన బాటలోనే అందరూ నడిచి తెలంగాణను సాదించుకుందాం.

**– ఎంపీ మధుయాష్కి**

జయశంకర్ పేరు వింటేనే తెలంగాణ గుర్తుకొస్తది. తెలంగాణే తన శ్వాసగా బతికాడు. తన స్వరాష్ట్ర స్వప్నాన్ని చూడకుండానే కన్ను మూయడం బాధాకరం. ఆయన ఆశయ సాధన కోసం యావత్ తెలంగాణ పోరాడినప్పుడు ఆయనకు నిజమైన నివాళి. ఇప్పటికైనా తెలంగాణ ప్రజా ప్రతినిధులంతా రాజనామాలు చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించాలి.

**– పోచారం శ్రీనివాసరెడ్డి,** బాన్సువాడ ఎమ్మెల్యే

తెలంగాణ పోరాటంలో ప్రొఫెసర్ జయశంకర్ పోషించిన పాత్ర అనిర్వచనీయం. ఆయన మృతి తీరని లోటు. నిరాడంబరంగా, వినమ్రతతో ఉండే జయశంకర్ తెలంగాణ సమస్యపై నిక్కచ్చిగా, నిబద్ధతగా నిలబడ్డారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన తెలంగాన ప్రజల అభిమానాన్ని పొందారు.

**–** *సీపీఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి* **సురవరం సుధాకరరెడ్డి**

ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన ఐదు దశాబ్దలుగా అలుపెరుగని పోరాటం చేశారు. ఈ ప్రాంతం వెనుకబాటుతనాన్ని ఆయన తన రచనల ద్వారా ప్రజలకు తెలిపారు. ఆయన మృతి తెలంగాణ ఉద్యమానికి తీరనిలోటు.

**– వకుళాభరణం కృష్ణమోహన్‌రావు,** రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు

# మన తరం మార్గదర్శి

- ప్రొ॥ ఘంటా చక్రపాణి

ఒక వైపు వీవీ మరో వైపు విమలక్క, మధ్యలో కేసిఆర్ వరంగల్లులో జయశంకర్ సార్ స్ఫూర్తియాత్రలో పాల్గొనేందుకు వెళ్లినప్పుడు అదాలత్ దగ్గర అమర్ వీరుల స్మారక స్తూపం వద్ద కనిపించిన దృశ్యం. సిద్ధాంత రీత్యా భిన్న ధృవాలు, ఆచరణలో తూర్పు పడమరలు, అయినా ఆ యిద్దరి కళ్లలో వేదన మాత్రం ఒకేటే, తమ చికరాల సహచరుడు, అత్యంత ఆత్మీయుడు ఇకలేడన్న దుఖం ఒక మనిషి రెండు భిన్నమైన ఆలోచనాధారలలో సమాన గౌరవం పొందడం అందులో మనుషులే అంచనాలకందన ఈ కాలంలో చాలా అరుదు. ప్రొఫెసర్ జయశంకర్ అలాంటి ఆరుదైన మనిషి ఆ ఇద్దరినే కాదు, ఆ యిద్దరి తోనూ విభేదించే మరెందరిన కలిపినో ఆశారేఖ అతను అందుకే తను ఎన్నో ఏళ్లు ఒంటరిగా నడిచిన వరంగల్ వీదుల్లో తన చివరి ప్రయాణంలో లక్షలాది మంది తోడయ్యారు. జన ప్రవాహంలో నాలుగడుగైలైనా వేసి స్ఫూర్తి పొందాలనుకొని కోట్లాది మంది ఆశపడ్డారు. కొందరు కాషాయ కండువాలు కప్పుకున్నారు. అనేక మంది నీలి రంగులో నిగనిగ మెరుస్తోన్న జయశంకర్ చిత్రపటాలు మోసుకుంటూ కనిపించారు. తెలంగాణ బీడు భూముల మీద వాన చినుకులు కురిసినప్పుడు విరబూసిన సప్త వర్ణ సింగిడి కదా అతను! జీవిత సాఫల్యం కదా అది. ఎంతోమంది మనుషులు, జీవితంలో ఎన్నో మార్గాల్లో మార్చుకుంటారు. కానీ ప్రొఫెసర్ జయశంకర్ ఒక్కరే జీవితాంతం ఒకే మార్గంలో నడిచారు. ఒకేమాట మీద నలిచారు. మనందరినీ తన మార్గంలో నడిపంచారు.

ఒక్క వరంగల్ నగరమే కాదు, ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ వార్త విని విలపించింది. ప్రతి ఇల్లూ అతన్ని కడసారి చూడాలని కలవరపడింది. ప్రతి గొంతూ అతని ఆశయాలను నినదించింది. ప్రతి గుండే మౌనంగా రోదించింది. నిజంగానే జయశంకర్ సార్ మన కన్నీళ్లను కోరుకున్నాడా...? కాదు, అతను అన్వేషించింది, ఆవిష్కరించింది. మన కన్నీళ్లను శ్వాశతంగా తుడిచే మార్గాన్ని తెలంగాణ ఒక్కటే ప్రజల దుఃఖాన్ని దూరం చేయగలదని బోధించిన బుద్ధుడు. అతను అతని ఆకాంక్ష సాకారమైతే తప్ప మనమంతా ఏడ్చినా అతని ఆత్మ శాంతించదు. ఏ ఉపాధ్యాయుడైనా తన బోధించే పాఠాలు కేవలం తన విద్యార్థులకు బతుకుదెరువు చూపతాయని మాత్రమే అనుకుంటాడు. కనీ సార్ మాత్రం తన జీవితాన్ని ఒక పాఠంగా మలిచాడు. కోట్లాది. మంది భవిష్యత్తుని తన పాఠంతో మార్చాలని కలగన్నాడు. ఆ పాఠాన్ని మనం అర్థం చేసుకోకుండా ఎంత దుఃఖిస్తే మాత్రం ఏం ప్రయోజనం?

సరిగ్గా ఇరవై ఇదేళ్ల కిందట 1986 లో కరీంనగర్ జీవగడ్డ దినపత్రికలో పనిచేస్తున్నప్పుడు నేను జయశంకర్ సార్‌ను కలిశాను. వెలిచాల జగపతిరావు అనే ఒక స్థానిక నాయకుడు ఎందుకో గానీ... ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ అసమానతలు అనే అంశం మీద ఒక సెమినార్ నిర్వహించాడు. చాలా మంది. మేధావులని హైదరాబాద్ నుంచి పిలిచాడు. బిపిఆర్ విఠల్ సదస్సును ప్రారంభించారు. అతనొక ఐఎఎస్ అధికారి ప్రభుత్వంలో ఉన్నత పదవుల్లో ఉన్నారు. ఆయన తరువాత అనేక మంది వక్తలు ప్రసంగించారు. కానీ నాకు ఎవరి మాటలు అర్థం కాలేదు. చివరగా జయశంకర్ గారు మాట్లాడారు. ఆయన మాట్లాతున్నంతా సేపు మన చరిత్రను, జీవితాన్ని కొత్తగా చెపుతున్నట్లు అని పిచింది. అప్పటికి నాకు ఇరవైయేళ్లు కూడా లేవు. తెలంగాణ అంటే ఒక భూభాగమే తప్ప

అదొక చరిత్రని, సంస్కృతిని తెలియదు. ఆ అవగాహన కానీ, అభిప్రాయంకానీ నాకప్పటికి అసలే లేవు. కొంత ఉద్వేగానికి లోనయ్యాను. ఒక దశలో ఈ ప్రొఫెసర్ నిజాలే చెపుతున్నాడా అనిపించింది. ప్రసంగాలు ముగిసాక మళ్లీ సార్‌తో మాట్లాడాను. నా అనుమానాలు వ్యక్తం చేసాను. సదస్సు జరిగిన ప్రాంగణంలోనే గంటకు పైగా మాట్లాడాను. అప్పుడు అల్లం నారాయణగారు మా న్యూస్ ఎడిటర్ జయశంకర్ గారి ఇంటర్వ్యూ రిపోర్ట్ చేసాను. ఆ తొలి పరిచయంలో నాకు తెలంగాణ పాఠం చెప్పిన తొలి గురువు జయశంకర్ నాకొక్కడికే కాదు. మా తరానికి, యావత్ తెలంగాణవాదానికే ఆయన ఆది గురువువన్న సంగతి ఆ తరువాత నాకర్థమయింది.

ఆ మరుసటి ఏడాదే నేను హైదరాబాద్ వచ్చాను. ఉదయం పత్రికలో పనిచేస్తున్నప్పుడు ఉస్మానియాలో చదువుకున్నప్పుడు తరచూ కలుస్తూ వింటూ ఉండేవాడిని. జయశంకర్ సార్‌ది ఒక తండ్రి లాంటి మనసు పైకి మెచ్చుకున్నట్టు కనిపించకపోయినా సరైన మార్గం ఏదో చెప్పేవారు. ఉదయంలో రసూల్ అనే మిత్రుడిని పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో చంపిన విషయంలో అప్పటి ముఖ్యమంత్రి నేదురమల్లి జనార్ధన్‌రెడ్డితో జర్నలిస్టులకు గొడవ జరిగింది. అందులో నేను క్రియాశీలంగా ఉన్నానని ఉదయం యాజమాన్యం  నన్ను ఇబ్బంది పెట్టింది. ఆ విషయం తెలిసి మా జీవగడ్డ విజయకుమార్ సార్ నన్ను కాపాడాలనే ఉద్దేశంతో బండ ప్రకాశ్ అనే మిత్రుడి దగ్గరకు తీసుకెళ్లారు. ఆయన కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు జయశంకర్ గారు అప్పుడు అక్కడ వీసీగా ఉన్నారు. భయపడాల్సిన పనిలేదు. నేను సార్‌తో మాట్లాడుతాను, దూరవిద్యా కేంద్రంలో సోషియాలజిలో ఒక కన్సల్టెంట్ పోస్టు ఖాళీ ఉంది, వెంటనే చేరిపో అన్నారు. నేను ఒప్పుకోలేదు. పర్మినెంట్ లెక్చరర్ అయితే వస్తానన్నాను. అప్పటికే నేను యుజిసి నిర్వహించే లెక్చరర్ పరీక్ష పాసై ఉన్నాను. ఫెల్లోషిప్ కూడా ఉంది. ఢిల్లీ వెళ్లి జెఎన్‌టియులో పిహెచ్‌డి చెయ్యాలనుకున్నాను. తర్వాత ఒకసారి జయశంకర్ సార్ని కలిసాను. పిహెచ్‌డి చేసాక ఏం చేస్తావ్ అని అడిగాడు. నాకు సామాధానం తెలియదు. సారే అన్నారు. మనకు అవకాశాలే తక్కువ, వచ్చిన అవకాశాల్ని వదులుకోవద్దని, ఉద్యోగానికి రావాలి, ఆలోచించు అన్నాడు ఈలోగా కాకతీయ యూనివర్సిటీ నోటిఫికేషన్ వచ్చింది. ఉద్యోగమూ వచ్చింది. ఒకరకంగా ఆయన నా ఆలోచనను అధ్యాపక వృత్తిలోకి వచ్చేవాన్ని కూడా కాదేమో దాదాపు రేండేళ్లు ఆయన విసిగా ఉండగా నేను కాకతీయలో పనిచేసాను. ఈలోగా నాకు ఓపెన్ యూనివర్సిటీలో ఉద్యోగం వచ్చింది. వెళ్లి రిలీవ్ చెయ్యమని అడిగాను. నేను నిన్ను వదలుకొదలుచుకో లేదు. నువ్విక్కడే ఉండాలి. హైదరాబాద్ కంటే నీ సేవలు అవసరం ఇక్కడే అన్నాడు. అప్పటి ఓపెన్ యూనివర్సిటీ వీసీ బషీరుద్దీన్‌తో స్వయంగా మాట్లాడి మూడు నెలలు గడువు తీసుకున్నారు. ఈ లోగా ఆలోచించుకోమన్నారు. నేను వినలేదు. నాకున్న కారణాల రీత్యా నేను కాకతీయ వదలిపెట్టాను. కానీ సార్ సాహచర్యం మాత్రం వదులుకోలేదు. వచ్చే ముందు ఒక మాటన్నారు. ఇక్కడే ఉంటే తెలంగాణకు, తెలంగాణ ప్రజల కోసం పరితపిస్తున్న వాళ్ల  కోసం పనికోచ్చేవాడివి కదా అని. ఎక్కడున్నా ఆ పనిలోనే ఉంట సార్ అని వచ్చేసాను. ఇప్పటి వరకు ఆ మాట తప్పలేదు.

ఆ తర్వాత చాలా మాట్లాడుకున్నాం. బహుశా జయశంకర్ సార్‌ను ఎక్కువసార్లు ఇంటర్వ్యూ చేసింది. కూడా నేనే నేమో డిసెంబర్ 9 ప్రకటన తర్వాత సార్ ఎంతో తృప్తిగా కనిపించారు. అప్పుడు ఏబీఎన్ ఛానల్‌లో ఇన్‌సైడర్ పేరుతో ఇంటర్వ్యూ చేసాను. దాదాపు మూడు గంటల పాటు ఆయన తన జీవిత ప్రస్థానమంతా చెప్తూ పోతుంటే అరవయ్యేళ్లు తెలంగాణ ప్రజల పోరాట చరిత్ర ఆవిష్కృతమైంది. ప్రొఫెసర్ జయశంకర్ జీవితం తెలంగాణ ఆత్మగౌరవ పోరాట చరిత్ర అని అర్థమయింది. ఈ మధ్యనే టి న్యూస్ ఛానల్ కోసం  ఆయన జీవితం చరిత్రను ఆ చరిత్రలోంచి తెలంగాణ అస్తిత్వ పోరాట చరిత్రను ఆవిష్కరించాలని ప్రయత్నించాను. మే నెల 16న ఒక గంటసేపు మాట్లాడుకున్నాం. ఆయనతో కాలేదు. గొంతు జీరవోయింది. నేను ఆ మరుసటి రోజు కెనడా వెళ్తున్నాను. కానీ చేత కావట్లేదు. నువ్ వెళ్లు, వచ్చేలోగా నేను బాగా అవుతాను. రాగానే మొదలు పెడదాం అన్నారు. అంతా ప్లాన్ చేసుకున్నాం. నేను కెనడా నుంచి అమెరికా వెళ్లాను. ఒక దశాబ్దం కిందట ఆయన అక్కడ నాటిన తెలంగాణ

బీజాలు ఇప్పుడు మహావృక్షాలై విస్తరించాయి. అక్కడి మిత్రులు సార్ చెప్పిన విషయాల సారాన్ని నెమరువేసుకుంటూ తెలంగాణ కోసం కలలు కంటున్నారు. చికాగో నుంచి ఒకసారి సార్‌తో మాట్లాడాను. ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పాడు. ఇండియా రాగానే ఫోన్ చేసాను. కలుస్తానని చెప్పాను. కానీ అదాలత్ ముందు అమరవీరుల స్థూపం వద్ద వేలాది మందిలో నేనొకడిని. వి.వి. నిల్చున్న స్థూపం వేదికపైకి పిలిచారు. కేసిఆర్ గులాబీ పూలిచ్చారు. జయశంకర్ సార్‌కు అర్పించి అందరం కలిసి నడిచాం. ఒకవైపు వీవీ, విమలక్క మరోవైపు కేసీఆర్ ముందు మైకులో గద్దర్ పాట 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా ... ఊరు ఊరంతా పది జిల్లాల జనం ఆ ప్రయాణం, ప్రవాహం అలాగే కొనసాగితే జయశంకర్ గారి కల నెరవేరుతుంది. తెలంగాణ వచ్చి తీరుతుంది. ఇంతకంటే సార్‌కు మనమిచ్చే నీరాజనం ఏముంటుంది.

**– ప్రొ॥ ఘంటా చక్రపాణి**
సామాజిక పరిశోధకులు

నమస్తే తెలంగాణ దినపత్రిక
26 జూన్, 2011

---

# అశ్రునివాళి

ప్రొఫెసర్ జయశంకర్ ఉన్నత విలువలుగల అరుదైన వ్యక్తి. ఆయన హైదరాబాద్ నిజమైన సంస్కృతికి ప్రతీక. తన తుదిశ్వాస వరకూ తెలంగాణ కోసం పోరాడారు. ఆయన మరణం ఉద్యమానికి తీరని లోటు.

**– మహబూబ్ ఆలం ఖాన్,** *అన్వరులూం కళాశాల*

తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిరిగా బతికిన మహోన్నత వ్యక్తి. ప్రజా ఉద్యమాలను నిర్మించి ఆత్మగౌరవంతో బతకాలని దారి చూపిన వ్యక్తి. ఆయన చివరి కోరిక తీర్చేందుకు తెలంగాణ ప్రజాప్రతినిధులంతా చిత్తశుద్ధితో పోరాడాలి.

**– సంధ్య,** *పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు*

ఆంధ్ర రాష్ట్రానికి ముందే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పాటుపడిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ తను నమ్ముకున్న ఆశయం కోసం, లక్ష్యసాధన కోసం విభిన్న సిద్ధాంతాలను ఏకం చేశారు.

**– లక్ష్మీనారాయణ,** *బీజేపీ ఫ్లోర్ లీడర్*

సీకేఎం కళాశాలకు మూడు సంవత్సరాలు ప్రిన్సిపాల్‌గా చేశారు. ఎమర్జెన్సీ సమయంలో కళాశాలలను బంద్ చేసే సమయంలో ముందుండి పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి ఆయన. తెలంగాణ రాష్ట్ర సధానలో సీకేఎం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఆయన స్ఫూర్తితో ముందుంటాం.

**– సదాశివశంకర్,** *సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్*

తెలంగాణ ఆకాంక్షకు నిలువెత్తు రూపం జయశంకర్. తన జీవితాన్ని మొత్తం తెలంగాణ ఉద్యమానికే అంకితం చేసిన వ్యక్తితోనే 'జైబోలో తెలంగాణ' సినిమా ముహూర్తం రోజున మొదటి షాట్ కార్యక్రమాన్ని చేయించాం.

**– శంకర్,** *సినీ డైరక్టర్*

# మరపు రాని తెలంగాణ బిడ్డ

**- ఎన్. వేణుగోపాల్**

ఆయన ఎన్నోసార్లు వారించినా ఆయనను అందరూ తెలంగాణ సిద్ధాంతకర్తగానే గుర్తించారు. కొందరు కొంత చిన్న చూపుతో తెరాస సిదా&:తకర్తగానో ... సలహాదారుగానో కూడా గుర్తించి ఉండవచ్చు. కానీ ఆయన ఆ విశేషణానికి ఎన్నో రెట్లు మించిన తెలంగాణ ముద్దుబిడ్డ. మరుపురాని

## తెలంగాణ మహావ్యక్తి ...

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ నిజంగా ఒక అరుదైన మానవతామూర్తి. ఓ ప్రజ్ఞావంతుడైన విద్యావేత్త. ఒక సమర్థుడైన విద్యా నిర్వాహకుడు. ఒక శక్తివంతుడైన ప్రజా మేధావి. ఒక అసాధారణమైన ఆలోచనాపరుడు - ఆచరణశీలి కలగలిసిన మహావ్యక్తి. డెబ్బై ఆరు సంవత్సరాల జీవితంలో ఆరు దశాబ్దాల పాటు ఆయన తెలంగాణ స్వతంత్ర వ్యక్తిత్వం గురించి, తెలంగాణ ప్రజల ఆకాంక్షల గురించి పనిచేశారు. గనుక తెలంగాణ సిద్ధాంత కర్త అనే పిలుపు ఆయనకు అక్షరాలా సరిపోతుంది.

ఉన్నత పాఠశాల విద్యార్థిగా 1952 ముల్కీ ఆందోళనలో పాల్గొన్న నాటి నుంచి, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మేధో పునాది అందించిన తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ బాధ్యుడిగా ఉన్న నాటి నుంచీ, ప్రస్తుత తెలంగాణ ఉద్యమం దాకా అరవై సంవత్సరాల పాటు ఆయన తెలంగాణ ప్రత్యేక అస్తిత్వాన్ని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపడానికి నిరంతరం ప్రయత్నిస్తూ వచ్చారు. 1950 తొలి దినాల నుంచి 2011 దాకా ఆయన తెలంగాణ ఉజ్వల భవిష్యత్తు గురించి కలగంటూనే వున్నారు. పరితపిస్తూనే వున్నారు. ఆ కృషిలో ఎవరు కలిసి వస్తే వారితో కలిసి పనిచేస్తున్నారు. ఆ అర్థంలో ఆయనను తె.రా.స సిద్ధాంత కర్త అన్నా ... అతిశయోక్తి కాదు. నిజానికి అంగీకరించినా అంగీకరించకపోయినా ... తెలంగాణ కోసం పనిచేస్తున్న రాజకీయ, రాజకీయేతర సంస్థలకూ వ్యక్తులకూ అందరికీ ఆయనే ప్రేరణ. లోలోపలనైనా ఆయన ఆరాధ్యుడు. కాళోజీ తర్వాత ఆ స్థానం దక్కేది జయశంకర్‌కు మాత్రమే. కాళోజీకైనా తొలిరోజుల్లో విశాలాంధ్ర నేపథ్యం ఉన్నది కానీ జయశంకర్ ఆది నుంచీ తుదివరకూ తెలంగాణను మాత్రమే కోరుకున్నారు.

తెలంగాణ వ్యక్తిత్వం మాత్రమే కాక జయశంకర్‌లో విశిష్టతలు ఎన్నో ఉన్నాయి. వ్యక్తిగా ఆయన స్నేహశీలి. వయోభేదంలేని స్నేహం ఆయనది. మనుషుల పట్ల తోటి మనుషుల ఇబ్బందుల పట్ల ఉద్వేగపూరితంగా స్పందించేవారాయన. ఎవరితోనైనా మృదువుగా, సాదరంగా, ప్రేమతో ప్రవర్తించేవారు. విద్యావేత్తగా ఆయన ప్రజ్ఞావంతుడు. పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా, లోతైన విశ్లేషకుడిగా ఆయన కృషి మరపురానిది. ఆయన రచనల్లో ఉపన్యాసాల్లో అది నిక్షిప్తమై ఉంది. ఆయన నిర్వహణ సామర్థ్యానికి అద్దంపట్టే పదవులూ ఎన్నో ఉన్నాయి. అధ్యాపకుల సంఘ బాధ్యుడిగా, వరంగల్ చందా కాంతయ్య స్మారక కళాశాల ప్రిన్సిపాల్‌గా, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ రిజిస్ట్రార్‌గా, కాకతీయ విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్‌గా, వైస్ ఛాన్సలర్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలు, ఆ కాలాలు గర్వంగా గుర్తుంచుకోదగ్గవి.

హనుమకొండలో గడిచిన చిన్నతనంలో ఆయన నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు చేసిన వీరోచిత పోరాటాన్ని కళ్లారా చూశారు. బహుశా దుష్పరిపాలనను వ్యతిరేకించే ప్రజల పోరాటశక్తి మీద అపారమైన విశ్వాసం ఆయన మనసు మీద చెరగని ముద్ర వేసి ఉంటుంది. అందుకే ఆయన జీవితమంతా పరాయిపాలకుల దుష్పరిపాలన మీద పోరాటానికి సిద్ధపడ్డారు. 1952 విద్యార్థి ఆందోళనలో భాగం పంచుకోవడం మాత్రమే కాదు, ఫజల్ అలీ కమిషన్‌ను కలిసి హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రం కోరుతూ విజ్ఞప్తి పత్రం ఇచ్చిన విద్యార్థి బృందంలో వున్నారు. అలా 1950ల తొలినాళ్లలో పడిన నిప్పురవ్వ అరవై సంవత్సరాల పాటు ఆరకుండా జ్వలిస్తూనే ఉండింది. అర్థశాస్త్ర అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా ఆయన తెలంగాణ వివక్ష మీద ప్రత్యేకంగానూ ప్రాంతీయ అసమానతల మీద మొత్తంగానూ విశేష అధ్యయనం చేశారు. ఎన్నో రచనలూ, ఆలోచనలు చేశారు. అవన్నీ తెలంగాణ సమాజంతో ఎప్పటికప్పుడు పంచుకున్నారు. వందలాది సమావేశాలలో, సభలలో పాల్గొన్నారు. 1969 ఉద్యమ సమయంలో తెలంగాణ వివక్షపై ఏర్పాటు చేసిన అసాధారణమైన సదస్సు నిర్వాహకులలో ఆయన ఒకరు.

1969 ఉద్యమం ద్రోహానికి బలి అయి ముగిసిపోయి, వెనుకంజ వేసిన తర్వాత ఆయన చాలా నిశ్శబ్దంగా ... ఆ అపజయానికి కారణాలను, పునర్విజృంభణ అవకాశాలను అన్వేషిస్తూ ఉండిపోయారు. ఆ నిశ్శబ్ద కృషి 1990 నాటికి ఫలితాలు సాధించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తప్ప మరొక మార్గాంతరం లేదు అనే ఆలోచనకు 1990ల నాటికి బహుజనామోదం లభించింది. 1990ల మధ్య నుంచీ అనేక సంస్థలు పుట్టుకువచ్చి ఈ ఆకాంక్షను వ్యక్తీకరించడం ప్రారంభించాయి. ఆ సంస్థలు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా వాటిమీద జయశంకర్ ప్రభావం నిరాకరించడానికి వీలులేనిది.

1971 తెలంగాణ ప్రజాసమితి ద్రోహం తర్వాత మొదటి రాజకీయ నిర్మాణంగా 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడడం కూడా ఆయన కృషికి కొనసాగింపే. ఈ పరిణామాలతో తన కల సాకారం కాబోతున్నదని ఆయన సంతృప్తి చెందినట్లు కనిపిస్తుంది. అయితే అప్పటికి కొన్ని నిరుత్సాహాలు, ఆశాభంగాలు లేకపోలేదు. ఆయన వాటిని సన్నిహిత మిత్రుల దగ్గరా, అభిమానుల దగ్గరా వ్యక్తం చేసేవారు కూడా. కానీ 'ఎన్ని లోపాలు ఉన్నా తెలంగాణను సాధించడానికి, ఒక రాజకీయ పార్టీ వెంట ఉండి కృషి చేయక తప్పదు' అని ఆయన తనకు తాను నచ్చచెప్పుకునేవారు.

తెలంగాణ రాష్ట్ర సాధనకు మూడు ప్రధాన ఆధారాలున్నాయని ఆయన ఎన్నోసార్లు చెప్పారు. 1) రాజ్యాంగ అధికరణం 3 కింద పార్లమెంటులో బిల్లు పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే రాజకీయ ప్రక్రియ. 2) ఆ రాజకీయ ప్రక్రియను సక్రమంగా నడిపే, ప్రజల మద్దతును కూడగట్టే ప్రజా ఉద్యమం. 3) తెలంగాణ ప్రజలలో ప్రతి ఒక్కరిలోనూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను నింపే భావజాల వ్యాప్తి, మేధో కృషి.

జయశంకర్ అరవై సంవత్సరాలపాటు భావజాల వ్యాప్తి, మేధో కృషి సాగించారు. మూడు దశలలోనూ ప్రజా ఉద్యమాలు వెల్లువెత్తినప్పుడు వాటిల్లో పాల్గొన్నారు. గత పది సంవత్సరాలలో రాజకీయ ప్రక్రియను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. అంటే ... ఆయన తాను చెప్పిన మాటకు అక్షరాలా, మనసా వాచా కట్టుబడ్డారు. ఆ కృషి కొనసాగించడమే ఆయనకు నివాళి.

**- ఎన్. వేణుగోపాల్**

నమస్తే తెలంగాణ దినపత్రిక
23 జూన్, 2011

# తెలంగాణ తీర్పరి!

**- మల్లెపల్లి లక్ష్మయ్య**

ఈ నెల సరిగ్గా తొమ్మిదవ తేదీన తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సమావేశం జరిగింది. ఆ సమావేశానికి హాజరవడానికి వెళుతూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తెలంగాణ 'జాతిపిత' 'ప్రథమపౌరుడు' ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్‌ను కలిశాను. అప్పటికే క్యాన్సర్ మహమ్మారి జయశంకర్ సార్ మీద తన క్రౌర్యాన్ని కక్కుతున్నది. ఉద్యమంలోనే కాదు. రోగంతో కూడా ఆయన వెనుదిరగని పోరాటం చేస్తున్నాడు. అప్పటికే మాట పలుచబడింది. నా చేయి గట్టిగా పట్టుకొని ఏదైనా చెయ్యండి. అంటూ హెచ్చరికగా చూశాడు. నిజానికి ఆ రెండు మాటలు చివరి ఆదేశం అవుతుందనుకోలేదు.సార్ సంకల్పశక్తి ముందు అప్పటికే పారిపోతున్న క్యాన్సర్ ఇంత తొందరగాపైచేయి సాధిస్తుందని ఊహించలేదు. సంవత్సర కాలంగా క్యాన్సర్ తో పోరాడుతున్న సార్ ఏనాడు తన అనారోగ్య గురించి పెద్దగా ఆలోచించలేదు. ఆయనకు తెలంగాణ రాష్ట్రసాధన ధ్యాస తప్ప మరొకటి లేదు. ఒక రంగా చెప్పాలంటే, తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా రాష్ట్రం ఏర్పాటు పోరాటంలో కళ్లు తెరిచి, అందరితో నడిచి, ఎందరిలోనో ఒక్కడై, 1996 వచ్చేసరికి ఒకే ఒక్కడై ఉద్యమాన్ని పునర్జీవింపచేసిన వైతాళికుడు.

1934లో వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో లక్ష్మికాంతారావు, మహాలక్ష్మి దంపతులకు పుట్టిన కొత్తపల్లి జయశంకర్ విద్యాభ్యాసం డిగ్రీదాకా హన్మకొండలోనే సాగింది. ఉపాధ్యాయుడిగా చేరి, ఆర్థిక శాస్త్రంలో ఆలీగడ్, బనారస్. విశ్వవిద్యాలయాల నుంచి ఎంఏ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పొందారు. హన్మకొండలోని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా కాకతీయ విశ్వవిద్యాలయం, సీఫెల్‌లకు రిజిస్ట్రార్, కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా పనిచేశారు. ఏ చదువులు చదివినా, ఏ పదవులు ఏలినా ఆయన దృష్టి మనసుస తెలంగాణ మాత్రమే అని చెప్పడానికి ఆయన జీవనం, నడిచిన మార్గం, నడిపిన ఉద్యమాలే సాక్ష్యం 1952లో నాన్‌మాల్కీ గోబ్యాక్ ఉద్యమం ఆయన జీవితాన్ని మలుపుతిప్పింది. ఆయన వయస్సు కేవలం 18 సంవత్సరాలు. హైదరాబాద్‌లో ఆ ఏడాది జరిగిన విద్యార్థుల ప్రదర్శనలో పాల్గొనడానికి వరంగల్ నుంచి బయలుదేరిన జయశంకర్ బస్సు పాడైపోవడం వల్ల మధ్యలో ఆలస్యంగా హైదరాబాద్ చేరుకున్నారు. అప్పటికే కాల్పులు జరిగి కొందరు విద్యార్థులు మరణించారు. ఆ సంఘటన గుర్తుకొచ్చినప్పుడల్లా ఆ రోజు ముందుగా వస్తే నేను కూడా ఆ కాల్పుల్లో పోయేవాణ్ణేమో అదే జరిగితే ఇంత వివక్ష ఇన్ని యాతనల నుంచి విముక్తి దొరికేదేమో అని కళ్లలో నీళ్లు తెచ్చుకునే వారు. ఆ విద్యార్థి దశలో ప్రారంభమైన ఉద్యమ చైతన్యం తుది శ్వాస విడిచే వరకు కొనసాగడం జయశంకర్ జీవితానికి ఉన్న ప్రత్యేకత. అయితే 1969లో మళ్లీ ప్రారంభమైన ఉద్యమంలో జయశంకర్ తన పాత్రను నిర్వహించిచుకున్నారు. తన ఆప్తమిత్రులు తోట ఆనందరావుతో కలిసి, అప్పటి ఉస్మానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ రావాడ సత్యనారాయణ ప్రోత్సాంతో తెలంగాణకు ఉమ్మడి ఆంధ్రలో జరిగిన అన్యాయాలపై అక్షరయుద్ధం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన సెమినార్‌లో ప్రవేశపెట్టిన పత్రాలతో పుస్తకం తీసుకొచ్చారు. 1969 ఉద్యమం సందర్భంగా అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఆహ్వానించిన మేధావుల బృందంలో జయశంకర్, తోట ఆనందరావులు సభ్యులుగా ఉన్నారు. ఆ తర్వాత అత్యంత కీలకమైనది. 1996వ సంవత్సరం అప్పటి

ఎన్‌డీఏ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్, ఉత్తరాంచల్, జార్ఖండ్ రాష్ట్రాలను ప్రకటించిన అనంతరం మళ్లీ తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి జీవింపచేయడానికి జయశంకర్ సార్ నడుంకట్టారు. 1996 అక్టోబరు 27వ తేదీన నిజామాబాద్‌లో మొదటి సభ జరిగింది. నవంబర్ 1వ తేదీన విద్రోహదినం పేరుతో వరంగల్ పట్టణంలో మరొక పెద్ద సభ నిర్వహించారు. ఆ సభ నిర్వహణలో కీలకపాత్ర పోషించడమే కాకుండా, ప్రధాన ప్రసంగం చేశారు. ఈ రోజు జరుగుతున్న ఉద్యమానికి ఆ సభ పురుడుపోసింది. 1997 జనవరి, 14వ తేదీన కరీంనగర్ జిల్లా గోదావరి ఖనిలో మల్లెపల్లి రాజం మెమోరియాల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, స్మారకోపన్యాసం చేశారు. అక్కడే అప్పుడే స్మారకోపన్యాసం పూర్తి పాఠాన్ని పుస్తకంలా ప్రచురించి ఆవిష్కరించారు. 'తెలంగాణలో ఏమి జరుగుతోంది' అన్న పేరుతో ప్రచురితమైన ఈ పుస్తకం ఈ దశ ఉద్యమంలో మొట్టమొదటి పుస్తకంగా చెప్పుకోవచ్చు. ఆ విధంగా మూడవ దశ ఉద్యమ ప్రయత్నం నిరంతరాయంగా సాగింది. తెలంగాణ ఉద్యమం ప్రజాస్వామిక స్వభావాన్ని సంతరించుకున్నదంటే దానికి కారణం జయశంకర్ సార్ తాత్విక చింతనే. తెలంగాణ సాధనలో రాజకీయ అంటరానితనాలు ఉండకూడదని. ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ దాకా ఏ సిద్ధాంతమైనా తనకు ఒక్కటేనని, అందరితో కలిసి పనిచేస్తానని ప్రకటించిన తెలంగాణ ఉద్యమ మార్గదర్శి జయశంకర్. ఉద్యమంలో అనేక ప్రవాహాలు ఉంటాయని, అవకాశముంటే సమైక్యంగా పనిచేయలని, కుదరకుంటే సమన్వయంతో, లేదంటే సహకారంతో, అదీ కుదరకుంటే సమాంతరంగా ఒకరినొకరు నిందించుకోకుండా పనిచేయాలని దిశ, దశ నిర్దేశించారు. పదవులు వచ్చినా హోదా పెరిగినా తెలంగాణ ఆశయం ముందు ఆయనకు అవన్నీ దిగదుడుపు ఆయన వ్యక్తిగత జీవితం ఎంతో మహోన్నతమైనది. పెన్షన్ తప్ప బ్యాంక్ బ్యాలెన్స్‌లేని అతిసాధారణ జీవనం, అసాధారణ గమనం అయనకే సొంతం.

సాక్షి దినపత్రిక
22 జూన్, 2011

**– మల్లెపల్లి లక్ష్మయ్య,**
సీనియర్ జర్నలిస్టు

---

# అశ్రునివాళి

1999లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరంను ఏర్పాటు చేయించారు. ఖండాంతరాల్లో ఉన్న తెలంగాణ ఉన్న తెలంగాణ ప్రజలను ఈ ఫోరం ద్వారా ఏకం చేసి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను తెలిపిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్.

**– రమేష్,** *తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం,యూఎస్ఏ*

జయశంకర్ జీవితమే ఒక సందేశం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ఏకైక లక్ష్యంగా పనిచేశారు. అదేస్ఫూర్తితో ముందుకు సాగడమే ఆయనకు నిజమైన నివాళి.

**– ప్రసాద్,** *టీడబ్ల్యుజే కన్వీనర్*

మహబూబ్‌నగర్ జిల్లాకు ప్రొఫెసర్ జయశంకర్‌కు పేగుబంధం, ఆత్మబంధం ఉంది, జిల్లావ్యాప్తిగా జరుగుత్ను వలసలు, తరలిస్తున్న నీళ్లు, నిధుల గురించి ప్రచారం చేసిన మహనీయుడు ఆయన.

**– రాఘవాచారి,** *అధ్యయన వేదిక కన్వీనర్*

# నాలుగు తరాలతో నడిచిన యోధుడు

**- వి. ప్రకాశ్**

సూర్య చంద్రులున్నంత కాలం, సృష్టి సాగినంత కాలం తెలంగాణ ప్రజల మహోన్నత పోరాటాల చరిత్ర నిలిచే వుంటుంది. తెలంగాణ చరిత్రలో అంతర్భాగంగా జయశంకర్ గారిని రాబోయే తరాల ప్రజలు సదా స్మరిస్తూనే వుంటారు.

తెలంగాణ తల్లి ప్రసవించిన అత్యుత్తమ పుత్రులలో మొదటి శ్రేణిలో నిలిచిన మహోన్నత వ్యక్తి జయశంకర్. కొన ఊపిరి ఉన్నంత వరకు నమ్మిన ఆశయం కోసం ప్రజల కోసమే జీవించే వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి త్యాగధనులను మరణం జనం నుండి ఎప్పటికీ వేరుచేయలేదు. భౌతికంగా జయశంకర్ సారు మనల్ని వీడినా మనందరి మదిలో ఎప్పటికీ నిలిచే ఉంటారు.

జయశంకర్ సారు జీవితాన్ని తెలంగాణ ఆరు దశాబ్దాల ఉద్యమాన్ని వేరు చేసి చూడలేము. 1952లో వరంగల్ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమై హైదరాబాద్‌లో మహోద్యమ రూపం దాల్చిన 'నాన్ ముల్కీ గో-బ్యాక్' ఉద్యమంలో ఆనాటి విద్యార్థి జయశంకర్ కీలకపాత్ర నిర్వహించారు. సిటీ కళాశాల వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో ఎందరో విద్యార్థులు అమరులైనారు. ఆ సంఘటనలను గుర్తుకు తెచ్చుకుంటూ 'ఆనాటి సిటీ కళాశాల విద్యార్థుల ర్యాలీకి వెళ్తూ భువనగిరి వద్ద ఫెయిలై ఆగిపోయిన బస్సు టైంకు హైద్మదరాబాద్ చేరి ఉంటే ఆ ర్యాలీ మొదటి వరుసలో నేనుండే వాణ్ని. ఆనాటి కాల్పుల్లో చచ్చినా బాగుండేది. యాభై ఏళ్ళుగా ఈ ప్రాంత ప్రజల కడగండ్లు, కన్నీళ్లు చూసే దుస్థితి నాకు దాపురించకపోయేది' అంటూ ఎంతో ఆవేదనతో మాట్లాడేవారు.

జయశంకర్ సారుతో నా సంబంధం గురుశిష్యుల అనుబంధం. 1975లో నేను వరంగల్ సి.కె.ఎం. కళాశాలలో డిగ్రీ చదువుతున్నప్పుడు సారు ప్రిన్సిపాల్‌గా మా కళాశాల బాధ్యత తీసుకున్నడు. సారు ప్రిన్సిపాల్‌గా రావడం వెనుక పెద్ద కథే ఉన్నది. అంతకన్న ముందు సికెఎం కళాశాలలో రెండు విద్యార్థి గ్రూపుల మధ్య కొట్లాటలు, కత్తిపోట్ల ఘటనలు జరిగినయి. విప్లవ కవి వరవర రావు గారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లో పెట్టింది ప్రభుత్వం. వరవర రావు గారు సికెఎం కళాశ్శాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్నారు. కళాశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా అప్పటి వరంగల్ కలెక్టర్ బాలరాజ్ గారిని ఆహ్వానించింది యాజమాన్యం. విద్యార్థులమైన మేము వేదికపై 'వరవరరావును బేషరతుగా విడుదల చేయాలని' పెద్ద బ్యానర్ పెట్టినం. కలెక్టర్ వేదికపైకి వస్తూనే కోపంగా ఆ బ్యానర్ కాగితాలను చించివేశారు. దానితో మేమంతా ఆవేశంతో 'కలెక్టర్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేసినం. కొందరు కోపంగా వేదికపైకి దూసుకుపోయిండ్లు. పరిస్థితి చేయిదాటి పోతున్నదని తెలుసుకున్న పోలీసులు లాఠీచార్జీ చేసిండ్లు. గాల్లోకి కాల్పులు జరిపిండ్లు. సభ రద్దయింది. పోలీసు రక్షణలో కలెక్టర్ వెళ్లిపోయిండు. యాజమాన్యం తలపట్టుకున్నది. అప్పటి ప్రిన్సిపల్ అంజయ్యతో విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టడం అసాధ్యమనే నిర్ణయానికి వచ్చి ఆంధ్ర రాష్ట్రమంతా కొత్త ప్రిన్సిపాల్ కోసం జల్లెడ పట్టి సిటీ కాలేజీలో ఆర్థిక శాస్త్ర అధ్యాపకులుగా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ గారిని ఒప్పించి వరంగల్‌కు తోల్కొచ్చిండ్లు. సారుకు అప్పటికే మంచి అధ్యాపకునిగా పేరున్నది. లెక్చరర్‌గా ఆదిలాబాద్‌లో షురువైన సారు ప్రస్థానం సిటీ కాలేజీ మీదుగా వరంగల్ చేరింది. సారు

రాంగనే సికెఎం కాలేజీల పరిస్థితి అర్థం చేసుకున్నడు. మా విద్యార్థి నాయకులతో మాట్లాడి నచ్చ చెప్పిండు. ఆ తర్వాత ఎన్నడూ సి.కె.ఎం.ల క్రమశిక్షణ దారి తప్పలేదు. వందలాది మంది ఉత్తమ విద్యార్థులను సృష్టించడమే కాకుండా ఉస్మానియా వీసీగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి వంటి పెద్దల అభినందనలను కూడా సికెఎం పొందగలిగిందంటే అదంతా సారు కృషి వల్లనే అని వేరే చెప్పనక్కరలేదు.

కాకతీయ యూనివర్శిటీయే సి.కె.ఎం కాలేజీకి అనుబంధంగా పనిచేస్తున్నదని జగన్మోహనరెడ్డి వ్యాఖ్యానించారు. సికెఎంకు సంబంధించి ఎప్పుడూ గుర్తుండే మరో సంఘటన వరవరరావు గారిని తిరిగి అధ్యాపకులుగా నియమించడం. అప్పుడు జిల్లా నుండి మంత్రిగా ఉన్న హయగ్రీవాచారి దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జయశంకర్‌సారు వరవరరావు సర్వీసు కొనసాగింపు కోసం అప్పటికే ముఖ్యమంత్రితో రాత పూర్వకమైన ఆదేశాలను పొంది ఉన్నారు. సిఎం సంతకం చూపించి హయగ్రీవాచారి నోరు మూయించారు. హయగ్రీవాచారితో ఇలాంటి ఘటనే మరో సందర్భంలో పునరావృతమైంది. సారు కాకతీయ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా ఉన్నప్పుడు హయగ్రీవాచారి మంత్రిగా ఉన్నారు. తనకు ఇష్టమైన ఒక వ్యక్తిని అటెండర్‌గా నియమించాలని లెటర్ సారుకు పంపించాడు. తెచ్చిన వ్యక్తి ముందే సారు లెటర్ చింపి మీ మంత్రికి చెప్పుకోమన్నడు. కోపంతో మంత్రి సారును తన చాంబర్‌కు వచ్చి కలవమన్నడు. 'నాకు మీతో పనిపడ్డప్పుడు తప్పక వస్త. ఇప్పుడు నాకు పనిలేదన్నడు' దీంతో మరింత కోపంతో ఊగిపోయి హుటాహుటిన జయశంకర్ సారింటికే హయగ్రీవాచారి వచ్చిండు. 'ఒత్తిళ్లకు లొంగనని' సారు కరాఖండిగ చెప్పిండు. తెల్లమొహం వేసుకొని మంత్రి వెనుదిరిగిండు. ఆ రోజుల్లో హయగ్రీవాచారి అంటే వరంగల్ జిల్లాలో హడల్. వామపక్షవాదులనెందరినో కాంగ్రెస్‌వాళ్లు హత్య చేయడం వెనుక ఈయన హస్తం ఉన్నదని ప్రచారం జరిగింది. ఏ బెదిరింపులకూ చలించని వ్యక్తిత్వం సారుది. కాకతీయ యూనివర్శిటీకి వీసీగా సారు పనిచేస్తున్న రోజుల్లో అప్పటి సిఎం నేదురుమల్లి జనార్ధనరెడ్డి సారుకు ఒక లేఖ పంపిండు. తనకు కావలసిన ఒక వ్యక్తికి ఉద్యోగం ఇవ్వమని – ఆ లెటర్ పక్కన బెట్టి 'రూల్స్‌కు విరుద్ధంగా మీ కోర్కెను నెరవేర్చలేనని' సి.ఎం.కు సారు చెప్పిండు. దానికి సి.ఎం. కోపగించుకోకపోగా 'మీలాంటి నిబద్ధత, నిజాయితీ కలిగిన వ్యక్తిని వీసీగా నియమించినందుకు నాకు ఎంతో గర్వంగా ఉన్నదని' సారును అభినందించిండు.

తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో అరవై ఏళ్లు ప్రయాణించిన జయశంకర్ సారు జీవితాన్ని సమీక్షించడమంటే తెలంగాణ ఉద్యమ చరిత్రను రాయడమే అయితది. ఆ అరవై ఏళ్లలో నాలుగు తరాల తెలంగాణ నేతలతో, ఉద్యమ కారులతో కలిసి పనిచేసిండు. 1952–56లో బూర్గుల, కె.వి. రంగారెడ్డిలతో, 1969–74లో తన సమకాలికులైన భూపతి క్రిష్ణమూర్తి, ప్రతాప్‌కిషోర్, సంతపురి రఘువీర్ రావు, మదన్ మోహన్, మల్లికార్జున్, ఆనందరావు తోట, శ్రీధరస్వామి, వరవరరావు వంటి నేతలతో, 1996లో తన తర్వాతి తరం వారమైన మాలాంటి వారితో, కె.సి.ఆర్‌తో కలిసి పనిచేస్తూ తెలంగాణ ఉద్యమ దిశానిర్దేశం చేశారు. ఈ అరవై ఏళ్లలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఎందరో విద్యార్థులు, నాయకులు ఆ తర్వాత రకరకాల ఉద్యమాల్లోకి కొట్టుకుపోయారు. కొందరు అగ్రకులాల వ్యతిరేకతతో, మరికొందరు అగ్రవర్గాల వ్యతిరేకతతో కుల, వర్గ పోరాటాల్లోకి మళ్లినారు. తెలంగాణ ఉద్యమంలో 1969లో పాల్గొన్న నేతలెందరో ఆ ఉద్యమంలో అణచివేయబడిన తర్వాత శ్రీకాకుళం, ములుగు – ఖమ్మం నక్సలైట్ ఉద్యమంలో, విప్లవ పోరాటాల్లో చేరిపోయారు. ఎంతో మంది ఇప్పటికీ ఎన్ని రకాలుగా దారి మార్చినా జయశంకర్ సారు మాత్రం ఊపిరి ఉన్నంత దాకా 'తెలంగాణ' బాట వీడలేదు. ఇది సారుకు మాత్రమే సొంతమైన ప్రత్యేకత. ఎస్.ఆర్. శంకరన్, హరగోపాల్, జీవన్‌లతో పౌరస్పందన వేదికల్లో జయశంకర్ ముఖ్య పాత్ర నిర్వహించారు. పౌర స్పందన వేదిక చర్చల్లో ... నక్సలైట్ల సమస్య, తెలంగాణ వెనుకబాటుతనం నుండే వచ్చిందని, వలస దోపిడీ పోతే నక్సలైట్లు ఉండరని వాదించేవారు. శాంతి చర్చలు తమ తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసే విధంగా సాగాలని ఆశించారు.

1954లో రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ కమిషన్ ముందు హాజరైన విద్యార్థి బృందంలో నేతగా తెలంగాణ

రాష్ట్రం ఏర్పాటు అవసరం గురించి ఫజల్ అలీకి, కమిటీ సభ్యులకు వివరించారు జయశంకర్. విలీనానికి వ్యతిరేకంగా 1955-56లో సాగిన ఉద్యమంలో విద్యార్థిగా పాల్గొన్నారు. 1969లో తన సహచరులను ప్రోత్సహించి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై ఒక పుస్తకాన్ని ప్రచురించి ఆనాటి ఉస్మానియా వీసీ, ఆంధ్ర మహాసభ నాయకులుగా ఉద్యమంలో పాల్గొన్న రావాడ సత్యనారాయణ గారిచే హైదరాబాద్ వై.ఎం.సి.ఎలో, హన్మకొండలో ఆవిష్కరింపజేసిండు. ఆ పుస్తకం 1969 ఉద్యమకారులకు ఒక కరదీపికగా ఉపయోగపడటమేగాక అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని కూడా ఆలోచింపచేసింది. ఆ పుస్తకం ఆంగ్లభాషలో ఉండడం వల్ల రాష్ట్రేతరులకు కూడా తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను తెలుసుకునేట్లు చేసింది. పొత్తూరి వెంకటేశ్వరరావుగారి చొరవతో ఇందిరాగాంధీ జయశంకర్ గారిని మరికొందరు మేధావులను పిలిపించుకొని తెలంగాణపై చర్చించింది. 1971లో తెలంగాణ ప్రజా సమితి పక్షాన లోక్‌సభకు అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం సారుకు వచ్చింది. డిపాజిట్ పైసలు కూడా తన వద్ద లేనందున ఎం.పి. అవకాశాన్ని పోగొట్టుకున్నానని సారు చెప్పిండు.

1970 నుండి 1998 దాకా తెలంగాణ ఉద్యమానికి తిరిగి ప్రాణం పోయడానికి సారు చేయని ప్రయత్నమంటూ లేదు. 'ఆర్ఎస్‌యు నుండి ఆర్ఎస్ఎస్ దాకా ఎవరు పిలిచినా ఉద్యమంలో పాల్గొంటా'నని చెప్పేవారు జయశంకర్‌సారు. అట్లనే చేసిండు. ప్రజా కవులైన కాళోజీ సోదరులకు సారు ఎంతో సన్నిహితంగా ఉండేవారు. 1956లో సమైక్యవాదిగా ఉన్న కాళోజీ తెలంగాణ వాదిగా మారడంలో ఎంతో కొంత సారు పాత్ర కూడా ఉన్నది. సారుపై కాళోజీ ప్రభావం బలంగానే ఉన్నది. వీరిద్దరి కామన్ ఎజెండా 'సామాన్య ప్రజలు' కావడమే. ప్రజల గొడవే వీళ్ల గొడవ.

1987లో తెలంగాణ (నాట్యకళ) ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ మొదలుకొని అనేక ప్రజా సంఘాలకు, ఆనాటి తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ మొదలుకొని అనేక ప్రజా సంఘాలకు, ఆనాటి తెలంగాణ రీజనల్ కమిటీ నుండి నిన్నటి శ్రీకృష్ణ కమిటీ దాకా, తెలంగాణ ప్రజా సమితి నుండి నేటి టి.ఆర్.ఎస్. కాంగ్రెస్ పార్టీల వరకు, ఎవ్వరడిగినా వారికి తెలంగాణ గురించి గంటల కొద్ది చెప్పిండు, రాసిచ్చిండు. నేను రాసిన 'టి.ఆర్.ఎస్ పదేండ్ల ప్రయాణాని'కి సారు రాసిన ముందుమాటే సారు చివరి మాటైతదని ఎప్పుడూ అనుకోలే. 'నమస్తే తెలంగాణ' పత్రిక ప్రారంభం నాడు సారును టీవీల చూసి ఏడ్వని వాళ్లు లేరు.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో సారు పాత్రే కీలకం. అప్పటి ప్రధాని దేవెగౌడ 1996 ఆగస్టు 15న ఎర్రకోటపై 'ఉత్తరాఖండ్' రాష్ట్ర ఏర్పాటును ప్రకటించిన తర్వాత తెలంగాణ వాదుల్లో కొత్త ఆశలు చిగురించినయి. వరంగల్‌లో భూపతి క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో తెలంగాణ సభ జరిగింది. కొండా మాధవరెడ్డి, జయశంకర్ సారు మాట్లాడిండ్లు. తెలంగాణ ఆవేశం నిద్రలేపిండ్లు. నవంబర్ ఒకటిని విద్రోహ దినంగా పాటించాలన్నరు. నిజామాబాద్‌ల పోశెట్టి, మరికొందరు లాయర్లు సారుని పిలిచిండ్లు. హైదరాబాదులో పాశం యాదగిరి సభ జరిపిండు. భోనగిరిల గుప్తనాగారం అంజయ్య, లాయర్లు, తెలంగాణవాదులు సభ జరిపిండ్లు. ఇంద్రారెడ్డి 'జై తెలంగాణ' పార్టీ పెట్టిండు. సూర్యాపేటల డా॥ చెరుకు సుధాకర్, వి. ప్రకాశ్, భరత్, బెల్లయ్య నాయకులు తెలంగాణ మహాసభ షురువుజేసిండ్లు. యాభైవేల మంది ఈ సభకు వచ్చిండ్లు. తెలంగాణ వాదులకు నమ్మకం కలిగింది. లక్షమందితోని ఏఐపిఆర్ఎఫ్ హన్మకొండల సభ పెట్టింది. తెలంగాణ జనసభ పుట్టింది. అన్ని సభలల్ల జయశంకర్‌సారు మాట్లాడిండు. అందరికీ పెద్ద దిక్కుసారే. దేశంలనే కాకుంట అమెరికాల 'తెలంగాణ డెవెలప్‌మెంట్ ఫోరం' స్థాపనలో సారుదే కీలకపాత్ర. సారు, జనార్ధనరావు అమెరికాల ఎన్నో సభలల్ల తెలంగాణ గురించి చెప్పిండ్లు. శ్రీకృష్ణ కమిటీకి నలభైకి పైగా దేశాల నుంచి నివేదికలు రావడం వెనుక సారు పాత్ర ఉన్నది. బాలగోపాల్ సారు పిలిస్తే ఆంధ్ర, రాయలసీమల ఎన్నో మీటింగులకు పోయి అక్కడి వాళ్లకు తెలంగాణ ఎందుకడుగుతున్నమో చెప్పిండు. ఇయ్యాల ఆంధ్ర జనం తెలంగాణకు వ్యతిరేకంగా లేరంటే దానికి సారు మీటింగులు, టీవీలల్ల మాటలు కొంత కారణం.

1999లో తెలంగాణ ఉద్యమంపై చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని తెచ్చింది. జనసభ కార్యకర్తలను

నక్సలైట్లుగా ముద్రవేసి 'ఎన్‌కౌంటర్' పేరుతో చంపింది. సభలు పెట్టుకోనివ్వలేదు. నాతో సారు చెప్పిండు. తెలంగాణ ఉద్యమాన్ని నడపడానికి మనకున్న శక్తి, వనరులు చాలవు. కేవలం ఉద్యమాలతో మాత్రమే తెలంగాణ తేలేము. ఈ సంకీర్ణ రాజకీయ యుగంలో తెలంగాణ కోసం ఒక బలమైన రాజకీయ పార్టీ ఉండాలె. ఉద్యమాల పునాది మీద ఆ పార్టీ ఎదగాలె. ప్రజలను ఆకట్టుకునే ఒక నాయకుడు కావాలె. ఎవరైనా ముందుకు వస్తరేమో కనుక్కోండి' అన్నడు. సారు మాటలు నిజమేనన్పించింది. అప్పటికే జయశంకర్ సారు, ప్రొ॥ కేశవరావు జాదవ్‌ల ఆధ్వర్యంలో మేము 28 సంఘాలతో తెలంగాణ ఐక్యవేదికను సెప్టెంబర్ 28, 1997న ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నం. సభలు, ధర్నాలు, ప్రెస్‌మీట్లు, కరపత్రాలు వంటి వాటికే మేం పరిమితమైనం.

జయశంకర్ గారి సలహాతో నేను కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలలోని కొందరు తెలంగాణ వాదులను కలిసిన. అప్పటి ప్రతిపక్షనేత పీజేఆర్ తెలంగాణ సమస్యలపట్ల ఎక్కువగా స్పందించిండు. రోజూ సాయంత్రం ఆయన ఇంటికి పోయి బాగా రాత్రయ్యేదాకా వుండి తెలంగాణ గురించి చెప్పినం. జయశంకర్, జాదవ్‌లను పీజేఆర్ ఇంటికి తోలుకపోయి వాళ్లతో చెప్పించిన. నెలలు గడిచినయ్. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎక్కువ ఓట్లు సీమాంధ్ర ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడిన వాళ్లయి వున్నయి. పీజేఆర్‌ను ఎన్నికల్ల ఓడించిండ్లు. ఓడిపోయినంక తెలంగాణ అంటరు. నన్ను ఇడిపిసిపెట్టు. ఎవ్వలు ముందుకు వచ్చినా నా సపోర్టు వుంటది అని పీజేఆర్ చెప్పటంతో ఇంక నమ్మదగ్గ నాయకులెవ్వరూ లేరని నిరాశ చెందినం. సరిగ్గ అదే టైంల కేసీఆర్ చంద్రబాబుకు విద్యుత్ చార్జీల పెంపుపై బహిరంగ లేఖ పత్రికల్లో వచ్చింది. తెలంగాణ పెద్దలు కేసీఆర్‌ను కలిసిండ్లు. ఆ సమయానికి జయశంకర్ సారు అమెరికల వున్నడు. సారుకు కేసీఆర్ ఫోన్ చేసిండట. ఈ సంగతి నాకు ఫోన్ చేసి చెప్పిండు సారు. నన్ను వెళ్లి కేసీఆర్‌ను కలవమని చెప్పిండు. అప్పుడే కేసీఆర్ రమ్మంటున్నడని భరత్‌కుమార్ (అడ్వకేట్) నా దగ్గరికి వచ్చిండు. కేసీఆర్‌ను కలిసినంక కొంచెం నమ్మకం వచ్చింది. ఆ రాత్రే సార్‌కు చెప్పిన నాయకుల కోసం మన వెదుకులాట ముగిసింది. కేసీఆర్ సీరియస్‌గానే ప్లాన్ చేస్తున్నడు. మీరు వెంటనే రావాలని సార్‌ను అడిగిన. కొద్ది రోజులకు సారు అమెరికా నుండి వచ్చిండు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండ సారును కేసీఆర్ ఇంటికి తోల్కపోయిన. కేసీఆర్, జయశంకర్‌ల తొలి కలయికకు, చివరి కలయికకూ ప్రత్యక్ష సాక్షిని నేనే. వారం రోజుల క్రింద సార్లు దావఖానల ఉన్నప్పుడు కేసీఆర్ కలిసిండు. అదే ఆఖరి కలయిక. మొదటి సారి కలిసినప్పుడు సారు కేసీఆర్‌తో అన్నమాటలు ఇప్పటికీ నాకు గుర్తున్నయి. 'ఈ యాభై ఏళ్లలో ఎంతో మంది నాయకులతో కలిసి పనిచేసిన. మీ నాయకత్వంలో తెలంగాణ సాధిస్తమనే నమ్మకం నాకు ఏర్పడింది.'

**– వి. ప్రకాశ్**
తెలంగాణ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్

నమస్తే తెలంగాణ దినపత్రిక
22 జూన్, 2011

---

# అశ్రునివాళి

స్థిత ప్రజ్ఞులు, తెలంగాణలో వివక్ష ఎక్కడ కొనసాగిన పోరాటం చేసిన వ్యక్తి ఆచార్య జయశంకర్, వారిచ్చిన స్ఫూర్తితో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడమే ఆయనకు నిజమైన నివాళి.

**– వేణుగోపాల్,** *బీజేపీ రాష్ట్ర నాయకుడు*

ప్రొఫెసర్ జయశంకర్ మరణ వార్త వినగానే రైల్వే మజ్దూర్ యూనియన్‌తో పాటు తెలంగాణ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతి తెలంగాణకు తీరని లోటు.

**– శ్రీనివాస్,** రైల్వే ఎంప్లాయిస్ యూనియన్

# విడిపోవడం అనివార్యం

## ప్రొఫెసర్ జయశంకర్ సార్‌తో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### రాష్ట్రం ఏర్పాటుకు ఇంత సుదీర్ఘ పోరాటం అవసరమా?

ఇది సుదీర్ఘ పోరాటమే. మద్రాస్ నుంచి ఆంధ్రరాష్ట్రం, జార్ఖండ ఏర్పడటానికి ఇంతకంటే ఎక్కువ పోరాటమే జరిగింది. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడ్డాక అసెంబ్లీలో తెలంగాణ బలం తగ్గింది. వారికున్న శక్తియుక్తులు ఇక్కడలేవు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ లేకపోతే వచ్చే ఇబ్బందులు వాళ్లకు తెలుసు. మొదట్లోనే అన్నీ చర్చించారు. నిధులు, వనరుల కొరత, రాజధాని లేకపోవడం.. వీటన్నింటి కారణంగానే రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ విలీనం బేషరతుగా జరగలేదు, శాశ్వతమూ అనుకోలేదు. రకరకాల ఒప్పందాలు, సూత్రాలు..అవన్నీ షరతులకు సంకేతాలు. అన్నింటి ఉల్లంఘునా జరిగింది. అందుకే విడిపోతామంటున్నాం. నెహూయే విడిపోవచ్చన్నారు.

### విడిపోతే ఆంధ్రాకు నష్టం జరిగేటట్టయితే..అలాంటి రాజకీయ ప్రక్రియ అవసరమా?

నష్టం అనే పదం సరికాకపోవచ్చు. ఉమ్మడి రాష్ట్రంలో ఉండటం వల్ల కృష్ణ, గోదావరి నదీజలాల్లో ఆ ప్రాంతానికి న్యాయబద్ధంగా చెందాల్సిన వాటా కంటే ఎక్కువ వాడుకుంటున్నారు. వేరే రాష్ట్రంగా ఉంటే..లేదా న్యాయబద్ధంగా నీటి పంపిణీ జరిగితే తెలంగాణకు ఎక్కువ నీరు అందేది. వాళ్లకు వచ్చేది అలాంటి నష్టమే. తెలంగాణకు ప్రాంతం, ఇక్కడి ప్రజలు విలీనానికి విముఖంగా ఉండేవారు. విలీనమైతే తెలంగాణకు న్యాయం జరగదని వారి అనుమానం. తెలంగాణ వనరులను, అవకాశాలను ఈ ప్రాంతం వారికి తగిన భాగస్వామ్యం కల్పించాలి. తెలంగాణ ప్రాంతం వారి భయాలను తొలగించు వీరు కలిసుందుకు ఒక ప్రాతిపదిక ఏర్పరచాలని ఒప్పందాల్లో అనుకున్నారు. కానీ వాటి ఉల్లంఘించారు. పెద్దమనుషుల ఒప్పందాన్ని రాష్ట్రం ఏర్పడిన తొలిరోజే ఉల్లంఘించారు. పదిపన్నెండేళ్లు అలాగే కొనసాగడం వల్లే 1968-69లో జై తెలంగాణ ఉద్యమం వచ్చింది. మళ్ళీ కొత్త ఒప్పందాలొచ్చినా.. సుప్రీం తీర్పుకూడా.. ఏవీ అమలుకాలేదు. సంబంధ బాంధవ్యాల గురించి చూస్తే..ఇరు ప్రాంతాలకూ ఎప్పటినుంచో ఉన్నాయి. ఇక ముందూ ఉంటాయి. అప్పుడులేని సమస్య ఇప్పుడు ఇందుకు వస్తుంది!

### విభజనను అడ్డుకుంటున్నది ఎవరంటారు?

రాష్ట్ర విభజన ప్రతిఘటనకు సూత్రాధారులు కొందరు పెట్టుబడిదారులే. పాత్రధారులు ఎవరన్నది వేరే విషయం. టీడీపీ అయినా, కాంగ్రెస్ అయినా, మరేపార్టీ అయినా తెలంగాణ ప్రాంత రాజకీయ నాయకత్వాన్ని ఎదగనీయరు, ఎదిగిన నాయకత్వాన్ని నిలబడనీయరు. పీవీ నరషింహారావు, చెన్నారెడ్డి, లాంటి ఉద్దండులనే ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించి మూడు రోజులకే ఇంటికి పంపించారు. కనుక ఎప్పుడైనా ఇతర ప్రాంత నాయకత్వాన్ని పెత్తందారీ శక్తి ఉంటుంది. అది వ్యవస్థలో ఉన్న సమస్య,, వ్యక్తులది కాదు. అందువల్ల ఈ సమస్య జాతీయస్థాయిలో పరిష్కారం కావాలి. స్థానిక నాయకత్వం విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తుంది. పార్లమెంటులో బిల్లు ఆమోదించాలంటే రాష్ట్ర అసెంబ్లీ అనుమతి అవసరం లేదు. అభిప్రాయమే

కావాలి. అది అనుకూలంగా ఉండొచ్చు,, ప్రతికూలం కావచ్చు.. అసలు స్పందిచకపోవచ్చు.

తెలంగాణ ఏర్పాటు జాప్యం అయ్యే సూచనలున్నాయా?

నేను అనుకోవట్లేదు. ఆంధ్రా ప్రాంతంలో చెలరేగిన అలజడుల వల్ల కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే చాలా అనర్థాలు జరుగుతాయి. నా అంచనా బట్టి సోనియాగాంధీ రాష్ట్ర విభజనకు సుముఖంగానే ఉన్నారు. కేవం రాజశేఖరరెడ్డి వల్లే జరగలేదు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన ఏకైక వ్యక్తి వైఎస్ అని ప్రధానమంత్రే స్వయంగా తనదంటూ ఒక బలమైన వర్గాన్ని తయారుచేసుకున్నారు. అందులో ప్రధానంగా పెట్టుబడిదారీ శక్తులున్నాయి. ఇప్పుడు హైదరాబాద్‌పై ఇన్నిక్లెయింలు చేసేది కూడా వాళ్లే తప్ప సామాన్య పౌరులు కారు. ఇందులో జగన్ ప్రమేయం కూడా ఉంది.

విభజన వల్ల సీమాంధ్ర ప్రాంతాలపై ఆర్థిక ప్రభావం ఎలా ఉంటుంది?

ప్రత్యేక రాయలసీమ కావాలా వద్దా అన్నది వేరే సమస్య. 1956 నవంబర్1కంటే ముందున్న పరిస్థితి పునరుద్ధరణ కావాలన్నది ఇప్పటి డిమాండ్. అప్పటికే తెలంగాణకు ప్రత్యేక రాష్ట్రంగా ఉనికి ఉంది. ఇప్పుడు కొత్త రాష్ట్రం సృష్టించడం లేదు.. పాత రాష్ట్రాన్ని పునరుద్ధరించాలంటున్నాం. విడిపోతేనే ఆంధ్రప్రాంతానికీ మంచిది. అనిశ్చిత పరిస్థితి వల్ల వాళ్లకు కూడా అభివృద్ధి ఆగిపోయిఉండొచ్చు. వాళ్ల ప్రాంతంలోనే రాజధాని ఉంటే.. అభివృద్ధి ప్రక్రియ మొత్తం దాని చుట్టూ తిరుగుతుండొచ్చు. ఎవరి పరిస్థితి వారికి తేలుతుంది. సముద్ర తీరం ఉంది, గ్యాస్ వస్తుంది. నదీజలాల్లో వాటా వస్తుంది. విడిపోతే రెండు రాష్ట్రాలకూ శ్రేయస్కరమే. ఫజల్ అలీ కమిషన్ కూడా ఇదే చెప్పింది.

హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టిన వారు..వాటిని వదిలేసి పెళ్లడం ఎలా అనిఅడుగుతున్నారు కదా?

పెట్టుబడులు పెట్టినవాళ్లకు ఇబ్బంది ఎప్పుడూ ఉండదు. ఎవ్వరనీ పొమ్మనడం లేదు. వ్యాపారం చేసి బాగుపడటానికి ఎలాంటి అభ్యంతరం లేదు. పెత్తనం చేయడాన్నే వ్యతిరేకిస్తున్నాం. ఉమ్మడి రాజధాని లేక కేంద్రపాలిత ప్రాంతం ఎందుకు.... ఎవరి కొరకు? రాజధాని ఎక్కడుండాలనేది ప్రజల సౌకర్యం కోసమా.. పాలకుల సౌఖ్యాల కొరకా..పెట్టుబడిదారుల లాభాల కొరకా? మహారాష్ట్ర గుజరాత్ విడిపోయినప్పుడూ ఇదే సమస్య వచ్చింది. బాంబేను తాము అభివృద్ధి చేశామని గుజరాతీలు అన్నారు. వ్యాపారం కొరకు వచ్చి పెట్టుబడులు పెట్టినవారు(మార్జుగేజీస్) యజమానులు కారు' అని దానికి అంబేద్కర్ సమాధానమిచ్చారు. అదే ఇక్కడ కూడా వస్తుంది.

ఉద్యమంలో 50 ఏళ్లకు పైగా ఉన్నారు. తెలంగాణవాదం మీద మీకింతటి మమకారం ఎందుకు ఏర్పడింది?

ఆర్థికశాస్త్రం చదివిన వ్యక్తిగా నా బాధ్యత నుంచి నేను తప్పుకోలేదు. తెలంగాణకు ఆర్థికంగా జరిగిన అన్యాయాలతోనే నా అధ్యయనం మొదలైంది. నిజాం కాలంలో.. 1947-48లో నేను హైస్కూలు విద్యార్థిని. కొందరు సరయోధులను నాటి ప్రభుత్వం పీడిస్తుంటే వారు పొరుగు ప్రాంతాలు, రాష్ట్రాలకు వలసలు పోయారు. విజయవాడకు పోయినవారిలో మా కుటుంబసభ్యులు చాలామంది ఉండిరి. శణార్థులై వెళ్లినప్పుడు వీరిపట్ల అక్కడివారు ప్రవర్తించిన తీరు గురించి తిరిగొచ్చిన తర్వాత మా పెద్దవాళ్లు మాట్లాడుకంటుంటే విహూవాణ్ని. అప్పట్లో నాకు పూర్తిగా అర్థం కాలేదు. గానీ.. బహుశావాళ్లు. మనం కలిసి ఉండలేమన్న భావాలు నాకు అప్పటినుంచే ఏర్పడ్డాయి. 1952 ఎన్నికల వరకు హైదరాబాద్ రాష్ట్రం కేంద్రం నియమించిన మిలటరీ, పౌర పాలకుల చేతల్లోనే ఉండేది. అప్పట్లో వాళ్లు పెద్దఎత్తున ఆంధ్రా ప్రాంతం నుంచి ఉద్యోగులను రప్పించారు. ఇక్కడివాళ్లకు తెలుగు, ఇంగ్లీషు రావన్న సాకుతో వారిని రప్పించారు. అప్పటికి నేను ఇంటర్మీడియట్ చదువుతున్నాను. వరంగల్ నేను చదివేటప్పుడు విశాలాంధ్ర స్థాపన అవశ్యకత గురించి ప్రచారం చేయడానికి వచ్చిన అనేకమంది నాయకుల్లో అయ్యదేవర కాళేశ్వరరావు గారూ ఉన్నారు. అయ్యదేవర ఉపన్యాస సారాంశం, పరిభాష ఏమంటే.. తెలంగాణ వాళ్లకు చదువులు రావు, తెలుగు సంస్కృతి తెలీదు. సభ్యత తెలీదు. కనుక మీరు ఆంధ్రలో కలిసిపోవాలి. అప్పుడే మీరు

సంస్కరించబడతారు' అన్నారు. దానికి నాతోపాటు పిల్లలంతా అల్లరి చేశాం. మాపై లాఠీచార్జి చేశారు. నాకూ దెబ్బలు తగిలాయి. ఆ సంఘటన తెలంగాణ మొత్తం వ్యాపించింది. మొత్తం తెలంగాణ ప్రాంతంలో ఒక అలజడి మొదలై హైదరాబాద్ చేరలేదు. చాలా మంది విద్యార్థులు మూసీనది ఒడ్డున సమావేశం కాగా.. కాల్పులు జరిగి ఏడుగురు చనిపోయారు. దాంతో తెలుగు భాష పేరుతో ఒక రాష్ట్రంలో ఉంటే మనకు భద్రత లేదన్న భావన నాకు బలంగా ఏర్పడింది. 52 ఉద్యమం ఉద్దేశం విశాలాంధ్ర ఏర్పాటు కావొద్దు. తర్వాత విలీనం జరిగిపోయింది. అందుకు కారణం భాషా సారూప్యం కాదు..భావ సారూప్యం కాదు.. కేవలం ఆంధ్రాప్రాంతం తమకున్న ఇబ్బందుల నుంచి బయటపడటమే. అప్పుడు నేను హైదరబాద్‌లో డిగ్రీ చదివేవాడిని. ఫజుల్ అలీకమిషన్ ముందు ఒక వినతిపత్రం నేను సమర్పించాను. ఆయన అడిగినప్పుడు.. వేరే రాష్ట్రంలో బతకలేకపోయినా భిక్షమెత్తుకునైనా బతుకుతామని బదులిచ్చాం.

## తెలంగాణ ఏర్పడేవరకు పెళ్లి చేసుకోనన్న ప్రతిజ్ఞ ఎందుకు చేశారు?

అది కాకతాళీమంగానే జరిగింది. మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. నేను జన్మించింది హన్మకొండలో. ఉమ్మడి కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లల పెళ్లిళ్లు. మా చదువులు.. పెద్ద భారంగా ఉండేవి. నేన బి.ఎ. చదివించలేక పోయారు. వరంగల్ బి.ఇడి.చేసి స్కూలు టీచర్ అయ్యాను. టీచర్‌గా చేస్తూనే రెండు ఎం.ఎ.లు పీహెచ్‌డీ పూర్తిచేశాను. ఎలాగైనా లెక్చరర్‌గా కావాలన్నది నా ఆశయం. అందులోనే పదేళ్లు గడిచిపోయాయి. లెక్చరర్ అయ్యాను ఉపాధ్యాయ సంఘాల్లో కీలకంగా పనిచేశాను. ప్రత్యేక తెలంగాణ వాదిని అని తెలిసిన తర్వానత కూడా మొత్తం రాష్ట్ర టీచర్ల యూనియన్‌కు అధ్యక్షుడిగా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఉద్యమంలో మరో ఐదేళ్లు గడిచిపోయాయి. అలా చూస్తూ చూస్తూనే45,50 ఏళ్ల వయసు వచ్చేసింది. 45ఏళ్లు ప్రతిపాదన ఉండేది. అప్పట్లో అనుకోకుండా నన్నురాష్ట్ర ప్రభుత్వం వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో నియమించింది. అది నాజీవితాన్నే చాలా కీలక మలుపు తిప్పిన కళాశాల అహోరాత్రాలు పనిచేయడంతో కాలేజీకి పేరు వచ్చింది. తర్వాత కాకతీయ యూనివర్సిటీవస్తే... అక్కడ సంక్షోభం ఏర్పడింది. దానికి నన్ను రిజిస్ట్రార్‌గా పంపారు. మరో మూడు నాలుగేళ్లు పట్టింది. అప్పటికే 50 ఏళ్లు దాటాయి. మళ్లీ హైదరాబాద్ వచ్చాను. అప్పుడు సీఫెల్‌లో ఏవో 'నిచేశాక రిటైరైపోయాను. మళ్లీ అనుకోకుండా కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌గా చేసే అవకాశం వచ్చింది. అప్పటికే 60 ఏళ్లు వచ్చాయి. తెలంగాణ వస్తేనే పెళ్లి చేసుకుంటానన్న విషయం కొంతమంది సన్నిహితులతో ప్రస్తావించిన మాట వాస్తవమే.

## జీవితంలో మర్చిపోలేని పాత్ర ఏది?

వృత్తిపరంగా నాకు బాగా తృప్తినిచ్చింది అధ్యాపకుని పాత్ర. ఉపాధ్యాయ వృత్తిలో బాగా తృప్తినిచ్చింది క్లాస్‌రూం టీచర్‌గానే. నా చదువంతా ఇంటర్ వరకు ఉర్దూ మీడియం. తర్వాత చదివినదంతా ఇంగ్లీషు మీడియం. టీచర్ వృత్తిలో చేరిన తర్వాత తెలుగు మీడియంలో చెప్పాల్సివచ్చింది. అయితే తెలుగు నేను చదువుకుని నేర్చుకున్న భాష కాదు.చాలా అభిమానించేది ఉర్దూ భాష ఈ సాహిత్యం నాకు చాలా ఇష్టం. ఉర్దూ చాలా సుందరమైన భాష.అది ఒక మతానికి సంబంధించినదైతే.. ఇంగ్లీషు కూడా మరో మతానికి చెందినదే కదా.

తెలుగుభాష ఆధిపత్య భావన తెలంగాణను అణగదొక్కిందని ఉద్యమాల్లో ఎందుకు భావిస్తున్నారు?

అది ఆధిపత్య ధోరణే తెలంగాణ సమస్యకు రెండు కారణాలు. ఒకటి దోపిడి...నీళ్లు నిధులు, అవకాశాల దోపిడ రెండోది దాడి...అది సాంస్కృతిక పరమైన దాడి ఒక ప్రాంతప్రజలు ఆర్థికంగా వెనకబడితే పుంజుకోవచ్చు. రాజకీయంగా నిరాదరణకు గురైతే మళ్లీ పుంజుకోవచ్చు. సాంస్కృతికంగా అస్తిత్వాన్ని కోల్పోతే మాత్రం మళ్లీ కోలుకోలేరు.

## తెలంగాణకు గొళ్లెం ఎప్పుడు తెరచుకుంటుంది?

త్వరలో నే తెరుచుకుంటుందన్న విశ్వాసం ఉంది. తెరుచుకోకపోతే గేట్లు బద్దలు కొట్టాలా అంటున్నారు.

ఉద్యమకారులకు..ప్రజలకు మీరిచ్చే సలహా?

విడిపోవడం అనివార్యం. ఆలస్యం కావడం అనర్థదాయకం. విడిపోవడంలో ఎవరికీ నష్టం లేదు. మీ ప్రాంతానికి న్యాయంగా చెందాల్సిన నీటి వాటిలో ఒక్కచుక్కా అక్కర్లేదు. మీ ప్రాంతపు ఆదాయంలో మాకు ఒక్క పైసా అక్కర్లేదు. మా ఆదాయాన్ని మేం కాపాడుకుంటాం. మీ ప్రాంతపు ఉద్యోగ అవకాశాల్లో ఒక్క ప్యూను పోస్టు కూడా మాకు అక్కర్లేదు. మా అవకాశాలు మాకు దక్కనీయండి. నా అంచనాలో 2012కల్లా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే అవకాశం ఉంది.

**- ఎబిఎన్ ఆంధ్రజ్యోతి**
(ఇన్‌సైడర్)

ఆంధ్రజ్యోతి దినపత్రిక
22 జూన్, 2011

## జయశంకర్ సార్ వరించిన పదవులు

-1975-1979: వరంగల్ సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్
-1979-1981 :కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్
-1982-1991: హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఇంగ్లీషు అండ్ ఫారన్ లాంగ్వేజెస్ (సీఫెల్ ) రిజిస్ట్రార్
-1991-1994: కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహించారు.
-2004-2006: అసంఘటిత రంగంలో పరిశ్రమల జాతీయ కమిషన్ సభ్యుడు.

### మరెన్నో:

రీజినల్ ఇంజనీరింగ్ కళాశాల బోర్డు గవర్నర్‌గా, కేరళలోని మహాత్మగాంధీ యూనివర్సిటీ ప్రణాళికా మండలి సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సభ్యుడిగా, సీఫెల్‌కు వైస్ చాన్సలర్‌గా నియమించే సెర్చ్ కమిటీలో సభ్యుడిగా, వర్కింగ్ గ్రూప్లఓ సభ్యుడిగా, కాకతీయ విశ్వవిద్యాలమం అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా, కాకతీయ విశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా, అకాడమిసెనేట్ సభ్యుడిగా, భువనగిరి ఎల్ఎన్ఎన్ఎస్ కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యుడిగా, చైర్మెన్‌గా, వరంగల్ ఎల్‌బీ కళాశాల గవర్నింగ్ బడీ సభ్యుడిగా, సికింద్రాబాద్‌లోని సర్దార్ పటేల్‌కళశాల గవర్నింగ్ బాడీ సభ్యుడిగా ఎల్ఐసీ అడ్వయిజరీ బోర్డు సభ్యుడిగా అనేక పదవులు నిర్వహించారు.

### శాశ్వత సభ్యుడు:

ఢిల్లీలోని ఇండియన్ ఇంటర్నేషనల్ సెంటర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హైదరాబాద్‌లోని అమెరికన్ స్టడీస్‌రిసెర్చ్ సెంటర్, ఎగ్జిబిషన్ సొసైటీ, ఏపీ ఎకనమిక్ కమిటీ, ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్‌లలో ప్రొఫెసర్ జయశంకర్ శాశ్వత సభ్యుడు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక, 22 జూన్, 2011

# నేలకొరిగిన శిఖరం

**- నమస్తే తెలంగాణ**

మృత్యువు ఆయనను అంతిమంగా ముద్దాడింది. తెలంగాణ గత వర్తమానాల వారధి తెగిపోయింది. జీవితాంతం కన్న కల సాకారం కాకుండానే ఆచార్య జయశంకర్ సారు కన్ను మూశారు. తెలంగాణ ఉద్యమానికి శిఖర సమానుడు నేలకొరిగారు. విశిష్ట సంస్కృతి, చరిత్ర వారసత్వం కలిగిన తెలంగాణలో అచ్చంగా అల్లకల్లోలంగా, తల్లడిల్లుతూ బతికిన జయశంకర్ నిలువెత్తు తెలంగణ ఆత్మ తెలంగాణ సర్వనామం జీవితమంతా ఒకేఒక్క అకాంక్ష మీద పోరాడిన ఒకేఒక్క యోధుడు. ఆయన పుట్టి బుద్దెరిగిన తర్వాత తెలంగాణ అర్థమైన తర్వాత, సరిగ్గా ఆరు దశబ్దాల క్రిందటే గైర్ ముల్కీ ఉద్యమం ఆయనను బరిలోకి లాగింది. సిటి కాలేజిలో ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమంలో అసువులు బాసిన ఏడుగురు విద్యార్థుల వారసత్వాన్ని ఇప్పటి దాకా కొనసాగించిన జయశంకర్ సారు తెలంగాణ అస్తిత్వ వాదానికి సైద్ధాతిక భూమికనిచ్చారు. బతికి ఉన్న కాలంలోనే సంభవించిన అనేక అల్లకల్లోలాల పరిణామాల మధ్య 1969ని బండగుర్తుగా భూజం మీద మోశాడాయన తెలంగాణ సమాజం ఆర్థం చేసుకున్న తీరులో రెండు పాయలు చూడవచ్చు. ఒకటి తెలంగాణ ధిక్కార స్వభావాన్ని మూలాల్లోకి వెళ్లి సమ్మక్క, సారక్కల నుంచి బందగీ, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, తెలంగాణ సాయుధ పోరాటం, అనంతరం ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత పాదుకున్న నక్సల్బరీ ఉద్యమం, సరిగ్గా పదిహేను సంవత్సరాలుగా కొనసాగుతున్న మలి తెలంగాణలో పోరాటం, ఒక వారసత్వంగా తెలంగాణను అర్థం చేసుకోవడం. జయశంకర్ ఆ ధారను పట్టుకున్న వారు. 1969 ఉద్యమం వైపుల్యం తర్వాత తెలంగాణ యవ్వన తేజంతో సాహసపూరితమైన, త్యాగధనులైన యువకులు ఒక చైతన్య జ్వాలగా ఎదిగారు. ఆ జ్వాల తెలంగాణకు నక్సల్బరీ రాజకీయాల భూమికను కల్పించింది. విద్రోహం ఫలితంగా విఫలమైన ఆంధ్రప్రదేశ్ నుంచి వేరు పడడం లాంటి అకాంక్షల నుంచి నూతన ప్రజాస్వామిక విప్లవం లాంటి విస్తృత విముక్తి ఆకాంక్షలను ఆవాహన చేసుకున్నదే అప్పటి తెలంగాణ తరం. ఆ పాయ ఇప్పటికి తెలంగాణ పోరాటంలో అంతర్భాగమై సాగుతూనే ఉన్నది. కానీ ఒకే ఒక్క జయశంకర్ ఈ అన్నింటి పరిణామాలకు సాక్షిగా కొనసాగుతూనే 1969 బలిదానాలను మరిలో పదిలంగా దాచుకుని తెలంగాణ అస్తిత్వ వాదనకు బలం చేకూర్చిన వాడు. ఆయన తెలంగాణ విడిపోవడమే దాని విముక్తి నమ్మిన అచ్చ తెలంగాణవాది. ఈ సారుదే మలి తెలంగాణ. అది జయశంకర్ దారి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వభావం, ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కోస్తాంధ్ర వలన పెద్దందారులు, దళారులు పెట్టుబడిదారులు వీరి ప్రయోజనాలు కాపాడే మీడియా అన్న సూత్రీకరణ చేసి తెలంగాణ సమాజానికి ముందు వలసాధిపత్యం నుంచి విముక్తి కావాలన్న సైద్దాంతిక భూమిక తయారు. చేసిన క్రాంతిధర్శి జయశంకర్ కన్నంలో వలసాధిపత్యపు దొంగను కన్నంలోనే పట్టుకొని, వలస పెత్తందారు కుట్రలను బద్దలు కొట్టాడాయన.

వలస వాదులు కేవలం దోచుకోవడానికే పరిమితం కారు. తాము దోచుకుంటున్న సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తారు. సంక్షోభం సృష్టిస్తారు. ఆంధ్ర వలస వాదం వేయి పడగలతో బుస కొడుతున్నప్పుడు తెలంగాణవాదం ఎన్నో ఒడిదొడుకులకు లోనయింది. వలసవాదులు వక్రీకరణలనే వాస్తవాలుగా ప్రచారం సాగిస్తూ, తెలంగాణ అస్తిత్వ విధ్వంసానికి పూనుకున్నారు. నీళ్ళు, నిధులు, కొలువులు... వంటి అన్ని రంగాలలో యథేచ్చగా దోపిడి

సాగిస్తూ, ఉద్యమం చెలరేగకుండా అన్ని రంగాలలో ప్రత్యక్ష, పరోక్ష అణచివేతను ప్రయోగించారు. ఈ స్థితిలో జయశంకర్ విద్యావంతులకు తెలంగాణ సోయి కల్పించారు. అన్ని రంగాలలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టే విధంగా విద్యావంతులను పరిశోధనలకు పురికొల్పారు. ఉద్యమం ఏ స్థాయిలో ఉన్నతాను మాత్రం నిబ్బరంగా తెలంగాణ సమాజానికి తల్లికోడి మాదిరిగా అండగా నిలిచారు. ఉద్యమం దిక్సూచి అయ్యారు.

ఇప్పటికీ అర్థం కానీ విషయమిటంటే 1969లో మరణించిన ఆ మున్నూటా డెబ్బై మంది త్యాగాలను అదే పోరాటం నుంచి ఎదిగి వచ్చిన నక్సల్బరీ తరం ఎందుకు పట్టించుకోలేదన్నది. సరిగ్గా ఇదే ప్రాతిపదికను డెబ్బైలలో విప్లవ శిబిరానికి కాస్త భిన్నమైన జయశంకర్ అచ్చ తెలంగాణ అస్తిత్వవారిగా రూపొందించిన భావనను రెండో పాయగా అర్థం చేసుకోవడంలో తప్పేమీ లేదు. ఆ తర్వాతే జయశంకర్ బుద్ధిజీవులతో కలిసి చేసిన కృషి ఉస్మానియా కాకతీయ ప్రొఫెసర్లు, విద్యావంతుల చొరవలో పదిహేనేళ్ల కిందట మలి తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శి అయింది. మోసాలు చూసి త్యాగాలు చూసి తెలంగాణ అనే ఒకే కలను మోసుకుంటూ, వ్యక్తిగత జీవితాన్ని కూడా తెలంగాణ ఆలోచనల పరిమితుల్లో, పరిధుల్లో కుదించుకుని, సర్వస్వం తెలంగాణగా బతికారు జయశంకర్.

ఆంధ్ర పెత్తందారులను ఎదుర్కోవడంలో ఒక దశలో తెలంగాణ మేధావి వర్గం, రాజకీయ వర్గం విఫలమైనప్పుడు మధ్య పొదివి పట్టి కాపాడారు. జయశంకర్ తెలంగాణ వాదానికి సంబంధించి ఎదురైన సవాళ్లను అధిగమించడంలో ఆయన విద్యా వంతులకు పెద్ద మనిషిగా వ్యవహరించారు. ఆనాడు రెండు రకాల సైద్ధాంతిక సమస్యలు తెలంగాణ మేధోవర్గాన్ని వేధించాయి. ఒకటి– తామూ తెలుగు వాళ్ళమనే ముసుగులో అధిపత్యం చెలాయిస్తున్న ఆంధ్ర పాలకవర్గానికి, తెలంగాణలోని వారి తాబేదారులకు సమాధానం ఇవాల్సి వచ్చింది. తెలంగాణ ప్రత్యేక అస్తిత్వాన్ని వివరించి దోపిడి నిజస్వరూపాన్ని బట్టబయలు చేయడంలో ఆయన సఫలీకృతమయ్యారు. వివిధ రంగాలలో సాగుతున్న దోపిడిని గణాంకాలతో వివరించారు. ఆర్థికంగా సాగుతున్న దోపిడి బయటకు పెట్టడం వల్ల తెలంగాణ ఉద్యమానికి గట్టి పునాది. ఏర్పడింది. ఆ తరువాత సంస్కృతి రంగం వంటి అన్ని రంగాల వివక్షను ప్రశ్నిస్తూ తెలంగాణ ఉద్యమం ఆంధ్ర ఆధిపత్యం చిహ్నాలను తిరస్కరించే స్థాయికి చేరుకుని వలస వాదులను నైతికంగా బలహీనపరిచింది. ఆంధ్ర వలస వాదానికి వ్యతిరేకంగా సాగుతున్న తెలంగాణవాదాన్ని వారూ అర్థం చేసుకోలేక వర్గ పోరాటం ఒక్క తక్షణ సమస్య అని భావించిన వారు ఒక దశలో ఉన్నారు. దీని వల్ల కొందరిలో కొంత సైద్ధాంతిక అస్పష్టత ఏర్పడింది. అయితే తెలంగాణ అస్తిత్వానికే ఏర్పడిన దశను అనేక మంది వర్గపోరాట తెలంగాణ మేధావులు పూర్తిగా గుర్తించారు. జయశంకర్ వంటి మహనియుడి మార్గదర్శకత్వం దొరకడం వల్ల అనేక మంది మేధావులు తెలంగాణ నీటిపారుదల మొదలుకొని అనేక రంగాలలో జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టే పరిశోధనలు సాగించారు. ఆంధ్ర దోపిడిని సాధికారికంగా నిరూపించారు. క్రమేణ తెలంగాణ ప్రజానీకం వర్గ పోరాటం కన్నా తెలంగాణ అస్తిత్వ పోరాటమే తక్షణ ప్రాధాన్యంగా భావించింది. దీంతో తెలంగాణ ఉద్యమం మరింత నిర్మాణాత్మకంగా, ప్రజా పునాదితో వెల్లువెత్తింది.

తెలంగాణలో పెట్టుబడిదారీవర్గం బలపడనందువల్ల రాజకీయ వ్యవస్థను ఏకతాటిపై నడిపించి, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే శక్తి లేకపోయింది. రాజకీయ పార్టీలన్నింటా ఆంధ్ర పెత్తందారులు తమ తాబేదార్లను నింపుకున్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ వాదంతో పుట్టుకొచ్చిన రాజకీయ శక్తులు బలహీనంగానే ఉన్నాయి. ఉద్యమ శక్తుల మద్దతే ఈ రాజకీయ శక్తికి ఊపిరి ప్రజా బలమే పునాది. ఈ దశలో రాజకీయ శక్తి, ఉద్యమ శక్తులు ఏకతాటిపై నిలబడకుండా, విభజన తీసుకువచ్చి ప్రజలను అయోమయంలో పడేయాలని ఆంధ్ర పెత్తందారీ శక్తులు కుతంత్రాలు చేశాయి. ఈ దశలో జయశంకర్ భిన్నశక్తులకు నైతిక మద్దతునిచ్చారు. దీంతో ఆంధ్ర వలసవాద శక్తులకు భంగపాటు తప్పలేదు.

తెలంగాణకు మద్దతుగా జాతీయస్థాయిలో ఏకాభిప్రాయ సాధనలో కూడా ఆయన తెలంగాణ ఉద్యమ సారథి కెసిఆర్‌కు అండగా నిలిచారు. తమ మేధోశక్తితో, వాక్పటిమతో కేంద్రంలోని పెద్దలను మెప్పించారు.

ధనబలంతో విర్రవీగుతున్న ఆంధ్ర వలసవాద శక్తులను ఢిల్లీలో వ్యూహాత్మకంగా దెబ్బకొట్టడం వల్ల తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావించే ఘడియ సమీపించింది. జీవిత కాలమంతా తెలంగాణ కోసం ఉద్యమించిన అనుక్షణం తెలంగాణ కోసం తపించిన జయశంకర్ తెలంగాణ విముక్తిని కళ్లారా కాంచకుండానే కన్ను మూయడం బాధాకరం జయశంకర్ కల తీరలేదు. తెలంగాణ తెల్లారలేదు. ఆయన కలను సాకారం చేయడమే, పోరాడి, తెగించి కొట్లాడి తెలంగాణ తెచ్చుకోవడమే జయశంకర్ సారుకు అసలు నివాళి 'నమస్తే తెలంగాణ' వినమ్రంగా తలవంచి జయశంకర్ సారుకు నివాళులర్పిస్తున్నది.

## మహోన్నత వ్యక్తిత్వం

జీవితాన్ని వికాసవంతం చేసుకొని సమాజానికి మార్గదర్శకత్వం చేయాలని భావించే వారు కొందరే ఉంటారు. తాను నమ్మిన సిద్ధాంతం వివేకవంతమైనదే అన జీఇనమ్మితే ఆ సిద్ధాంతంకోసం జీవితాన్నే అంకితం చేయడం అందరికీ సాధ్యంకాదు. ఇలాంటి విలక్షణ గుణం కలిగిన మహా మనీషి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్. ఎందరో సిద్ధాంతకర్తలు పుట్టిన భూమి ఇది. తమతో సైద్ధాంతికంగా విభేదించినవారికి సైతం శాంతియుతంగా మృధువైన మాటలు చెప్పి ఒప్పించే ప్రయత్నం చేసేవారు ఉన్నారు. ఆ కోవకు చెందిన జయశంకర్‌ది తన భావాలతో విభేదించినవారి అభిమానానికే పాత్రమయ్యే స్వభావం. ఆయన వ్యక్తిత్వం ఆయనను వృత్తిలోనే కాక, వ్యక్తిత్వంలోనూ ఆచార్యుని చేసింది. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 1934, ఆగస్టు ఆరోతేదీన వరంగల్ జిల్లా ఆత్మకూర్ మండలం అక్కంపేటలో జన్మించారు. ఆయన వరంగల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. పద్దెనిమిది సంవత్సరాల వయసులో ఆయన ఎఫ్.ఏ చదవుతున్నప్పుడు (1952లో) రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణకు రాజకీయ అంగీకారం కుదిరింది. దాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. విద్యార్థులకు నాయకత్వం వహించి తరగతులను బహిష్కరించారు. బెనారస్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో ఎమ్.ఎ. పట్టా సాధించారు. సమాజంలో ఆర్థిక సామాజిక అసమానతలను విశ్లేషించేందుకే ఆర్థిక శాస్త్రాన్ని ఎంచుకొన్నాన్నది. ఆయన మాట జయశంకర్ మౌలికంగా గాంధేయవాది ఎలాంటి సామాజిక మార్పునైనా శాంతియుతంగా సాధించాలని చెప్పేవారు. హింస్మాక, ఉద్యమాలవల్ల మానిషి ఏదీ సాధించలేడని చరిత్ర విశదీకరిస్తుందని ఆయన ఎప్పుడు అనేవారు. 1962లో 1968లో తెలంగాణ ఉద్యమాన్ని ఆయన తన పరిశోధనా రచనల ద్వారా చైతన్యవంతం చేశారు. 1968లో ఆయన ఉపన్యాసకుడిగా పనిచేసేవారు. తెలంగాణలోని వెనకబాటుతనాన్ని ఆ ప్రాంతవాసులకు జరుగుతున్న అన్యాయాన్ని పరిశోధన పత్రాల ద్వారా, రచనల ద్వారా ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేశారు.

ఆర్థిక శాస్త్రంలో పి.హెచ్‌డి. చేయడానికి జయశంకర్ ప్రాంతీయ అసమానతలనే పరిశోధనా వస్తువుగా ఎంచుకున్నారు. తెలంగాణ పట్ల ఆయన తన స్పందనల్ని ఎన్నడూ తీవ్ర పదజాలంతో వ్యక్తం చేయలేదు. జయశంకర్ ఆయన మృదుస్వభావి 2000 సంవత్సరంలో జరిగిన ఒక సంఘటన ఆయన ప్రవృత్తికి అద్దం పడుతుంది. గాంధేయ సిద్ధాంతాలలోకాక, సాయుధ పోరాటం ద్వారా తెలంగాణ సాధించుకోగలమని వాదించిన ఒక వ్యక్తికి జయశంకర్ చెప్పిన సమాధానం ఇది సమాజమంటే ఏమనుకొటున్నారు.? మానిషి సంఘజీవి తోటి మానవులను హింసించడం తగదు. మానవత్వం కోల్పోయినప్పుడు సిద్ధాంతాలకు అర్థం ఉండదు అన్నారు. ఈ మాటలు ప్రొఫెసర్ జయశంకర్ విలక్షణ భావాలకు ప్రతీకలు. ఎన్నో ప్రలోభాలు ఆయనను సిద్ధాంతాల గాడి నుంచి పక్కకు తప్పించాలని చూశాయి. కేంద్ర ప్రభుత్వంలో ఎన్నో పదవుల్ని ఆయనకు ఎర చూపినా తన మార్గాన్ని విడువలేదు.

ఒక సిద్ధాంతాన్ని నమ్మడం వేరు, ఆచరించడం వేరు. ఉద్యమానికి ఆయన మార్గదర్శకత్వం చేశారేకాని, నాయకత్వం వహించలేదు. అందుకే ప్రొఫెసర్ జయశంకర్ ప్రాతీయతలకు, రాజకీయాలకు అతీతంగా అభిమానుల్ని సంపాదించుకున్నారు. 1991–1994 మధ్య ఆయన కాకతీయ విశ్వవిద్యాలయానికి కులపతిగా పనిచేశారు. అంతకుముందు 1979–1981 కాలంలో ఆ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. ఉస్మానియా

విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యుడిగా, కేరళ ప్రణాళిక బోర్డు సభ్యుడిగా పదవులు నిర్వహించారు. ఆయన మరణించే వరకు తెలంగాణ ప్రాంతంలోని సమస్యలపై అధ్యయనం నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ సంస్థకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకోసం పరితపిస్తూ జీవించిన ఆన్నత వ్యక్తి అలాంటి మహత్తర వ్యక్తిని ఈ సమాజం కోల్పోయింది. రాష్ట్రం అంతటా ఆయనకు అభిమానులున్నారు. భౌతికంగా మరణించినా ప్రొఫెసర్ జయశంకర్ అందరి హృదయాల్లో చిరంజీవి!

**– సంపాదకీయం**
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రిక
22 జూన్, 2011

---

# అశ్రునివాళి

జయశంకర్ ఏ పదవిలో ఉన్నాఆ పదవికే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి, తెలంగాణ  కోసం తుదిశ్వాస వరకు పోరాడారు. జోహార్ జయశంకర్ సార్.

**– చందుపట్ల జంగారెడ్డి,** *బీజేపీ నాయకుడు*

తెలంగాణ ప్రజల ఆశజ్యోతి ప్రొఫెసర్ జయశంకర్ మరణ వార్త తెలంగాణ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. తెలంగాణ విమోచన పోరాటంలో ఆయన పాత్ర అపుర్వమైనది. ప్రొఫెసర్ జయశంకర్ మాట కేసీఆర్ కూతగా మారి తెలంగాణ ప్రజలను ఉత్తేజ పరిచింది. అటువంటి మహా వ్యక్తి తెలంగాణ రాష్ట్రాన్ని చూడకపోవడం విచారకరం.

**– గుండా మల్లేశ్,** *సీపీఐ ఎమ్మెల్యే*

సత్యసాయి అంత్యక్రియలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. తెలంగాణ ప్రజలకు దైవమైన ప్రొఫెసర్ జయశంకర్ అంత్యక్రియలు ప్రభుత్వం ఎందుకు జరపడం లేదు. భావితరాల వారికి గుర్తుండేలా ట్యాంక్‌బండ్‌పై, తెలంగాణ గ్రామాల్లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి.

**– రవి,** *ఓయూ జేఏసీ*

ఆచార్య జయశంకర్ మరణ వార్తతో తెలంగాణ ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. బతుకుదెరువు కోసం వచ్చిన ఆంధ్రోళ్ల దోపిడీ రోజురోజుకు పెరుగుతోంది. ప్రొఫెసర్ జయశంకర్ ఇచ్చిన స్ఫూర్తితో ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతా.

**– బీసీ మూద్,** *టీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు*

జయశంకర్ స్ఫూర్తి, ఆశయాలు నేటి  వయుతకు మార్గదర్శకం. జయశంకర్ మృతి తెలంగాణకు తీరనిలోటు ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకెళ్ళాలి.

**– జొజ్జా తారకం**

తెలంగాణ ఆశజ్యోతి ఆచార్య జయశంకర్ తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తిని చైతన్యాన్ని నింపిన మహోన్నత వ్యక్తి ఆయన. చూపిన దారిలోనే నడిచి తెలంగాణ సాధంచుకుందాం.

**– బీసీ టీచర్స అసోషియేషన్ సంతాపం**

# తీరని లోటు

**- ఆంధ్రజ్యోతి**

తెలంగాణ ఉద్యమ బాటలో అవిశ్రాంత పథికుడు, రుషితుల్యుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్. ఆయన ఇకలేరు అనే వార్త తెలంగాణ వాదులకు మాత్రమే కాదు. తెలంగాణ డిమాండ్ సహేతుకతను, న్యాయబద్ధతను గుర్తించిన వారందరిని దిగ్భ్రాంతికి గురిసింది. అభిప్రాయాలతో విభేదించినప్పటికీ ఆయన వ్యక్తిత్వాన్ని గౌరవించే వారిని సైతం ఈ వార్త వ్యాకులపరచింది. కొంతకాలం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మంగళవారం హనుమకొండలోని స్వగృహంలో కనునమూసిన జయశంకర్ ఆఖరు క్షణం వరకు తెలంగాణనే కలవరపరిచారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర స్వప్నం సాకారం కావడం కోసం పరితపించారు. డెబ్బై ఆరేళ్ల జీవిత ప్రస్థానంలో ఆరు దశాబ్దాలుగా అలుపెరగకుండా తెలంగాణ జెండాను తన భూజాలపై మోస్తూ వచ్చిన జయశంకర్‌ది విశిష్ట వ్యక్తితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోయారు. తన మూర్తిమత్వం, నైతిక నిష్ఠతో తెలంగాణ ఉద్యమానికి ఆయన మేరుపులా ఆలంబనగా నిలిచారు.

తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరిన గత కొద్ది సంవత్సరాల్లో ఆయనను దగ్గరగా గమనించే ఆవకాశం లభించిన తటస్థ రాజకీయ నాయకులు, పాత్రికేయులు, మేధావులు కూడా ఆయన ప్రత్యేక మూర్తిమత్వాన్ని గౌరవించారు. వ్యక్తిత్వాన్ని చూసి అబ్బురపడ్డారు. తెలంగాణవాదాన్ని పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తూ ముందుకు వచ్చిన ఒకరిద్దరు రాజకీయ నాయకులు తప్ప ఆయన గురించి పరుషంగా, వ్యతిరేకంగా మాట్లాడినవారు లేదు. తన వ్యక్తిత్వం, వ్యవహార శైలి, ఉద్యమ నిష్టలతో తెలంగాణ వాదానికి గౌరవ ప్రతిష్ఠలను సాధించిన ఘనత జయశంకర్‌కు దక్కుతుంది.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి జ్వాలను మూడు తరాలకు చేరవేస్తూ వచ్చిన జయశంకర్ 1952లో ముల్కీ ఉద్యమంలో ఆధ్యాపకునిగా క్రిమాశీల పాత్ర నిర్వహించారు. మూడో విడతగా 1995 నుంచి మల్లీ రాజుక్కు తెలంగాణ ఉద్యమంతో ఆయన కలిసి అడుగువేశారు. ఉద్యోగ జీవితంలో విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్‌గా, వైస్ ఛాన్సెలర్‌గా ఉన్నత సోపానాలు అధిరోహించినా తెలంగాణ వాదం మాత్రం ఆయన్ను వెన్నంటే ఉంది. ప్రబలమైన ప్రజల ఆకాంక్షగా, సెంటిమెంట్‌గా అమూర్తభావనల్లో వ్యక్తమైన తెలంగాణ వాదానికి సైద్ధాంతిక ప్రతిపత్తిని జయశంకర్ కల్పించారు. ఉపనిషత్తులను సమకూర్చి ఉద్యమానికి పటిష్టమైన పునాదులు వేశారు. అర్థికవేత్తగా వనరుల పంపణీలో ప్రాంతీయ అసమానతలను విస్పష్టంగా ఎత్తిచూపారు. దానినే తన సొంత ప్రాంతానికి అన్వయించి సమైక్య రాష్ట్రంలో తెలంగాణలో జరిగిన అన్యాయాన్ని సరళంగా, సూటిగా బయట పెట్టారు. ఎదుటివారికి కటువుగా తోచే విషయాలను సైతం తనదైన శైలిలో మృదువుగానే చెప్పడం ఆయన ప్రత్యేకత. బనారస్ యూనివర్సిటీ ఉస్మానియా విశ్వావిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో స్నాతకోత్తర డిగ్రీని, డాక్టరేట్‌ను అందుకున్న జయశంకర్ బుద్ధి జీవి, మేధావి మాత్రమే కాదు తాను నమ్మిన సిద్ధాంతాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో కార్యకర్త కూడా. మూడు తరాల తెలంగాణ ప్రాంత విద్యావంతులకు మరీ ముఖ్యంగా పార్టీలకు అతీతంగా తెలంగాణ వాదాన్ని నమర్థిస్తున్న వారికి ఆయన గురుతుల్యులు. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన ఆయన కార్యక్షేత్రం హైదరాబాద్, వరంగల్ నగరాలకు పరిమితమైనప్పటికి

ఆయన జీవితంలో అంతర్భాగమైన తెలంగాణవాదం ప్రచారానికి ఎల్లలు ఏనాడు అడ్డురాలేదు. దేశ సరిహద్దులకు ఆవల అమెరికా వంటి చోట్ల నుంచి నేడు బలంగా వినవస్తున్న తెలంగాణ గళానికి నేపథ్యం అయనే ఐదు దశాబ్దాలుగా అలలు అలలుగా కొనసాగుతున్న తెలంగాణ ఉద్యమం పదేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్ర సమితి అవిర్భవించిన తర్వాత ఉవ్వెత్తున కెరటంగా మారింది.

జయశంకర్ కృషి కారణంగానే దీనికి పూర్వరంగం సమకూరిందని చెపవచ్చు. క్షేత్రస్థాయిలో అవ్యవస్థీకృతంగా ఉన్న తెలంగాణ వాదాన్ని ఆయనే సంఘటితపర్చి బలమైన పునాదులు సమకూర్చారు. ఈ పునాదుల నుంచే కొత్త మిలినియయం ఆరంభంలో టిఆర్ఎస్ ఊపిరులుపోసుకుని ఉవ్వెత్తున లేచింది.

ప్రపంచానికి కరుడుగట్టిన తెలంగాణవాదిగా పరిచయమైన జయశంకర్ మేధోపరంగా, హృదయగతంగా ప్రజాస్వామికవాది. ఆర్థికశాస్త్ర ఆచార్యునిగా, పరిశోధకునిగా ప్రాంతీయ అసమానతలపై ఆయన లోతుగా అధ్యయనం చేశారు. ఆయన ఆ ఉద్యమ భావాలను ఆ అధ్యయనం బలం చేకూర్చింది. తెలంగాణ ఉద్యమం తన జీవితంలో అంతర్భాగంగా ఉన్నప్పటికీ, ఇతర ప్రజాస్వామిక పౌరహక్కుల ఉద్యమాలకు కూడా ఆయన సన్నిహితంగా ఉన్నారు. పూర్తి సానుభూతితో వ్యవహరించారు. తెలంగాణాతో పాటు అనేక రాజకీయ ఎజెండాలు కలగలసి ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి నేతలతో భూజం భూజం కలిపి నడిచినప్పటికీ ఆయన మాత్రం తెలంగాణేతర రాజకీయాంశాలను ఎన్నడూ తన దగ్గరకు రానీయలేదు. ఆయన పరిశుద్ధ తెలంగాణవాదిగానే ఉండిపోయారు. సమూహంలో ఉన్నా, ఒంటరిగా ఉన్నా ఆయనది ఒకే ఎజెండా ... ఎన్నడూ మాట తప్పలేదు. మడమతిప్పలేదు. పదవులను ఆశించలేదు. సంపదను కాంక్షించలేదు. తన సిద్ధాంతంపై అచంచల విశ్వాసం ఉన్న జయశంకర్ చెప్పిందే చేశారు. చెప్పారు. మృదువుగా చెప్పిన స్థిరంగా తన వాదనను వినిపించారు. తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయ నిరుద్యోగుల వ్యాపకంగా ఈసడించిన బద్ధవ్యతిరేకులు సైతం జయశంకర్ కారణంగా తెలంగాణవాదాన్ని, ప్రజల్లో పెల్లుబుకిన ప్రబలమైన ప్రత్యేక రాష్ట్ర అకాంక్షను మొత్తంగా తీసిపారేసే సాహసం చేయలేకపోయారు. తెలంగాణ పార్టీలలోను, నేతల్లోనూ స్వార్థ ప్రయోజానాలను, రాజకీయ పార్శ్వలను వేలు ఎత్తి చూపేందుకు ఆస్కారం ఉండవచ్చు. కానీ జయశంకర్ వంటి వారి విషయంలో అలాంటి విమర్శలకు అవకాశం లేదు. తెలంగాణ ఉద్యమం ఎంత ఉధృత రూపం దాల్చినా అదుపు తప్పకుండా స్థిరంగా ముందుకు సాగడానికి జయశంర్ వంటివారి వ్యక్తిత్వం కూడా దోహదం చేసింది.

టిఆర్ఎస్ వంటి ఒక పార్టీ రాజకీయ యవనికపై ప్రత్యక్షమవుతుందన్న ఉహ కూడా లేని రోజుల్లో ముఖ్యంగా 90వ దశకంలో తెలంగాణ ప్రాంత విద్యార్థులు, మేధావులు, రచయితలు, కవులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను వ్యక్తం చేస్తూ జరుపుకున్న సమావేశాలు, సభలు, సదస్సులకు జయశంకర్ కేంద్ర బిందువు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత నిర్లక్ష్యానికి, అన్యాయానికి గురికావడం తథ్యమన్న భావనతో విశాలాంధ్రను వ్యతిరేకించిన పాతతరంవారు, ఆ తర్వాత దశాబ్దాల్లో అనుమానాలు అనుభవపూర్వకంగా నిజంకావటం భరించలేక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని సిద్ధమాయ్యారని జయశంకర్ తరుచూ చెబుతుండేవారు.

ఆయన మృతితో తెలంగాణ ఉద్యమం నిజంగానే దిక్కును కోల్పోయింది. ఆటుపోట్లు, మానావమానాలు, భరోసాలు, భంగపాట్ల మధ్య ఉద్యమం నడికూడలిలో నిలబడిన వేళ జయశంకర్ వంటి హితుడు, ప్రేమికుడు, మార్గదర్శి, సిద్ధాంతవేత్త భౌతికంగా కనుమరుగుకావడం తెలంగాణకు అతిపెద్ద లోటు. పూరించలేని ఒక శూన్యం.

**- ఎడిటోరియల్**

ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి దినపత్రిక
22 జూన్, 2011

# మాటలురాని దుఃఖం

**- వార్త దినపత్రిక**

తెలంగాణ ఇంతగా దుఃఖం కలిగించిన రోజు ఇటీవలి దశాబ్దాలలో కాళోజీ మరణం తర్వాత మరొకటిలేదు. ఇది పల్లెపల్లెనా గుండె గుండెనా పాకిన ఒక మహాప్రజోద్యమ సందర్భం అయినందున, జయశంకర్ సార్ అకాల మరణం వల్ల తెలంగాణ తల్లికి కలుగుతున్న కడుపుకోత అనన్యమవుతుంది. సారు వయసు 76 సంవత్సరాలు అయితే కావచ్చుగాక. తను క్యాన్సర్ రాక్షసి బారినపడితే పడవచ్చుగాక, అయినప్పటికి ఆయనది అకాలమరణమే. తెలంగాణ అనే ఒక పీడితప్రాంతానికి అక్కడి నిరంతర పోరాటశీల జనసామాన్యనికి తన జీవితాన్నే అంకితం చేసిన ఆ మహానుభవుడు, ఆ ప్రాంతం సంపద్వంతంగా అభివృద్ధి చెంది కళకళలాడకముందు ఎపుడు కన్నుమూసినా అది అకాలమరణమే అవుతుంది. దోపిడికి, అణచివేతకు గురైన తెలంగాణ వంటి ప్రాంతాలు అభివృద్ధిచెందాలని కలలు గన్న జయశంకర్ వంటి మానవతావాది, మేధావి, క్రియాశీలుడు, త్రికరణ శుద్ధిగల నిబద్ధాత్ముడు, ఆ స్వప్నం నెరవేరకముందు మృత్యువాతపడటం తప్పక ఆకాల మరణమే.

జనాకాంక్షమేరకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటమన్నది జయశంకర్ స్వప్న సౌధానికి పునారదిరాయి. వంటిది మాత్రమే. తెలంగాణ వ్యవస్థాపనను చూసి కన్నుమూయగలనని ఆయన అనవచ్చుగాక. కాని అది కేవలం సాంకేతికార్థముతో గూడదైన మాట. భౌగోళిక తెలంగాణ ఆ దార్శనికుని ప్రణాళికలో తొలిసౌదం మాత్రమే. తెలంగాణ వంటి అంతర్గత వలసలు తమ అసమ అభివృద్ధినుంచి బహిరంగా, అసమానతల నుంచి బాహిర్గత, అంతర్గత పీడనలనుంచి సమగ్రంగా, విముక్తి చెందటమన్నదే ఆయన ప్రణాళిక, దార్శనికత పీడిత తెలంగాణ దృష్టి నుంచి దోపిడి పీడనా వ్యవస్థలను, ఆ వ్యవస్థల తీరు నుంచి తెలంగాణ స్థితి గతులను అర్థం చేసుకున్న మేధావి ఆయన. కనుక, తను అహరహం అర్థశతాబ్దిపాటు తపించినట్లు తెలంగాణ రాష్ట్రం భౌగోళికంగా ఏర్పడినా, అంతమాత్రాన్ని చూసి చనిపోవలసిన మనిషికారాయన. తెలంగాణ ప్రజలు తమ భవిష్యత్తును తాము నిర్మించుకోవటం మొదలై ఆ మార్గంలో విజయవంతంగా సాగిపోవటాన్ని కళ్ళారచూసి, మనసార ఆశీర్వదించి, అపుడు గాని సంతృప్తితో చనిపోగూడని మహామనిషి ఆయన.

జయశంకర్ పేరు దేశవ్యాప్తంగా తెలిసింది ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సందర్భంగా కావచ్చు. కాని ప్రజలకు, ముఖ్యంగా అణచివేతకు గురైనవర్గాలకు త్రికరణ శుద్ధిగా అంకితమైన మేధావిగా ఆయన విస్తృతంగా తెలిసినవాడే. శంకరన్, కణ్ణబిరాన్, బాలగోపాల్‌వలె ఆయన సంస్థాగత పౌర హక్కుల ఉద్యమ పరిధిలోకి వచ్చి ఉండకపోవచ్చు. కాని ప్రజల ఆర్థిక సామాజిక హక్కులకోసం అంతే నిబద్ధతతో, నిస్వార్థంగా త్యాగనిరతితో దశాబ్దాలపాటు కృషిచేయటంలో ఆయన ఈ ముగ్గురికేకాదు, మరెవరికీ తీసిపోలేదు. మేధావితనం అంటే అరడజను డిగ్రీలు, కొన్ని డజన్ల పుస్తకాలు, పాండిత్య ప్రదర్శనా స్థలనాలుగా ప్రతీతమై ఉన్న మన కెరీరిస్టు పాడుయుగంలో, ఇటువంటి సోకాల్డ్ మేధావులంతా నిజార్థంలో పరాన్నభూక్కులు కావటాన్ని చూస్తునే ఉన్నాం. అందుకు భిన్నంగా, తమ మేధాశక్తి అన్నివిధాలుగా తమకు సమాజం ఇచ్చిందేనన్న స్పృహతో, ఆ సమాజం కోసం నిలిచిన నిజమైన కొద్దిపాటి మేధావులలో జయశంకర్ ఒకరు. తెలంగాణలోనే కాదు, యావద్దేశంలోనే అటువంటి వారు అరుదు. ఆయన

దేశానికి తెలంగాణ ఇచ్చిన మేధావి. ఎవరికైనా స్ఫూర్తిదాయకంగాగల ఆచరణయుతమైన మేధావి జీవితమాయనది.

అధికార రాజకీయాలు, ధనరాశుల వ్యూహాలు, అసమర్థపాలకులు, తెలంగాణకే చెందిన భృత్యనాయక వర్గాల కారణంగా ప్రత్యేక రాష్ట్రం సాకారం కావటం ఇంత ఆలస్యమవుతుంది. గాని లేనిపక్షంలో జయశంకర్ సారు తను కోరుకున్న రాష్ట్రాన్ని ఎప్పుడు చూసి ఉండేవారు … ఆ సంతృప్తిలో నవతెలంగాణ నిర్మాణోత్సహంలో తన అనారోగ్యాన్ని కూడా వెనుకకు నెట్టగలిగేవారు. ఆయనను మృత్యువు ఇంత త్వరగా కబళించటంలో పైన అనుకొన్న అధికార రాజకీయాలు, ధనరాశుల వ్యూహాలు, అసమర్థపాలనలు, తెలంగాణ భృత్య నాయకుల దోషం కూడా ఉందనక తప్పదు. ఈ విధమైన విద్రోహం మధ్య ఈ మాటలురాని దుఃఖ సమయంలో, తెలంగాణ తనకు తాను చేసుకొదగిన ప్రతిజ్ఞ ఒక్కటే అది ప్రత్యేకరాష్ట్రాన్ని సాధించి తీరగలమన జీఇమరొకమారు ఉద్ఘాటించి దిక్కులను పిక్కటిల్లచేయటం అంతకు తక్కువైన ప్యాకేజీలుగాని, ప్రాంతీయ మండలి వగైరాలుగాని ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, అందుకు సిద్ధపడటం తెలంగాణకు, జయశంకర్ సార్ స్మృతికి ద్రోహం కాగలదని నిర్ద్వంద్వంగా ప్రకటించటం. నేటి ఉదయం తన స్వస్థలమైన వరంగల్లులో ఆయన అంత్యక్రియల సమయంలో, తన చితిని జ్వలింపచేసే అగ్నికీలల సాక్షిగా, అందరూ ఆ శపథం చేయాలి.

వార్త దినపత్రిక
22 జూన్, 2011

**– ఎడిటోరియల్**
వార్త దినపత్రిక

---

# అశ్రునివాళి

తెలంగాణ పోరాటానికి తన జీవితాన్నే అంకితం చేశారు. ఆయన ఆరుదైన మేధావి ఉక్కుమనిషి నిరాడంబరంగా ఉండటం ఆయన ప్రత్యేకత.

**– నమ్ము,** *రచయిత*

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆదర్శప్రాయుడు. ఆయన నిబద్ధతతో ప్రజా సమస్యలను అధ్యయనం చేశారు. ఆయన కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా విద్యార్థులను తీర్చిదిద్దాడు. విద్యారంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి.

**–కొణిజేటి రోశయ్య,** *మాజీ ముఖ్యమంత్రి*

తెలంగాణ కోసం జయశంకర్ అహర్నిషలు పరితపించారు. నమ్మిన సిద్ధాంతం కోసం కృషి చేశారు. తెలంగాణ ఉద్యమానికి వెన్నంటి నిలిచారు. ఆయన చివరి కోరిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రఏర్పాటు.

**–దామోదర రాజనర్సింహ,** *ఉప ముఖ్యమంత్రి*

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చిరస్మరణీయులు. బడుగు బలహీన వర్గాలను ఐక్యం చేసే దిశలో భాగంగా జీవితాన్నే అంకితం చేసిన ఘనత ఆయనది. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే నిజంగా నివాళులర్పించినట్లు

**–డాక్టర్ ఎ. చక్రపాణి,** *శాసన మండలి చైర్మన్*

# సి.కె.ఎం కళాశాలలో జయశంకర్ సార్‌తో ...

**- ఎస్. జీవన్ కుమార్**

హైదరాబాద్‌లోని ఎయిడెడ్ కళాశాలల తర్వాత వరంగల్‌లోని ఛందా కాంతయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల తెలంగాణా జిల్లాల్లో అత్యంత పేరెన్నికగాంచింది. అక్కడ విద్యార్థుల్లో వుండే విప్లవ రాజకీయ సంస్కృతి వల్ల ప్రభుత్వం, పోలీసులు ఆకళాశాలను సమస్యాత్మక కళాశాలగా ప్రచారం చేశారు. విరసం వ్యవస్థాపక సభ్యుడు, విప్లవ పార్టీల రాజకీయాల పట్ల అచంచల విశ్వాసంగల వ్యక్తి వరవరరావుగారు, ఆ కళాశాల అధ్యాపకుడు కావడం వల్ల ఆ కళాశాలను ప్రమాదకరమైన విద్యా సంస్థగా పనికట్టుకొని పోలీసులు ప్రచారం చేశారు. పోలీసు ఆఫీసర్ల పిల్లలు, ఇంజనీరింగ్ కళాశాల, మెడికల్ కళాశాల అధ్యాపకుల పిల్లలు మరియు నగరంలోని ప్రముఖ వ్యాపారస్తుల, రాజకీయ నాయకుల పిల్లలు కళాశాలలో చదువుతుండటం చాలా ఆశ్చర్యకరం. ఇతర వాతావరణం ఎట్లా వున్నా పాఠాలు బాగా చెప్తారు అనే ఒక సర్టిఫికేట్ కూడా ఆ కాలేజీ పొందింది. 1973 నుండి ఆ కళాశాల రకరకాల సమస్యలతో తల్లడిల్లింది. యాజమాన్యం పట్టించుకోకపోవడం, విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు సరైన నిష్పత్తిలో ప్రభుత్వ ఖజానాలో వేయకపోవడం వల్ల ప్రభుత్వం ఇచ్చే గ్రాంటు సిబ్బందికి సరిపోకపోవడం, సరైన సమయంలో మంజూరు కాకపోవడం, పరిపాలనలో అశ్రద్ధ, అవకతవకల వల్ల కాలేజీ చాలా కష్టాలు ఎదుర్కొంటున్న సమయంలో కె. జయశంకర్ గారు ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్ హోదా నుండి సి.కె.ఎం కళాశాలకు ప్రిన్సిపాల్‌గా, అక్టోబర్ 1975లో వచ్చారు. బక్కపల్చగా, అతి మామూలుగా, ఏమీ గంభీరత్వం ఫోజులేని ఆయనను చూసి మా కాలేజీలోని ఒక వర్గానికి చెందిన అధ్యాపకులు ఈయనను సులభంగా బుట్టలో వేసుకోవచ్చని సంబరపడ్డారు. కాని కొద్ది సమయంలోనే అది జరిగే పనికాదని అర్థం చేసుకొని హతాశులయ్యారు.

జయశంకర్‌సారు పదిహేను రోజుల్లోనే కళాశాలలోని పరిస్థితిని అంతా ఆకళింపు చేసుకున్నారు. ఆయన పరిపాలన విధానంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు, ఆయనలోని నిబద్ధత, చాతుర్యం, విషయ పరిగ్రాహణశక్తి, సమస్యల్ని పరిష్కరించడంలో ప్రదర్శించిన మెలకువలు చూసి కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు అబ్బురపడ్డారు. ఆయన ప్రతిభ చూసి ముగ్ధుడైన అప్పటి కళాశాల ఛైర్మన్, జిల్లా కలెక్టర్ సమర్‌జిత్‌రే గారు, జయశంకర్ గారి అభిమాని అయినాడు. కొన్ని సందర్భాలలో జిల్లా సమస్యల పరిష్కారం కోసం జయశంకర్ గారి సూచనలు అడిగేవారు. తర్వాత జిల్లా కలెక్టర్‌గా వచ్చిన తివారీగారు, జయశంకర్ గారి పట్ల, కళాశాలలో కొందరిపైన వ్యతిరేక అభిప్రాయాలు ప్రకటించి కొన్ని రోజుల తర్వాత, కాలేజీ వ్యవహారాలన్నీ జయశంకర్‌గారికి వదిలేయడమే ఉత్తమం అని భావించాడు. ఫీజు వసూళ్ళ విషయంలో అవకతవకలకు పాల్పడ్డ ముగ్గురు ఆఫీసు సిబ్బందిని సస్పెండ్ చేసి, ఆఫీస్ వ్యవహారాలను సమగ్రంగా విచారించడానికి సీనియర్ ఉపాధ్యాయులతో ఒక కమిటీ వేశాడు. ఈ చర్య అందర్నీ భయభ్రాంతులకు గురి చేసింది. దీనితో చాణక్య నీతి ప్రదర్శించే కొందరు ఉపాధ్యాయులు కూడా జాగ్రత్తగా, బాధ్యతగా మసలుకోవడం మొదలు పెట్టారు. రెండు షిఫ్టుల్లో నడుస్తున్న ఇంటర్, డిగ్రీ కాలేజీలను ఒకే షిఫ్టులోకి తెచ్చాడు. నాతో పాటు పని చేస్తున్న 16 మంది జూనియర్ లెక్చరర్లకు డిగ్రీ విద్యార్థులకు బోధించే అవకాశం కలిపించాడు. సీనియర్ లెక్చరర్స్ ఇంటర్మీడియెట్ క్లాసులు తీసుకోవడం తప్పనిసరి అనే నిబంధన

విధించాడు.

విద్యార్థుల ఫీజు స్లాబ్ కొంచెం పెంచి, సులువైన పద్ధతిలో ఫీజులు వసూలు చేసే విధానం ప్రవేశ పెట్టి, సాంఘిక సంక్షేమ శాఖ నుండి వచ్చే ఫీజును క్రమబద్ధీకరించాడు. దీనివల్ల ప్రభుత్వానికి ఫీజుల వాటా సరైన సమయంలో పపండంతో, కాలేజీకి ప్రభుత్వం విడుదల చేసే గ్రాంటు సక్రమంగా రావడం మొదలైంది. అప్పుడు డి.పి.ఐ గా ఉన్న ప్రతాప్ రెడ్డి గారు ఇంటర్ మీడియట్ బోర్డు సెక్రెటరీగా ఉన్న మాధవ రెడ్డి గారు సార్‌కు చాలా సన్నిహితులు. అందు వల్ల ప్రభుత్వం నుండి కావలసిన పనులన్ని సాఫీగా జరిగేవి. పరీక్షలు నిర్వహించే పద్ధతిలో చాలా బెస్ట్ ప్రాక్టీసెస్ ఆవిర్భవించాయి. విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించడం పెద్ద ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, దాదాపు జనరల్ ఎలక్షన్స్‌లాగా బ్యాలెట్ బాక్స్‌లు బ్యాలెట్ పత్రాలు వాడటం, కౌంటింగ్ విధానంలో మార్పులు ప్రవేశ పెట్టి, ప్రజాస్వామిక వాతావరణాన్ని, పారదర్శకతను పెంపొందించాడు. చాలా కాలంగా నానుతూ, కోర్టు దాకా వెళ్ళిన సైన్స్ శాఖాధిపతుల సీనియారిటీ సమస్యని అతి చాకచక్యంగా, సామరస్యంగా ఇద్దర్ని కూర్చోబెట్టి పరిష్కరించాడు. కాలేజీలో సమస్యలన్ని దాదాపుగా లేని పరిస్థితి ఏర్పడి, ఉపాధ్యాయులంతా నిబద్ధతతో పనిచేసే వాతావరణం ఏర్పడింది. సమస్యలను సృష్టించే లెక్చరర్స్ కూడా సమస్యలను సృష్టించడం అట్లా ఉంచి, సమస్యలు తలెత్తకుండా, సమస్యేమైనా వస్తే పరిష్కారం వాళ్ళే చేసే ఒక సంస్కృతి కాలేజీలో ఏర్పడింది. ఎమర్జెన్సీలో సస్పెండ్ అయిన వరవరరావుగార్ని తిరిగి సర్వీసులోకి తీసుకునే విషయంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. అప్పటి ముఖ్యమంత్రి వెంగళరావు వ్యతిరేకించినప్పటికీ, ఆయనను తన పద్ధతిలో సముదాయించి ఫైలుపై ఆయన సంతకం తీసుకొని వరవరరావు గారి సస్పెన్షన్‌ను రద్దు చేశాడు. ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకించిన అప్పటి స్థానిక మంత్రి హయగ్రీవాచారి తీవ్ర ఆగ్రహంతో కాలేజీకి వచ్చి జయశంకర్‌ను నిలదీశాడు. ఫైలు ఆయన ముందు పెట్టి ... "వెళ్ళి మీ ముఖ్యమంత్రి గారిని అడగండి" అని సమాధానం చెప్పి పంపించాడు. వరవరరావుగారి సస్పెన్షన్‌ను రద్దు చేసి విధుల్లోకి తీసుకొని ఆయనతో కలసి పనిచేయడం తన జీవితంలో అత్యంత సంతోషకరమైన విషయంగా చెప్పేవాడు.

వరవరరావుగారిపై సస్పెన్షన్ రద్దు అయిన అంశం, కావలి కాలేజీలో సస్పెండ్ అయిన కె.వి. రమణారెడ్డితో సహా ఇతర కళాశాలల్లో, స్కూళ్లల్లో సస్పెండ్ అయిన వారందరు తిరిగి విధుల్లో చేరడానికి దోహదపడింది. కొద్ది రోజుల్లోనే యు.జి.సి నుండి నిధుల కోసం కృషి చేసి మౌళిక వసతుల అభివృద్ధి పని మొదలు పెట్టాడు. ఆరు నెలల్లో మంచి లైబ్రరీహాల్, సెమినార్ హాల్ దాదాపు 24 క్లాసు రూములు తయారైనాయి. లైబ్రరీ నిర్మాణం అవుతున్న సమయంలో లెక్చరర్ శ్రీనివాసరావు, జయశకర్ సార్ కొన్ని రాత్రులు అక్కడే పడుకున్నారు. ఉపాధి కల్పించే కోర్సుల్లో మా కాలేజీ తెలంగాణాలో అగ్రభాగాన నిలిచింది. ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, అగ్రికల్చరల్ బాటనీ, ఫిషరీ సైన్స్ కోర్సులు ప్రారంభించబడ్డాయి. అన్ని సైన్స్ విభాగాలకు అవసరపడే ఒక సెంట్రల్ లాబ్ నిర్మాణం జరిగింది. దిన దినం జరుగుతుండే ప్రగతి, అందులో మమ్మల్ని ఇన్‌వాల్వ్ చేసే ప్రక్రియలు మమ్మల్ని అబ్బుర పరచేవి. కోకర్రికులర్ కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలు బాగా జరుగుతుండేవి. విద్యార్థులకు అంతర్ జిల్లాల సెమినార్‌లు, వకృత్వ పోటీలు జరిగేవి. ఒక పోటీలో, అప్పుడు ఆర్.ఇ.సిలో విద్యార్థిగా వుండి, కొద్దికాలం క్రిదం పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన, మావోయిస్టునేత చెరుకూరి రాజ్‌కుమార్ మొదటి బహుమతి, ఇప్పుడు నల్సార్‌లో ప్రొఫెసర్‌గా వున్న మాఢభూషి శ్రీధర్ రెండవ బహుమతి గెల్చుకున్నారు. కెమెరా క్లబ్ స్థాపించి ప్రముఖ ఫోటోగ్రాఫర్ రాజన్ బాబు ఫోటోల ప్రదర్శన, పల్లెరాజయ్యగా చిత్రకళ ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. ఈ తరుణంలో అప్పటి ఉస్మానియా వైస్ ఛాన్సలర్ అయిన జస్టిస్ జగన్ మోహన్ రెడ్డి గార్ని మా కాలేజీకి ఆహ్వానించడం జరిగింది. ఆయన కాకతీయ యూనివర్శిటీకి వెళ్ళి మా కాలేజీకి వచ్చాడు. ఆయన సమావేశంలో మాట్లాడుతూ అసలు కాకతీయ యూనివర్శిటీనే ఈ కాలేజీకి అనుబంధంగా ఉందా అనిపిస్తుందని వ్యాఖ్యానించాడు.

దాదాపు విద్యార్థుల సంఖ్య, నాలుగు వేలు, డిగ్రీ, ఇంటర్ కలసి 54 క్లాసులు ఉండేవి. హన్మకొండ, వరంగల్,

ఖాజీపేట నుండి 12 ఆర్.టి.సి. బస్సులు విద్యార్థుల కోసం నడుపుతుండేవారు. నేను, రాజ్ కుమార్ గారు బస్సుల ఇంచార్జీలుగా ఉండేవాళ్ళం. ఒకసారి ఒక డిగ్రీ మొదటి విద్యార్థి, బస్సులో గొడవపడి డ్రైవర్‌ను కొట్టాడు. ఆ విద్యార్థి, నా స్నేహితుడి తమ్ముడు. ఆయన అప్లికేషన్‌లో నా రెఫరెన్స్ రాసి ఉంది. నాకు ఈ గొడవ సంగతి తెలియదు. రాత్రి 8 గంటలకు సార్ నన్ను వాళ్ళ ఇంటికి పిలిపించాడు. నేను వెళ్ళగానే విషయం చెప్పి, ఆ విద్యార్థి టి.సి. నా చేతుల్లో పెట్టి ఈ విద్యార్థిని రేపు కె.డి.సి. కాలేజీలో చేర్పించు. మనం తీసేశాం. ఆర్.టి.సి. ఉద్యోగులు ఆ విద్యార్థిపై దాడికి వస్తారని సమాచారం ఉంది అని చెప్పాడు. నేను కె.డి.సి. ప్రిన్సిపాల్ సంత్ ప్రసాద్ రెడ్డిని కలిసి, ఆ విద్యార్థి అడ్మీషన్ విషయం మాట్లాడి కాలేజీకి వెళ్ళాను. మధ్యాహ్నం బస్సు నిండా, యూనియన్ సభ్యులతో సహా డ్రైవర్లు చాలా ఆవేశంగా కాలేజీకి వచ్చి ఆ విద్యార్థిని అప్పజెప్పమని డిమాండ్ చేశారు. సార్ నన్ను పిలిచి జరిగిన విషయం చెప్పమన్నాడు. నేను ఆఫీసు నుండి అడ్మిషన్ రిజిస్టర్, టి.సి. పుస్తకం తీసుకొచ్చి చూపి ఆ విద్యార్థిపై మేం చర్య తీసుకున్న విషయం వివరించాను. వాళ్ళుఏం అనాలో తోచక వెళ్ళిపోయారు. ఈ విషయం నాకు రాంచందర్ సార్, జయశంకర్‌సార్‌కు తప్ప ఎవరికీ తెలియదు. ఇటువంటి సమస్యలు ఉత్పన్నమైనప్పుడు చాలా చాకచక్యంగా ప్రవర్తించి పరిష్కరించేవాడు. పోలీసులు సార్‌ను కలవడానికి సందేహించేవారు. ఎటువంటి సమస్య వచ్చినా పోలీసుల సహాయం తీసుకొనేవాడు. ఒకసారి ఇంటలిజెన్స్ అధికారి ఒక విద్యార్థి వివరాల కోసం సార్‌ని కలిశాడు. సార్ చాలా మర్యాదగా విద్యార్థుల వ్యవహారాలు జీవన్‌కుమార్ చూస్తాడు, ఆయనను కలవండి, సమాచారం ఇస్తే తీసుకోండి, నా దగ్గరికి మాత్రం రావద్దని చెప్పాడు. ఆయన నా దగ్గరికి రాకుండానే వెళ్ళిపోయాడు.

ఎంతటి పెద్ద సమస్య అయినా సార్ దాన్ని అర్థం చేసుకొని పరిష్కరించే విధానం మమ్మల్ని ఆశ్చర్య పరిచేది. సార్ బాధ్యతలు తీసుకొన్న కొద్ది రోజులకే స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలు వచ్చాయి. ప్రజాస్వామిక, వామపక్ష భావాలు గల అధ్యాపకులు ఒకరిని నిలబెట్టగా, కొంచెం ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. ఆలోచనా విధానానికి సంబంధించిన వారు ఒక అధ్యాపకున్ని రంగంలో ఉంచారు. హోరా హోరీగా ప్రచార కార్యక్రమం కొనసాగింది. స్కూటర్లపై ఇండ్లకు వెళ్ళి గుంపులుగా ప్రచార కార్యక్రమం మొదలైంది. ఈ పరిణామానికి జిల్లా పోలీసు యంత్రాంగం, అధికార్లు నివ్వెర పోయారు. ఈ పరిస్థితిని వారించే ప్రయత్నం చేయాలని కలెక్టర్, పోలీసుల నుంచి జయశంకర్ గారిపై వత్తిడి వచ్చింది. సార్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి, విద్యా సంస్థల్లో ఇటువంటి పరిస్థితి వాంఛనీయం కాదని, బలాబలాలు తేల్చుకోవడం వల్ల వివిధ అభిప్రాయాలు కలిగి ఉన్న ఉపాధ్యాయులు కలిసి పనిచేసే వాతావరణం, సంస్కృతి చెడిపోతుందని, విద్యా సంస్థ క్షేమం దృష్ట్యా రెండు వర్గాలు ఆవేశాలకు పోకుండా కలిసి ఒక సమాలోచన చేయాలని విజ్ఞప్తి చేశాడు. సార్ విజ్ఞప్తి మేరకు రెండు పక్షాల వాండ్లం కూర్చొని, ఒక కమిటీ వేసుకొని, ఇద్దరికీ ఆమోద యోగ్యమైన అభ్యర్థిగా మా బ్యాచ్‌కు చెందిన కెమిస్ట్రీ నరసింహరావును ఎన్నుకోవడం జరిగింది. సార్ ఇంత పెద్ద పరీక్షలో విజయం సాధించి, కళాశాల యాజమాన్యాన్ని, జిల్లా యంత్రాంగాన్ని ఆశ్చర్యానికి గురి చేశారు. మేనేజ్‌మెంట్ సభ్యుల సమావేశాలు క్రమం తప్పకుండా జరిపేవాడు. ఇంతకాలం ఏమీ పట్టనట్టుగా ఉండే సభ్యులు జయశంకర్ సార్ హయాంలో సమావేశాలకు తప్పకుండా హాజరయ్యేవారు. సార్ సమావేశాలలో ప్రవేశపెట్టే తీర్మానాలు, కాలేజీకి సంబంధించిన నివేదికలు వినడం, చర్చించడం తమ బాధ్యతగా భావించేవారు. సంవత్సరానికి ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశం దాదాపు ఒక పండుగలాగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగేవి. ఈ విషయాలన్ని మేం మా ప్రతినిధి ద్వారా ఉత్సాహంగా వినేవాళ్ళం. కళాశాల పనులను, బాధ్యతలను పూర్తిగా వికేంద్రీకరణ చేశారు. అడ్మిషన్ కమిటీ, పరీక్షలు నిర్వహించే కమిటీ, గేమ్స్ కమిటీ, కల్చరల్ కమిటీ, క్రమశిక్షణ కమిటీలన్నీ పూర్తి స్వతంత్రంగా పనిచేసేవి. అవసరం అయినప్పుడు మాత్రమే సార్ జోక్యం చేసుకునేవాడు.

సి.కె.ఎం. కళాశాలలో మూడున్నర సంవత్సరాలు పనిచేసి, కాలేజీని ఉత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్ది ఇక్కడ డిప్యూటేషన్ కాలం ముగియగానే ఎస్.ఇ.ఆర్.టి.కి వెళ్ళి అక్కడ కొన్ని నెలలు పని చేసి కాకతీయ యూనివర్శిటీకి

రిజిస్ట్రార్‌గా వచ్చాడు. మా కాలేజీలో సార్ వీడ్కోలు కార్యక్రమం పెద్ద పండుగలాగా జరిగింది. దాదాపు 40 రోజులు అన్ని క్లాసుల వాళ్ళు వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేశారు. చివరి రోజు కళాశాల యాజమాన్యం, కాలేజీ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన సభ 1979 మార్చి నెలలో జరిగింది. సాయంత్రం 6 గంటలకు మొదలై ఉదయం 4 గంటల వరకు కొనసాగింది. చివరి వరకు కలెక్టర్ సమరజిత్‌రే గారు కూర్చున్నారు. సభ ముగిసిన తర్వాత దాదాపుగా అందరం పోచమ్మ మైదాన్ వరకు నడచి ఆటోల్లో ఇండ్లకు చేరాం. ఒక గంట తర్వాత అంటే 5 గంటలకు, ఓంకార్‌పై హత్యా ప్రయత్నం జరిపాడనే అభియోగంపై వరవరరావు గారిని కుమార్‌పల్లి ఇంట్లో నుంచి పోలీసులు తీసుకెళ్లారు. పోలీసుల ఇంటరాగేషన్‌తో తాను రాత్రంతా కాలేజీలోనే ఉన్నానని, అందుకు జయశంకర్‌కు జరిగిన వీడ్కోలు సభ, అందులో చివరదాకా కూర్చున్న జిల్లా కలెక్టర్ సమర్‌జిత్‌రే గారే సాక్ష్యమని చెప్పాడు. సభలో దాదాపు అందరు జయశంకర్ గారి సామర్థ్యాన్ని, నిబద్ధతను పొగుడ్తూ మాట్లాడారు. సార్ ప్రతిభను ఒప్పుకోవడం ఇష్టం లేని ఒక సీనియర్ మిత్రుడు మాత్రం "జయశంకర్ సమర్థవంతుడే కాని బెనెవెలెంట్ డిక్టేటర్‌లా వ్యవహరించాడు" అని వ్యాఖ్యానించాడు.

విద్యార్థుల తరపున బిఎస్సీ-3వ సంవత్సరం విద్యార్థి మ్యాతూ థామస్ చాలా అనర్గలంగా ఇంగ్లీషులో ఉపన్యసించాడు. ఆ విద్యార్థి సార్‌కు ప్రియమైన శిశ్యుడు. మ్యాతూ థామస్ ఇప్పుడు భారత సైనిక శాఖలో పెద్ద అధికార హోదాలో వున్నాడు. సార్‌కు చాలా దగ్గరగా ఉండే విద్యార్థులు మల్లిఖార్జున్, మల్లారెడ్డి, మధుసూధనాచారి, డి.ఎస్.మూర్తి రకరకాల వృత్తుల్లో స్థిరపడ్డారు.

సార్ రిజిస్ట్రార్ అయిన తర్వాత హయగ్రీవాచారి గారు ఒక ల్యాబ్ అసిస్టెంట్‌ను వేరే శాఖకు మార్చమని సిఫారసు చేస్తే నిబంధనల ప్రకారం వీలు కాదని తిరస్కరించాడు. హయగ్రీవచారిగారు సార్‌పై కోపంతో కక్ష సాధింపు చర్యలకు దిగాడు. ఆయనపై ఎట్లాగైనా ఒక కేసు బనాయించాలని, హన్మకొండ సి.ఐ.ని ఆదేశించాడు. ఈ విషయం, హన్మకొండ సి.ఐ., డి.ఎస్.పి.తో చెప్తున్నప్పుడు నేను ఏదో పనికోసం వెళ్ళినప్పుడు వినడం జరిగింది. ఈ విషయం నేను సార్‌కు చెప్పాను. సరిగ్గా నాలుగు రోజుల తర్వాత సార్ ఇంట్లోకి కిటికిలో నుండి ఎవరో అర.వై.ఎల్. కరపత్రాలు విసిరారు. సార్ వెంటనే వాటిని తీసుకెళ్ళి కలెక్టర్ తివారీకి చూపెట్టాడు. సార్ ఎవరైనా తనను అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేసినా, కుట్ర పూరితంగా వ్యవహరించినా, వారి పట్ల చాలా కఠినంగా వ్యవహరించేవాడు. కె.యు.సి.లో రిజిస్ట్రార్‌గా ఉన్నప్పుడు, సార్‌పై ఎ.బి.వి.పి. విద్యార్థుల్ని రెచ్చగొట్టి, సీమాంధ్రకు చెందిన ప్రొ॥ కేశవరావు, ప్రొ॥ విజయసారథిగార్లు అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేశారు. వాళ్ళను దాదాపుగా మూడు చెరువుల నీళ్ళు త్రాగించాడు. వాళ్ళు విధిలేక ఉస్మానియాకు బదిలీ చేసుకొని వెళ్ళిపోయారు. వాళ్ళ రిలీవింగ్ ఆదేశాలు సంతకంచేసి వాళ్ళని పంపివ్వడం నాకు చాలా సంతోషకరమైన విషయం అని చాలా సార్లు మాతో చెప్పుకున్నాడు. అర్హత, నైపుణ్యత ఉన్న వాళ్ళను గుర్తించి అవకాశాలు అందించేవాడు. ఆయన రిజిస్ట్రార్‌గా ఉన్నప్పుడు తర్వాత వైస్‌ఛాన్సలర్ అయిన తర్వాత పెద్ద సంఖ్యలో వెనుకబడిన తరగతులు, దళిత అభర్థులు యూనివర్సిటీలో చేరగలిగారు.

సి.కె.ఎం కాలేజీకి ఎప్పుడు వెళ్ళినా అప్పటి రోజులు, ఆ స్వర్ణయుగం, జయశంకర్ సార్ నేతృత్వంలో మేమంతా పనిచేస్తూ చాలా విషయాలు నేర్చుకున్న వైనం గుర్తొస్తుంది. ఇప్పటికీ సార్ ప్రవేశపెట్టిన బెస్ట్ ప్రాక్టీసెస్ అమలులో వున్నాయి. ఆయన డిజైన్ చేసిన లెటర్‌ప్యాడ్, సెలవు చీటీ నమూనా, పరీక్షల అటెండెన్స్ ఫారాలు, ఆయన రాసిన కాలేజీ నివేదికల నమూనాలు ఇంకా అమలు అవుతున్నాయి. ఆయన చేసిన కృషి, ఏర్పరచిన సాంప్రదాయాలు తరువాత వచ్చిన ప్రిన్సిపాల్స్‌కు మార్గదర్శకంగా నిలిచి వాళ్ళ పరిపాలనను సులభతరం చేశాయి. నాకు సార్ ఆఫీసు వాళ్ళు రాసే ఉత్తరాలు చూసి గ్రామర్, భాషా అంశాలు సరిచేసే బాధ్యత అప్పగించాడు. ఈ క్రమంలో అధికారిక ఉత్తరాలు రాసే విధానాలు నేను సార్ నుండి చాలా నేర్చుకోవడం జరిగింది. సి.కె.ఎం పాత మిత్రులం ఎప్పుడు సార్‌తో కలిసి పిచ్చాపాటిగా మాట్లాడుకున్నా ఎక్కువగా సి.కె.ఎం.కాలేజి జ్ఞాపకాల్లోకి వెళ్ళేవాళ్ళం.

జయశంకర్ గారు "నాకు జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన కాలం సి.కె.ఎం కాలేజీలో ఉన్నప్పుడే" అని సంతోషంగా అంటుండేవాడు.

అంత సమర్థవంతుడు, ప్రతిభాశీలి, నిబద్ధత గల వ్యక్తితో చాలా సన్నిహితంగా కలిసి మెలసి పనిచేయడం ఒక గొప్ప అనుభవంగా నేను భావిస్తున్నాను. కళాశాలలో ఇప్పుడు మూడవ తరం మిత్రులు పనిచేస్తున్నారు. వాళ్ళకు ఈ విషయాలన్ని తెలియ చెప్పాలని, ఈ విధంగా సార్‌కు నివాళి అర్పించడానికి ఈ వ్యాసం రాయడానికి సాహసించాను.

జూన్ 23, 2011

**– ఎస్. జీవన్ కుమార్**

సి.కె.ఎం. పూర్వ ఆంగ్ల ఉపన్యాసకులు
మానవహక్కులవేదిక కార్యకర్త

---

# అశ్రునివాళి

జయశంకర్ జీవితం అందరికీ ఆదర్శం. ఆయన మృతితో తెలంగాణ ఉద్యమానికి తీరని నష్టం వాటిల్లింది.

***–సబితా ఇంద్రారెడ్డి,*** *రాష్ట్ర హోం మంత్రి*

జయశంకర్ మృతి తెలంగాణ ఉద్యమానికి తీరని లోటు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

***–డీకే అరుణ,*** *రాష్ట్ర సమాచార శాఖమంత్రి*

తెలంగాణ ఉద్యమ నిర్దేశకులు, అభ్యుదయవాది ప్రొఫెసర్ జయశంకర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాను. బ్రహ్మచారియైన ఆయన తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారు.

***–శ్రీధర్‌బాబు,*** *రాష్ట్ర మంత్రి*

తెలంగాణే శ్వాస, ధ్యాస, స్వప్నంగా జీవితాంతం జీవించిన మొదటి వ్యక్తిగా చరిత్రలో ప్రొఫెసర్ జయశంకర్ నిలిచిపోతారు. ఆయనకు విప్లవ జోహార్లు. తెలంగాణ ప్రజాస్వామిక డిమాండ్ అని నమ్మినవారు ఆయన. అలాంటి ప్రజాస్వామిక సంఘటన ఐక్యంగా అన్ని పార్టీలు కలసి ఉద్యమించాలి. ఈ బాధ్యత తెలంగాణ కోసం ఏర్పడిన రాజకీయ పార్టీ తీసుకోవాలి.

**– కూర రాజన్న,** *సీపీఐ ఎంఎల్ జనశక్తి కేంద్ర నేత*

తెలంగాణ సిద్ధాంత కర్త, తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి .జయశంకర్. తెలంగాణ సాధించుకోవడం ద్వారానే ఆయనకు మనం నిజమైన నివాళి అర్పించినట్లు, ఆయన ఆత్మను శాంతి కలుగ జేసినట్లు

**–మోత్కుపల్లి నర్సింహులు,** *టీడీపీ ఎమ్మెల్యే*

నీతి, నిజాయితీతో తెలంగాణ సాధన కోసం జీవితాన్ని అంకితం ఇచ్చిన మహనీయుడు ఆయన. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరే విధంగా ఐక్యంగా ఉద్యమించి తెలంగాణను సాధించుకోవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి.

***–దేవేందర్‌గౌడ్,*** *టీడీపీ నేత*

# తెలంగాణ జీవనది

**- బోనకుర్తి సోమేశ్వర్**

ఈ రోజు తెలంగాణలోని ప్రతి పల్లె, ప్రతివాడ, ప్రతి ఇల్లు తెలంగాణ ఎప్పుడొస్తదా అని ఎదురు చూస్తోంది. ఉద్యమ పిలుపు రాగానే తమ సొంత పనులు మానుకొని ఉద్యమంలో భాగస్వాములయితుండ్రు. అడ్డొచ్చిన వాళ్ళ సంగతేందో చూస్తాం అంటున్నరు. వాడకో సంఘం ఏర్పడింది. ఈ రోజు తెలంగాణలోని ప్రతి మనిషి ఏదో ఒక సంఘంలో, సంస్థలో, వేదికలో భాగస్వాములు. ఫోన్ ఎత్తగానే జై తెలంగాణ ... జై జై తెలంగాణ అనుకుంటున్నరు. యావత్తు తెలంగాణ యువకులకు, ఈ తరం ఉద్యమ నేతలకు, ఈ రోజు రాజకీయ నాయకులకు, తనకు తెలంగాణనేర్పిన ప్రతి పాఠాన్ని, అనుభవాన్ని, అనేక పద్ధతులలో మూడు తరాలకు అందించిన మహోన్నత నేత మన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్.

తెలంగాణకు పెద్దదిక్కు, దాదాపు అన్ని సంఘాలు, వేదిక, సమైఖ్యల నిర్మాణంలో బాధ్యుడైన జయశంకర్ సార్, పదవులకు, స్వార్థ ప్రయోజనాలకు దూరం. ఆయన మనిషి విలువను పెంచినవాడు. ప్రతి మనిషి అభిప్రాయాన్ని గౌరవించడం, ఆయనను అందరూ అభిమానించేలా చేసింది. ఏ చిన్న సమావేశం అయినా సరే మాట ఇచ్చిండంటే తప్పక హాజరుకావడం అనేది ఆయన క్రమశిణకు మారుపేరయింది. అది తెలంగాణ మేధో సంపత్తికి మార్గదర్శం అయ్యింది. తెలంగాణలోని ప్రతి గ్రామం ఆయనకు సుపరిచితం. అన్ని రంగాలలో తెలంగాణ ఏ విధంగా వెనుకబడేశారో, ప్రతి సంఘటన ఆయన నోటిమీద పద్యాలయి ఆడాయి.

హైస్కూల్ నుంచి విశ్వ విద్యాలయాల వరకు చెట్టుకింది సమావేశం నుంచి, బహిరంగ సభల వరకు అన్ని కార్యక్రమాలకు ఆయనే వక్త. తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడానికి మూడు రకాల పోరాట స్వరూపాలున్నాయన్నారు.

1. ప్రజల్లో చైతన్యం కలిగించడం,
2. ఉద్యమం
3. రాజకీయ ప్రక్రియ అనే మూడు స్వరూపాలలో ఆయన భాగస్వామి అయ్యారు. చెప్పారు. ఆచారించారు.

ప్రత్యేక రాష్ట్రం ఎందుకు అవసరమో ప్రజల్లో అవగాహన కల్పించి, ఆయన రచనల ద్వారా, మాటలద్వారా, సంస్థల నిర్మాణం ద్వారా ఆ పనిని పూర్తి చేశారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఉద్యమాలు చేయడం వల్ల ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ బలోపేతమవుతుందని చెప్పి ఒకవేళ చావాల్సివస్తే మాతరం ముందు వుంటుంది. తెలంగాణ మీ కోసం మీరు చనిపోతే ఇక తెలంగాణ ఎవరి కోసమాని యువతను అనేకసార్లు వరించారు. చివరగా రాజకీయ పక్రియ ద్వారాని రాష్ట్రం ఎర్పడుతుందని నమ్మకంతో టిఆర్ఎస్ పార్టీ స్థాపన ప్రస్తనంలో ముందున్నడు, ఎనో విమర్శలకు గురైనాడు.

ఎని విమర్శలు వచ్చిన విమర్శించిన ప్రతి విమర్శకు ఆయన అంతే గంభిరంగా సమాధనం ఇచ్చినాడు. నేను ఏ పార్టీ మనిసిని కాను టిఆర్ఎస్ చేసే ప్రతి పనిలో నేను వుండాను నేను సలహదారుని మాత్రమే అంతకంటే మించి తెలంగాణ ఉద్యమ కార్యకర్తను అని అందరికి ఎకె ఒక్క ప్రశ్న వేసాడు. మరో రాజకీయ ప్రత్యన్యాయం చెప్పండి ముందుకెళ్ళందాం అని ....

శంకర్ సార్ ఎంతో గొప్పవ్యక్తిత్వం చెప్పడానికి మరో మాటలు అసరం లేదు. నమ్మిన ఆశయం కోసం తన చివరి ఊపిరి వరకు పోరాడి ఎవరైతే ప్రాణాల్ని ధార పోస్తారో వాళ్లే చరిత్రను మార్చగలిగారు. అలాంటి వారిలో జయశంకర్ గారు మహనీయుడు ఆయన స్ఫూర్తి యాత్ర తదనంతరం జరుగుతున్న స్మసరణ సభలే ఆధారం.

ఈ రోజు తెలంగాణ గురించి నాయకులుగా మేధావులుగా పోం ... వారిలో చాలా మంది తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను మొదట గుర్తించలేదు. కాని శంకర్ సార్ తన విద్యార్థి జీవితం నుండి తన శ్వాస ఆగిపోయే చివరి మాట వరకు ఆయన ప్రతిశ్వాస, అడుగు తెలంగాణ కోసమే సాగింది. సార్‌ను చాలా తక్కువ సార్లు కలిసిన ఆయన మాకు మార్గదర్శి. అంబేద్కర్ కళశాలలో విద్యార్థిగా ఉన్నపుడు మేము ఎర్పటు చేసిన కాళోజీ సంస్మరణ మొదలుకొని (మేము ఏర్పాటు చేసిన ప్రతి సమావేశంలో సార్ పిలవగానే వచ్చారు. ఆయన ప్రతిమాటలో గంభీరం, ఎంత స్థాయిలో ఉందో ఆవేదన, అక్రోశం అంతే ఉండేవి. ఇక చివరగా ఒక్క మాట మాత్రం విచిత్రంగా చెప్పుకోవాలి. ఇది అందరికి తెలిసిందే అయిన.

గల్లీ విద్యార్థి మంత్రులు ఎంత సుపరిచితమో, ఢిల్లీలో నాయకులు అంతే సుపరిచితం, విద్యార్థికి తెలంగాణ పోరాటం ఎలా చేయాలో నేర్పాడు. ఢిల్లీ నాయకులకు తెలంగాణ ఎందుకు ఇవ్వాలో చెప్పాడు. చివరకు తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిచే మాట్లాడించగలిగాడు.....

మళ్లీ దసరా, మళ్లీ దీపావళి, సంక్రాంతి, ఉగాది, బతుకమ్మ కొత్త సంవత్సరం తెలంగాణలోనే అన్ని... అనే ప్రగల్భాలు పలకకుండా ... సార్ ప్రకటింప చేసిన ప్రకటనల అచరణ రూపంలో తీసుకురావల్సిన బాధ్యత ప్రజలుగా మనపైన ఎంతో ఉందో రాజకీయ నాయకులకు 100 రేట్లు ఉన్నది అని గుర్తు చేస్తున్నారు.

**– బోనకుర్తి సోమేశ్వర్**

---

# అశ్రునివాళి

తాడిత, పీడిత హృదయాలను ఐదు దశాబ్దాలుగా ఆవాహనం చేసుకున్న వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్. విద్యావేత్తగా చైతన్య జ్వాలలు రేకెత్తించడం అందరికీ సాధ్యం కాదు...అది జయశంకర్‌కే సాధ్యం.

***–జూపూడి ప్రభాకర్‌రావు,*** ఎమెల్సీ

మేధావుల్లోని గొప్ప నాయకుడు జయశంకర్. తన జీవిత కాలంలో అనేక సామాజిక న్యాయ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ప్రజల పక్షాన ఎంతగానో కృషిచేశారు. నా కంటే 20ఏళ్ళు చిన్నవాడైనప్పటికీ వ్యక్తిగతంగా నేను ఆయన అభిమానిని. ఆయన అకాల మృతి తెలంగాణ ఉద్యమానికి తీరని లోటు.

***–కొండా లక్ష్మణ్‌బాపూజీ,*** స్వాతంత్ర్య సమర యోధులు

నిస్వార్థంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరిశ్రమించిన ధీశాలి జయశంంకర్. ఎన్నో అవరోధాలు ఎదురైనా తెలంగాణవాదాన్ని గల్లీ నుంచి ఢిల్లీ వరకు వినిపించారు. మచ్చలేని మనిషిగా నిలిచారు. భారత దేశంలో చిన్న రాష్టాల ఉద్యమంలో ఆయన జీవిస్తారు. మళ్లీ జన్మిస్తారు.

**–జయధీర్ తిరుమల రావు**

# నిరంతర మార్గదర్శకులు

**- ప్రొ॥ ఇ. రేవతి**

జయశంకర్ సార్‌ను కోల్పోవడం తెలంగాణ సమాజానికి, ప్రత్యేకంగా విద్యావంతులకు పెద్దలోటు. తెలంగాణ అంశం మీద హేతుబద్ధంగా తార్కికంగా, గణాంకాల సహితంగా రచనలు చేసి మేధోపరంగా గట్టి పునాదిని ఏర్పర్చారు. తన జీవితమే ప్రత్యక్ష అనుభవంగా తెలంగాణ రాష్ట్ర అవశ్యకత కోసం భూమికను పకడ్బందీగా తయారు చేశారు. తెలంగాణకు చరిత్రలో ఏం జరిగింది. ఏట్లా జరిగింది. ఎందుకలా జరిగింది. అనే ప్రశ్నల చూట్టు తన అధ్యయనం కొనసాగింది. తెలంగాణలోని నాయకత్వం స్వతంత్రంగా ఎదగకపోవడానికి, ప్రజల ఆకాంక్షలను అందిపుచ్చుకోకపోవడానికి కారణాలను సరిగ్గానే అంచనా వేశారు. అందుకే అధ్యయనంతో పాటు అవగాహన పెంచడానికి పాటుపడ్డారు. ఎప్పటికప్పుడు తెలంగాణ  జ్వాల అగిపోకుండా నిలబెట్టారు.

జయశంకర్ సార్ ది బహుముఖ వ్యక్తిత్వం ఒకవైపు పరిపాలనాదక్షుడుగా, ఇంకోవైపు మేధోపరమైన నాయకత్వం వహించి ఎంతో మందిని తెలంగాణ ఉద్యమంవైపు మళ్లించారు. 1990 దశకంలో తిరిగి మొదలైన ఉద్యమంలో జనార్ధన్ చురుకైన పాత్ర వహించాడు. జయశంకర్ సార్, జనార్ధన్ కలిసి అనేక సామవేశాల్లో పాల్గొనేవారు. అంతవరకు జనార్ధన్ అదివాసీ ప్రాంతాల్లో తన అధ్యయనం, అనుభవాల ద్వారా వెలుగులోచ్చిన విషయాలను సార్‌తో పంచుకున్నాడు. ముఖ్యంగా కోస్తాంధ్ర నుంచి ఆదివాసీ ప్రాంతాలకు వలసవచ్చిన ఏ విధంగా వాళ్ల వనరులను కొల్లగొడుతున్నారు. వైనాన్ని తెలంగాణ కూడా అన్వయించి జయశంకర్ సారును ఆ ప్రాంతాలకు తీసుకువెళ్లాడు. గిరిజన ప్రాంతాల్లో కనీస వైద్య సౌకర్యాలు మంచి నీరు వంటివి లేకపోవడంతో, సాధారణ రోగాలకు అనేకమంది. గిరిజనులు బలైపోయేవారు. మరొపక్క అదివాసీయేతరలు ఆస్తులు పెంచుకోవడం అవన్నీ జయశంకర్ సార్‌ను కూడా కదిలించాయి.

తొమ్మిది సంవత్సరాల చంద్రబాబు పాలనలో ఉదారవాద విధానాల వల్ల తెలంగాణ ప్రాంతంలోని రైతులు, వివిధ వృత్తులవారు అనేక రకాలుగా కష్టాలు పాలయ్యారు. తెలంగాణ ప్రాంతానికి అన్ని రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను, వివక్షతను ఎత్తిచూపుతూ తెలంగాణవాదులు పత్రికల్లో అనేక వ్యాసాలు కూఠ రాశారు. అప్పటిదాకా నాకు తెలంగాణ విషయం ఒక విధంగా సెంటిమెంట్ మాత్రమే నన్ను కూడా ఏదైనా రాయమని అడిగితే తెలంగాణ వ్యవసాయరంగం గురించి రాసే ప్రయత్నం చేసిన అప్పుడు అనిపించింది. అధ్యయనం చేయవలసింది ఎంతో ఉన్నదని ముఖ్యంగా ఆర్థికవృద్ధి అభివృద్ధి బహుముఖం కలిగిన ప్రక్రియ ప్రభుత్వం సమాచారాన్ని ఉపయోగించి తెలంగాణకు జరుగుతున్న వివక్షను ఎత్తిచూపడం కష్టమైన పనే ఆనందరావు తోట, జయశంకర్ సార్‌లు తెచ్చిన తొలి పరిశోధనత్మక పుస్తకం 'తెలంగాణ: ఆన్ ఇన్వేస్టిగేటివ్ ఫోకస్' నా అధ్యయనంలో మొదటిది. అత్యంత విలువైంది.

2000 సంవత్సరం వరకు జయశంకర్ సార్‌తో నా అనుబంధం జనార్ధన్ ద్వారానే. 2000 జూన్ నెలలో వాళ్లిద్దరు అమెరికాలో మొదటిసారిగా తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో పట్టణాల్లో ప్రసంగించారు. 2001 సంవత్సరంలో టీఆర్ఎస్ ఏర్పడినప్పుడు జనార్ధన్, జయశంకర్ సార్‌లు ఎంతో కృషి

చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన తొలి రాజకీయ పార్టీ కాబట్టి దాని వెన్నంటే ఉండాలని, స్థానిక ఎన్నికల్లో పార్టీ ద్వారా తెలంగాణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం ముమ్మరంగా చేశారు. ఆ అన్నీ ప్రయత్నాల్లో అలుపెరుగకుండా తిరిగిన జనార్ధన్ నడుస్తున్న చరిత్రలో భాగమయ్యాడు. అప్పుడు జయశంకర్ సార్ తల్లడిల్లిపోతున్నా మాకు ఎంతో ధైర్యమిచ్చారు. ఆ తర్వాత జనార్ధన్ మెమోరియల్ ట్రస్టు ఏర్పాటులో కూడా సార్ ప్రధాన పాత్ర వహించారు. మొదటి స్మారకోపన్యాసం తెలంగాణ అంశం మీద ఇచ్చారు. 2004లో రురె హైదరబాద్ సిఈఎస్ఎస్‌లో చేరిన తర్వాత రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభం, రైతు ఆత్మహత్యలపై అధ్యయం చేసినప్పుడు తెలంగాణలో వ్యవసాయం మరింత సంక్షోభంలో పడిపోడానికి ప్రభుత్వం విధానాలే ప్రధాన కారణమని ఆ విషయాలు సార్‌తో తరచూ చర్చించేదాన్ని ప్రొఫెసర్ హనుమంతరావు రచించిన ప్రాంతీయ అసమానతలపై వ్యాపాలు తెలుగు ప్రచురణ ఆవిష్కరణ సందర్భంలో తెలంగాణకు జరిగిన, జరుగుతున్న వివక్షపై జయశంకర్ సార్ సోదాహరణంగా చెప్పారు. అదే చాలా మందిలో తెలంగాణ సమస్యలపై అవగాహనను పెంచింది. వేదిక ఏదైనా ఎంతో స్పష్టతతో, లోత్తైన విశ్లేషణను అందించేవారు.

తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రారంభ సభ్యులుగా మాకు సార్‌తో అనుబంధం మరింత పెరిగింది. తెలంగాణ రావడానికి విద్యావంతుల పాత్ర నిరంతరం వున్నట్టే, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఉండాలని అనేవారు. తెలంగాణ రావడం అన్ని సమస్యలకు పరిష్కారం కాదు. మనలాంటి వాళ్లం ఎప్పటికప్పుడు జాగరూకతతో సమస్యల పట్ల అవగాహనతో ఉండాలని చెప్పేవారు. మెయిన్ స్ట్రీమ్ సమాజంలోని అన్ని రకాల అవకతవకలు, అసమగ్రతలు తెలంగాణలోనూ ఉంటాయి. కాబట్టి విద్యావంతులు పాత్ర ఎప్పటికీ ఉంటుందనే విషయం నొక్కి చెప్పేవారు.

శ్రీకృష్ణ కమిటీకి సమర్పించిన నివేదికను సార్ సమగ్రంగా రూపొందించారు. అన్నిరంగాల్లో అన్ని కోణాల నుంచి ముఖ్యంగా చారిత్రక కోణం నుంచి, విద్యారంగంలో వివక్షను సార్ బాగా ఎత్తిచూపారు. తెలంగాణవైపు నుంచి ఏ నివేదిక వెళ్లినా వాటికి సార్ రచనలే భూమిక అంటే అతిశయోక్తి కాదు. అట్లాగే ఆర్థికకోణంలో కూడా తెలంగాణ ఆదాయ-వ్యయాల విశ్లేషణను కూడా నాటి ఆర్థకమంత్రి రోశయ్య అసెంబ్లీలో చేసిన ప్రకటన ఆధారంగా సూక్ష్మంగా, సులభంగా అర్థమయ్యేటట్టు చెప్పారు.

సార్ ఆరోగ్యం బాగా లేనప్పటీ నుంచి ఎప్పుడైనా ఎట్లున్నారు అని అడిగితే, ఏమోనమ్మా ఏం జబ్బో కనపడకుండా ఉన్నది. ఊపర్ షేర్వానీ, అందర్ పరేశాని, లాగున్నది అని నవ్వేవారు. క్యాన్సర్‌కు జరిగే కీమో చికిత్స వల్ల చాలా అసౌకర్యానికి, బాధపడే వాడు.అంతే తప్ప, తన బాధ గురించి ఎన్నడూ చెప్పలేదు. రోజూ కొంతసేపయినా చదవడమూ, రాయడమూ చేయనిదే ఉండలేని పరిస్థితి ఆయనది మరి. కొన్ని నెలలుగా రెండు పనులూ చేయాలని దగ్గరివాళ్ళు చెప్పేవారు. ఒకటి తన అనుభవాలను రికార్డు చేయడం, రెండవది : తెలంగాణకు సంబంధించిన ఆర్థిక వృద్ధి - అభివృద్ధి మీద సమగ్రంగా రాయడం. రెండోదానికి సంబంధించి నన్ను కొంత సమాచారం సేకరించమన్నారు. ఒకసారి ఆసుపత్రిలో కలిసినప్పుడు అది అందజేశాను. అయితే మీతో కూర్చుని మీరు చెప్పిన పని చేస్తా సార్! అన్నాను. కాని అది జరుగనేలేదు. కూర్చోవడానికే ఇబ్బందిగా ఉందమ్మా అన్నారు. తెలంగాణకు సంబంధించి పరిశోధించవలసిన అంశాలు ఎన్నో వున్నాయి. అయితే సులభశైలిలో సాధారణ ప్రజలకు అందే విధంగా రాయడం సార్ నుంచి నేర్చుకోదగ్గ విషయం. సార్ అధ్యయనం, రచన, భావవ్యాప్తి అనే ఈ మూడు ప్రక్రియలు నిరంతరంగా కొనసాగించిన మేధావి. అదే విద్యావంతులందరికీ మార్గదర్శకంగా ఉండదగినది.

**- ప్రొ॥ ఇ. రేవతి**

కాకతీయ విశ్వవిద్యాలయం

నమస్తే తెలంగాణ దినపత్రిక
30 జూన్, 2011

# అజాత శత్రువు

**- చుక్కా రామయ్య**

జయశంకర్ మరణంతో నాలుగుకోట్ల కన్నీటి బిందువులు రాలాయి. వర్షానికి ఆకులు నుంచి రాలిన చినుకులు కావని, ప్రజల కన్నీటి సామూహిక అశ్రుతర్పణాలు ఇంతమంది ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగారు. మొత్తం తెలంగాణ సమాజమంతా బాధతో, ఆవేదనతో నిండిపోయింది. దీనికి కారణం అతను గత 60 సంవత్సరాలలో ఈ ప్రాంత ప్రజల జీవనంతో మమేకం కావడమే అంతేకాదు. తెలంగాణ సమస్యలకు మూలకారణలను అధ్యయనం చేశారు. దానిక శాస్త్రీయమైన కారణాలు చూపిస్తూ బాధ్యులైన ప్రతి నాయకుని గడపనుతొక్కి తెలంగాణ ఆవేదనను వినిపించాడు. కాబట్టే ఈ సామూహికమైన అశ్రుతర్పణం. కొందరు తమకోసమే పుడతారు, కొందరు ప్రజల కోసం పుడుతారు. మరికొందరు అనాథల మొరను వినిపించటానికి, వాళ్ళ కళ్ల నీళ్ళను తుడిచేందుకు పుడతారు. ఇలాంటి వారి కోసం ఎవరో కొద్ది మంది మాత్రమే నిలబడతారు. ఆ నిలబడ్డవాళ్లలో ఏ కొందరు మాత్రమే జీవితాంతం నిలబడి సమస్యకు పరిష్కారం దొరికేంతవరకు పెనుగులాడుతూనే వుంటారు. అలాంటి కోవకు చెందినవాడే ప్రొ. జయశంకర్ తెలంగాణ గడ్డలో ఎంతో మంది తమ జీవితాలను ప్రజల కోసం అర్పితం చేశారు. కష్టాలను అనుభవించారు. ఫలితం రాలేదని నిరాశపడలేదు. పోరాటమే తమ విజయానికి సంకేతమనుకున్నారు. అదే వారి కానందం.

కొందరు ఫలితాలను చూసి మురిసిపోతారు. ఏ కొద్దిమంది మాత్రమే ప్రజా పోరాటాలతో ఆనందపడతారు. జయశంకర్ తనకు ఎన్ని బాధలు వచ్చినా సామాజిక సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. అందుకే తండోపతండాలుగా ప్రజలు వచ్చి ఆయనకు నివాళులర్పించారు. ఇది సానుభూతి కాదు. తెలంగాణ 60 సంవత్సరాల పోరాటానికి నిలువుటద్దం జయశంకర్ ఆయన బహుజన వర్గాల నుంచి వచ్చిన వాడు. పేద వర్గాలతో కలిసి పెరిగినవాడు. వారి కష్టాలను చిన్నప్పటి నుంచే దిగమింగినవాడు. చదువుకుని తనతోటి ప్రజల కన్నీరు తుడవాలని ఉద్యోగంలో చేరినవాడు. ఏ ఉద్యోగంలోనూ చేరకుండా ఉపాధ్యాయ వృత్తి స్వీకరించాటానికి కారణం ఏమిటంటే? ఈ వృత్తి ద్వారా ప్రజలకు చేరువై జనజాగృతం కోసం కృషిచేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొందరు టెక్స్టుబుక్స్ చెప్పి సంతోషపడతారు. కొందరు సామాజిక పాఠాలు చెప్పి సంతృప్తి పడతారు. అందుకే అతను ఉపాధ్యాయవృత్తిని ఆదిలాబాద్‌లో తీసుకున్నాడు. అన్ని ప్రాంతాల కన్నా ఆ రోజుల్లో వరంగల్ జిల్లా అక్షరాస్యతా శాతం ఎక్కువగా ఉండేది. 15 శాతం అక్షరాసత్య ఉండేది. ఈ వృత్తి అవసరమున్న వారి దగ్గర చేస్తే బావుండేది. అందుకే జయశంకర్ గిరిజనుల మధ్య ఉండి తన ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించాడు. ఆనాటి నుంచే ఆయనలో పోరాట పటిమ ఏర్పడింది.

తెలంగాణ ప్రాంతానికి సంపద ఉందని వనరులున్నాయని అదే విధంగా దారిద్ర్యం, ఆకలి కూడా తాండవిస్తున్నాయని చూపిన కళ్లు ఆయనవి. దీనికి పరిష్కారం విజ్ఞానరంగంలో ఏమైనా దొరుకుతుందా అని బెనారస్‌కు ఎం.ఎ ఎకనామిక్స్ చదివాడు. ఇతర దేశాల ఆర్థిక పరిస్థితులపై ఆయన అధ్యయనం చేశాడు. దానితో సహా తెలంగాణ ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకై రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమంలో కూడా దుమికాడు. అడవి ప్రాంతంలో తిరిగి ఉపాధ్యాయులను సమీకృతం చేయటం ఆ రోజుల్లో ఎంత కష్టమో ఆలోచించండి. కాబట్టే ఆనాటి ఉపాధ్యాయ ఉద్యమం సామాజిక ఉద్యమాలకు శిక్షణా కేంద్రమయ్యింది.

ఉద్యమాలు ఎలా నడపాలి? ఎలాంటి ప్రాతినిధ్యం వహించాలి? అన్న విషయాలను నేర్చుకునే అవకాశం ఈ శిక్షణతోనే నేర్చుకున్నాడు. అతను ఈ శిక్షణతోనే గవర్నమెంటు కాజలేజి టీచర్స్ అసోసియేషన్‌కు ప్రధాన కార్యదర్శి అయ్యారు. కాలేజీ అధ్యాపకులకు ఆనాడు ఆర్గనైజ్డ్ అసోసియేషన్ లేకుండేది. దానిని యాక్టివ్‌గా చేయటమే గాకుండా యూనియన్‌కు స్ఫూర్తిని రగిలించాడు. అధ్యాపకుల్లో గట్టి నమ్మకాన్ని కలిగించగలిగాడు. ఇంత అనుభవంతో అతను సీఫెల్‌క రిజిస్ట్రార్ అయిన తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ అయ్యాడు. ఉద్యమాలలోనే కాదు. విద్యారంగంలో కూడా కొత్తపోకడలు ఏర్పాటు చేశాడు. ఉపాధ్యాయ ఉద్యమం నుంచి వచ్చిన మొదటి వి.సి. జయశంకర్ చాలా మంది ఉద్యమ కార్యకర్తలను ఆందోళనకారులుగానే చూస్తారు. ఆందోళన ఏ నిబద్ధతతో చేస్తారో విద్యారంగంలో అంతే నిబద్ధంతో విద్యా కార్యక్రమాలు రూపొందించి వాటి అమలుకు ఆచరణ రూపమెత్తుతారు. కాకతీయ విశ్వవిద్యాలయాన్ని భారతీయ విద్యారంగంలో ఒక కీలకస్థానంలో నిలబెట్టారు. కెయుసీకి యజీసీలో ఒక ప్రత్యేకత అనిపించారు. సామాజిక స్పృహ ఉన్న వ్యక్తి విద్యారంగంలో బాధ్యతాయుతమైన స్థానం ఆక్రమిస్తే విద్యారంగానికి ఏ రకమైన పోకడలనిస్తాడో నిరూపించి అందరి విసీలతో ప్రశంసలను పొందాడు.

ఎన్ని పదవులను అధిష్టించి పాలనా రంగంలో పేరు తెచ్చుకున్నా తను పుట్టిన స్థలాన్ని తన ప్రాంత ప్రజల కష్టాలను మాత్రం మరిచిపోలేదు. సమస్యలపై పోరాటం చేయటం ఒక భాగమైతే దానికి కావలసిన డాక్యుమెంట్లు సంపాదించటం, వాదనాపటిమను రూపొందించటం, చర్చలు చేయటం, ప్రభుత్వం అధికారులతో భేష్ అనిపించుకోవటం జయశంకర్‌కే దక్కింది. అతను తయారు చేసిన పత్రాలే అటు 610 జీవోకు ఆధారాలయ్యాయి. 610 జీవోపై జరిగిన ఉల్లంఘనలన్నీ క్రోడికరించారు. దానిపై ఏర్పడిన గిర్‌గ్లానీ కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చి ప్రభుత్వంతో ఒప్పించాడు. అదే టీఎన్జీవోల ఉద్యమానికి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అతికీలక పనిముట్లుగా మారాయి. తెలంగాణ ఉద్యమానికి అవే పునాదులయ్యాయి. ఆ పునాదులే రాజకీయ నాయకులకు సామాజిక పుస్తకంగా మారింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఆయన అండగా నిలిచాడు. ఉపాధ్యాయుడు రాజకీయ వేత్త కాదు కానీ ఉద్యమానికి ఉత్ప్రేరకుడౌతాడు. తన రాజకీయ ప్రతిష్టకన్నా తను నమ్మిన ఆశయం కోసం చివరిదాకా పోరాడిన వ్యక్తి జయశంకర్ ఆ మొక్కే క్రమక్రమంగా పెరిగి తెలంగాణ ఉద్యమ వటవృక్షం అయ్యింది. ఈ వృక్షం తమకు నీడనిస్తుందని నాలుగుకోట్ల మంది ఆశతో ఎదురుచూస్తున్నారు. జయశంకర్ ఎవర్నీ కూడా విమర్శించినవాడు కాదు. అందర్నీ ఒప్పించే ప్రయత్నం చేశాడు. అందుకే అతను అజాతశత్రువు.

ఏ రాజకీయ పదవికోసం ఆయన పాకులాడలేదు. తను నమ్మిన ఆశయం సఫలీకృతమైతే చాలు అనుకున్నాడు. తను పుట్టి పెరిగిన ప్రాంతం నిర్లక్ష్యానికి గురికాకుంటే చాలు అనుకున్నాడు. దేశంలో తెలంగాణ ప్రజలకు సగౌరవస్థానం లభించాలని కలలుగన్నాడు. ప్రజలను పిట్టల్లాగా కాల్చి చంపుతున్నపుడు లాఠీలు శిరసెత్తి స్వైరవిహారం చేస్తున్నపుడు మానవతా దృష్టితో నిలుచున్నాడు. ఇది శాంతి భద్రతల సమస్యకాదని హెచ్చరించాడు. అతనికి రాజకీయరంగు పులిమే ప్రయత్నం  చేసినా కానీ ఆయన నిజాయితీయే దాన్ని తిప్పికొట్టింది. ఆయన రాజకీయ నాయకుడు కాకుండా ప్రజా నాయకుడుగా రూపొందాడు. అందుకే తెలంగాణ ఇన్ని కన్నీటి బిందువులు రాల్చింది. ఒక తరగతి గది టీచర్ ఒక ప్రాంత ఆశయాలు ఫలింప చేయటానికి గురువుగా మారాడు.

- నీ ఆశాయాన్ని నువ్వు కళ్లారా చూడలేకపోవచ్చును.
- నీ-మాదిరిగా పోరాడే పటుత్వాన్ని ఈ ప్రాంతమంతా వెదచల్లావు అవి ఈనాడు ఎంతో మంది త్యాగమూర్తులను తయారుచేశాయి.
- నీ-ఆశయ సాధనకు, ఈ సుదీర్ఘకాల అలుపెరుగని పోరు ప్రయత్నానికి జోహార్లు.
- త్యాగాలే ఒక వ్యక్తిని మహనీయునిగా మారుస్తాయి.
- జయశంకర్ త్యాగజీవి, మహనియుడు. అందుకే నీ తోటి అధ్యాపకుడుగా, తోటి  కార్యకర్తగా నా వీడ్కోలు.

**- చుక్కా రామయ్య**

ఆంధ్రజ్యోతి దినపత్రిక
24 జూన్, 2011

# తొలితరం దార్శనికుడు

**- ప్రొ॥ జి. లక్ష్మణ్**

లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ మరణించినప్పుడు ప్రజాకవి కాళోజీ నారాయణరావు వారిని ఉద్దేశించి ఇలా అన్నారు. 'పుట్టుకనీది చావు నీది బ్రతుకంతా దేశానిది'. ఈ మాటలు ప్రొఫెసర్ జయశంకర్ విషయంలో అక్షరాలా వర్తిస్తయి. పుటుక చావు రెండూ జయశంకర్‌వే అయినా, ఆయన బతుకంతా తెలంగాణకోసమే సాగింది. సహజంగా తత్త్వశాస్త్రం పునాదులు నిరాశా వాదంతో ప్రారంభమై, ఆశావాదంతో ముగుస్తాయి. తెలంగాణలో పారే నదులెన్ని ఉన్నా ఇక్కడి భూముల పంటల పొలాలకు దక్కడం లేదు. ఇక్కడ ఉపాధి అవకాశాలు ఎన్ని ఉన్నా నిరుద్యోగులకు అవి లభించడం లేదు. తెలంగాణలో వనరులు, నిధులు ఎన్ని వున్నా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకపోవడానికి ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ దోపిడీయే కారణం. ఇది విశ్వసించి తెలంగాణ అభివృద్ధి కేవలం స్వరాష్ట్రంలోనే సాధ్యమనీ, తెలంగాణకు రాష్ట్ర ప్రతిపత్తి ఎందుకు కావాలో వివరిస్తూ తెలంగాణ వాదానికి శాస్త్రీయ బద్ధమైన తాత్త్విక పునాదులు చేసిన వ్యక్తి కొత్తపల్లి జయశంకర్, జయశంకర్‌లో ఈ తాత్త్విక పునాది ఏర్పడటానికి కారణం, ఆయన ఆర్థిక శాస్త్రంలో ఆచార్యులు కావడం, వారికి ప్రొఫెసర్ మంజూర్ అలం, టి.పి.ఆర్ విఠల్ లాంటి వారితో ఉన్న పరిచయం. 'తెలంగాణ విశ్వ విద్యాలయం, కాళోజీ, టీచర్స్ ఫెడరేషన్' తరుపున ఆనందరావు తోట జయశంకర్‌లు వేసిందే తెలంగాణవాదంపై వచ్చిన మొదటి పుస్తకం. ఆ రోజుల్లో తెలంగాణ వాదులందరికి ప్రేరణా పుస్తకమే. వివిధ రంగాలలో తెలంగాణను కోస్తాంధ్ర ప్రాంతంతో పోల్చితే ఏ విధంగా వెనుకబడి ఉందో, దానికి కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించారు. ఈ పుస్తకం నేటితరం తెలంగాణ వాదులకూ ఆదర్శంగా నిలిచింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోకపోవడమే కాకుండా, అది దోపిడీకి గురి అవుతున్నది. రాష్ట్ర సాధన ద్వారానే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ ప్రజలకు మోక్షమార్గం చూపిన తెలంగాణ తొలితరం దార్శనికుడు కొత్తపల్లి జయశంకర్.

ఆ రోజుల్లో నేను, ప్రభాకర్, హరినాథ్, భిక్షం ఎప్పుడు వరంగల్ వెళ్ళినా కాళోజీని, ఆ పిదప జయశంకర్‌గారిని కలిసి వస్తూ వుండేవాళ్ళం. కాళోజీ మరణించిన తర్వాత మేము వరంగల్ వెళ్లడం బాగా తగ్గింది. అప్పుడప్పుడు జయశంకర్‌ను హైదరాబాద్‌లోనే కలుస్తూ వుండేవాళ్లం. మా అందరినీ జయశంకర్‌కు పరిచయం చేసిన వ్యక్తి ప్రొఫెసర్ ఆనందరావు. అప్పుడు జయశంకర్ సీఫెల్‌లో రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ వున్నారు. ఆ విధంగా జయశంకర్‌తో ఏర్పడిన మా పరిచయం క్రమంగా బలపడి వారిదే ప్రభావితులమయ్యాము. 1987లో 'తెలంగాణ ఇన్‌ఫర్మేషన్ ట్రస్టును' స్థాపించాం. జయశంకర్, కాళోజీలు మా ట్రస్టు గౌరవ సభ్యులు, 1969 తర్వాత తెలంగాణవాదం మరుగున పడిపోతున్న తరుణంలో మళ్ళీ దానికి ప్రాణం పోయాలంటే ఒక పత్రిక అవసరముందని భావించాం. 'మా తెలంగాణ' అనే మాసపత్రికను స్థాపించాం. 'మా తెలంగాణ' మాస పత్రికను స్వర్గీయ కొండా మాధవరెడ్డి, జయశంకర్, కాళోజీలు తమ చేతుల మీదుగా 1987లో ఆవిష్కరించారు.

1983లో తెలుగు ప్రజల ఆత్మగౌరవం పేరిట తెలుగుదేశం పార్టీ ఆవిష్కరించింది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి రోజుల నుంచే తెలంగాణ వ్యతిరేక విధానాలకు పాల్పడింది. అప్పటి వరకు తెలంగాణ ప్రాంత

వనరులు నిధులు దారి మళ్లడం గురించి మాట్లాడే మాకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో కొత్త సమస్యలు తెరపైకి వచ్చినయి.

తెలంగాణ ప్రాంతంలోని శాసనసభ, లోక్‌సభ స్థానాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా ఆంధ్రప్రాంతం నుంచి వలస వచ్చిన అనేక మందిని ఎన్నికల్లో అభ్యర్థులుగా టీడీపీ నిలబెట్టింది. ఇది మమ్ములను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఒక రోజు కాళోజీ, జయశకర్ ఆనందరావు తోట సమక్షంలో 1983లో జరిగిన హిమాయత్‌నగర్ శాసనసభ ఎన్నికల ఉదంతం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. 1983 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అనామకుడు స్థానికుడైన నారాయణ గౌడ్ విజయం సాధించారు. విజయం సాధించానన్న అమితానందంలో అతడు తట్టుకోలేక అకస్మాత్తుగా గుండె పోటుతో అదే రోజు చనిపోయిండు. కొంత కాలానికి అక్కడ ఉప ఎన్నిక జరిగింది. తెలుగుదేశం పార్టీ స్థానికేతరుడైన ఉపేంద్రను అక్కడ బరిలో దించింది. ఉపేంద్ర అక్కడ పోటీ చేయడాన్ని స్థానిక హిమాయత్ నగర్ ఓటర్లు ఎవ్వరూ కూడా జీర్ణించుకోలేకపోయారు. ఫలితం ఆయన పరాజయం పాలయ్యారు. ఈ ఉప ఎన్నిక మాలాంటి తెలంగాణవాదుల్లో ఆశను రేకెత్తించింది. అంతే కాకుండా స్థానికేతరులను తెలంగాణ ప్రాంతం నుంచి ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవడానికి తెలంగాణ ప్రజలు సుముఖంగా లేరని రూఢీ చేసింది. ఇదే అంశం కల్వకుర్తి నియోజకవర్గంలో 1989లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తేలింది. 1989 శాసనసభ ఎన్నికల్లో ఎన్టీ రామారావు ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ మూడు ప్రాంతాల నుంచి శాసనసభకు జరిగిన ఎన్నికల బరిలోకి దిగారు. ఆంధ్ర, రాయలసీమ నుంచి ఎన్నికయ్యారు. కానీ తెలంగాణ ప్రాంతంలోని కల్వకుర్తి నియోజకవర్గంలో చిత్తరంజన్‌దాస్ అనే స్థానిక కాంగ్రెస్ అభ్యర్థిచేతిలో ఓడిపోయారు. తెలంగాణ ప్రజల మనోభావాలు తెలంగాణవాదానికి అనుకూలంగా వున్నాయనే విషయాన్ని ఈ ఎన్నికలు రుజువు చేసినయి. 1970లో తెలంగాణ ఉద్యమం ముగిసిన తర్వాత తెలంగాణవాదం కనుమరుగైందని భావించిన వాళ్లకు హిమాయత్ నగర్, కల్వకుర్తి ఎన్నికలు కనువిప్పు కలిగించాయి.

తెలంగాణ వాదానికి తెలంగాణ ప్రజలను మించిన సిద్ధాంత కర్తలెవ్వరూ లేరని రుజువు చేసినయి. ఈ ఎన్నికలు తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అద్దం పట్టాయి. కానీ టీడీపీ మాత్రం ఈ ఎన్నికల నుంచి ఏ మాత్రం గుణపాఠాలు నేర్చుకోలేదు. 610 జీవోను విడుదల చేసి దాన్ని అమలు చేయలేదు. ఆరుసూత్రాల పథకంలో భాగంగా వచ్చిన ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డులను రద్దు చేసింది. తెలంగాణ అనే పదాన్నే అసెంబ్లీలో ఉచ్చరించేందుకు వీలులేదని శాసించింది. ఈ ఉదంతాలన్నీ తెలంగాణవాదానికి బలం చేకూర్చాయి. జయశంకర్‌కు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో సంబంధాలు వుండేవి. కానీ తెలుగుదేశం పార్టీ వాళ్లతో మాత్రం ఉండేవి కావు. వారికి తెలుగుదేశం పార్టీ అన్నా రాయలసీమ కాంగ్రెస్ నాయకులన్నా గిట్టేది కాదు. 1996లో నాటి ప్రధాని దేవేగౌడ పంద్రాగస్టు నాడు ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగం తెలంగాణ వాదులందరిని తట్టిలేపింది. నాటి నుంచి తెలంగాణ వాదానికి ప్రజా సంఘాల మద్దతు లభించడంతో అది బలపడింది. ఈ మద్దతు కూడగట్టటంలో జయశంకర్ పాత్ర చిరస్మరణీయం. 2001లో తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితితో తన చివరి పదేళ్ల జీవనయానాన్ని కొనసాగించారు. తుదిశ్వాస విడిచే వరకు దానితోటే కదం కలిపిండు.

జయశంకర్ బి.ఎ., బి.ఇడి, వరకు తెలంగాణలోనే విద్యనభ్యసించి, బనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో పీజీ చేశారు. అలీఘడ్ ముస్లిం యూనివర్శిటీలో ఆర్థిక శాస్త్రంలో పీజీ చేశారు. ప్రొ॥ నాగరాజు వద్ద పరిశోధన చేపట్టి 'ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి' అనే పరిశోధనా పత్రం సమర్పించి 1980లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన జయశంకర్ క్రమంగా ఎదిగి రిజిస్ట్రార్‌గా, చివరకు కాకతీయ విశ్వ విద్యాలయం ఉపకులపతిగా నియమితులయ్యారు. కాకతీయ విశ్వ విద్యాలయానికి ఉపకులపతిగా నియమించబడినప్పుడు మా మిత్రులందరూ కాళోజీని వెంటబెట్టుకుని జయశంకర్‌ను కలిశాం. వారికి కృతజ్ఞతలు తెలిపి, ఘనంగా సన్మానించాలని మేము భావిస్తున్నామని అన్నప్పుడు దానికి వారు నిరాకరించిరి. అప్పుడు నాకు వారు అన్నమాటలు ఇంకా జ్ఞాపకం వున్నాయి. 'నాకు సన్మానాలు అంటే గిట్టవు. ఈ విశ్వ విద్యాలయానికి నేను వీసీగా ఉన్న కాలంలో ఏమైనా తప్పులు

చేస్తే కాళోజీ అధ్యక్షతనే ఒక సమావేశం ఏర్పాటు చేసి, దానికి నన్ను ఆహ్వానించి నన్ను కడగి పారేయండి' అని అన్నరు. జయశంకర్ ఒక ఉత్తమ ఉపాధ్యాయుడు. క్లాస్‌రూములో పాఠం చెప్పినట్లుగానే ఉండేది. ఆయన ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు. రిజిస్ట్రారుగా, ఉపకులపతిగా పని చేస్తున్న కాలంలో ఎన్నో చేదు అనుభవాలు ఎదురైనా చలించలేదు. తెలంగాణ సగటు మనిషి బాధలన్నీ తన బాధలుగానే భావించి స్పందించారు. అంతే తప్ప తన బాధలను తెలంగాణ బాధలుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించలేదు. అది జయశంకర్‌కు తెలంగాణ అంశం పట్ల ఉన్న నిబద్ధత, పత్రికలు తెలంగాణ వాదులు జయశంకర్ గారిని, తెలంగాణ సిద్ధాంత కర్త అని సంబోధించినప్పుడల్లా వారు నొచ్చుకునేవారు. 'తెలంగాణ వాదానికి అసలు సిసలైన సిద్ధాంతకర్తలు తెలంగాణ ప్రజలే తప్ప మరెవ్వరు కారని అనేవారు. ఫణికర మల్లయ్యను మించిన సిద్ధాంతకర్త తెలంగాణలోనే ఎవ్వరు లేరని జయశంకర్ అనేవారు. కుటుంబపరంగా, సమాజ పరంగా కూడా అతను అనేక ఆటుపోట్లకు గురయిండు. స్థితప్రజ్ఞుడుగా మూర్తీభవించిన వ్యక్తిత్వం జయశంకర్‌ది. ఆయన అన్నింటికి అతీతం. తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి వున్నారు. వాటి సాకారానికి జీవితాంతం కృషి చేసిన వ్యక్తి జయశంకర్. అందుకే ఆయన జీవితం తెలంగాణ ప్రజలందరికీ ఆదర్శం. ఆయన మనకు అందించిన స్ఫూర్తితో రాష్ట్రాన్ని సాధిద్దాం.

నమస్తే తెలంగాణ దినపత్రిక
1 జూలై, 2011

**– ప్రొ॥ జి. లక్ష్మణ్**
ఓయూ టీచర్స్ ఫోరం ఫర్ తెలంగాణ కన్వీనర్

---

# అశ్రునివాళి

ఉద్యమానికి ఊపిరై, సమస్తాన్ని తెలంగాణ కోసం వెచ్చించిన జ్ఞాని జయశంకర్. ఆయన మృతి తీరని లోటు. ఇప్పుడు తెలంగాణ పెద్దదిక్కును కోల్పోయింది. ఆయన ఆశయాలను, ఆకాంక్షను కొనసాగించేందుకు సదా కృషి చేద్దాం.

***–సంగిశెట్టి శ్రీనివాస్,*** *సింగిడి తెలంగాణ రచయితల సంఘం కన్వీనర్*

జయశంకర్ మృతి కలచివేసింది. ఆయన మేధాశక్తి అపారమైనది. కాకతీయ వర్సిటీలోనే గాక ఎక్కడ పని చేసినా తోటి వారిని ఎంతగానో ఆదరించేవారు. ఆయనతో కలసి పని చేయడం అదృష్టం. ఆ మహనీయుడి ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

***–ప్రొ.జి.వెంకటరాజం,*** *తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షుడు*

ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను చాటిచెప్పిన గొంతుక.. తన ఆకాంక్షను కనులారా వీక్షించకుండానే కన్నుమూయడం దురదృష్టకరం. జయశంకర్ ఆశయాన్ని నెరవేర్చేందుకు తెలంగాణవాదులంతా కట్టుబడి ఉండాలి.

***–వెంకట్ యాదవ్,*** *తెలంగాణ వాయర్స్ కమిటీ ఫర్ సోషల్ జస్టీస్ కన్వీనర్*

ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా తెలంగాణ కోసం పాటుపడిన నిస్వార్థమూర్తి జయశంకర్. ఆయన ఆత్మకు శాంతి జరగాలంటే తెలంగాణ ఏర్పాటు తప్పనిసరి. కోదండరామ్, కేసీఆర్‌లు మరింత బాధ్యతతో జయశంకర్ లోటును భర్తీ చేయాలి.

***–రాజేందర్‌రెడ్డి,*** *న్యాయవాదుల జేఏసీ కన్వీనర్*

# తీరనిలోటే కానీ, తీర్చవలసిన లోటు కూడా

**- కె. శ్రీనివాస్**

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఎవరు, ఆయన ఏ వాదాన్ని ప్రచారం చేశారు, ఏ రాజకీయ లక్ష్యం కోసం పనిచేశారు–అన్న ప్రశ్నలను కాసేపు పక్కన పెడదాం. ఆయన ఉగ్రోతలూగించే ఉపన్యాసాలు చేసినవారు కాదు, కుండబద్దలు కొట్టే మాటలతో మైకులు విరగొట్టినవారు కాదు, జనవేశాల సోపానాల మీద ప్రతిష్ఠను ప్రబల్యాన్ని పెంచుకున్నవారు కాదు. ఆయన కేవలం ఒక అధ్యాపకుడు. ఒకపరిశోధకుడు. ఒక రచయిత. ప్రచార కార్యకర్త సలహాదారు. నిర్వహించిన వైస్‌చాన్సలర్ వంటి ఉన్న తపదవులతో సహా ఆయన వృత్తిప్రవృత్తులన్నీ విద్యావిషయికమైనవే. బౌద్ధికమైనవే. అటువంటి ఒక మేధావి, పాఠాలు చెప్పే వంతులు, సాధుజీవి, స్వాదుసంభాషి అనారోగ్యంతో కన్నుమూస్తే తెలంగాణ ప్రజానీకం గుండె ఎందుకు పగిలింది? ఎందుకు దిక్కులదిరేట్లు రోదించింది? ఆయన పార్థివ కాయానికి జనసాంస్కృతికలాంఛనాలతో ఎందుకంత ఘనంగా వీడ్కోలు పలికింది? ఒక ఉపాధ్యాయుడికి అంతటి నివాళి లభించిన సందర్భం ఇటీవలికాలంలో ఎప్పుడన్నా చూశామా?

డెబ్బయ్యారేళ్లు బతికిన మనిషి అనారోగ్యమరణం దిగ్భ్రాంతి కలిగించేదేమీ కాకపోవచ్చు. కానీ, జయశంకర్ విషయంలో అది అకాల మరణమూ ఆకస్మిక మరణమూ అయింది. అరవయ్యేళ్లుగా తెలంగాణ నిప్పును కాపాడుకుంటూ వస్తున్న జయశంకర్ ప్రస్తుత ఉద్యమం పతాకఘట్టంలో అస్తమించడాన్ని జనం జీర్ణించుకోలేకపోతున్నారు. ఎదిగిన సంతానం ప్రయోజకులైతేనో చూడాలనుకుని ప్రాణం ఉగ్గపట్టుకున్న వృద్ధుడు, కోరిక తీరకుండానే కన్నుమూస్తే దుఃఖం అంతా ఆ తీరనికోరిక చుట్టూనే సుడిరిగినట్టు, జయశంకర్ నిష్క్రమణ వేదన తెలంగాణ శేష ఆకాంక్షనే ప్రతిధ్వనించింది. సాపేక్షమైన స్తబ్దతలో పడి, తరువాతి అడుగు ఏమిటో తెలియని అయోమయంలో ఉన్న తెలంగాణ ఉద్యమంలో అంతర్లీనంగా వినిపిస్తున్న అసహనపు ఆవేదన ఏదో జయశంకర్ సంతాప వాతావరణంగా రూపుదిద్దుకున్నది. తెలంగాణ ఉద్యమానికి ఇక్కడి మేధావులకు విద్యావంతులకు ఉన్న సజీవసంబంధాన్ని జయశంకర్ మరణసంర్భం మరోసారి చాటి చెప్పింది. ఆకాంక్షకేవలం భావోద్వేగాలకు సంబంధించినదో, సెంటిమెంట్ మాత్రమే అయితేనో అక్షరాలతో ఆలోచనలతో సామాన్య ప్రజలకు సైతం ఇంతటి గాఢమైన అనుబంధం సాధ్యమయ్యేదికాదు. జయశంకర్ క్రియాశీల ప్రమేయంతో తిరిగి తిరిగి తెరపైకి వచ్చిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం, అంతిమ ఫలితంఇంకా అందనప్పటికీ తన ప్రస్థానంలో తెలంగాణ సమాజానికి ఎంతో పరిపక్వతను కూడా అందించెంది. త్యాగశీలత, నిబద్ధత ఈ రెంటినే అత్యున్నతమైనవిగా గుర్తిస్తామని చెప్పడం ద్వారా రాజకీయనేతలకు జయశంకర్ అంతిమయాత్ర ఒక హెచ్చరికను అందించింది.

మహావ్యక్తి మరణించిన వెంటనే తీరని లోటు అని పూడ్చలేని నష్టమనీ యథాలాపంగా అంటున్నాము. ప్రాసంగికత కోల్పోయిన వ్యక్తులు, కాలధర్మం చెందే వ్యక్తుల విషయంలో కూడా మర్యాదపూర్వకంగా అటువంటి నివాళిమాటలే మాట్లాడతాము. కాని, బాలగోపాల్ జయశంకర్ వంటి వారి మరణం కలిగించే లోటు నిజమైన లోటు. వారు వర్త మానంలోనూ క్రియాశీలంగా సామాజికరంగంలో ఒక విశిష్టమైన కార్యసాధకులుగా ఉండడం ఒక కారణం కాగా, వారి వ్యక్తిత్వాలు చారిత్రకంగా నిర్వహించిన పాత్ర రీత్యాకూడా వారి ఉనికి విలువైనది కావడం

మరో కారణం. దశాబ్ధాలుగా సాగుతున్న తెలంగాణ ఉద్యమంలో తరం నుంచి తరానికి ప్రవహించిన జీవచైతన్యం జయశంకర్. ఆయన మాట వెనుక, వాదన వెనుక చరిత్ర ఇచ్చిన సాధికారత, అనుభవం ఇచ్చిన గాంభీర్యం ఉంటూ వచ్చాయి. చారిత్రక వ్యక్తిగా ఆయన ప్రాసంగికత ఒకటయితే, వర్తమాన ఉద్యమంలో ఆయన పాత్రకు మరో ప్రాసంగికత ఉన్నది. ఆయన వ్యక్తిగత్వం, అనుభవం వర్తమాన ఉద్యమంలో ఆయననొక మేరునగ సమానుడిని చేశాయి. తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకుంటున్న రాజకీయపక్షాలు, సంఘాలు, బృందాలు అనేకం ఉండవచ్చును. ఎవరి పద్ధతిలో వారు ఆచరణను కొనసాగిస్తూ ఉండవచ్చు. కానీ, జయశంకర్ ఆయా సంస్థల సంఘాల కంటె ఉన్నతస్థానంలో స్థాయిలో నిలబడిన వ్యక్తి చీలికలు పీలికలుగా ఉన్న సమాజంలో అందరినీ సమ్మతమైన అందరూ గౌరవించే పెద్దమనిషి ఆయన. అటువంటి పెద్దమనిషి భౌతికంగా అదృశ్యం కావడం తెలంగాణ ఉద్యమానికి నిజంగానే పెద్దలోటు. జాగ్రత్త పడకపోతే తీరని లోటు కూడా.

రాజకీయ పక్షాలు కానీ, ఉద్యమాలు కానీ వాస్తవంలో సమాజంలోని కొన్ని ప్రయోజనాలకు, ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఆ పక్షాల నాయకత్వం తను ప్రాతినిధ్యం వహించే వర్గాన్ని తనవెంట ఐక్యంగా నిలుపుకోవడంతో పాటు, ఆ వర్గం ప్రయోజనాలను నెరవేరుస్తూ, తరువాతి పురోభివృద్ధి దశలోకి తీసుకువెళ్లాలి. ఆ ప్రయోజనాలకు భూస్వామ్య స్వభావమో సాంప్రధాయ సమాజ స్వభావమో ఉన్నప్పటికీ, రాజకీయ పక్షాల అంతర్గత వ్యవహారసరళి ఆ వర్గ సమష్టి ప్రయోజనార్ధం ప్రజాస్వామికంగానే ఉంటుంది అభివృద్ధి చెందిన ప్రాంతాలనుంచి ఏర్పడిన పార్టీలపై ఆ పార్టీల ప్రాతినిధ్య వర్గాలకు గట్టి పట్టు ఉంటుంది. పార్టీల విధానాలను, పనితీరును ఆవర్గాలు రకరకాల శ్రేణుల ద్వారా నియంత్రించే ప్రయత్నం చేస్తాయి. ఆ వర్గాలకు సమాజంలో ఉన్న పలుకుబడి, విద్యాసాంస్కృతిక సామాచార రంగాలలో ఉండే పట్టు, వివిధ అధికారిక హోదాలలో ఉన్నందున సమకూరే సామాజిక పెట్టుబడి–అన్నీ కలిసి తమ ప్రతినిధి పార్టీతో సాధికారంగా వ్యవహరించే శక్తిని ఆ వర్గాలకు ఇస్తాయి. వెనుకబడిన ప్రాంతాలలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. తమ ప్రాంత ప్రయోజనాలకు పరివితమై పార్టీని నిర్మించుకునే శక్తే ప్రాంతీయవర్గాలకు అరుదుగా ఉంటుంది. ఒకవేళ అది సాధ్యమైనప్పటికీ, వెనుకబాటు తనం ఆ పార్టీ నిర్మాణంలో కూడా ప్రతిఫలిస్తుంది. పార్టీని అదుపు చేసెసామాజిక పెట్టుబడి ప్రాంతీయవర్గానికి ఉండదు. చారిత్రకంగా కానీ. ధనసంపన్నత వల్ల కానీ, విద్యాసాంస్కృతికాది రంగాలలో ప్రాబల్యం వల్ల కానీ సమకూరే స్వతంత్ర శక్తి ఈ వర్గానికి ఉండడం కష్టం. అందువల్ల వెనుకబడిన ప్రాంతాల ప్రయోజనాల కోసం ఏర్పడే పార్టీలో అంతరంత నిర్మాణం కూడా అప్రజాస్వామికంగానో, గుంపుపెద్దలాగానో వ్యవహరిస్తాడు. వివిధ స్థాయిలలో పార్టీ నిర్మాణం ఉండదు, ఉన్నా అది పైవారి ఆజ్ఞలకోసం ఎదురుచూస్తుంటుంది. పార్టీ అధినాయకుడిని ప్రశ్నించే వారు కానీ, సరిదిద్దేవారు కానీ ఎవరూ ఉండరు. అటువంటి సందర్భంలో జయశంకర్ వంటి వారి అవసరం ఏమిటో తెలుస్తుంది.

జయశంకర్ ఆ శక్తిని సంపూర్ణంగా వినియోగించుకున్నారని చెప్పలేము. గడ్డిపోచ ఆసరా దొరికినాచాలు గోదావరి ఈదవలసిన అగత్యం ఉన్నదని ఆయన నమ్మారు. గట్టి నాయకత్వం లభిస్తే, చాలు ఎన్ని లోపాలున్నా క్షమించవలసిందేనని కొన్ని సందర్భాలలో రాజీపడ్డారు. కెసిఆర్ జయశంకర్‌కు బహిరంగంగా పాదాభివందపం, చేయడం కేవలం ఆయన మీద గౌరవంతోనే కాదు. ఆ చర్య కెసిఆర్‌కు అదనపు నైతికస్థాయిని, సాధికారతను సంక్రమింపజేస్తుంది. జయశంకర్‌కు ఆ విషయం తెలుసు. ఉద్యమ ప్రయోజనాలకు, రాజకీయపార్టీల వ్యూహాలకు వైరుధ్యం వచ్చే సందర్భాలుంటాయనీ ఆయనకు తెలుసు. అటువంటి సన్నివేశాలలో కల్పించుకుని రాజకీయపక్షం నడకను సరిదిద్దగలిగే శక్తి ఉన్నప్పటికీ జయశంకర్ దానిని పెద్దగా ఉపయోగించుకోలేదు. కాకపోతే, తాను ఒక పార్టీ మీద అధిక విశ్వాసం ఉన్నట్లు కనిపించినప్పటికీ, తెలంగాణ ఉద్యమంలో అనేక సంస్థలు పనిచేయడం మంచిదని ఆయన విశ్వసించారు. దేవేందర్‌గౌడ్ పార్టీ పెట్టినప్పుడు ఆయన ఆశీర్వదించారు. గద్దర్ వంటి వారితో అయితే, జయశంకర్‌కు సుదీర్ఘమైన ప్రజాస్వామిక అనుబంధం ఉన్నది. జయశంకర్ భౌతికకాయంపై టిఆర్ఎస్

జెండాను కాకుండా, తెల్లటి తెలంగాణ జండాను కప్పారు. పార్టీలకు కాకుండా, ఉద్యమానికి ఆయన చూపిన నిబద్ధతకు అది నివాళి.

ప్రస్తుత తెలంగాణ ఉద్యమానికి పాదులు తీయడంలో విద్యావంతుల వర్గంపై జమశంకర్ ఎక్కువగా ఆధారపడ్డారు. తొలినాటి సంఘాలు, సంస్థలు అన్నీ మేధోపరమైన కృషినే అధికంగా నిర్వహించాయి. తెలంగాణ ఉద్యమంలో విద్యావంతులు ఒక బలమైన రాజకీయ శ్రేణిగా రూపొందడం వెనుక ఈ పునాది ఉన్నది. జయశంకర్ వారసత్వాన్ని కొనసాగించే బాధ్యత కూడా విద్యావంతుల మీదనే ఉన్నది. రాజకీయపార్టీల వ్యూహప్రతివ్యూహాలకు అతితంగా, సమాంతరంగా ఒక ప్రతిష్ఠాత్మకమైన నేతృత్వాన్ని ఉద్యమానికి అందించగల శక్తి మేధావి వర్గానికి ఉన్నది. కోదండరామ్, మల్లేపల్లి లక్ష్మయ్య వంటివారికి ప్రజాహితరంగంలో సుదీర్ఘ అనుభవమూ, సునిశిత మేధావులుగా గుర్తింపూ ఉన్నాయి. ఉద్యమ బాధ్యతానిర్వహణలో వారి తటస్థత గురించి అనేక ఆరోపణలు, సందేహాలు వినిపిస్తున్నాయి. రాజకీయశక్తులతో వ్యవహరించేటప్పుడు ఏర్పడే ఒత్తిళ్లు, సమన్వయసాధనలో కలిగే ఇబ్బందులు సహజమే అయినప్పటికీ, వాటికి అతీతంగా ఉద్యమశ్రేయస్సును వస్తుగతంగా చూడగలిగే శక్తిని జయశంకర్ స్ఫూర్తితో అలవరచుకోవాలి. అపోహలకు ఆస్కారం ఇవ్వకుండా, జయశంకర్ దార్శని కత, స్థితప్రజ్ఞత అలవరచుకుంటే , ఆయన లేని లోటు పూడ్చడం ప్రస్తుత మేధావివర్గానికి అసాధ్యమేమీ కాదు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక
26 జూన్, 2011

***– కె. శ్రీనివాస్***

---

# అశ్రునివాళి

తెలంగాణ కల సాకారమయ్యే వేళ జయశంకర్ లాంటి వ్యక్తి లేకపోవడం తెలంగాణ మొత్తనికి బాధాకరం. తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని ఆర్పించిన గొప్ప వ్యక్తి జయశంకర్. ఆయన ఇప్పుడు లేకపోవడం ప్రజలందరినీ కలచివేస్తోంది.

***– రమేష్,*** *తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు*

అలుపెరగని తెలంగాణ వాదానికి వెన్నుముకగా నిలిచిన వ్యక్తి ఇప్పుడు అనంతలో కాలకు వెళ్లిపోవడం గుండెలను ద్రవింపజేస్తోంది.

***–రామ్‌లక్ష్మణ్, మధుసూదన్,*** *అర్జున, ఎస్టీ, గురుకుల టీచర్స్ సొసైటీ*

జయశంకర్‌ది పదవికాంక్షలేని నిస్వార్థ, నిష్కళంక జీవితం. ఆయన ఆశయాల కోసం పనిచేశారు.

***– రవీందర్‌రెడ్డి,*** *ఆధ్రప్రదేశ్ ఈబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు*

వికాలాంగులకు ఉద్యమానికి కూడా ఆయన వెన్నుదన్నుగా నిలిచారు. వికలాంగులు రోడ్లపైకి వచ్చి పోరాడుతుంటే చలించి మద్దతు తెలిపిన మనిషి జయశంకర్.

***– అందె రాంబాబు,*** *వికలాంగులు హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు*

కల్తీలేని, పిజాయితీ కలిగిన ఆదర్శమూర్తి జయశంకర్. బౌగోళిక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మాత్రమే తన లక్ష్యంగా భావించలేదు. ప్రజలకు ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక చైతన్యాన్ని అందించేదిగా తెలంగాణ ఉండాలని కోరుకున్నారు.

***– పోటు సూర్యం,*** *సీపీఐ ఎంఎల్ కేంద్రకమిటీ సభ్యుడు*

# జయశంకర్ మార్గం ... 'తెలంగాణ'కు ఆదర్శం

**- ఆదిత్య**

ఒక వ్యక్తి ఔన్నత్యం తెలియాలంటే, ఆ వ్యక్తి మరణాంతరం అంతిమ యాత్రలో ఎంతమంది పాల్గొన్నారన్నది ఒక కొలమానం. ప్రతి రోజు ఎంతోమంది. పుడుతూ ఉంటారు. గిడుతూ ఉంటారు. జనం పెట్టుకునేది, ఆరాధించేది, అతి కొద్దిమందిని మాత్రమే! ఎంతకాలం జీవించామన్నది కాదు. ఎలా బ్రతికాం? ఏం చేశాం? అన్నది ప్రధానం చనొపయిన వారిని కీర్తిశేషులు అంటాం గానీ నిజంగా కీర్తిని వదలి వెళ్ళిపోయేవారు నూటికి కోటికి ఒక్కరు మాత్రమే ఉంటారు. మంగళవారం కన్నుమూసిన తెలంగాణ సిద్దాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఈ కోవలోకే వస్తారు. తెలంగాణ ప్రజలు ఆయనను జయశంకర్ సార్ అని అపాయ్యంగా ఊరికే పిలుచుకోవడం లేదు. ఎదురుగా ఉన్నప్పుడు ఎదుటి వ్యక్తిని గౌరవంతో సంబోధించడం వేరు. పరోక్షంలో కూడా గౌరవించడం వేరు. జయశంకర్ విషయంలో మాత్రం పరోక్షంలో కూడా సార్ అని తెలంగాణ ప్రజలు పిలుచుకుంటారు. ఇలాంటి గౌరవం ఆషామాషీగా పొందలేరు. కేవలం తెలంగాణ వాదాన్ని నెత్తికెత్తుకున్నందుకే జయశంకర్ సార్‌కు ప్రజల గుండెల్లో చోటు దొరికిందనుకుంటే పొరపాటే! ఆయన జీవితమే ఒక ఆదర్శం. చాలామంది చాలా చెబుతూ ఉంటారు. ఆచరణలో పాటించేది కొందరే! తాను నమ్మిన సిద్దాంతాలను, విలువలను త్రికరణ శుద్దిగా జీవితాంతం పాటించిన మహనీయుడు జయశంకర్. ఆజన్మ బ్రహ్మచారిగా ఉంటూ సాధారణ జీవితం గడిపిన వ్యక్తి ఆయన. ఆయన తుదిశ్వాస విడిచిన నివాస గృహాన్ని చూస్తే చాలు, జయశంకర్ ఎంతటి నిరాడంబర జీవితాన్ని గడిపారో తెలుస్తుంది. జయశంకర్ గురించి చాలామంది, చాలా రాశారు.

అంతకంటే గొప్పగా రాయడానికి కూడా ఏమీ లేదు. కానీ ఆదర్శ జీవితం గడిపిన ఆయనకు అక్షర నివాళులు అర్పించడం నా దర్శం, నిజానికి, నాకూ జయశంకర్ పెద్దగా పరిచయం లేదు.'యథాడ్రా తథారాజా' కార్యక్రమం నిర్వహణ కోసం వరంగల్ వెళ్ళినప్పుడు, మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి విందుకు వెళ్ళాను. నాతో పాటు జయశంకర్ కూడా మంత్రి ఆహ్వానించారు. ఆ సందర్భంగా ఆయన అభిప్రాయాలు, నమ్మిన విలువల పట్ల నిబద్ధత, తెలంగాణ విషయంలో చిత్తశుద్ధి నన్ను ఆయనను అభిమానించేలా చేశాయి. తెలంగాణ రాష్ట్రం సమితి అధినేత కె. చంద్రశేఖరరావు చర్యలు, ప్రకటనల వల్ల తెలంగాణ ఏర్పాటులో అవరోధాలు ఏర్పడటం లేదా? కె.సి.ఆర్ ప్రవర్తనను ఎలా భరిస్తున్నారు.? అని ఆయనను ఆ సందర్భంగా అడిగాను, దీనికి జయశంకర్ చెప్పిన సమాధానం ఒక్కటే! "ప్రతి వ్యక్తిలో కొన్ని లోపాలు ఉంటాయి. నేను తెలంగాణ రాష్ట్ర సమితిని రాజకీయ పార్టీగా చూడటం లేదు. ఆ పార్టీ సభ్యుడిని కూడా కాదు. తెలంగాణ కోసం పోరాడుతున్న కారణంగానే మాత్రమే కాదు, తెలంగాణ కోసం ఎవరు పోరాడినా నేను సంఘీభావం తెలుపుతాను. వ్యక్తులు- వారి ప్రవర్తనతో నాకు సంబంధం లేదు. వారు తెలంగాణ కోసం పోరాడితే చాలు, నా మద్దతు ఉంటుంది" అని జయశంకర్ ఎంత నిబద్ధత ఉండో నాకు స్పష్టం అయింది.

తెలంగాణ కోసం ఎంతమంది ఉద్యమించారు. మరెందరో అసువులు బాశారు. మిగతా ఉద్యమకారులకు జయశంకర్‌కు చాలా తేడా ఉంది. ప్రతేక తెలంగాణ రాష్ట్రాన్ని స్వప్నించడమే కాదు, దాని కోసం జీవితమంతా

ఆయన శ్వాసించారు. ఇతర ఉద్యమకారులలో పలువురికి సొంత వృత్తులు, ప్రవృత్తులు ఉన్నాయి. మరికొందరు అవసరార్థంగానీ రాజకీయ ప్రయోజనాల కోసంగానీ, అప్పుడే పుట్టిన అభిమానంతోగానీ తెలంగాణవాదాన్ని తలకెత్తుకున్నారు. జయశంకర్ విషయంలో అలా కాదు. ఆయన పుట్టి బుద్దెరిగినప్పటి నుంచి తుదిశ్వాస విడిచేవరకు తెలంగాణ కోసం పరితపించారు. ఈ క్రమంలో, తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఉత్థాన పతనాలు ఎదురైనా ఆయన చలించలేదు. మనోనిబ్బరాన్ని కోల్పోలేదు. తెలంగాణ ప్రయోజనాలు పొందినా, ఆయన మాత్రం అలాంటి ప్రలోభాలకు ఆకర్షితులు కాకపోవడమే కాదు– రాజకీయ పార్టీలకే 'మార్గదర్శి'గా నిలిచారు. అహంభావంతో వ్యవహరించే కె.సిఆర్ వంటి వ్యక్తి కూడా బహిరంగ సభలలో జయశంకర్ కాళ్ళకు మొక్కేవారంటే, ఆయన గొప్పతనం స్పష్టం అవుతుంది. తెలంగాణ సాధన ప్రక్రియలో జయశంకర్ సీమాంధ్ర ప్రజలను ఎన్నడూ దూషించలేదు. సమైక్యాంధ్ర కోరుతున్న వారి పట్ల కూడా ద్వేషపూరితంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని మాత్రమే వివరించే వారు. ఈ కారణంగానే సమైక్యవాదాన్ని వినిపిస్తున్న వారు కూడా జయశంకర్ మరణవార్త తెలిసి బాధపడ్డారు. అభిప్రాయాలు, సిద్ధాంతాలతో ఎవరు ఎవరితోనైనా విభేధించవచ్చు. కానీ నమ్మిన సిద్ధాంతం పట్ల నిబద్ధతతో వ్యవహరించే జయశంకర్ వంటి వాళ్లు ఎవరికైనా, ఏ ప్రాంతం వారికైనా ప్రాతః స్మరణీయలే!!

కావాలని ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్న జయశంకర్ అంచెలంచెలుగా వైస్ ఛాన్సలర్ స్థాయి వరకు ఎదిగారు. ఈ క్రమంలో ఆయనకు ఎందమంది శిష్యులు తయారయ్యారు. వారిలో కొందరు విప్లవ ఉద్యమాల వైపు ఆకర్షితులు కాగా, కులవర్గ పోరాటాలకు మరికొంత మంది ఆకర్షితులయ్యారు. ప్రజా సంఘాలు, పౌర హక్కుల పరిరక్షణకు పాటుపడటం ద్వారా ఆయన శిష్యులు కొందరు కీర్తి ప్రతిష్ఠలు గడించారు. కూడా అయితే, జయశంకర్ మాత్రం ఈ పంథాలలో దేన్నీ అనుకరించలేదు. మద్దతు కూడా ఇవ్వలేదు. అలాగని వ్యతిరేకించనూ లేదు. తాను స్వప్నిస్తున్న తెలంగాణ రావాలంటే నక్సలైట్లతోపాటు, ప్రతి ఒక్కరి సహకారం, మద్దతు కావాలని ఆయన నమ్మేవారు. దీన్ని బట్టే తెలంగాణ పట్ల ఆయనకున్న నిబద్ధతను అర్థం చేసుకోవచ్చు.

మూడు దశాబ్దాలుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ కీలక పాత్ర పోషించారు. 1952 నుంచి 1956 వరక చోటు చేసుకున్న ఉద్యమంతో పాటు .. 1969, ఆ తర్వాత 1996లో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్రను ఎవరూ విస్మరించలేరు. నిజం చెప్పాలంటే, తెలంగాణ రాష్ట్ర సమితి పురుడు పోసుకోవడానికి పరోక్షంగా ఆయనే కారణం తెలంగాణ ఉద్యమ వేడి రగిలించడానికి జయశంకర్ చేస్తున్న కృషిని గమనించిన కె. చంద్రశేఖర రావు తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి, ఆయనతో చేతులు కలపడం ద్వారా ఉద్యమ పార్టీకి అంకురార్పణ చేశారు. రాజకీయ ప్రయోజనాలు ఎవరు పొందినా తనకు నిమిత్తం లేదని భావించే జయశంకర్, ఈ క్రమంలో కె.సి.ఆర్ కు అండగా నిలిచారు. జయశంకర్ వంటి వాళ్ళు వెన్నంటి ఉండటం, ప్రజల్లో వారికున్న విశ్వసనీయత వల్ల తెలంగాణ రాష్ట్ర సమితి రాజకీయంగా కూడా నిలదొక్కుకోగలిగింది. సమైక్యవాదిగా కొంతకాలం వ్యవహరించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు వంటి వాళ్ళతో కూడా తెలంగాణకు అనుకూలంగా ప్రకటన చేయించిన ఘనత జయశంకర్ ప్రభావం పూర్తిగా పడటంతో "తెలంగాణకు ద్రోహం చేసే వార ప్రాంతేతరులైతే తరిమికొట్టండి. తెలంగాణ ప్రాంతం వారైతే బొంద పెట్టండి" అని కాళోజీ పిలుపుఇచ్చారంటే, అయనపై జయశంకర్ ప్రభావం ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజ్యాగం ప్రక్రియ ద్వారా మాత్రమే తెలంగాణ సాధించాలని ఆయన విశ్వసించేవారు.

మేథావుల ద్వారా భావజాలం వ్యాప్తిచేయడంలోనూ, విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మించడంలోనూ విజయం సాధించిన జయశంకర్... రాజ్యాంగ ప్రక్రియ ద్వారా తెలంగాణ సాధించలేక పోయినందుకు చివరి రోజుల్లో ఎంతో ఆవేదన చెందే వారు. తెలంగాణ కోసం ఎవరితోనైనా జత కట్టడానికి సిద్ధపడిన జయశంకర్ నిజానికి ఒక వాకింగ్ లైబ్రరీ ఎటువంటి సమాచారం కావాలన్నా క్షణాల్లో ఇవ్వగల సత్తా ఆయన సొంతం. ఈ కారణంగానే కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ప్రజాప్రతినిధులు ఒక పర్యాయం ఢిల్లీ వెళ్ళినప్పుడు తమతో పాటు జయశంకర్‌ను

తీసుకు వెళ్ళారు. ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని ఆయన అయితేనే సమర్థంగా వివరించగలరనీ, అదే సమయంలో ఆయనకున్న విశ్వసనీయత వల్ల పార్టీ పెద్దలన ఒప్పించవచ్చునన్నది కాంగ్రెస్ సీనియర్‌ల ఆలోచన. తెలంగాణ అంశంపై మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్వయంగా జయశంకర్ పిలిపించుకుని మాట్లాడారు. ప్రధాని మన్మోహన్ సింగ్ కోరిక మేరక యు.పి.ఎ ప్రభుత్వం తొలుత ప్రకటించిన ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికలో తెలంగాణ అంశాన్ని ఎలా పేర్కొనాలో సూచింది కూడా ఆయనే! అంతెందుకు, 2009 డిసెంబర్ తొమ్మిదిన కేంద్ర హోం మంత్రి పి. చిదంబరం చేసిన ప్రకటన రూపకర్త కూడా జయశంకరే! ఆనాడు దీక్ష చేసి కె.సి.ఆర్‌తో గానీ, టి.ఆర్.ఎస్. నాయకులతో గానీ మాట్లాడకుండా జయశంకర్‌తో మాత్రమే చిదంబరం మాట్లాడారంటే, కేంద్ర ప్రభుత్వానికి ఆయన పట్ల ఎంతటి గౌరవం, నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ అంటే ఎవరితోనైనా వస్తా! అనే సిద్ధాంతంతో ఆయన జీవితాంతం ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రయత్నించారు. ఈ క్రమంలో కె.సి.ఆర్.తో కొన్ని సందర్భాలలో విభేదాలు తలెత్తినా ఆయన లెక్క చెయ్యలేదు. తాను తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడిని కాదని కూడా ఆయన ఒక సందర్భంలో ప్రకటించారు. తనను టి.ఆర్.ఎస్ సిద్ధాంతకర్తగా మీడియాలో పేర్కొనడంపై జయశంకర్‌కు ఆక్షేపణ ఉండేది. తాను తెలంగాణ కోసం పోరాడతానే కానీ, టి.ఆర్.ఎస్. కోసం కాదనీ, తనను తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా పిలవాలని జయశంకర్ కోరుకునే వారు.

ఆయన పైకి ఎంత సౌమ్యుడుగా కనిపిస్తారో అంతరంగాలలో అంత పట్టుదల ఉన్న మనిషి. తన మనసుకు నచ్చనిది, నిబంధనలకు విరుద్ధమైనది, అనుకున్నది ఏమీ చేసేవారు కాదు. కాకతీయ విశ్వవిద్యాలయం వి.సి.గా ఉన్నప్పుడు అటెండర్ పోస్టుల కోసం అప్పటి జిల్లా మంత్రి టి. హయగ్రీవాచారి పంపిన సిఫారసులను బుట్టదాఖలు చేశారు. దానితో ఆగ్రహించిన మంత్రి తన ఇంటికి రావలసిందిగా హుకుం జారీ చేయగా, “ఒక మంత్రిగా మీతో అధికారిక పని ఉన్నప్పుడు మాత్రమే మీ ఇంటికి వస్తాను” అని ముఖం మీద చెప్పగలిగిన ధీశాలి జయశంకర్. హయగ్రీవాచారి స్వయంగా ఇంటికి వచ్చి, తాను సూచించిన వారికి అటెండర్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరినా అంగీకరించలేదు. రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నాయని, నాటి ముఖ్య మంత్రి నేదురుమల్లి జనార్ధన రెడ్డి చేసిన సిఫారసులను కూడా తిప్పి కొట్టిన ధైర్యం జయశంకర్ సొంతం. ఈ విషయాలను ఆయనే స్వయంగా తన జ్ఞాపకాల్లో ప్రస్తావించారు. జయశంకర్ గురించి ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నైనా చెప్పవచ్చు. అయితే, జయశంకర్ జీవితం నుంచి తెలంగాణవాదులు, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె.సి.ఆర్ పాటు, ఇతర పార్టీల నాయకులు నేర్చుకోవలసింది ఎంతో ఉంది. విద్వేషాలకు తావులేని విధంగా సిద్ధాంత పునాదులపై తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేయలవసిన అవసరం ఉంది.

జయశంకర్ అంతిమ యాత్ర సందర్భంగా చోటు చేసుకున్న అవాంఛనీయ సంఘటనలను అర్థం చేసుకోవచ్చు. తాము పెద్ద దిక్కుగా భావించే జయశంకర్ సార్ ఇక లేరన్న దుఃఖంతో పాటు, తెలంగాణ వాదులు భావోద్వేగానికి గురై ఉండవచ్చు. ఆ కారణంగానే కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులపై భౌతిక దాడులకు చూడవలసిన బాధ్యత ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న వారిపై ఉంది. ఇక్కడే తాము ఆరాధించే జయశంకర్ జీవితాన్ని తెలంగాణవాదులు ఆదర్శంగా తీసుకోవాలి. తెలంగాణ వాదానికి ఎన్నో పర్యాయాలు ద్రోహం జరిగినా ఆయన ఎన్నడూ నిరాశ చెందడం గానీ, ఉద్రేక పడటంగానీ జరగలేదు. చివరి వరకు ఆశావాదంతో, అలుపెరుగని పోరాటం చేస్తూనే కన్ను మూశారు. జయశంకర్ నిజమైన నివాళి సమర్పించడమంటే, ఆయన అనుసరించిన మార్గంలో లక్ష్యాన్ని సాధించు కోవడమే! తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందో లేదో తెలియన పరిస్థితి! కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకునే పక్షంలో, ఆ పని జయశంకర్ బతికి ఉన్నప్పుడే జరిగి ఉంటే ఎంతో బాగుండేది. తాను స్వప్నించిన తెలంగాణ రాష్ట్రాన్ని కళ్ళారా చూసుకుని, మనశ్శాంతితో ఆయన కన్నుమూసి ఉండేవారు. ఏది ఏమైనా, తెలంగాణ వాదులు భావోద్వేగాలు, నిరాశా నిస్పృహలకులోను కాకుండా, జయశంకర్ చూపిన బాటలో పయనిస్తే ఆలస్యంగానైనా లక్ష్యాన్ని చేరుకోగలరు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక, 25 జూన్, 2011 **– ఆదిత్య**

# మనకాలం యోధుడు

**- డాక్టర్ వెల్పాల కొండలరావు**

ప్రొఫెసర్ జయశంకర్ అంటే తెలంగాణ ఉద్యమం గుర్తుకు రాకతప్పదు. మనసా వాచా కర్మణా తెలంగాణ అస్తిత్వ ఉద్యమంతో ఆయన పూర్తిగా తాదాత్మ్యం చెందారు. ఉద్యమానికి పర్యాయపదంగా మారారు. ప్రారభం నుంచి తెలంగాణ ఉద్యమంలో అనేకమంది చిత్తశుద్ధితో పాల్గొన్నారు. అయితే ఉద్యమానికి చెందిన దశలు, స్థితులన్నిటిలోను, వివిధ అటుపోటుల్లోను జయశంకర్ స్థిరంగా, ధృడచిత్తంతో చివరి శ్వాస వరకు పోరాడారు. దురదృష్ట వశాత్తు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనే ప్రగాఢ వాంఛ నెరవేరకుండానే ఆయన మరణించారు. ఆయన్ని నేను కలిసనప్పుడు ... నన్ను కలిసి ప్రతిసారి కొండలరావు సాబ్, అబ్ తొ ఎక్ హీ ఖ్వాయిస్ హై, వొ తెలంగాణ దేఖ్‌నా ఔర్ మర్‌జానా (నాకోరిక ఒకటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూసిన తర్వాత మరణించడం) అని అనేవారు. చాలా కాలం నుంచి ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నప్పటికి ఈ మధ్యకాలంలో ఆయన మరీ క్షీణించిపోయారు. ఒక వేళ తెలంగాణ ఏర్పడేంత వరకు ఆయన బతికి ఉన్నప్పటికి శారీరకంగాకాక స్ఫూర్తితో మాత్రమే జీవించి ఉండేవారు.

తెలంగాణ ప్రొఫెసర్ జయశంకర్ ఏదో ఒక్క వర్గానికి మాత్రమే పరిమితమైనవారు కాదు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, విలేఖరులు, రాజకీయనాయకులు, సాహిత్యకారులు, వ్యవహర్తలు, న్యాయవాదులు, శ్రామికులు, స్వచ్ఛంద సేవకులు, ఉద్యమ నాయకులు, తదితరులు ఇలా అందరివాడుగా జయశంకర్ చివరిదాకా బతికారు. అతను మాస్‌కు, 'క్లాస్' కు ఇరువర్గాలకు చెందివారు. ప్రత్యేక తెలంగాణ సిద్ధాంత భావజాలకర్తగా ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించినప్పటికి ఎలాంటి శషభిషలు, అరమరికలు లేకుండా అన్ని వర్గాలతో ఆయన కలిసి పోయేవారు. ఆయన తెలంగాణలోని ప్రతి ఒకరీకి సుపరిచితుడు. ఆయన తన అపారమైన మేధో సంపత్తితోనే కాకుండా, అద్భుతమైన హాస్యం ద్వారా కూడా ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. ఆయన మంచి వక్త. ఆయన ఉపన్యాసాల్లో సమాచారం ఎంతో వుండేది. భావాలు, సంఘటనలు, సందర్భాలు, అనుభవాలు, కథలు నానుడులు, భావ ప్రతీకలు అన్నీ ఒక అందమైన అల్లికగా ఉపన్యాసంలో రక్తికట్టే విధంగా ఆస్తకికరంగా ఉంటాయి. ఆయన తన ఉపన్యాసాల ద్వారా ప్రజల్లో ఉద్వేగాన్ని, ఉత్తేజాన్ని, చైతన్యాన్ని రగిలించేవారు. దాంతోపాటు హృదయాన్ని సున్నితంగా స్పృశిస్తారు. ఉద్యమ కార్యోన్ముఖుల్ని చేస్తారు. సమాచారాన్ని సున్నితంగా అందించడం మాత్రమే కాదు, వ్యక్తులను సంస్కరించే మార్పుచేసే శక్తికూడా ఆయనలో పుష్కలంగా ఉంది. ఆయనకు తన భావాలపైనే కాకుండా, తన భాషపై కూడా అత్యంత పట్టు ఉంది. అందువల్ల తెలంగాణలో జరుగుతున్న సామాజిక, విద్యా విషయక, సాంస్కృతిక లేదా మేధోపరమైన ఉద్యమాలన్నింటికీ ఆయన వెలకట్టలేని సంపదగా నిలిచారు.

ఉపన్యాసాలు, సంభాషణలు, చర్చలు ప్రతిపాదనల్లాంటి పలు విషయాలు శక్తివంతంగా రూపొందించేందుకు జయశంకర్ మంచి నేపథ్యంలో ఆయన ప్రాచీన మహోపాధ్యాయుల తరహాలో ఒక మంచి ఉపాధ్యాయుడిగా తన నడతను ప్రారంభించారు. ఆయనలో దేశవాళి చాతుర్యం నిబిడీకృతమై ఉండడం వల్ల ఆయన బోధన పద్ధతి స్థానిక వాసనలతో, సహజసిద్దమైన అనుభూతులతో గుబాళిస్తుంటుంది. పుస్తకాల్లో పొందుపరచిన స్థానికేతర విషయాలను

బోధించడంగాక, ఆ కార్మికుల, విద్యార్థుల నిజజీవితానుభవంతో జోడించి సులభగ్రాహ్యమైన శైలిలో ఆయన విద్యార్థులకు బోధించేవారు. ఈ బోధనాను భవం ఆయన్ని ఒక మంచి వక్తగా ఒక మంచి ఉపాధ్యాయునిగా, ఆరాధాకుడిగా నిలిపింది. దాంతో ఆయన విద్యా రంగంలో ఉన్నా, రాజకీయల్లో ఉన్నా, ఒక నిష్ఠాతుడిగా రాణించారు. ఆయనకు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రవేశముంది. ఆ భాషా వ్యవహర్తలు కూడా ఆశ్చర్యపోయేంతటి పద సంపదను వినియోగిస్తూ ధారాశంగా మాట్లాడేవారు. ఆయనకు పదాలమీద పట్టుండటమే కాకుండా, ఆ సంస్కృతులు, చారిత్రక సందర్భాలపై కూడా అపారమైన పట్టు ఉంది. తాను మాట్లాడాల్సిన తాను రాయాల్సిన విషయాలపై ముఖ్యంగా రాజకీయాలు, విద్యా సంబంధ విసయాలపై ఆయనకు అత్యంత స్పష్టత, స్వచ్ఛత, నేర్పు ఉంది.

ఆయన తన భావాలను మంచిగా వ్యక్తీకరించడమే కాకుండా, స్ఫుటంగా విశదీకరించగలరు. ఆకర్షించడమే కాదు, ప్రత్యర్థుల వాదనలను చిత్తుచేయగలరు. సాధారణ విద్యావేత్తలకు, మేధావులక భిన్నంగా ఆయన జ్ఞానాన్ని మిళితం చేసి బోధించేవారు. ఆయన తన తర్కాన్ని అద్భుతంగా ప్రతిపాధిస్తారు. ఒక క్రికెటర్ బ్యాట్‌లా, ఒక కమ్మరి సుత్తిలా ఆయన చమత్కరిస్తుంటారు. ఎవరి నైనా నొప్పించవలసి బాధ పెట్టవలసి వస్తే ఆయన చిరునవ్వుతోనే సరిపెట్టేవారు. ఆయన చాలా సంక్షిప్తంగా వ్యక్తికరించేవారు. అనేకమందిలా ఆయన ఒక విషయంపై మాట్లాడేటపుడు సాగతీత వివరణ ఇచ్చే వారు కాదు. సంక్షిప్తంగా, అర్థవంతమైన, ఉపయుక్తమైన పదాలు, వాక్యాలతో సరిపెట్టేవారు.

జయశంకర్ భావాలను మంచిగా వ్యక్తీకరించడమే కాకుండా, స్ఫుటంగా విశదీకరించగలరు. హాస్యం, ఆపహాస్యం, వ్యంగ్యం, ఛలోక్తులతో ఆయన ప్రజలను ఆకర్షించడమే కాదు, ప్రతత్యర్థుల వాదనలను చిత్తుచేయగలరు. సాధారణ విద్యవేత్తలకు, మేధావులకు భిన్నంగా ఆయన జ్ఞానాన్ని, లోక జ్ఞానాన్ని మిళితం చేసి బోధించేవారు. ఆయన తన తర్కాన్ని అద్భుతంగా ప్రతిపాధిస్తారు. ఒక క్రికెటర్ బ్యాట్‌లా, ఒక కమ్మరి సుత్తిలా ఆయన చమత్కరిస్తుంటారు.

అన్నిటికంటె మించి, జయశంకర్ ఒక గొప్ప వ్యూహకర్త. కీలక సమయాల్లో సందర్భాల్లో విజయం సాధించడంలోను, తమవాళ్ళను గెలిపించడంలోను ఆయన ఆలోచనలు, సలహాలు, సూచనలు ఆచరణాత్మకంగా ఉండేవి. ఆందుకనే టీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు ఆయన్ని గొప్ప సిద్ధాంతకర్తగా కాక, ఒక మంచి వ్యూహకర్తగా తరచూ సంబోధించేవారు. ఆయన సిద్దాంత అవగాహన టీఆర్ఎస్‌కు, దాని అధినేత కేసీఆర్‌కు ఎవరూ ఇవ్వనంత భావజాల బలాన్ని చేకూర్చింది. అధ్యాపక సంఘ కార్యకర్తగా జయశంకర్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. ఈ అనుభవం నేపథ్యంలో రాజకీయ సామాజిక, సాంస్కృతిక వగైరా రంగాల్లోని సంస్థల నిర్మాణం, వాటి కార్యాచరణలో తలెత్తే విన్యాసాలు, సమీకరణాలు వ్యూహాలు, ఎత్తుగడలు లాంటి అనేక అంశాల్లో సంస్థాగత నిర్మాణ కౌశలానికి పునాదులు పడ్డాయి. ఈ అనుభవంతో ఆయన ఒక మంచి విద్యా వ్యవహర్తగా ఎదిగారు. ఆ తర్వాత కాలంలో ఆయన తెలంగాణ ఉద్యమంలో అనేక ఆటుపోట్ల మధ్య గట్టిగా పనిచేశారు. టీఆర్ఎస్ పార్టీకి సలహాదారుగా, వ్యూహకర్తగా వ్యవహరించారు. విద్య, రాజకీయరంగాల్లో అనేక మంది దిగ్గజాలతో కలసి పనిచేయడం మూలాన ఆయన అందరికి సుపరిచితుడు. విభిన్న వ్యక్తిత్వాలతో సర్దుకుపోయి కలసి పనిచేయడంతోను, వివిధ భావాలు, దృక్పథాలు వైఖరులున్న వ్యక్తులతో మెలగడంతోను ఆయనలో వ్యక్తులను అర్థం చేసుకోగల అవగాహన బాగా పెరిగింది.

కాకలు తీరిన తెలంగాణ కాంగ్రెస్‌నేత మర్రి చెన్నారెడ్డితోను, ఆయన కంటే కొంత మెతకగా కనిపించినప్పటికి సమానమైన శక్తివంతుడు కెసిఆర్‌తోను ప్రొఫెసర్ జయశంకర్ సునాయాసంగా పనిచేశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి వ్యవహార శైలిలో వ్యంగ్యం ఉండకపోయినా పంచ్ ఉంటుంది. అయితే జయశంకర్ లాగా కెసీఆర్‌లో స్థానికత్వంతో కూడిన వ్యంగ్యం సమృద్ధిగా ఉంటుంది. ఈ స్వభావం జనాకర్షణకంగా ఉపయోగపడుతుంది. ఈ తత్వమే వారిద్దరూ తెలంగాణ ఉద్యమంలో సుదీర్ఘకాలం కలసి ప్రయాణించేందుకు ఉపకరించిందని భావిస్తున్నాను. ప్రొఫెసర్ జయశంకర్

తెలంగాణ ఉద్యమానికి టీఆర్ఎస్‌కు టీఆర్ఎస్ అధినేత ఒక గొప్ప అస్తిలాంటి వారు. కేసిఆర్‌కు సామాన్యులతో వ్యవహరించి వాళ్లను సంఘటితం, చేసే నైపుణ్యం మాత్రమే ఉంది. తెలంగాణకు చెందిన ఉన్నత విద్యావంతులతో వ్యవహరించడం కేసిఆర్‌కు అంతగా తెలియదు. అనేక సంక్లిష్టతలతో కూడిన తెలంగాణ మేధావులు, విద్యావేత్తలు, పండితులు, ఉన్నత రాజకీయ, సివిల్ సర్వెంట్లతో వ్యవహరించేందుకు ప్రొఫెసర్ జయశంకర్‌ను కేసిఆర్ వినియోగించేవారు. తెలంగాణలోని సామాన్యులు, ఉన్నత విద్యావంతులతో అన్ని రకాల సెక్షన్ ప్రజలను ఏకతాటిపైకి తెచ్చేందుకు వీరిద్దరి ఉమ్మడి కృషి, టీఆర్ఎస్‌కు చాలా బాగా ఉపకరించింది. జయశంకర్ మరణంతో టీఆర్ఎస్‌కు దాని అధినేత చంద్రశేఖర్‌రావుకు పూడ్చుకోలేని నష్టం జరిగింది. 'రాజకీయ న్యాయం' కంటే 'సామాజిక న్యాయం' లక్ష్యంగా పనిచేసే పార్టీగా ప్రచారం పొందేందుకు జయశంకర్ లాంటి ప్రతిష్టగల వ్యక్తి టీఆర్ఎస్‌కు అవసరం. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు సామాజిక న్యాయ సాధనలో భాగమేనని సామాజిక న్యాయం కోరుకునే వారిని ఒప్పించగల సామర్థ్యం జయశంకర్ వద్ద ఉంది.

జయశంకర్ నాకు చిరకాల మిత్రుడు. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న రోజుల నుంచి నాకు పరిచయం ఉంది. ఆయన 'సి' హాస్టల్‌లో ఉండేవారు. ఆ రోజులనుంచి మేమంతా కలసి మెలసి తిరిగేవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సిండికేట్ ఎన్నికల్లో నేను గణనీయమైన ఓట్ల మెజారిటీతో గెలిచేందుకు డాక్టర్ జయశంకర్ డాక్టర్ తోట, డాక్టర్ శ్రీధర్‌స్వామిల కృషి ఎంతో ఉంది. జయశంకర్ అస్తమయం తెలంగాణ సామాజిక, మేధో, సాంస్కృతిక రంగాలకు తీరని లోటు అలాగే వ్యక్తిగతంగా నాకు మరింత తీవ్రమైన లోటుగా భావిస్తున్నాను. తెలంగాణ ప్రజల మనసులలోను, హృదయాల్లోను ఒక యగకర్తగా, ఒక అజేయ సైనికుడు' గా జయశంకర్ ఎప్పటికీ నిలిచే ఉంటారు.

**– డాక్టర్ వెల్పాల కొండలరావు**

కన్వీనర్ తెలంగాణ కల్చరర్ ఫోరం

ఆంధ్రజ్యోతి దినపత్రిక
22 జూన్, 2011

---

# అశ్రునివాళి

తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చనిపోవడం తీరని లోటు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. జయశంకర్ అనుభవం నుంచితాము ఎంతో ఉద్యమ స్ఫూర్తి పొందాం.

***– తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ సలహాదారులు***

*బి.మోహన్‌రెడ్డి, ఎన్.జానయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.సామిరెడ్డి, సీపీడీసీఎల్ అధ్యక్షుడు ఎ.ఆర్ శెట్టి, ఎంప్లాయీస్ జేఏసీ కోఆర్డినేటర్ శివాజీ*

ఆయన ఆశయ సాధన కోసం అన్ని పార్టీలు సంఘాలు ఏకమైపోరాటం చేయాలి. 1952 నుంచి నేటి వరకు ఉద్యమంలో పాల్గొంటూ వెన్నుముకలా ఉన్నారు. తెలంగాణను సాధించుకోవడం ద్వారానే జయశంకర్‌కు నిజమైన నివాళులు అర్పించిన వాళ్లమవుతాం.

***– నాగం జనార్ధనరెడ్డి,*** *సీనియర్ ఎమ్మెల్యే*

# మూడు తరాల ఉద్యమానికి ఊపిరి...

**- శ్రీధరరావు దేశ్‌పాండే**

ఇటీవలి కాలంలో ఒక విశాల ప్రజా సమూహన్ని ప్రభావితం చేసిన మహోపాధ్యాయుడు ఎవరని వెదికితే ప్రొఫెసర్ జయశంకర్ తప్ప మరొకరు కనిపించరు. 1952 నాన్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం మొదలుకొని ఇప్పటి వర్తమాన తెలంగాణ ఉద్యమం దాకా తెలంగాణ రాష్ట్ర సాధనా కృషిలో పెనవేసుకుపోయిన జీవితం జయశంకర్‌ది. అరవైఏండ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఉద్యమ మార్గాన్ని వీడలేదు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినప్పుడు ఉద్యమ నాయకత్వానికి దిశానిర్దేశం చేసినాడు. ఉద్యమం విద్రోహానికి గురి అయినప్పుడు తిరిగి ఉద్యమ పునర్ నిర్మాణానికి భావ ప్రచారంలో తన కృషిని కొనసాగించినాడు. ఆయన మూడు తరాల ఉద్యమకాకులకు అప్తుడు, స్ఫూర్తిప్రదాత, తెలంగాణ మహోపాధ్యాయుడు.

వేలాది సభల్లో సదస్సుల్లో, చిన్నా పెద్ద సమావేశాల్లో ఆయన చేసిన ప్రసంగాలు అమూల్యమైనవి. ప్రసంగాల ద్వారా ఆయన చేసిన తెలంగాణ ఉద్యమ భావ ప్రచారం తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించింది. ఇటీవలి కాలంలో ఆయన చెప్పింది. ఎమిటంటే తెలంగాణ ఉద్యమానికి కావల్సింది. మూడు ప్రక్రియలు ఒకటి భావ ప్రచారం, రెండు ఉద్యమం, మూడు రాజకీయ ప్రక్రియ తెలంగాణ ఉద్యమ భావ ప్రచారంలో రచయితలు, కవులు కళాకారులు, ప్రొఫెసర్లు ఉపాధ్యాయులు, ఉద్యోగవర్గాలు విశేషమైన కృషిని కొనసాగించి తెలంగాణ ప్రజా పునాదిని ఏర్పరచారు. ఈ పునాదిమీద తెలంగాణ ఉద్యమ నిర్మాణం కొనసాగింది. 1952లో నాన్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం 1956లో విలీనానికి వ్యతిరేకంగా ఉద్యమం 1969 ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం 1971లో ఎన్నికల పోరాటం, 1996 నుండి ఇప్పుడు సాగుతున్న ప్రజా పోరాటాలు ఇవన్నీ ప్రజలు తెలంగాణ రాష్ట్ర కోసం విరామమెరగక చేస్తున్నవే.

అయితే తెలంగాణ కోసం కీలకమైన రాజకీయ ప్రక్రియ విఫలవుతూనే ఉన్నది. తెలంగాణ రాజకీయ నాయకుల దళారి స్వభావం వల్ల పదవులకు, వ్యక్తిగత ప్రయోజనాలకు బలి అయి రాజకీయ ప్రక్రియ ముందుకు సాగటంలేదని జయశంకర్ వేదన పడేవారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మీరు రెండోశ్రేణి నాయకులుగా ఉండాలనుకుంటే మాకు అభ్యంతరం లేదు. మేం ప్రజలం రెండోశ్రేణి పౌరులుగా ఉండదల్చుకోలేదని వారిని ఎద్దేవా చేసేవారు ఈ వ్యాస రచయిత విన్న జయశంకర్‌గారి ప్రసంగాల్లో మణిపూసవంటింది. అంబేద్కర్ స్మారక ప్రసంగం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్టువారు 2002 డిసెంబర్ 6న అండేద్కర్ వర్ధంతి రోజున, ఏర్పాటుచేసిన సభలో చిన్న రాష్ట్రాలు- అంబేద్కర్ ఆలోచనలు అన్న అంశంపై రెండుగంటల పాటు సాగిన జయశంకర్ ప్రసంగం ఎందరినో ఆకట్టుకుంది. అంబేద్కర్ ఆలోచనల్ని విప్పి చెప్పిన ఆయన విశ్లేషణా సామర్థ్యానికి ఈ ఉపన్యాసం మచ్చుతునక ఆయన ఉపన్యాసానికి ఇచ్చిన ముగింపు అందర్నీ ముగ్దులను చేసింది. ఇవ్వాళ బతికి ఉంటే... నేను ఆనాడే చెప్పాను కలిసి ఉండే పొంతన లేకపోతే ఎప్పుడైనా విడిపోవచ్చునని... ఇప్పుడు తెలంగాణ విడిపోవాలనే చెబుతాను... అంటాడు ఫజల్ అలీ బతికి ఉండే .. నేను దోపిడికి, అణిచివేతకు, వివక్షకు గురి అవుతున్న తెలంగాణను చూసి తానే ఉద్యమానికి నాయకత్వం వహించేవాడు.. అని చెబుతూ తన ప్రసంగాన్ని ముగించారు. ప్రెస్‌క్లబ్ చప్పట్లతో

మారుమోగింది. ఉద్యమ వ్యాప్తికి వ్యాస రచనను, పుస్తక రచనను ఆయనొక ముఖ్యమైన మాధ్యమంగా ఎంచుకున్నారు. చిన్న పెద్దా అనే లేకుండా అడిగిన వారికి వ్యాసం రసిచ్చారు. తెలుగులో, ఇంగ్లీషులో ఆయన లెక్కలేన్ని వ్యాసాలు రాసారు. ఇంటర్వ్యూలు ఇచ్చారు. పుస్తకాలు రాసారు. ఆయనరాసిన 'తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్ ఇప్పటికి డిమాండ్ ఉన్న పుస్తకమే 1969 ఉద్యమం సందర్భంగా తెలంగాణ యూనివర్శిటీ టీచర్స్ కన్వెన్షన్ ఏర్పాటు చేసి ఆ సదస్సులో వచ్చిన ప్రసంగాలను తెలంగాణ మూవ్‌మెంట్ యాన్ ఇన్వెస్టిగెటివ్ ఫోకస్' పేరిట జయశంకర్ ఆయన ఆప్తమిత్రుడు తోట ఆనందరావు పుస్తకాన్ని ప్రచురించారు. ప్రజలకు తమ కష్టాలు తెలుసు ఆ కష్టాలు ఎందుకున్నవో వాటి మూల కారణాలు వారికి తెలియవు. మేధావులుగా మనం చెయ్యవల్సింది. ప్రజలకు కష్టాలు ఎందుకున్నవి చెప్పటం. కారణాలు తెలిస్తే కష్టాలు తీరే మార్గాన్ని ప్రజలే ఎదుర్కొంటారని జయశంకర్ గారు అనేవారు. తెలంగాణ హిస్టరీ సొసైటీ తరపున 1969 ఉద్యమ చారిత్రక పత్రాలు' అన్న పుస్తకం కోసం ప్రొఫెసర్ జయశంకర్ గార్ని ఈ వ్యాసరచయిత, సంగిశెట్టి శ్రీనివాస్ కలిసినప్పుడు అమూల్యమైన పత్రాలను అందించారు. వాటిలో 'జై తెలంగాణ' పత్రిక సంచికలు ఉన్నాయి.

ఒక మహావృక్షం కూలిపోతే ఎంత వెలితి ఏర్పడుతుందో జయశంకర్ మరణం తెలంగాణ ఉద్యమానికి అటువంటిదే. ఇది నిజమైన అర్థంలో పరించలేని లోటు అనితరసాధ్యమైన వైవిధ్యభరితమైన ఉద్యమకృషి ఇంకా అసంపూర్ణంగా మిగిలిపోవడమే ఒక విషాదం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును చూసే చనిపోవాలన్న ఆయన కోరిక నెరవేరకుండానే ఆయన వెళ్లిపోవటం మనందరి ముఖ్యంగా రాజకీయ నాయకుల వైఫల్యమే. ఆయన పార్థివ శరీరానికి సమస్కరించి పూలగుచ్ఛాలను అర్పించే ఈ రాజకీయ దళారులు గుర్తించవలసింది. ఏమిటంటే... జయశంకర్ జీవితాశయమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి రాజకీయ వ్యూహాన్ని ఐక్యంగా రచించుకోవాల్సి వుంది. అదే ఆయనకు నిజమైన నివాళి.

***– శ్రీధరరావు దేశ్‌పాండే***

ఆంధ్రభూమి దినపత్రిక
22 జూన్, 2011

---

# అశ్రునివాళి

1969 తర్వాత మలిదశ ఉద్యమంలో జయశంకర్ చేసిన కృషి మరువలేనిదని సామాజిక తెలంగాణ మహాసభ కన్వీనర్, కో కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, కె.వెంకటనారాయణబోయ, అస్థిత్వవాద సామాజిక విప్లవ సిద్ధాంతకర్త సాంబశివరావు, తెలంగాణ బహుజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.నాగరాజు, సామాజిక జైఆంధ్ర మహాసభ రాష్ట్ర కన్వీనర్ చెముకుల సుధాకర్ కొనియాడారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ మృతి పట్ల ఐజేయూ సెక్రెటరీ జనరల్ కె.శ్రీనివాసరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమసుందర్, వై.నరేందర్‌రెడ్డి, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ డి.అమర్ సంతాపం ప్రకటించారు.

ఉద్యమమే ఊపిరిగా పని చేశారని సామాజిక తెలంగాణ ఓబీజీ జేఏసీ కన్వీనర్ కస్తూరి జయప్రసాద్. ఉస్మానియా గ్రాడ్యూయేట్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దాస్యం ఉదయ భాస్కర్, తెలంగాణ బీసీ ఫ్రంట్ కో కన్వీనర్ చిక్కా దేవదాసు, తెలంగాణ విశ్వవిద్యాలయాల బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధి చింతల రాజేంద్రప్రసాద్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి జీవితం అంకితం చేసిన నేత ప్రొఫెసర్ జయశంకర్ అని తెలంగాణ ఉద్యోగుల సంఘం (సెంట్రల్ అసోసియేషన్) ఉపాధ్యక్షుడు ఎం.రవిచంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.పద్మాచారి, సహాధక్షుడు, శ్రీధరరావుదేశ్‌పాండే, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి జూపాక సుభద్ర, తెలంగాణ ఉద్యోగుల సంఘం (గ్రేటర్ హైదరాబాద్ శాఖ) అధ్యక్షుడు జి.శంకర్, ప్రధాన కార్యదర్శి జి.అనంద్ తెలిపారు.

***– టీఆర్‌టీయూ,*** అక్టా-ఏపీ

# తెలంగాణ రాష్ట్రం సాధనే ప్రొ॥ జయశంకర్‌కు నివాళి

**- అమర్**

జూన్ 21.2011 నాడు కామారెడ్డి కోర్టు దగ్గర మీడియా ప్రతినిధులంతా లగడపాటిపై నా ప్రతిస్పందన అడుగుతున్నారు. ఇంతలోనే జడ్జిగారి అనుమతితో కల్సిన వకీల్లిద్దరు ప్రొ॥జయశంకర్ గారి మరణ వార్తను తెలిపారు. దాంతో ఒక్కసారిగా "జయశంకర్ అమరత్వం సాక్షిగా తెలంగాణ సాధనకు ఐక్యంగా ఉద్యమించడమే ఆయనకు నిజమైన నివాళి కాగలదని" వ్యాఖ్యానించాను. గడిచిన ఏడాది కాలంగా హక్కుల నేతలు ప్రజాస్వామిక వాదులు, తెలంగాణ వాదులు మార్క్సిస్టు దార్శనికులు మొదలుకొని  అనేకమంది మరణాల్ని వింటూ మౌనంగా ఉండాల్సి వస్తుంది. జూన్ 17.2011 న కోర్టు అనుమతితో బంద్రు నర్సమ్మ సందాప సభకు  వెళ్లి కన్నాభిరన్, ఎన్.ఆర్.శంకరన్, డా॥మాధవ స్వామి, పత్తిపాటి వెంకటేశ్వరులు, ప్రొ॥ఆర్.ఎస్ రావు  కొండన్న మరియు జోగన్న లాంటి వారికి విప్లవ జోహార్లు ప్రకటించి కొంచెం గుండె బరువు దించుకున్నాను. ఇంతలోనే ఈ దిగ్భ్రాంతికర వార్త వినాల్సి విచ్చింది. ఈ ఉద్విగ్న పరిస్థితుల్లోనైనా తెలంగాణ వాదులంతా జెండాల కతీతంగా ఐక్యంగా ఉద్యమించుటకు ప్రతినబూనాల్సి ఉంది. ఈ విషాదం సందర్భంగా పాలిటిక్స్ మాట్లాడుకోవడం సరైంది కాదు. కానీ తెలంగాణ అంశంతో రాజకీయ లబ్ది పొందింన పార్టీలపైనే అందరిని కదిపే ప్రధాన భాధ్యత ఉందని చెప్పక తప్పదు. తెలంగాణను చూడలేక సోయానన్న బాధను అదిమి పట్టుకుని ఈ బాధ్యతను నేరవేర్చడానికి విద్యార్థి-యువత ఉందన్నధీమ ఆయన దార్శకతను తెలియజేస్తుంది. ఆయన దృష్టికోణం నుండి కొన్ని విషయాలను తెలంగాణ వాదులముందు చర్చకుపెడ్తున్నాను. ఏడాది తర్వాత ఆలేరులో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజిగారి ఔదార్యాన్ని చవిచూసిన నేనె తెలంగాణను చూడాలన్న ఇలాంటివారి కలలు పరిపూర్తి కావాలన్న ఆకాంక్షతోనే ఇలా రాస్తున్నాను. రాష్ట్రంలో రాజకీయ పాకులాటల చదరంగపు ఆట రక్తి కడుతుండగా పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటి తన ఐక్య ఉద్యమ కర్తవ్యాన్ని  మరిచిపోతే. మరొకసారి విద్యార్థి-ప్రజా ఉద్యమం ఆ బాధ్యతను భుజానకెత్తు కుంటుంది. అన్యాపదేశంగానైనా ఉస్మానియా, కాకతీయులవైపు ఆశగాచూస్తూ ప్రొ॥జయశంకర్ అన్నమాటలు ఆమన చివరి సందేశంగా స్వీకరిద్దాం. విషాదాన్ని వెదజల్లుతున్న ఈ శోకదినాల్లో తెలంగాణ రాష్ట్రసాధన కర్తవ్యాలు రచించుకోవడం ఆయనకు నిజమైన నివాళి కాగలదు. ఉద్యమమే అన్ని సందిగ్ధతలకు తెరదించగలదు.

సరిగ్గా తెలంగాణ ఉద్యమం జూన్ సభల ప్రభంజనమై, ప్రతిపల్లె ప్రతిఘటన బాణాలెక్కుపెడ్తున్నప్పుడు తెలంగాణ  ఉద్యమ యోధుడు జయశంకర్ గారిని ఒక వేదికపై కలిసే అవకాశం దొరికింది. ఎంతోమంది రాజకీయ పార్టీ నాయకుల్ని  ప్రజాప్రతిధుల్ని ప్రేక్షకులుగా మార్చిన ప్రజాఉద్యయం, ప్రొ॥ జయశంకర్‌తో పాటు నాలాంటి ఉద్యమ కార్యకర్తలకు వేదికలెక్కే అవకాశం కల్పించింది, సరిగ్గా అలాంటి సందర్భంలో అమరుడు మల్లెపల్లి రాజం  మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గోదావరిఖనిలో జరిగిన సభలో సార్‌తో పాటు నేనూ విమల వేదికపై భాగంపంచుకున్నాము. అయితే వారితో వ్యక్తిగతంగా అనుభవాలు పంచుకునే అవకాశం, మరొసారి కల్సుకునే సందర్భం రాకుండానే నేను కట కటాల పాలయ్యాను. వారేమో ఇప్పుడు భౌతికంగానే లేకుండా పోయాడు. కానీ సభ తర్వాత అతనితో కల్సి భోజనం చేసే సందర్భంలో ఆయన ఆహార నియమాలు, ఆరోగ్య రహస్యాలు తెల్సి

ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. భోజనం చేసే సమయం దాటి పోయిన తర్వాత తాను కాసిన్ని పండ్లు తప్ప మరేమి తీసుకోనని చెప్పి ఒక అరటిపండు, అంగూర్లతో ఆపూట కానిచ్చారు. “అంత నిష్ఠతో ఉన్నాను కాబట్టే నాకెలాంటి అనారోగ్య సమస్యలు లేవ”ని గర్వంగా చాటారు. అకలిని–అనారోగ్యాన్ని జయించి, ఆరు దశాబ్దాలనిరీక్షణ ఫలించి తెలంగాణ రాష్ట్రాన్ని వారు కండ్లారా చూడగలరని నేను మనస్ఫూర్తిగా విశ్వసించాను. కానీ వారం రోజుల క్రితం పేగు క్యాన్సర్ కు సంబంధించిన వార్త పత్రికల్లో వచ్చేవరకు నాబోటి బంధీకి ఆయనను చావు వెంటాడుతున్న విషయమే తెలియకుండా పోయింది. ఇప్పుడు పేగుక్యాన్సర్ జయశంకర్‌కే కాదు! తన జీవిత కాలపు నిలువెత్తు ఆశైన తెలంగాణ అంశానికి కూడా రోగం సోకుతుందా అనే అనుమానాలు కల్గుతున్నాయి.

మన సింబాలిక్ ప్రొటెస్ట్ (ప్రతీకాత్మకమైన నిరసన)లతో ఢిల్లీకి సెకతాకుతుందో లేదోగానీ వర్షాకాలపార్లమెంటు సమావేశాలు లోక్‌పాల్ బిల్లు, మహిళా రిజర్వేషన్, మతహింస నిరోధక బిల్లులతోనే తాత్కాలికంగా గడిచిపోతున్నాయి. తెలంగాణకు పొగబెడ్తారన్న సంకేతాలే వెలువడుతున్నాయి.అరవై ఏండ్లుగా తెగని అంశాన్ని మైమరిచి ఆరు ప్రతిపాదనలు తేల్చడానికి సమయం పడ్తుందనే వ్యాఖ్యానాలున్నాయి. అఖండ భారత, అంతర్జాతీయవాదం, జాతీయవాదం అనే సైద్ధాంతిక చర్చలతో సంబంధంలేని అసందర్భ ప్రాంతీయ వాద వ్యాఖ్యవాదం అనే సైద్ధాంతిక చర్చలతో సంబంధంలేని అసందర్భ ప్రాంతీయ వాద వ్యాఖ్యానాలు వినబడ్తున్నాయి. పొలిటికల్ కంపల్షన్‌తో పాటు, చీలిక పరిణామాలనుండి రాష్ట్ర కాంగ్రెస్ గృహ సమస్యల కాయకల్ప చికిత్సల్లో మనిగి తేలుతుంది. వీటికి అనుగుణంగా సీమాంధ్ర కుబేరుల బార్గెయినింగ్ వ్యూహం, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు తెరమీదకు వచ్చాయి. అలాగే ప్రధాన ప్రతిపక్షానికి తెలంగాణ అంశం కరిమింగిన వెలగపండనేది ప్రజలంతా ఇప్పటికి విశ్వసిస్తున్నారు. ఉద్యమ పార్టీల చిత్తశుద్ధిని ప్రశిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో మూడుతరాల ఉద్యమ సాక్షిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ ప్రజాస్వామ్యమనే సైద్ధాంతిక బలం మన ముందుంది. 1969 నుండి నేటి దాకా విద్యార్థి–ప్రజా ఉద్యమమే మొత్తం రాజకీయ పార్టీలను ఏకం చేసింది. తూర్పు–పడమరలను ఒక దగ్గరకు చేర్చింది కానీ భవిష్యత్తుకు మార్గదర్శనం చేయాల్సిన రాజకీయ పార్టీలు కూడా తమ శక్తిమేరకు ప్రజలను ఐక్యం చేయడంలో వైఫల్యాలనే ఎదుర్కొంటున్నాయి. తెలంగాణ వాదుమధ్య ఐక్యత–పోరాటం అనే అంశాలు చర్చనీయాంశం అవుతున్నాయి. అయితే తెలంగాణ సాధనలో సుదీర్ఘ అనుభవాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయించుకుంటూ, తెలంగాణ వాదుల్లో ఐక్యత–తెలంగాణ సాధనలో ఉద్యమం ప్రధానమని నిర్దేశించుకోవాల్సిన సమయం ఆసన్నమయ్యింది. దురదృష్టివశాత్తు ఐక్యత చీలిక దగ్గర, ఉద్యమం రాజకీయ లబ్ధి దగ్గర ఆగిపోతున్నాయి. అయితే ఉద్యమమంటే ఎడతెగని. పోరాటమా!? అనే అసహనం కూడా ఒక ప్రధానన్యాయకత్వం నుండి వ్యక్తమౌతుంది. ఉద్యమం–విరామం–ఉద్యమం అనే క్రమంలో అది ఊర్ధ్వ ముఖంగా (ఉన్నత పోరాటంగా) పోవాలా? సింబాలిక్ నిరసనలుగామారాలా? ఎన్నికలు– రాజకీయాలు– ఎన్నికలుగా తిర్గుతుండాలా? రాజకీయాల తర్వాత పోరాటంగా మారాలా? అనే ప్రశ్నలకు తమ తమ అనుభవాలనుండి, వర్తమాన స్థితి నుండి కర్తవ్యాలు రూపొందించుకోవడానికి యావత్ తెలంగాణ నడుంకట్టాల్సిన ప్రొ।। జయశంకర్ అమర్వతం సాక్షిగా మరొక రౌండ్‌టేబుల్ జరగాలి. జెండాలకతీతంగా జరిగే ఈ సమావేశం కనీస ఉమ్మడి అంగీకార ప్రాతిపదికన ఒక వేదికగా కనీసకార్యక్రమం రూపొందించుకోగలగాలి. సీమాంధ్ర కోటీశ్వరుల సైంధవ పాత్రను–కేంద్ర ప్రభుత్వనాన్చుడు వైఖరిని ఎదుర్కొంటూ తెలంగాణ సమాజమంతా ఒకతాటిపైన నిలబడాలి. ఇక తెలంగాణను చూడలేరన్న నిట్టూర్పులతో ఎవరూ ప్రాణాలుకోల్పోరాదు. అప్పుడు ఒక తెలంగాణ రాష్ట్రంగా జయశంకర్..........వస్తాడు.

**– అమర్**

వార్త దినపత్రిక
27 జూన్, 2011

# జనమెరిగిన జయశంకర్ !
# 'తెలంగాణ' వచ్చేవరకు బతికుంటే ...

**- వెల్జాల చంద్రశేఖర్**

వంటా వార్పు విజయవంతమైందని, తెలంగాణ ఉద్యమం మళ్లి వేడెక్కుతుందన్న ముచ్చట్లతో ఆనందంగా ఉన్న తెలంగాణ వాదులకు మంగళవారం ఉదయం 'జయశంకర్ సార్' చనిపోయారన్న వార్త పిడుగుపాటయింది. ఏ తెలంగాణవాది నోట విన్నా తెలంగాణ రాష్ట్రం వచ్చేవరకైనా బతికుంటే బాగుండేది. అన్న మాటే వినిపించింది. ఆయన జీవితం తెలంగాణ రాష్ట్ర ఉద్యమంతో ఏవిధంగా పెనవేసుకుపోయిందో, అందిరి నోట వినిపించిన మాటే నిదర్శనం అదే ఆయనకు గొప్పనివాళి. ఆయన మృతి వార్తకు దాదాపు అన్ని చానళ్లు టిఆర్ఎస్ సిద్ధాంతతకర్త జయశంకర్ మృతి అనే శీర్షికలు పెట్టారు. అయితే అందరికి తెలియని విషయం ఒకటుంది. ఆయన ఏనాడు టిఆర్ఎస్ జెండా ఎత్తులేదు, ఆ పార్టీ కండువా కప్పుకోలేదు. ఆ పార్టీలో సభ్యత్వం తీసుకోలేదు. టిఆర్ఎస్ కు సంబంధించి భారీ సభలు సమావేశాలు ఎక్కడ పెట్టినప్పటికి కెసిఆర్‌కు వెన్నంటే ఉండి వెళ్లేవారు. ఆయన సభలు, సమావేశాల నిర్వాహకులు ఉత్సాహంతో కెసిఆర్‌తో పాటు, ఆయనకు పక్కనే ఉండే జయశంకర్‌కు గులాబి కండువాకప్పేందుకు వెళితే ఆయన సున్నితంగా తిరస్కరించేవారు. ఆ విషయాన్ని కెసిఆర్ కూడా చూసి చూడనట్లుగా వదిలేశారు.

అయితే ఒక సభలో గులాబి కండువా కప్పడానికి మరీ బలవంతం చేయడాన్ని గమనించిన కెసిఆర్ స్పందిస్తూ 'జగమెరిగిన తెలంగాణవాదికి జెండాలెందుకయ్యా' అని వ్యాఖ్యానించారు. కెసిఆర్ తడుముకోకుండా అన్న ఈ మాటలు అక్షరత్యం. ప్రొఫెసర్ జయశంకర్‌ను ప్రత్యేకంగా ఎవరికి పరిచయం చేయల్సిన అవసరం లేదు. అటు శ్రీకాకుళం నుంచి ఇట చిత్తూరుదాక ఆయన జనమెరిగిన తెలంగాణవాది. తెలంగాణ ఉద్యమంతో ఆయన ఆరు దశాబ్దాలుగా విడిదీయారాని బంధం ఏర్పర్చుకున్నారు. ఈ ఉద్యమంతో తనకున్న అనుబంధం ఎప్పటిదో, ఆయన ప్రతి సభలోనూ చెబుతుండేవారు. 1952 లో హైదరాబాద్‌లోని సిటీ కాలేజీలో జయశంకర్ చదువుకునేవారు. ఆ రోజుల్లో నిజాం నవాబు, తన ఆస్థానంలో అధికారులను ఉద్యోగులను స్థానికులను కాకుండా ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా పిలుపించుకునేవారు.

దీనికి వ్యతిరేకంగా ముల్కి నాన్ ముల్కి ఉద్యమం ప్రారంభమైంది. ఆ ఉద్యమంలో భాగంగా సిటీ కాలేజికి చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున ప్రదర్శన ర్యాలీ జరిపారు. అది జరిగే రోజు వరంగల్‌లో ఉండిపోయిన జయశంకర్ ఎలాగైనా దానికి హాజరుకావాలని అక్కడి నుంచి బస్సులో బయలుదేరారు. మార్గమధ్యంలో జనగామ వద్ద బస్సు పాడైపోవడంతో, ఆయన హైదరాబాద్‌కు చేరుకునే సరికే సిటీ కాలేజి విద్యార్థుల ర్యాలీ జరగడం, నిజాం పోలీసులు కాల్పులు జరపడం, అందులో ఏడుగురు చనిపోవడం జరిగింది. ఆ రోజు బస్సు పాడైపోకుండా ఉంటే, ఆ చనిపోయిన విద్యార్థుల్లో నేను ఉండే వాడిని, ఆ రోజు చనిపోయినా బాగుడేది? ఎందుకంటే తెలంగాణ ప్రజలు ఇన్ని కష్టాలు అనుభవించడాన్ని చూడాల్సిన పరిస్థితి వచ్చేది కాదని జయశంకర్ బాధపడేవారు. తెలంగాణవాదులంతా ఆయన్ను 'సార్' అంటూ గౌరవంగా పిలుచుకునేవారు. నిమ్స్‌లో కెసిఆర్ అమరణ నిరాహర దీక్షలో ఉండగా, 2009 డిసెంబర్ 9న రాత్రి తొమ్మిది గంటల సమయంలో సోనియాగాంధీ రాజకీయ సలహాదారు ఆహ్మద్‌పటేల్

ఆయనకు ఫోన్ చేసి దీక్ష విరమించాలని కోరారు. మాట్లాడలేని స్థితిలో ఉన్న కెసిఆర్ అన్ని విషయాలు జయశంకర్‌తో మాట్లాడండీ అని చెప్పేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కేంద్ర హోంమంత్రి చిదంబరం స్వయంగా జయశంకర్ సారే డిక్టేట్ చేశారు. తాను రాసుకున్న పదాలను సరి చేసుకోవడానికి చిదంబరం మూడు నాలుగు సార్లు జయశంకర్‌ను సంప్రదించారు. చిదంబరం కూడా జయశంకర్‌ను తెలంగాణవాదులు పిలుచుకున్నట్టు కూడా సార్ ... సార్' అంటూ సంభోదించిడం అక్కడున్న వారిని ఆశ్చర్యపర్చింది.

జస్టిస్ శ్రీకృష్ణ కమిటీకి టిఆర్ఎస్ తరపున ఇచ్చిన నివేదికను జయశంకర్ స్వయంగా నెల రోజుల పాటు శ్రమించి తయారు చేశారు. ఆయన నిత్య విద్యార్థి తెలంగాణవాదులు ఏర్పాటు చేసే సభలు, సమావేశాలకు వెళ్లడం, ఇంటి వద్ద ఉన్నప్పుడు చదవడం, వాటిలోని విషయాలను రాసకుంటూ కనిపించేవారు  కాస్త తీంకకి చిక్కిందంటే హైదరాబాద్‌కు బయలుదేరి కెసిఆర్ వద్దకు చేరుకునేవారు. జయశంకర్‌తో కెసిఆర్ కూర్చున్నారంటే, ఇక వారిద్దరికి ఇప్పట్లో తెమిలేది కాదనే వచ్చిన వారు వెళ్లిపోయేవారు. జయశంకర్‌తో కెసిఆర్ కూర్చుంటే ఆయన తన కుటుంబసభ్యులను కూడా మరిచిపోయేవారని చెబుతారు. తెలంగాణ ఉద్యమాన్ని హింసాత్మకంగా కాకుండా దీర్ఘకాలం కొనసాగాలంటే అహింసాత్మకంగా ఉండాలన్ని సిద్ధాంతీకరించి, టిఆర్ఎస్ నేత ఆచరణలో చూపించిన శాంతికాముకుడు జయశంకర్ తెలంగాణకు నిధుల్లో, నీళ్లలో, ఉపాధిలో జరిగిన అన్యాయంపైనే ఆయన ఎక్కువగా అధ్యయనం చేసేవారు. పైగా కాకిలెక్కలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శాసనసభలో ప్రవేశపెట్టే బడ్జెట్ పుస్తకాలను ముందేసుకొని గంటల తరబడి ఆయన లెక్కలు తేల్చుకుంటూ కనిపించేవారు. ఆయన ఏ సభలో మాట్లాడినా తాను చెప్పే సమాచారం ప్రభుత్వం అధికారికంగా ఇచ్చిందని తెలిపేవారు. బడ్జెట్ పుస్తకాలను తనకు తెచ్చిపెట్టమని తనకు సన్నిహితంగా ఉండే ఎమ్మెల్యేలకు ఆయన పదే పదే ఫోన్లు చేసేవారు. ఒక రోజు ఉదయం పదకొండు గంటల ప్రాంతంలో హన్మకొండలోని తన నివాసంలో జయశంకర్ కొందరితో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో కాకతీయ యూనివర్శిటీకి చెందిన కొంతమంది విద్యార్థి నాయకులు వచ్చి, తమను పరిచయం చేసుకున్నారు. 'సార్ కొంత మంది మా ఫ్రెండ్స్‌కు తెలంగాణ ఉద్యమమే అర్థమైతలేదు. సెల్ ఫోన్లు, సినిమాలు షికార్లు తప్ప, తెలంగాణవాదం ఎక్కడం లేదు. అన్నారు. చెప్పే విషయాన్ని వారి గుండెలకు హత్తుకునేలా చెబితే ఎలాంటివాడికైనా అర్థం అవుతుంది, ఆ ప్రయత్నం చేయండి' అని జయశంకర్ సూచించారు.'అదే సార్, వారికి అర్థం అయ్యేలా ఎలా చెప్పాలో తెలియకనే వచ్చాం' అని వారన్నారు. అది సింపుల్ థింగయ్యా అంటూ చెబుతూ మూడు ముక్కల్లో తెలంగాణ రాష్ట్రం ఎందుకు కావాలో చెబుతూ, 'ఆంధ్ర ప్రాంతం ఆంగ్లేయుల పాలనలో, తెలంగాణ ప్రాంతం నిజాం పాలనలో ఉంది. ఆంగ్లేయులు ఉండటంతో  వారికి ఇంగ్లీషు బాగా వచ్చింది. నిజాం పాలనలో ఉండడంతో మనకు ఉర్దూ, హిందీ బాగా వచ్చాయి. అయితే వారికి రాని హిందీ పరీక్ష  పాసుకావాలంటే 18 మార్కులు  వచ్చినా చాలు, మనకు రాని ఇంగ్లీషు పాసు కావాలంటే మాత్రం 35 మార్కులు రావాల్సిందే ఇది చాలదా ఇరు ప్రాంతాల మధ్య ఎలాంటి వివక్ష ఉందో. ఇదే విషయాన్ని వారికి అర్థమయ్యేలా చెప్పండి అని చెప్పగానే ఇక వారంతా అంతా అర్థమైందని పరుగెత్తుకెళ్లారు.

తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని చిన్న అంశాలతో అందరికి అర్థం అయ్యేలా చెప్పడంలో జయశంకర్‌కు మరెవ్వరు సాటిరారు. శ్రీకృష్ణ కమిటికి తెలంగాణపై జయశంకర్ పది నిమిషాల్లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశాక, ఇక ఇతరులు ఏమి చెప్పినా తమకు అర్థమయ్యేలా జయశంకర్ చెప్పారని వారు వాదించారంటే, ఆయన ఎంతటి సమ్మోహన బోధకుడో చెప్పాల్సిన అవసరం లేదు.

**- వెల్చాల చంద్రశేఖర్**

ఆంధ్రభూమి దినపత్రిక
22 జూన్, 2011

# మన సాంస్కృతిక ఉద్యమ తల్లిపేగు జయశంకర్

**- జూలూరు గౌరీశంకర్**

ప్రొంఫెసర్ కొత్తపల్లి జయంశంకర్ ఆర్థిక, రాజకీయ శాస్త్రాన్ని ఔపోసన పట్టినవారు. రాజకీయ, ఆర్థిక సామాజిక శాస్త్రాలను సాహిత్యానికి అన్వయించి సాంస్కృతిక రంగానికి తెలంగాణ తాత్విక పునాదులు వేసినవాడు. వేసినవాడు. కాళోజీ, జయశంకర్‌లు ఇద్దరూ తెలంగాణ ఉద్యమానికి రెండు స్తంభాల్లాంటివాళ్లు. కాళోజీకి సాహిత్య రంగంపై ఎంత పట్టుందో రాజకీయ, ఆర్థిక సామాజిక అంశాలపై అంతే పట్టుంది. అట్లాగే ఉపాధ్యాయ నాయకుడిగా, పరాపాలనా దక్షకుడిగా, తెలంగాణ సిద్ధాంతకర్తగా నిలిచిన జయశంకర్‌కు సాహిత్యంపై గట్టిపట్టుంది. ఇది ఆతరం వారికే సాధ్యమైందనుకుంటాను. జయశంకర్ భాషా శాస్త్రవేత్త కాకపోయినప్పటికీ భాషకు సంబంచి, ఉర్దూ తెలుగు కలగలసిన భాషా సౌందర్యం గురించి ఆయన పదేపదే చెప్పే వారు. తెలంగాణ రచయితల వేదికకు ఒక సాంస్కృతిక భూమికను అందించారు. జయంశకర్ చూపిన దారిలోనే తెలంగాణ వాదులు ముందుకు సాగారు. వారు ప్రతిపాదించిన సాహిత్య, తాత్త్విక పునాది తోనే వందల కలాలు తెలంగాణ ఉద్యమ కొలుమాలను రాజేస్తున్నాయి.

మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకుంటున్న తరుణంలో సాహిత్యం, సాంస్కృతిక రంగాన్ని పట్టిష్ఠం చేయడానికి జయశంకర్ ఎంతో కృషి చేశారు. గద్దర్‌లాంటి వ్యక్తులను కలిసి తెలంగాణ ఉద్యమానికి సాంస్కృతిక గజ్జె కట్టాలని కోరారు. 1996 లో అనేక సాంస్కృతిక సంస్థలను ఏకం చేయటంలో తెలంగాణవైపు సాంస్కతిక రంగాన్ని మరల్చటంలో జయశంకర్ పాత్ర మరువలేనిది. ఆయ ఎంతో చదువుకున్నవాడు. హిందీ, ఇంగ్లీషు ఉర్దూ, తెలంగు భాషలలో పట్టున్నవాడు. దేశదేశాలు తిరిగినవాడు. తెలంగాణ ఉద్యమానికి పెద్ద దిక్కు. ఆయన తెలంగాణ గుండె చప్పుడు. ఆయన తెలంగాణ సాంస్కృతిక పేగుబంధం. ఆయనను తెలంగాణ పదబంధాల నుంచి విడదీసి చూడలేము. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో అక్షరాలను ఆరని మంటలుగా చేసి సాహిత్య కొలుములు రాజేస్తం. ఆయన చూపిన దారిలో తుదికంట నడువడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి.

ఆయన వేదికల మీద రాజకీయ నాయకుడిలాగా గొంతెత్తి అరిచేవారు కాదు. తరగతి గదిలో పిల్లలకు పాఠం చెప్పినట్లుగా చెప్పేవారు. మొత్తం తెలంగాణ సమాజాన్ని తరగతి గది చేసుకొని ఉద్యమ పాఠం చెప్పిన సారు జయశంకర్. 1969 ఉద్యమంలో తెలంగాణకు సంబంధించిన ఉద్యమ పౌరుషాన్ని రగుల్కొలిపే గీతం కావాలని ఎదురుచూస్తున్న సమయంలో రావెళ్ళ వెంక్రటామారావు రాసిన తెలంగాణ గీతం మేము జాతిగీతంగా పాడుకునే వాళ్ళమని ఆయన ఈ తరానికి ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసేవారు.

'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అన్న శంకరంబాడి గీతాన్ని విశ్లేషించి ఇందులో తెలంగాణకు సంబంధించిన అసలు ఆనవాళ్ళులేవని, రుద్రమ్మ భుజశక్తి అన్న ఒక పదం ఇందులో తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక ఊసు గాని, అనవాళ్ళుగాని లేవని ఒక సాంస్కృతికమైన కదలికను తీసుకొచ్చారు. జయశంకర్ తన ఉపన్యాసాల్లో మా తెలుగు తల్లికి గీతాన్ని విశ్లేషించిన తర్వాతనే తెలంగాణ జన జాగృతి పాటలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. కరీంనగర్‌లో జర్నలిస్టు మల్లయ్య రాసిన తెలంగాణ వైతాళికులు పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన సుదీర్ఘమైన ప్రసంగం చేశారు. మహా ప్రస్థానం రాసిన శ్రీశ్రీ అనేక ఉర్దూ పదాలను ఉపయోగించాడని చెప్పారు. తెలంగాణ

భాషను తక్కువ చేస్తున్న ఆధిపత్య సంస్కృతి వివరిస్తూనే ఇతర ప్రాంతాలకు చెందిన ప్రముఖ సాహిత్య వేత్తలతో మాట్లాడి వాళ్ళను ఒప్పించిన ఘనత జయశంకర్ సార్‌దే. జంధ్యాల పాపయ్య శాస్త్రీతో మాట్లాడిన సందర్భరంగా అనేక విషయాలు ఆయనకు చెప్పారు. వకాల్తా, సిపాయి, బేఖాతరు, ఖబర్దార్, జబర్దస్తీ లాంటి అనేక పదాలను ఆంధ్రా ప్రాంతానికి చెందిన కవులు, రచయితలు, పత్రికలవాళ్ళు ఎలా ఉపయోగిస్తారో పాపయ్యశాస్త్రీకి వివరించి ఒప్పించారు. పోతన, పాల్కురికి సోమనాథుడు గురించి గుర్తుచేసేవారు. పోతన పద్యాలలోని తెలంగాణ పదాల్ని ఉటంకించేవారు. ఈ మట్టికి ధిక్కార తత్త్వం వుందని అందుకు పోతన ప్రతీక అని చెప్పేవారు. ఆంధ్ర, తెలంగాణ సంస్కృతుల మధ్య ఎన్ని తేడాలున్నాయో విశ్లేషించేవారు. ఇలా సాహిత్య, సాంస్కృతిక అంశాలు ముందుకొచ్చాయి. ట్యాంక్‌బండ్‌పై తెలుగు తేజోమూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించిన వారు తెలంగాణ వైతాళికుల విగ్రాహాలను ఎందుకు ప్రతిష్ఠించారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణకు సంబంధించిన సాంస్కృతిక యోధుల చరిత్రంతా కనుమరుగు చేశారుని ఆయన ఆవేదన వ్యక్తకం చేశారు.

వావిలాల గోపాలకృష్ణయ్య, కాళోజీ నారాయణరావులు ఇద్దరు. సాతంత్ర సమరయోధులే, ఇద్దరూ నిరాడంబరులే, సమాజం కోసం నిలబడ్డవారే. ఇద్దరు 3 నెలల తేడాతో చనిపోయారు. వావిలాల చనిపోయిన కొన్ని గంటలలోనే గుంటూరులో తేడాతో చనిపోయారు. వావిలాల చనిపోయనా కొన్ని గంటలలోనే గూంటూరులో ఆయన స్మారరక కేంద్రానికి 5 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని జయశంకర్ చెప్పారు. కానీ కాళోజీ నారాయణరావు కన్నుమూస్తే ప్రభుత్వం ఇప్పటి వరకు ఎన్నిసార్లు డిమాండ్ చేసినా వరంగల్‌లో ఆయన పేరిట స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని, ఇది వివక్ష కాదా అని ప్రశ్నించారు. జయశంకర్ ఒక ఉపాధ్యాయుడిగా ఒక సాంస్కృతిక డైరెక్షన్ నిచ్చాడు. తెలంగాణలోని ప్రజా సంఘాలన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా న్యూఢిల్లీలో బతుకమ్మ శకటాన్ని ప్రదర్శించారు. ఆయన పలు సాహిత్య, సాంస్కృతిక రంగాలకు సంబంధించింది. చేసిన సూచనలను, సలహాలను తెలంగాణ సాహిత్య లోకం గర్వంగా స్వీకరించింది. ఇటీవల సాహిత్యంలో వస్తున్న అనేక అస్తిత్వ ఉద్యమాలను జయశంకర్ అక్కును చేర్చుకున్నారు. అస్తిత్వ ఉద్యమాల మీద స్పష్టమైన వైఖరి వ్యక్తం చేస్తూనే, తెలంగాణ సాంస్కృతి కోద్యమానికి దిక్సూచిగా నిలిచారు.

నమస్తే తెలంగాణ దినపత్రిక
29 జూన్, 2011

***– జూలూరు గౌరీశంకర్***

---

# అశ్రునివాళి

తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ మృతి పట్ల తెలంగాణ రీజినల్ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ అఫిలియేటెడ్ కళాశాలల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున్‌రావు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. లక్షలాది మంది తెలంగాణ ప్రజలు ఆయన అంతక్రియల్లో పాల్గొనేందుకు బుధవారం సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పరిమితి చెందిన మేధావి, రాజకీయ దృక్పథం, పట్టుదల, నిబద్ధత కలిగిన ఒక సిద్ధాంతకర్త. తెలంగాణ కోసం ఆయన అహరహం పాటుపడ్డారు. ఆయన లేని లోటు తెలంగాణకు తీరనిది.

***–నారాయణ,*** *సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి*

జీవితం మొత్తం సమాజానికే అంకితం చేసిన మహానీయుడు. ఆస్తులు, భూములకు పంచిపెట్టిన గొప్ప వ్యక్తి. జీవితాన్ని తెలంగాణ కోసం త్యాగం చేసిన మహాపురుషుడి మరణం తెలంగాణకు తీరని లోటు.

***– హరీశ్వర్‌రెడ్డి,*** *టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే*

# వారం వారం మారనివాడు

- దేశపతి శ్రీనివాస్

ఏది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము నరుడ. నరుండగుట దుష్కరమ్ము సుమ్ము ఆ దుష్కరమైన దానిని సుసాధ్యం చేసి చూపించిండు జయశంకర్ సారు. తెలంగాణ మట్టి తీర్చిదిద్దిన అపురూపమైన మనిషి ఆయన. తెలంగాణ సంస్కృతిలో ఉన్న ఉదాత్త విలువలకు ఆయన ప్రతిరూపం. జీవితమంతా ఒకే ఎజెండాతో జీవించిండు. 'జయశంకర్ సార్‌కు ఎప్పుడు కోపం రాదు, ఆదే ఆయన దగ్గర నాకు నచ్చని లక్షణం' అని ఈ మధ్య నాతోటి ఒకాయన అన్నడు, నిజంగానే సార్ ఎప్పుడూ ఎవ్వరిపైనా పరుషంగా మాట్లాడంగా చూడలేదు. కోపమే కాదు, దుక్కం కూడా, సార్ మాటలల్ల ఎప్పుడూ స్వీయ సానుభూతి ఏ కోశానా కనిపించలేదు.

జయశంకర్ సార్‌ది మేఘ గంభీర స్వరం. ఆయన ఉపన్యాసం గంభీర నదీ ప్రవాహం. సప్రమాణమైన చర్చనే తప్ప ఖచ్చితమైన తర్కమే తప్ప సభా రంజకత్వంకోసం మాట్లాడే ఉపన్యాసం కాదు. ఆలోచనా బలంతోని వాదంలోని స్పష్టతతోని సారు సభ మీద ఒక గంభీర ముద్ర వేస్తాడు. భావన ఎంత స్పష్టంగా ఉంటుందో... వ్యక్తీకరణ కూడా అంతే స్ఫుటంగా ఉంటది. మాటల మధ్య విరామంతో కూడ ఒక వ్యక్తీకరణను సాధించడం సారుకు ఒక్కనికే తెలిసిన ఒక అద్భుత విద్య. చెప్పదలుచుకున్న భావానికి అనుగుణంగా పదాలు అంత అప్రొప్రియేట్‌గా ఎట్లా మీకు స్ఫూరిస్తయ్ సార్ అని నేనడిగినప్పుడు 'నేనే ముందు ఉర్దూలో ఆలోచిస్త. తరువాత సమానార్థకాలైన తెలుగుపదాలను వినియోగిస్తా' నని సారు చెప్పిండు. సారుకు ఉర్దూ అంటే అమితమైన ప్రేమ. మమకారం. ఉర్దూ కేవలం మహమ్మదీయుల భాష అని ఏనాడు అనుకోలేదు. ఒక మతానికి భాష ఉండొచ్చు. కానీ ఒక భాషకు మతం ఉండదని సారు అనేవాడు. జయశంకర్ సారు ఉర్దూ ప్రసంగాన్ని వినేటందుకు ఉర్దూ పండితులు కుడా చెవి కోసుకుంటరు. సారుకు చదువు చెప్పిన గురువు విద్వాన్ టీవీ సుబ్బారావు. ఆయన తన 80 ఏట ఉర్దూ నేర్చుకొని 'ఉర్దూ కవితా మాధురి' అనే పుస్తకం రాసిండు. గురువు పుస్తాకానికి శిష్యుడైన జయశంకర్ సారు గొప్ప ముందుమాట రాసిండు. తెలంగాణ ప్రజల భాషను 'తౌరక్యాంధ్రం'గా ఈసడించే ఆంధ్రా ప్రాంతీయుల అజ్ఞానానికి, అహంకారానికి జవాబుగా రాసిన ముందుమాట అది. తెలుగు భాషమీద ఉర్దూ భాష ప్రభావాన్ని విశదీకరించిన ఒక మాస్టర్ పీస్.

జయశంకర్ సార్‌ను చాలా మంది మితభాషి అనుకుంటారు. కానీ తన కిష్టమైన వాళ్లతోటి సారు గంటలకొద్ది మాట్లాడుతడు. సారు మాటల్లో హాస్య చతురత ఉంటది. ఒకసారి సార్ సభలో ఒక సభికుడు ప్రసంగానికి అడ్డంపడి' తెలంగాణ వస్తే ఏమస్తది సార్! మళ్లా గీ దొంగలే కదామనల్ని పరిపాలించేది' అన్నడు. దానికి సమాధానంగా సారు చెదరని చిరునవ్వుతో 'అవును ఆ దొంగలె పరిపాలిస్తరు. కని దొంగలు తినంగ మిగిలింది ఇప్పుడు రాజమండ్రికి పోతున్నది. తెలంగాణ వస్తే ఇక్కడనే ఉంటది' అని అనంగనె సభలో ఉన్న వాళ్లంతా ఒకసారిగా నవ్విండ్రు. ఉద్యమకాలంలో నాకు లభించిన అపురూపమైన వరం సారు సాన్నిహిత్యం. 2004 ఎన్నికలకు ముందు హనుమకొండ అశోక హోటల్‌లో జరిగిన ఒక సభలో సారుతో పాటు నేను వక్తను. సారు నాగురించి ప్రస్తావిస్తు 'నేనేమో తెలంగాణ గురించి మాట్లాడుతున్న పెద్ద పిచ్చోడిని, నాకు ఒక చిన్న పిచ్చోడి తోడు దొరికింది. ఈ రోజు నేను

ఎక్కువగ మాట్లాడను. దేశపతి మాట్లాడేది వింటాను' అని తక్కువ సేపు మాట్లాడి ముగించిండు. నేను మాట్లాడేది ఆసాంతం విన్నడు. సభ ప్రతిస్పందనను చూసి సంబురపడ్డడు.

సారుకు ఎక్కువ సన్నిహితమైన ప్రజాసంఘం తెలంగాణ విద్యావంతుల వేదిక. సారు 'మేధావులు' అనే పదం కన్నా 'విద్యావంతులు' అనే మాటను ఎక్కువగా ఉపయోగించేది. 'తెలంగాణ మేధావుల సంఘం' అని పేరు పెడదామంటే వద్దని, 'మనల్ని మనం మేధావులం అనుకుంటే అతిశయం ధ్వనిస్తది' అని 'తెలంగాణ విద్యావంతుల వేదిక' అనే పేరును సారే పెట్టిండు. ఎక్స్ట్రీం లెఫ్ట్ కన్నా దేశానికి ప్రమాదకరం ప్రజా ఉద్యమాలతో విద్యావంతులు మమేకం కాలేకపోవటం అని సార్ పదే పదే చెప్పేది. ప్రజలకు తమ కష్టాలకు సంబంధించిన అనుభవం ఉంటది. కానీ ఆ కష్టాల వెనుక ఉన్న వ్యవస్థాగత మూలాలకు సంబంధించిన ఎరుక ఉండదు. ఆ ఎరుకను కలిగించేంత శత్రువేమీ కాదు. అసలు ప్రజల పక్షం పిలిచిన వారెవరూ అజాత శత్రువులుగా ఉండలేరు. సార్ ఎన్నో నీలాపనిందలను సహించిండు. చాలా మందికి తమ అసంతృప్తులకు సారు బాధ్యత వహించక పాయెనని, టీఆర్ఎస్తో ఘర్షణకు దిగకపోయెనని కోపం ఉండేది. సారు ఎప్పుడు ఆ పని చేయడానికి ఇష్టపడలేదు. ఒకసారి ఒకాయన సారును పట్టుకొని 'మీరు తప్పు చేస్తున్నారు' అని పరుషంగా మాట్లాడిండు దానికి సారు 'నేను తప్పయితే నేను ఒకే తప్పును నిలకడగా చేస్తున్న' అని అన్నడు. అంటే రోజుకో తప్పు చేయకుండా ఉంటున్న. ఒకే మార్గాన్ని ఎంచుకున్నానని చెప్పిండు. ఈ మాటలు విన్నప్పుడు నాకు 'వారం వారం మారని వాడు' అంటూ వట్టికోట గురించి దాశరథి రాసిన కవితా పంక్తులు యాదికొచ్చినయి. కేసిఆర్ నిరహార దీక్ష సమయంలో వారి కుటుంబానికి జయశంకర్ సారు కొండత అండగా నిలబడ్డడు. ప్రభుత్వం కుట్ర పూరితంగా కేసీఆర్ను ఖమ్మం దవాఖానల ఉంచింది. నిజానికి కేసీఆర్తో పాటు జయశంకర్ సార్ అరెస్ట్ కాలేదు. కాని ఎట్ల పోయిండో కని ఒక చిన్న సంచి పట్టుకొని ఖమ్మం దావఖానల తేలిండు. దవాఖానల కరెంటు తీసేసి ఒక దశలో ప్రభుత్వం భయానక వాతావరణం సృష్టించింది. కేసీఆర్కు ప్రాణ హాని తలపెడతరే మోనని భయం అందరిని ఆవహించింది. ఈ విషమ సరిస్థితిలో జయశంకర్ సార్కు అనుక్షణం తండ్రివలె అండగా నిలిచిండు. ప్రభుత్వ కుట్రలను ఛేదించిండు. అటు కేసీఆర్ను ఇటు ఉద్యమాన్ని కాపాడిండు. డిసెంబర్ 9 ప్రకటనను సాధించుకున్న తరువాత తనే స్వయంగా నిమ్మరసం ఇచ్చి తల నిమిరి దీవించిండు.

శ్రీకాంతాచారి మృతదేశాన్ని గన్పార్కు స్థూపం దగ్గరకు తీసుకవచ్చినప్పటి ఒక సంఘటన గురించి జయశంకర్ సారు నాతోపాటు అనేకమందికి చెప్పిండు. ఒక విద్యార్థి సార్ కాళ్ల మీద పడి 'తప్పు చేసిన సార్' అని అనుకుంట ఏడ్చిండు, సార్ ఆ పిల్లగాన్ని అక్కున చేర్చుకొని ఏం తప్పు చేసినవు అని అడిగితే... ఉస్మానియాలో కేసీఆర్ దిష్టిబొమ్మతో పాటు మీ దిష్టిబొమ్మను కూడా కాలబెట్టిన అని అపరాధ భావనతో కుంగిపోతూ చెప్పిండు. మరెందుకు చేసినవు ఆ పని అని సార్ అడిగితే... ఒక పెద్ద మనిషి చెప్పితే చేసిన అని అన్నడు. సారు అవేవి మనసులో పెట్టుకోకుండా ఆ పిల్లగాన్ని క్షమించిండు.

కేసీఆర్ కేంద్రంలో మంత్రి పదవి చేపట్టి తెలంగాణ కోసం జాతీయ స్థాయిలో మద్దతు కూడగడుతున్నప్పుడు, జయశంకర్ సార్ కూడా తానూ ఓ అధికార పదవిలో చేరిండు. సార్కు ప్రధాని ప్రతిపాదన మన్మోహన్తో గల పరిచయం చాలా మందికి తెలువదు. ప్రధాని ప్రతిపాదన మేరకే ఆయన ఈ పదవిలో చేరిండు. ఈ పదవిలో ఉండి తెలంగాణ విషయమే పట్టించుకుంటానని ముందుగానే చెప్పిండు. ఢిల్లీలో ఇల్లు తీసుకుని, కారులో తిరిగే స్థోమత లేనందువల్ల అధికారిక పదవి చేపట్టడానికి అంగీకరించిండు. తెలంగాణ కోసం మద్దతు కూడ గట్టే వరకే ఆ పదవిలో ఉండి మళ్ళీ తెలంగాణకు వచ్చిండు.

శ్రీకృష్ణ కమిటీ వేయంగనే సార్ నివేదికను తయారు చేయడంలో తల మునకలైండు. ఒక బృహత్ నివేదికను తయారు చేసిండు. ఆ ప్రయత్నంలో తనకు తోడు నిలిచిన టీఆర్ఎస్ పొలిట్బ్యూరో సభ్యుడు శ్రవణ్కు ఇంగ్లీషులో ఉన్న ప్రావీణ్యాన్ని మెచ్చుకున్నడు. కమిటీ వారికి ఏవో సందేహాలున్న వంటే క్యాన్సర్తో బాధపడుతూ కూడా ఢిల్లీకి

పోయిండు. ఆ సమయంలో 'ఎందుకు సార్ మీకింత కష్టం' అని నేను ఫోన్ ద్వారా మెసేజ్ పెడితే, బదులుగా నాకు ఢిల్లీ నుంచి సార్ మెసేజ్ వచ్చింది. అందులో సార్ ఇట్ల అన్నడు.

Thanks for the fine sentiments. In all modesty I would like to say that at this stage in my life, I am living only for Telangana and if I loos my life for the sake of Telangana, it would be my good fortune - Jayashankar

సారును నిరంతరం నిందించిన వారు కూడా సారు మీద ఇప్పుడు పుంఖాను వ్యాసాలు రాస్తున్నరు. ఇప్పుడు సార్ దగ్గరకుపోయి మీ మార్గమే నిజమని తేలింది సార్ అని చెపుదామంటే సారు లేడు. సారు చూపించిన మార్గమే ఉన్నది. (కాళోజీ అన్నట్టు) జయశంకర్ సార్ వలనే మనం కూడా పాటలతో ప్రతి అడవిని తోటగా మార్చేద్దామా! నడిచిన ప్రతిబాట పక్క పూలను పూయిద్దామా!! కాలం ఎదమీద దీపం వెలిగిద్దామా!!!

**– దేశపతి శ్రీనివాస్**
తెలంగాణ కవి, గాయకుడు

నమస్తే తెలంగాణ దినపత్రిక
3 జూలై, 2011

---

# అశ్రునివాళి

ఉద్యమం చివరి దశకు వచ్చిన సమయంలో మంచి ఉద్యమ నాయకుడిని సాగింది. ఆయన మరణం ఉద్యమానికి తీరని లోటు. వృత్తిరీత్యా ఆయనతో కొంతకాలం పనిచేయడం నాఅదృష్టం. ఆయన చిరకాల స్వప్నం తెలంగాణ రాష్ట్ర సాధన జరగకుండానే తుదిశ్వాస విడవడం దురదృష్టకరం.

**–అంపశయ్య నవీన్,** *ప్రముఖ కవి*

టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోద్భలంతో గద్దర్‌పై కాల్పులు జరిగాయి. గద్దర్ అజ్ఞాతంలో ఉండగా ఈగ వాలలేదు. తన ప్రోద్భలంతోనే గద్దర్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ కాల్పుల సంఘటనకు కారకున్ని అయ్యానని జయశంకర్ చాలా కుమిలి పోయారు. అప్పటి నుంచి చంద్రబాబును ఆయన క్షమించలేదు. రెండు కళ్లతో బాబును కని పెట్టుకుని ఉండాలని అనేవారు.

**–పాశం యాదగిరి,** *తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్*

తెలంగాణ ఉద్యమానికి అందించిన ఆయన సేవలు వెలకట్టలేనివి. ఆయన చివరి ఊపిరివరకు తెలంగాణ కోసమే పోరాడాడు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కాపాడేందుకు నిరంతరం తపన పడ్డాడు.

**–ప్రొఫెసర్ పాపిరెడ్డి,** *రాజకీయ జేఏసీ చైర్మన్, వరంగల్*

తెలంగాణ ఏర్పాటుకు జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ మృతికి సంతాపం తెలియజేస్తూ అతని ఆశయమైన తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు పోరాడుతామని ప్రతిన బూనుతున్నాం.

**–రాజమహేందర్ రెడ్డి,** *తెలంగాణ ఎయిడెడ్ కాలేజీల స్టాఫ్ అసోసియేషన్(టాక్సా) అధ్యక్షుడు,*

**వెంకటరమణ,** *కార్యదర్శి*

తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఆయన ప్రజలకు ఎలుగెత్తి చాటారు. రాష్ట్ర ఏర్పాటే ఆయనకు నిజమైన నివాళి.

**–విక్రంకుమార్,** *తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు*

# మహోన్నత వ్యక్తిత్వం

**- అప్పరసు రమాకాంతరావు**

జీవితాన్ని వికాసవంతం చేసుకొని సమాజానికి మార్గదర్శకత్వం చేయాలని భావించే వారు కొందరే ఉంటారు. తాను నమ్మిన సిద్ధాంతం వివేకవంతమైనదే అన జీఇనమ్మితే ఆ సిద్ధాంతంకోసం జీవితాన్నే అంకితం చేయడం అందరికీ సాధ్యంకాదు. ఇలాంటి విలక్షణ గుణం కలిగిన మహా మనీషి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్. ఎందరో సిద్ధాంతకర్తలు పుట్టిన భూమి ఇది. తమతో సైద్ధాంతికంగా విభేదించినవారికి సైతం శాంతియుతంగా మృదువైన మాటలు చెపిప ఒప్పించే ప్రయత్నం చేసేవారు ఉన్నారు. ఆ కోవకు చెందిన జయశంకర్ ది తన భావాలతో వేభేదించినవారి అభిమానానికే పాత్రమయ్యే స్వభావం. ఆయన వ్యక్తిత్వం ఆయనను వృత్తిలోనే కాక, వ్యక్తిత్వంలోనూ ఆచార్యుని చేసింది. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 1934, ఆగస్టు ఆరోతేదీన వరంగల్ జిల్లా ఆత్మకూర్ మండలం అక్కంపేటలో జన్మించారు. ఆయన వరంగల్ లో పాఠశాల విద్య అభ్యసించారు. పద్దెనిమిది సంవత్సరాల వయసులో ఆయన ఎఫ్.ఏ చదవుతున్నప్పుడు (1952లో) రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణకు రాజకీయ అంగీకారం కుదిరింది. దాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. విద్యార్థులకు నాయకత్వం వహించి తరగతులను బహిష్కరించారు. బెనారస్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో ఎమ్. ఎ. పట్టా సాధించారు. సమాజంలో ఆర్థిక సామాజిక అసమానతలను విశ్లేషించేందుకే ఆర్థిక శాస్త్రాన్ని ఎంచుకొన్నాన్నది. ఆయన మాట జయశంకర్ మౌలికంగా గాంధేయవాది ఎలాంటి సామాజిక మార్పునైనా శాంతియుతంగా సాధించాలని చెప్పేవారు. హింస్మాక, ఉద్యమాలవల్ల మానిషి ఏదీ సాధించలేదని చరిత్ర విశదీకరిస్తుందని ఆయన ఎప్పుడు అనేవారు 1962లో 1968లో తెలంగాణ ఉద్యమాన్ని ఆయన తన పరిశోధనా రచనల ద్వారా చైతన్యవంతం చేశారు. 1968లో ఆయన ఉపన్యాసకుడిగా పనిచేసేవారు. తెలంగాణలోని వెనకబాటుతనాన్ని ఆ ప్రాంతవాసులకు జరుగుతున్న అన్యాయాన్ని పరిశోధన పత్రాల ద్వారా రచనల ద్వారా ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేశారు.

ఆర్థిక శాస్త్రంలో పి.హెచ్‌డి. చేయడానికి జయశంకర్ ప్రాంతీయ అసమానతలనే పరిశోధనా వస్తువుగా ఎంచుకున్నారు. తెలంగాణ పట్ల ఆయన తన స్పందనల్ని ఎన్నడూ తీవ్ర పదజాలంతో వ్యక్తం చేయలేదు. జయశంకర్ ఆయన మృదుస్వ భావి 2000 సంవత్సరంలో జరిగిన ఒక సంఘటన ఆయన ప్రవృత్తికి అద్ధం పడుతుంది. గాంధేయ సిద్ధాంతాలలో కాక, సయుధ పోరాటం ద్వాఆరా తెలంగాణ సాధించుకోగలమని వాదించిన ఒక వ్యక్తికి జయశంకర్ చెప్పిన సమాధానం ఇది సమాజమంటే ఏమనుకొటున్నారు.? మానిషి సంఘజీవి తోటి మానవులను హింసించడం తగదు. మానవత్వం కోల్పోయినప్పుడు సిద్ధాంతాలకు అర్థం ఉండదు. అన్నారు. ఈ మాటలు ప్రొఫెసర్ జయశంకర్ విలక్షణ భావాలకు ప్రతీకలు. ఎన్నో ప్రలోభాలు ఆయనను సిద్ధాంతాల గాడినుంచి పక్కకు తప్పించాలని చూశాయి. కేంద్ర ప్రభుత్వంలో ఎన్నో పదవుల్ని ఆయనకు ఎర చూపినా తన మార్గాన్ని విడువలేదు.

ఒక సిద్ధాంతాన్ని నమ్మడం వేరు, ఆచరించడం వేరు. ఉద్యమానికి ఆయన మార్గదర్శకత్వం చేశారేకాని, నాయకత్వం వహించలేదు. అందుకే ప్రొఫెసర్ జయశంకర్ ప్రాతీయతలకు, రాజకీయాలకు అతీతంగా అభిమానుల్ని సంపాదించుకున్నారు. 1991-1994 మధ్య ఆయన కాకతీయ విశ్వవిద్యాలయానికి కులపతిగా పనిచేశారు.

అంతకుముందు 1979-1981 కాలంలో ఆ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యుడిగా, కేరళ ప్రణాళిక బోర్డు సభ్యుడిగా పదవులు నిర్వహించారు. ఆయన మరణించే వరకు తెలంగాణ ప్రాంతంలోని సమస్యలపై అధ్యయనం నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ సంస్థకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకోసం పరితపిస్తూ జీవించిన ఆన్నత వ్యక్తి అలాంటి మహత్తర వ్యక్తిని ఈ సమాజం కోల్పోయింది. రాష్ట్రం అంతటా ఆయనకు అభిమానులున్నారు. భౌతికంగా మరణించినా ప్రొఫెసర్ జయశంకర్ అందరి హృదయాల్లో చిరంజీవి!

ఈనాడు దినపత్రిక
22 జూన్, 2011

**- అప్పరసు రమాకాంతరావు**

---

# అశ్రునివాళి

ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప మేధావి, విద్యావేత్త ఆయన నిరంతరం బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం శ్రమించారు, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. అయన మృతి తీరనిలోటు.

***-జూలకంటి రంగారెడ్డి,*** *శాసనసభా పక్ష నేత (సీపీఎం)*

అయన తెలంగాణ ప్రాంత సమస్యలపై నిరంతరం అధ్యయనం చేశాడు. ప్రజలను చైతన్యం చేశాడు. అలాంటి గొప్ప వ్యక్తి మృతి ఊహించని పరిమాణామం తెలంగాణ రాష్ట్ర సాధనతోనే ఆయన ఆత్మకు శాంతి కలుగుతుంది.

***-గాదారి కిషోర్,*** *రాష్ట్ర కన్వీనర్ (తెలంగాణ విద్యార్థి సంఘం)*

విద్యావంతుడిగా, ప్రొఫెసర్‌గా, వీసీగా జయశంకర్ రాష్ట్రానికి అందించిన సేవలు, యువతను చైతన్యవంతంగా నడిపించిన కృషి మరువలేనిది. ప్రజలు,బలహీనవర్గాలు గర్వపడే విధంగా జయశంకర్ సేవలు అందించారు.

***-చిరంజీవి,*** *ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు*

తెలంగాణను ఆంధ్రలో కలుపాలన్ననాడే విద్యార్థిగా దాన్ని ఆపడానికి శక్తికి మించి పడిన ఉబలాటం మరువలేనిది. ఐదు దశాబ్దాలుగా ఆంధ్ర కబంధహస్తాల నుంచి విముక్తి కోసం చేసిన పోరాటం సాటిలేనిది. జయశంకర్ స్ఫూర్తితో పోరాటాన్ని కొనసాగించి తెలంగాణ సాధించడమే ఆయనకు నిజమైన నివాళి. ఆ ఆశయాన్ని సాధించేవరకు విశ్రమించేది లేదు.

***-జి. జగదీష్‌రెడ్డి,*** *టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు*

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం నెరవేరకుండానే మరణించడం మనోవేదనకు గురించేసింది. తెలంగాణ రాష్ట్ర సాధనకు, జయశంకర్ కలలను సాకారం చేసేందుకు ఐక్యంగా పోరాటాలు చేస్తాం.

***-గజ్జల కాంతం,*** *ప్రజాసంఘాల జేఏసీ నేత*

ఆచార్య జయశంకర్ తెలంగాణ పక్షపాతి. తెలంగాణ కోసం రాజీలేని పోరాటం చేసిన యోధుడు.

***-వేదకుమార్, రత్నమాల, చిక్కుడు ప్రభాకర్ -*** *తెలంగాణ ప్రజాఫ్రంట్ నేతలు*

తెలంగాణ ప్రజల స్వాతంత్ర్యం కోసం విరామం ఎరుగని పోరాటాలు చేసిన ఆచార్య జయశంకర్ అమరుడు. అచార్య లోటు తీరనిదని, తెలంగాణను సాధించి నిజమైన నివాళులు అర్పిస్తాం.

***-బి. రాఘవేందర్‌రావు, కె. యాదయ్యగౌడ్ -*** *ఎంపిడిఒల సంఘం నేతలు*

# ఒక దీపస్తంభం

**- తెలకపల్లి రవి**

తాము పూర్తిగా ఏకీభవించని వారినెవరినైనా ఇతరులు గౌరవిస్తున్నారంటే అది వారి వ్యక్తిత్వానికి ప్రతీక. ప్రొఫెసర్ జయశంకర్ అక్షరాలా అలాంటి వ్యక్తి. అరవై ఏళ్లపాటు ఒకే మాటకు బాటకు కట్టుబడి నిస్వార్థంగా నిష్కల్మషంగా నిలబడ్డారు. తెలంగాణ విముక్తికి మొదటి తరంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి వారు ప్రతీకలైతే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత కాలంలో ఆ ప్రాంత సమస్యలకు ఆయన ప్రతిధ్వని అయ్యారు. అది పదవులతో ప్రచారాలతో సంబంధం లేని భావాత్మక ప్రాతినిధ్యం. అనుకున్నది జరగకపోయినా ఆకాంక్షకే కట్టుబడిన దృఢమైన ప్రాతినిధ్యం. విద్యా రంగంలో వున్నతమైన బాధ్యతలు నిర్వహించినా రాజకీయ నేతలకు గురుపీఠంలో భాసించినా జయశంకర్ నిబద్ధంగా నిరాడంబరంగా సంచరించారు. తనకు చాలా ఇష్టమైన మాటల్లో చెప్పాలంటే చెన్నారెడ్డి నుంచి చిన్నారెడ్డి వరకూ రకరకాలైన రాజకీయ పాత్రధారులు మారారు గాని తాను సూత్ర, ధారిగానే వుండిపోయారు. వచ్చీ పోయే నౌకలకు దారి చూపిస్తూ వుండిపోయే దీపస్తంభమే అయ్యారు. ఆయన ఆలోచనలను అన్ని వేళలా అందరూ ఒప్పుకుని వుండలేకపోవచ్చుగాని ఆయన అంకిత భావం, అధ్యయన శీలత, ఆచరణకు ప్రాధాన్యం ఇవ్వడం, ఆడంబరాలకు అట్టహాసాలకు దూరంగా వుండటం ఇవన్నీ ఆదర్శప్రాయమైనవి.

నాయకత్వం అనేక విధాల పట్టుపడుతుంది. భూస్వామ్య సంప్రదాయాలు గల దేశాల్లో కుటుంబ వారసత్వం ఒక మార్గం. పదవుల వల్ల, పై నుంచి ఆమోదం వుండటం వల్ల, ఒకానొక చారిత్రక సన్నివేశం వల్ల మనుషులు నాయకులవుతుంటారు. కాగా తమ నైతికతతోనూ జ్ఞాన సంపదతోనూ పట్టుదలతోనూ పోరాట పటిమతోనూ మరికొందరు నాయకత్వ పాత్ర పోషించగలుగుతారు. అధికార పూర్వకమైన నాయక స్థానాలలో మార్పులు చేర్పులుంటాయి. గాని నైతిక సైద్ధాంతిక కారణాల వల్ల లభించే నాయకత్వాలు అలా కాదు. వర్తమాన తెలంగాణ రాజకీయ దృశ్యంలో జయశంకర్‌ది అలాంటి నైతిక నాయకత్వమే. అది బలం బలహీనత కూడా. బలం ఏమిటంటే ఆటుపోట్లకు అతీతంగా కొనసాగడం. బలహీనత ఏమంటే తమ భావ పరివ్యాప్తికి ఎవరిపైనైనా ఆధారపడవలసి రావడం. నాయకుడు ఎవరైనా నేను నా భావాల విస్తరణకే ఉపయోగించుకున్నానని ఆయన తరచూ చెబుతుండేవారు. అయితే ఈ ఉపయోగించుకోవడం అనేది రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. ఈ సంగతి తెలుసు కనుకే వీలైనంత వరకూ ప్రత్యక్ష పదవులకు దూరంగా మసిలారు. 1969 ఉద్యమం తర్వాత చెన్నారెడ్డి తనను ఎన్నికల్లో పోటీ చేయమని పిలిస్తే నిరాకరించానని, అలా చేసి వుంటే తను కూడా ఒక మదన్ మోహన్‌లాగా మిగిలిపోయేవాడినని ఆయన ఒకసారి ఈ రచయితతో మాట్లాడుతూ అన్నారు. దాదాపు గంట సేపు రాష్ట్ర రాజకీయాలకు, వ్యక్తులకు సంబంధించి వివిధాంశాలపై జరిపిన చర్చ ఆయన అవగాహన విస్తృతికి అద్దం పట్టిందనే చెప్పాలి. అప్పటికే ఆయన జరరుజ భారాలతో కాస్త మెత్తగా వున్నారు.

1952కు ముందు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర వాదన వుండేది కాదని సుందరయ్య రాశారు. తర్వాత కూడా ప్రత్యేక రాష్ట్రం కోరిన వారిలో భిన్న తరహాలకు చెందిన వారున్నారు. తరాలకు చెందిన వారున్నారు. 1954లో ఫజల్ అలీ కమిటీ దగ్గరే ప్రత్యేకంగా వుండాలని జయశంకర్ మెమోరాండం ఇచ్చారంటే మొదటి నుంచి ఆంధ్ర

ప్రదేశ్ ఏర్పాటుకు ఆయన వ్యతిరేకంగానే వున్నారనేది స్పష్టం. ఫజల్ అలీ సిఫార్సుల పైన వాటి అమలుపైన అనేక భిన్నాభిప్రాయాలున్నాయి.

అయితే ఆనాడు దానికి మెమోరాండాలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు పలువురు తర్వాత తమ వైఖరి మార్చుకున్నారు. ఉదాహరణకు రాష్ట్ర ఏర్పాటుపై హడావుడి వద్దని అంతకన్నా ముందే దస్త్రం సమర్పించిన నీలం సంజీవరెడ్డి తర్వాత తనే మొదటి ముఖ్యమంత్రి అయ్యారు. మర్రి చెన్నారెడ్డి, కె.వి. రంగారెడ్డి వంటివారు మంత్రులయ్యారు. తమ రాజకీయ భవితవ్యాలు మారగానే ప్రత్యేక మంత్రం చేపట్టి మళ్లీ మానుకున్నారు. ఆ దశలో జయశంకర్ వారికీ మద్దతుగా నిలిచి తర్వాత నిరుత్సాహానికి గురైనారు. ఇక వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలోనూ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ప్రత్యేక రాష్ట్ర పల్లవి ఆలపించి సోనియా గాంధీకి మెమోరాండం ఇచ్చినప్పుడు వారితోనూ జయశంకర్ వుండి విషయ పుష్టి కలిగించేందుకు కారకులైనారు.

అంతకు ముందు కాలంలో విభజన ఉద్యమానికి 90ల తర్వాతకూ తేడా ఏమంటే అస్తిత్వం రాజకీయాలకు అంతర్జాతీయంగా ప్రోత్సాహం పెరగడమే. ఆ పదం వాడినా వాడకపోయినా మొదటి నుంచి ఆ తరహాకు చెందిన ఆలోచనలు కలిగిన జయశంకర్ వంటి మేధావులకు ఈ వాతావరణం కూడా బాగా దోహదం చేసింది. ఈ ప్రాంతంలో వెనకబాటు గురించి, అసమానతలు లేదా తాము అనుకునే వివక్షల గురించి సమాచార తాత్విక భూమిక ఏర్పాటు చేయడం అవసరమని వారు గుర్తించారు. ప్రపంచీకరణ విధానాల ఉధృతిలో పెరిగిన సమస్యలను ప్రాంతీయ కోణాన్ని మేళవించి విస్తృతమైన అధ్యయనం ప్రచార కార్యక్రమాలను తలపెట్టారు. దీని ఫలితమేమంటే అప్పటి వరకూ పాలకవర్గ రాజకీయ వేత్తల పాచికలకే పరిమితమైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఒక సిద్ధాంత రూపం తీసుకున్నది.

తాను సిద్ధాంత కర్తనని జయశంకర్ ఒప్పుకోకపోయినప్పటికీ ఈ కోణంలో ఆయన చిరకాల భావాలు అస్తిత్వ సిద్ధాంతాలకు అచ్చంగా సరిపోయాయి. కె.సి.ఆర్. 2000 తర్వాత తెలుగు దేశం నుంచి వైదొలిగాక, ప్రత్యేక రాష్ట్ర నినాదం తీసుకుని టి.ఆర్.ఎస్. ఏర్పాటు చేశాక సహజంగానే జయశంకర్ దానికి భీష్మ పితామహుడుగా మారాడు. భారతంలో భీష్ముడి పాత్ర పూర్వాపరాలు సుప్రసిద్ధమైనవే.

వామపక్షాల విద్యుత్ ఉద్యమ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వంపై పెరగిన అసంతృప్తి 2004లో కాంగ్రెస్ టి.ఆర్.ఎస్ కూటమి అధికారంలోకి వచ్చింది. తర్వాత వై.ఎస్. వైఖరి ఎలా మారిందీ రెండు చోట్ల రెండు రకాలుగా ఎలా మాట్లాడిందీ ఎవరూ కాదనలేని సత్యం. ఇప్పుడు ప్రధాన పార్టీలు సాగిస్తున్న ద్వంద్వ భాషణం అప్పుడు ఒక్క గొంతుతోనే వినిపించిన ఘనాపాటి వై.ఎస్! అయితే ఇదంతా పాలక పక్షాలకూ ఆ నాయకులకు సర్వ సాధారణమైన విషయం. వ్యూహాత్మకత ప్రయోజనాల పరిరక్షణ పేరుతో వారు దేన్నయినా సమర్థించుకోగలరు. జయశంకర్ వంటివారు అలా గాక అనుకున్నదానికే కట్టుబడి వాదనలు సమకూర్చుకోవడానికి ప్రయత్నిస్తారు. అందుకే ఆయన కమ్యూనిస్టేతర రాజకీయవాదులతోనే సన్నిహితంగా మెలిగినట్టు కనిపిస్తుంది. ప్రాంతీయ సమస్యల నుంచి ప్రపంచ సమస్యల వరకూ అన్నిటి పట్లా దృష్టి సారించే మార్క్సిస్టు రాజకీయాలకు ఒక ఉప ప్రాంతంపై ప్రధానంగా దృష్టి నిలిపే వైఖరికి మధ్యన తేడాలుండటంలో ఆశ్చర్యం లేదు. మరోవైపున ఆయనతో మమేకమైనట్టు కనిపించే పార్టీలైనా సరే ఆయన చెప్పిన ప్రతిదీ అమలు చేశాయని గాని చేయగలవని గాని అనుకోవడం కష్టం. భావాత్మక రాజకీయాలకూ వ్యూహాత్మక రాజకీయాలకూ తేడా అక్కడే వస్తుంది. అలాంటి తేడాలు ఎన్ని వున్నా ఆ రేఖలకు అతీతంగా ఆయన వ్యక్తిత్వాన్ని అందరూ గౌరవించడమే గొప్ప విశేషం.

ఇక జయశంకర్‌కు నివాళి సందర్భంలో కనిపించిన కొన్ని అవాంఛనీయ ఘటనలు ఆయన అనుసరించిన ఈ ఉన్నత జీవన సంప్రదాయాలకు అనుగుణమైనవి కావని చెప్పక తప్పదు. పూర్తిగా వ్యతిరేకించేవారికి కూడా గౌరవించే అవకాశం కలిగించడం ఆయన ఔన్నత్యానికి నిదర్శనమవుతుంది తప్ప నివాళిని నిరసనకు నిలయంగా చేయనవసరం లేదు. అనిశ్చితికి అసలైన చిరునామాగా మారిన ఈ రాష్ట్రంలో రేపు ఏ నిర్నక్ష్మీం ఎప్పుడు

వెలువడుతుందో, అసలు వెలువడుతుందో లేదో ఎవరికీ తెలియదు. తన రాజకీయ లాభనష్టాల లెక్కల తేలేవరకూ కేంద్రం ఎలాంటి ప్రకటన చేసే ప్రసక్తి వుండదు. ఇపుడున్న గజిబిజి అస్తవ్యస్త పరిస్థితులలో ఆ లెక్క అంత సులభంగానూ తేలదు. అందుకే అధిష్ఠానం దాగుడు మూతలు విరమించిన దాఖలాలు లేకపోగా సందేహాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ విధంగా ప్రాంతాలతో ప్రజలతో చెలగాటమాడుతున్న కేంద్రం వైఖరిని తెలుగు ప్రజలంతా నిరసించాల్సిన సమయమే తప్ప ఇది పరస్పరం ఉద్రేకాలు పెంచుకోవలసిన పని లేదు.

ప్రజలు ఎక్కడున్నా ప్రజలే. ప్రొఫెసర్ జయశంకర్ అనుకున్న అవగాహనకు ప్రాధాన్యం ఇచ్చారేగాని అసహనానికి కాదు. అదే సంయమనం, చర్చా సంప్రదాయం కొనసాగించడం ప్రజాస్వామిక పరిష్కారాలకు మార్గం సుగమం చేస్తుంది. ఫజల్ అలీ కమిటీ నుంచి శ్రీకృష్ణ కమిటీ వరకూ నడిచిన చరిత్ర అందరికీ అనేక పాఠాలు నేర్పింది. సవ్యంగా అధ్యయనం చేసేట్టయితే రేపటికి బాట చూపుతుంది. ఆ విధంగా స్వాతంత్ర్యానంతర ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రొఫెసర్ జయశంకర్‌కు తనదైన స్థానం వుంటుంది. చరిత్ర నిరంతరం నిర్మించబడుతూనే వుంటుంది తప్ప ఒక స్థిరబిందువు దగ్గర ఆగిపోదు.

***– తెలకపల్లి రవి***

ఆంధ్రజ్యోతి దినపత్రిక,
23 జూన్, 2011

---

# అశ్రునివాళి

తెలంగాణ కోసం జీవితకాలం పోరాడిన త్యాగశీలి. బడుగుల ఆత్మగౌరవాన్ని పెంచిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

***–అద్దంకి దయాకర్,*** *జేఏసీ నేత*

1952, 1969లలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, ఆ మార్గంలో అందరిని నడిపించారు. బీసీ కులంలో పుట్టి అన్ని సామాజికవర్గాలను ఏకంచేయడంలో సారు విజయం సాధిఇంచారు.

***– బెల్లయ్య నాయక్,*** *లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు*

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు సైద్ధాంతిక ప్రాతిపదికను ఏర్పరచి ఉద్యమానికి రూపం కల్పించిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్, దేశం గోప్ప మానవతావాదిని కోల్పోయింది. అసమానతను ఎత్తి చూపటంలో ఆయన నిరంతర పోరాటయోధుడు. ఆయన నిస్వార్థ నిష్కళంక జీవితం అందరికి ఆదర్శప్రాయం.

***–వైఎస్ జగన్,*** *వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు*

జయశంకర్ టీచర్. లెక్చరర్, ప్రొసర్, కేయూ ఉపకులపతిగా బాధ్యతలు నిర్వహిస్తునే తెలంగాణ జాతి విముక్తి కోసం నిరంతరం శ్రమించారు. ఆయన స్ఫూర్తితో ప్రతీ ఉద్యోగి రాష్ట్రం కోసం పోరాటం చేయాలి. ప్రజలందరూ ఏకమైనా ప్రజాప్రతినిధులు ఏకం కాలేదనే బాధను ఆయన వ్యక్తం చేసేవారు.

***–వి. శ్రీనివాస్‌గౌడ్,*** *తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం అధ్యక్షుడు*

ప్రొఫెసర్ జయశంకర్ మృతి తెలంగాణ ప్రజలకు తీరని లోటు. నా ప్రగాఢ సంతాప. ఆయన ఆత్మకు శాంతి కలుగాలని ఆ భగవంతుడ్ని వేడుకుంటున్నాను.

***–డిఎస్,*** *సీపీసీ మాజీ అధ్యక్షుడు*

# ఋషితుల్యుడు

**- లోచన్**

కేలిఫోర్నియాలో ఉన్న నేను జూన్ 21 ఉదయం టి.వి.లో ప్రొఫెసర్ జయశంకర్ కన్నుమూత అనే వార్త విని నిశ్చేష్టుడినైపోయాను. జయశంకర్‌తో నాకు 50 ఏళ్ళ స్నేహం. ఆయన హనుమకొండలో టీచర్‌గా పనిచేస్తున్న కాలంలో రాష్ట్ర ఉపాధ్యాయ కార్యకలాపాల్లో చాలా చురుకుగా పాల్గొనేవారు. అధ్యాపకుల సమస్యల పట్ల, సమస్యల పరిష్కరం కోసం చేపట్టవలసిన కార్యక్రమాల పట్ల ఆయనకు స్పష్టమైన అవగాహన ఉండేది. ఆయన ఏ సంస్థలో పనిచేసినా, ఏ పని చేపట్టినా సమగ్ర అవగాహనతో, అంకిత భావంతో ముందుకు పోయేవారు. ఆనాటి రాష్ట్రోపాధ్యాయ సంఘాధ్యక్షులు, మేధావి, పత్రికా సంపాదకులు వి.పి.రాఘవాచార్య, ఆనందరావు తోట, వామన్‌రావు అంజుట్టి వంటి ప్రముఖులు తరచుగా ఉపాధ్యాయ ఉద్యమకేంద్రమైన వరంగల్‌కు వచ్చి సభలూ సమావేశాల్లో పాల్గొనేవారు. అధ్యాపకులకు సంబంధించిన ఆనాటి అన్ని కార్యక్రమాల్లో జయశంకర్ వ్యక్తిత్వం ఎందరికో ప్రేరణగా ఉండేది. వరంగల్‌కే చెందిన మరో మేధావి, గాంధేయవాది ప్రొఫెసర్ ఫర్మాజీ, ప్రొఫెసర్ శ్రీధరస్వామి, జయశంకర్‌కి అత్యంత సన్నిహిత మిత్రుడు ఉత్తమ అధ్యాపకుడు ఆర్.వెంకటేశ్వర్లు విడదీయరాని కామ్రేడ్లుగా, అవిరామంగా పనిచేసి హనుమకొండ రాష్ట్రోపాధ్యాయ శాఖను చైతన్యవంతమైన సామూహిక శక్తిగా తీర్చిదిద్దారు. ఈ అన్నింటిలోనూ జయశంకర్ పాత్ర ఉపాధ్యాయ వర్గానికి స్ఫూర్తిదాయకంగా ఉండేది. సంఘ సభ్యునిగా ఆయనతో కలసి పనిచేయడం నాకు ఎంతో ఉత్సాహంగా ఉండేది.

నాలుగు నెలల క్రితం హనుమకొండ అడ్వకేట్ కాలనీలో జయశంకర్ ఇంటికి పరామర్శించడానికి వెళ్ళి ఆయనతో మాట్లాడినప్పుడు ఆయనకేమీ కాదు కోలుకుంటారు అనిపించింది. ఆ మాటలే ఆయనతో అన్నప్పుడు "లోచన్! జీవితంలో చాలా చూశాను. నాకు తృప్తిగానే ఉంది. ఇప్పుడు ఇక ఏమైనా పర్వాలేదు" అని ఒక్క క్షణం ఆయన శూన్యంలోకి చూస్తుండిపోయినప్పుడు నామనసును ఏదో విచారం ఆవరించినట్లైంది. "మీకేమీ కాదు మీరు త్వరలోనే కోలుకుంటారు" అని సెలవు తీసుకుని వచ్చేశాను. నాకు తృప్తిగానే ఉందన్నప్పుడు భయానకమైన తన క్యాన్సర్ బాధను పక్కనపెట్టి తెలంగాణా తప్పక వస్తుందన్న విశ్వాసం, అందుకోసం తన శక్తికిద్దీ కృషిచేయగలిగాననే తృప్తి ఆయన ముఖంలో కనిపించింది. నేను ఆయన పక్కన కూర్చున్నంత సేపు ఆయన చిన్ని మనుమరాలు (తాను పెంచుకున్న కొడుకు కూతురు) ఒక్కక్షణం కూడా వదలకుండా ఆయన ఒడిలోనే కూచుని ఆయన మెడచుట్టూ చేతులు వేస్తూ గారాబు చేయడం ఇప్పుడు తలచుకుంటుంటే ఆ దృశ్యం ఆ అనుబంధం నా కళ్ళముందు అలా కదలాడుతున్నది.

హనుమకొండ అడ్వొకేట్స్ కాలనీలో ఆయన ఇల్లు బాలసముద్రంలో మా ఇంటికి చాలా దగ్గరే. కాని ఎందుకో హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎదురు సందులో ఉన్న ఆయన పాత ఇల్లేనాకు బాగా గుర్తుండిపోతుంది. అక్కడ ఆయన నిత్యం తన మిత్రుల్ని కలుసుకోవడం, సన్నిహితులతో ముచ్చటించడం ఆయన అధ్యయనం, స్కూల్ టీచర్ నుంచి వైస్‌ఛాన్స్‌లర్ దాకా ఎదిగిన క్రమం ఆ ఇల్లును చూసినప్పుడు గుర్తొస్తాయి.

కాళోజీ సోదరులతో ఆయనకున్న అనుబంధం చాలా ప్రత్యేకమైంది. వాళ్ళిద్దరి యెడల ఎంతో చనువుగా,

పూజ్యభావంతో మెలిగే వారు.ఎప్పుడు కలుసుకున్నా వాళ్ళ మధ్య సంభాషణ ఎన్నో సామాజిక మానవీయ కోణాలను స్పృశిస్తూ అక్కడున్న వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా వుండేది. నేను పెదకాళోజీ (రామేశ్వరరావు) మీద రాసిన ఒక స్మృతి గీతం విని ఆయన మెచ్చుకున్నా తీరు ఆయన సహృదయతకి, కాళోజీ గొప్పతనానికి గుర్తుగా ఇంకా నామనసులో మిగిలే ఉంది.

తెలుగు, ఉర్దూ భాషల పట్ల, ఆ భాషల అందం అభివ్యక్తులపట్ల ఆయనకు మంచి అవగాహన ఉండేది. ఇది ఆయన అతిథిగా పాల్గొన్న అనేక సాహితీ సమావేశాల్లో, ఉర్థూ ముషాయరాల్లో వ్యక్తమయ్యేది. జయశంకర్ మార్క్సిజంతో పూర్తిగా ఏకీభవించక పోయినా కొందరు వీరప్రజాస్వామిక మేధావుల్లాగా దాన్ని ద్వేషించలేదు. దాని మీద విషం కక్కలేదు. అదేపనిగా దాడులు చేయలేదు. అభ్యుదయవాదిగా సమాజం పట్ల తనదైన విశాల సామాజిక, ఆర్థిక, చారిత్రక దృక్పథం ఉండిన మేధావి ఆయన.

జయశకర్ మంచి వక్త కూడా. శ్రోలికి పోకుండా నిలకడగా, సౌమ్యంగా కాని దృఢంగా, మంచి విశ్లేషణతో మాట్లాడి విషయానికీ. సందర్భానికీ న్యాయం చేస్తూ సభల్లో సమావేశాల్లో తనదైన శైలిలో ముందుకు నడిచేవారు.

ఆయన మంచి పరిపాలనా దక్షుడని ఆయనతో పనిచేసిన ఎవ్వరినడిగినా చెబుతారు. హైదరాబాద్‌లో సీఫెల్ రిజిస్ట్రార్‌గా, వరంగ ల్‌లో సి.కె.యం. కాలేజీ ప్రిన్సిపాల్‌గా కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా వైస్ ఛాన్సలర్‌గా ఆయన గణనీయమైన సేవలను అందించారు. ఇంకా కొంత కాలం ఆయనే ఉంటే మా సంస్థ బాగుపడేదని అందరిసహచరులతో అని పించుకున్న సమర్థుడు జయశంకర్.

తెలంగాణా జీవితం పట్ల, తెలంగాణా భాష పట్ల, సంస్కృతీ సంప్రదాయాల పట్ల ఆయనకు లోతైన, ఆత్మీయ అవగాహన ఉండేది. తెలంగాణ కన్నీళ్ళ పట్ల, తెలంగాణ కోపం, ధిక్కారం పట్ల, పోరాటాల పట్ల, పోరాట వీరుల పట్ల ఎనలేని ప్రేమాను బంధాలుండేవి. తెలంగాణా వనరుల పట్ల. వనరుల దోపిడీ విధ్వంసాల పట్ల ఆయనకు మేథమేటికల్ అండ్ సైంటిఫిక్ ప్రమాణాలతో కూడిన సంపూర్ణ అవగాహన ఉండేది. ఇలా తన ప్రతి అంగుళం తెలంగాణ ప్రతిరూపమూ, ప్రతిక్షణం తెలంగాణ ఊపిరా అన్నంతగా ఆయన తెలంగాణ ఉద్యమంతో మమేకమ య్యారు. అందుకే ఆయనను తెలంగాణ విజ్ఞాన సర్వస్వమన్నారు, తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త అన్నారు. సిద్ధాంతకర్త అనేది చిన్నమాట. నిజానికి తెలంగాణ ముద్దుబిడ్డ తెలంగాణ తనానాకి నిండైన రూపం.

జీవితంలో ఆయన ఎన్నడూ ఆడంబరాలను కోరుకోలేదు. సాదాసీదా స్నేహమయ తెలంగాణ భోళో ఋషితుల్య జీవితాన్నే గడిపారు. తను పుట్టిన ఊరు అక్కంపేటలో తనకు చెందిన రెండె కరాల భూమిని 2001 లో అక్కడి జిల్లాల పరిషత్ హైస్కూల్‌కి ఉచితంగా ఇచ్చేసిన ఉదారుడు త్యాగశీలి జయంశకర్. తెలంగాణా వాదానికి గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని, ప్రజాస్వామ్యతత్వాన్ని, ఒక పవిత్రతను తెచ్చిన చారిత్రక వ్యక్తిత్వం ఆయనది ఆయనది. మేధావులు, విద్యాసంస్థలు సమాజ చలనానికి, మార్పుకి ఎలా ఉపయోగపడవచ్చో జయంశంకర్ జీవితం చెపుతుంది.

గత సంవత్సర కాలంగా వరసగా ఎందరో మేధావులు, ప్రజా హక్కుల పోరాట యోధులు, సమాజసేవకులు కన్నుమూశారు. మొన్న బాలగోపాల్, శంకరన్, నిన్న బుర్ర రాములు, ప్రత్తి పాటి, ఆర్.ఎస్.రావు, ఇలా ఇది నేల తల్లి ముద్దు బిడ్డలు నిష్క్రమించేకాలమా అని అనిపిస్తున్నది. ఒక్కొక్కరే మన మధ్యనుండి వెళ్ళిపోతుంటే నిన్నటి కన్నా ఈ రోజు మనం పేదవాళ్ళం, నిస్సహాయులం అయిపోయామా అనిపిస్తున్నది. జయశంకర్‌లేని తెలంగాణను, జయశంకర్‌లేని హనుమకొండను ఊహించడమే కష్టం. అసలు ఈ వెలితి పూడుతుందా అనిపిస్తుంది. అయితే చలన శీలమైన మన సమాజంలో అనేక వైరుధ్యాల మధ్య . సంఘర్షణల మధ్య నూతన సృజన జరుగుతూనే ఉంటుంది. జయశంకర్‌లాంటి మేదావుల, త్యాగధనుల స్ఫూర్తి నుంచి అమరవీరుల వెలుగుల మేధావుల, త్యాగధనుల స్ఫూర్తి నుంచి అమరవీరుల వెలుగుల నుంచి నూతన నాయకత్వం పుట్టుకు వస్తుంది. తెలంగాణ యువకులే ఆయన ఆశాదీపాలు– ఆయన అందించిన కాగడాను అందుకొని ముందుకుసాగే గురుతరమైన బాధ్యత వారిపై ఉంది.

ఆయన తెలంగాణకి తన జీవితాన్ని ఇచ్చాడు. తెలంగాణను తన్న ప్రాణాలతో ప్రేమించిన ఆయనకు మనం ఇవ్వగలిగిన నివాళి తెలంగాణ సాధనే. కన్నీటితో కాదు కార్యదీక్షతో ...

జయశంకర్ అంటే తెలంగాణే కదా!

**- లోచన్,**

కేలిఫార్నియా (అమెరికా)

ఆంధ్రజ్యోతి దినపత్రిక
30 జూన్, 2011

---

# మహోన్నత వ్యక్తి జయశంకర్

ప్రొఫెసర్ జయశంకర్ మరణం తెలంగాణ ఉద్యమానికి తీరని లోటు. యాభై ఏళ్లుగా తెలంగాణ కోసం పోరాడుతున్న జయశంకర్ లేని లోటు పూడ్చలేనిది. ఆయన నిబద్ధత, త్యాగనిరతి ఆదర్శగా తెలంగాణ ఉద్యమం ముందుకు పోవాలి. రాష్ట్రాన్ని సాధించాలి. ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాచరణలో గొప్ప గాంధేయవాదిగా నిరూపించుకున్నారు. 1952 నాటి ముల్కీ ఉద్యమం తొలి అడుగు నుంచి మొక్కవోని దీక్షతో పోరాటం చేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల గురించి సవివరమైన సమాచారంతో... వివక్షను ఎండగట్టారు. ఎప్పటికప్పుడు తాజా గణాంకాలతో.. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని, వివక్షను ఎత్తిచూపారు. అలాగే తెలుగు మాట్లాడే ప్రాంతం రెండు రాష్ట్రాలుగా విడిపోయి ఎలా అభివృద్ధి చెందుతాయో కూడా శాస్త్రీయంగా వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నైతిక మద్దతును అమెరికాతో పాటు దేశదేశాల్లో కూడగట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఢిల్లీలో అన్ని పార్టీల కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించడంలో కీలక భూమిక పోషించారు. అన్ని రాజకీయ పక్షాలతో.. తెంగాణకు అనుకూలంగా ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖలు ఇప్పించారు.

తెలంగాణకు జరుగుతున్న వివిక్ష, అణిచివేత, దోపిడీని సాధికారికమైన విషయ పరిజ్ఞానంతో... ఎటువంటి విసుగు, విరామం లేకుండా వివరించేవారు. తన నిరంతర పోరులో ఎప్పుడూ, ఎక్కడా తన స్థానం గురించి ఆలోచించలేదు. పాకులాడలేదు. అతని సుదీర్ఘ అధ్యాపక, పాలనా పరమైన వృత్తిలో... మంచి పాలనాదక్షుడిగా మేధావిగా నిరూపించుకున్నారు. ప్రధాన రాజకీయ స్రవంతికి దూరంగా ఉంటూనే వాటిని ప్రభావితం చేశారు. ఈ నిస్వార్థ రాజకీయ ఆచణే అందర మన్ననుల పొందే మేధావిగానూ, నేతగానూ చేసింది. ఆ మహానుభావునికి తెలంగాణ ప్రజల తరపున నివాళిలర్పిస్తున్నారు. తెలంగాణ ఉద్యమం కీలక దశకు చేరుకున్న దశలో.. ఇంకా ఎక్కువ సలహాలు, సూచనలు అవసరమున్న సందర్భంలో జయశంకర్ లేకపోవడం విశాధం ఆయన లేని లోటును ఆయన అనుచరులుగా.., అనుమాయులుగా ... తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకోని పోవడంలో కృషి చేయాలి. ఆయన కలను నిజం చేయాలి. అదే.. ఆయనకు నిజమైన నివాళి.

**- సి. హెచ్. హనుమంతరావు**

ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యులు

నమస్తే తెలంగాణ దినపత్రిక
27 జూన్, 2011

# తెలంగాణ శిఖరం

- జూలురు గౌరీశంకర్

పంటను కావలి కాసే చూపు పోయింది.
పిల్లల్ని విడిచి తల్లికోడి మాయమైంది
బుజ్జగించి బువ్వపెట్టే అవ్వ చెయ్యి ఒక్కసారి
అగిపోయింది.
నేలమ్మ తన బిడ్డను
తనలో కలుపుకోతలేక గుక్క పెట్టింది.
కాల పరీక్షక కాలమే నిలువలేక
జయశంకర్ ముందు బిక్కుబిక్కుమంది
జగానికి వెలుగురేఖ జయశంకర్
అధిపత్యాన్ని అడ్డంగా నరికిన
భావజాల ఖడ్గం జయశంకర్
పెనుగులాట ఉన్నంత కాలం
మౌన రుద్రుడు
జయశంకరుంటాడు
స్వేచ్ఛకు పర్యాయపదమాయన!
మా గాయాలకు కట్టువునువ్వు
మా భావాల పల్లకివి నువ్వు
అలుపెరగని నీ దారిలో
అడుగులు వేస్తే చాలు
ఈ అక్షరాలు అగ్గిమంటలౌతాయి.
నీ భావజాల డొలికలలో ఊగిన
సాంస్కృతిక పేగుబంధం
తెలంగాణ ఉద్యమ పోరైంది.
నువ్వు తెలంగాణ బతకమ్మవు
ప్రతి తల్లి నెత్తిన పెట్టుకున్న
ఆశయాల బోనానివి
అవ్వల ఆశల కొంగుముడిని
మా తెలంగాణ అక్షర మాలవు
పోరుపదాల నిఘంటువు!
తన జీవితాన్ని ఈ నేలపై పరిచి
తన దేహాన్ని తెలంగాణ
చేసికొన్నాడు
తెలంగాణ యింటికోసం
అన్ని సుఖాలను వదిలిన ఋషి
తన పాఠం తెలంగాణ
తన భాష తెలంగాణ
తన దిరి- దాపు తెలంగాణ
ఆయన తెలంగాణ శిఖరం!
స్వప్నం చితకదు
అది జయశంకర్ మాటై
తెలంగాణ జెండైతది
గెలుపు వాకిళ్లకాడికి
వస్తున్నప్పుడు
స్వప్నం కాపలాదారులడు
కన్నుమూశాడన్న
బాధ కాలమే.. తెలంగాణ కోసం
జయశంకర్ ని కన్నది ఆయన స్వప్నానికి
కాలమే తన రెండుకళ్లనిచ్చి
ఆయన చూపులో పొందించ్చి ఆయన తపస్సుకు
కాలం కరిగింది తెలంగాణ వరాన్ని
అందుకుంటున్నప్పుడు ఆ తపస్వీ తన రెండు కళ్లను
మళ్లీ కాలానికే యిచ్చేసాడు తెలంగాణ ఆయన జీవన వేదం
ఆయన తెలంగాణ నిలువెత్తు రూపం
తెలంగాణ ఆయన వూపిరి ఆ నినాదమే ఆయన బతుకు
పుట్టుక చావు తెలంగాణే మా జాతి జెండావు నువ్వు
మా ఆశల నిజ స్వప్నం నువ్వు
ఈ మట్టి మర్చిపోలేని మాటలు తెలంగాణ జయశంకర్
మా ఆశయాల కొలిమి
జయశంకర్ మా ఆవేదనల కుంపటి ఆయన
అధిపత్యం గుండెలదరగొట్టి తెలంగాణ గూడుకట్టుకున్న
ఆ భావజాలం మా సుదీర్ఘ తెలంగాణ
విముక్తి ప్రయాణం ఇది స్మృతి గీతం కాదు.
తెలంగాణ సాధనే అయనపై రాసే నిజమైన ఎలిజి!

- జూలురు గౌరీశంకర్

# ఓరుగల్లు పోరుబిడ్డ

**- పెసరు లింగారెడ్డి**

ఓరుగల్లు పోరుబిడ్డ ఒదిగిపోయెరా,
పోరులోన ఆశాజ్యోతి ఆరిపోయెరా! ॥ఓరుగల్లు॥

కాకతీయ ప్రాంగణమ్ము కమిలిపోయెరా,
ఉస్మానియా పరిసరాలు ఉడికిపోయెరా! ॥ఓరుగల్లు॥

మూడుతరాల ముద్దుబిడ్డ మునిగిపోయెరా,
కూలి, నాలి – బీదా, బిక్కి కుమిలిపోయెరా! ॥ఓరుగల్లు॥

కొత్తపల్లి జయశంకర్ కొలిమి ఆయెరా,
ఎండుతున్న కడుపులల్ల మంట బెట్టెరా! ॥ఓరుగల్లు॥

ఉడుకుతున్న ఉద్యమానికుప్పొయెనురా,
ఐక్యతనే ఆయుధంగ చేసి చూపెరా! ॥ఓరుగల్లు॥

పొల్లుబోని మాటలింక మల్లినలేమా,
నగుమోము నమ్మకము మేం గనలేమా! ॥ఓరుగల్లు॥

ఆయుధాల అక్షరాలు చదువగలేమా,
కళ్లకు కట్టేటువంటి కవితలు రావా? ॥ఓరుగల్లు॥

అరవయేండ్ల పోరు ఇంక అలసిపోయెరా,
ఆంధ్రరోళ్ల కళ్లు ఇంక సల్లబడ్డయా? ॥ఓరుగల్లు॥

జాతికొరకు జన్మనంత ధారపోసెరా,
తెలంగాణ బ్రహ్మగాను ఎదిగిపోయెరా! ॥ఓరుగల్లు॥

విధిరాతను ఎదిరించలేక ఊపిరొదిలెరా,
ఆశయాల ఊపిరులు మనకు ఊదెరా! ॥ఓరుగల్లు॥

**- పెసరు లింగారెడ్డి,**
హైదరాబాద్

# జీవనది ఆగిపాయే ...

- వనపట్ల సుబ్బయ్య

దుక్కల దాహం తీరకుండానే
దూళ్ల దూపారక ముందే
జీవనది ఆగిపోయే

గుడిసెలో దీపం వెలుగకుండానే
గుడిమీద జెండా ఎగురకమునుపే
శిఖరం కూలిపాయే

పలక మీద అ,ఆలు దిద్దకముందే
పోరలు ప్రొఫెసర్లవ్వకమునుపే ...
కొత్తపల్లి పాఠం మూగపాయే ...

అరవై ఏళ్ళ ప్రయాణంలో
ఆశయం అంకురించకముందే
అస్తమించిన సూర్యుడు

చాణక్యుడు బోధించినా
చంద్రగుప్తులు గెలువకమునుపే ...
పొద్దు వాలిపాయే!

- వనపట్ల సుబ్బయ్య

---

# దుక్క

సలసల మసిలే కన్నీళ్ళ కోనేరును
వాదన చేసి వాదంగా నిలిపినవు
కమ్ముకున్న కమ్మ కుట్రల రట్టు చేయగా
వేదన వాదనలను సిద్ధాంతంగా మలిచినవు

నూనూగు మీసాల నుంచి నిన్నమొన్నటి దాకా
మిడతల వలసను కండ్లార చూసి
పుట్టిన పీడన రడపుండ్లకు మలాం రాస్తివి

వేల వేల ఉపన్యాసాలు వ్యాసాలు పుస్తకాలు
ఎన్ని చేస్తివి! ఎంత తిరుగుతివి! ఎంత రాస్తివి!
జయశంకర్ సార్!! తెలంగాణా ఆకాశంలో ధృవతారవు
నీ మరణం ఈ దుక్కి నిండా దుక్కపాతం

- అన్నవరం దేవేందర్

# జయశంకర్! జయ తెలంగాణ!!

**– జూకంటి జగన్నాథం**

మొగ్గ
పువ్వుగా విచ్చుకుంటున్న
చప్పుడు విన్నవాడు

పెదవి
క్షణంలో నవ్వును సింగారించుకుంటున్న
వెలుగును కన్నవాడు

కలను – రగిలిన జన కుంపటిలో కాచి
తెలంగాణ తల్లి సిగపువ్వు
నగగా మలచడం తెలిసినవాడు

నది పక్కనున్నా – గుక్కెడు నీళ్లకోసం
స్తన్యం అందని సంటిపిల్లలా
ఎక్కెక్కి ఏడుస్తున్న
భూమాత వెత కత ఎరిగినవాడు

గత వర్తమాన – భూతకాలాల వంతెన
దిగులు పడ్డ ఉద్యమానికి
ఊపిరినే ప్రాణవాయువుగా
యిచ్చిన ధీరుడు

నీస్వప్నం
నాలుగున్నర కోట్ల ప్రజలు
నిజం చేయడానికి
భుజం మీది కెత్తుకున్నరు

తెలంగాణ గోస ఆశవు
తెలంగాణ ఆర్తి కీర్తివి
నీ వొక మిత్తి లేని కొవ్వొత్తివి
జై శంకర్! జైజై శంకర్!!
జయశంకర్! జయ జయ తెలంగాణ!!

---

తెలంగాణ ప్రాంతపు ప్రజలు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని గళం విప్పినప్పుడల్లా కొన్ని సందేహాలు, కొన్ని ప్రశ్నలు ఎదురవుతూ వుంటాయి. ఈ ప్రశ్నలు వేసేవారిలో కొందరికి చారిత్రక నేపథ్యం తెలియదు, కొందరికి రాజకీయ పరిణామాల అవగాహన వుండదు. కొందరికి ఉండేది స్వార్థ చింతనైతే మరికొందరికి తెలుగు రాష్ట్ర సమగ్రతను కాపాడాలనే తపన. ప్రశ్నలకు, సందేహాలకు కారణాలేవైనా వాటికి సరియైన సమాధానాలను వెదకటం చాలా అవసరం.

**– ప్రొఫెసర్ జయశంకర్**

---

# అశ్రునివాళి

50ఏళ్ళుగా తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ సాబ్ మరణం దిగ్భ్రాంతి కలగజేసింది.

**–దుర్గాబాయి,** *తెలంగాణ ఉద్యోగుల మహిళా సంఘం అధ్యక్షురాలు*

తెలంగాణ రాష్ట్రంలో గాలి పీల్చుకోవాలని కలలు కన్న ఆయన ఆ కల సాకారం అయ్యే సమయంలో చనిపోవటం దురదృష్టకరం.

**– మధుసూదన్‌రెడ్డి,** *ఇంటర్ విద్యా జేఏసీ కన్వీనర్*

## అనుబంధం

# విషాద తెలుగు సమాజం

**– ప్రొ॥ జి. హరగోపాల్**

గత రెండు సంవత్సరాలలో తెలుగు సమాజం చాలా మంది విలువైన, ప్రజాస్వామ్య భావాలకు, ఆచరణకు కట్టుబడి, ఒక మెరుగైన సమాజం కొరకు అవిశ్రాంతంగా కృషి చేసిన వారిని కోల్పోయింది. ఇంత మందిని ఒకటో, రెండో సంవత్సరాలలో కోల్పోవడం వలన సామాజిక పరిణామ క్రమంలో దానికి దోహదపడే ప్రక్రియలో చాలా ఖాళీలు ఏర్పడ్డాయి. ఇవి పూరించడం సమాజానికి సాధ్యమౌతుందో, ఉద్యమాలు మళ్ళీ ఇటువంటి మనుషులను రూపొందించుకోగలుగుతాయో, అనుమానమే. ఎందుకో కొందరు వ్యక్తులను, వ్యక్తిత్వాలను రూపొందించుకోవడానికి ఆ వ్యక్తుల వ్యక్తిగత కృషికి ఎంత పాత్ర వుంటుందో, సమాజానికి కూడా అంతే కీలకమైన పాత్ర ఉంటుంది. మన సమాజంలో ఈనాడు జరుగుతున్నన్ని ఉద్యమాలు, విప్లవ ఉద్యమం మొదలుకొని అస్తిత్వ ఉద్యమాల దాకా, పౌరహక్కుల ఉద్యమం మొదలుకొని ప్రజాస్వామ్య సంభాషణ, ఘర్షణ దాకా పలురూపాల ఉద్యమాలు ఉన్నాయి. ఈ సామాజిక మథనం నుంచి చాలా విలువలు, విలువైన వ్యక్తులు పుట్టారు. ఆలాంటి వారి మరణాలు నరేంద్రనాథ్‌తో మొదలై బాలగోపాల్, శంకరన్, కణ్ణభిరాన్, రాజగోపాలన్, ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు, బుర్ర రాములు, ఆర్.యస్.రావు, జయశంకర్ దాకా ... ఒక్కొక్క మనిషి మరణం నైతిక విలువలకి, జీవన ప్రయోగాలకి, ప్రజాస్వామ్య పరిణామాన్ని చాలా బలహీనపరచింది. వీళ్ళ జీవితాలు ఉద్యమాలతో పెనవేసుకొని వున్నాయి. ఉద్యమాల నుంచి ఊపిరి పోసుకొని ఉద్యమాలకు ఊపిరి పోసిన ఇంత మందిని కోల్పోయిన తెలుగు సమాజం ఒక విషాద స్థితిలో ఉన్నది. వీరందరిని సృష్టించగలిగిన తెలుగు సమాజం ఒక ఉజ్వలమైన చారిత్రక సాంప్రదాయాన్ని, వారసత్వాన్ని సృష్టించుకోగలిగింది.

ఒక మరణం ఒక జననం సృష్టికి సహజమే కావచ్చు. ఒక వీరుడు నేలకొరిగితే వేల మంది ప్రభవింతురు అన్న విశ్వాసము సమాజానికి అవసరమే. కాని చరిత్రలో కొన్ని దశలు చాలా క్రియాత్మకంగా, సృజనాత్మకంగా వుంటే కొన్ని దశలను చీకటి దశలుగా పేర్కొంటారు. చరిత్రను అలా విడదీయడము శాస్త్రీయమా కాదా అన్న ప్రశ్నను అటుంచి, చరిత్ర మార్పు ఒక్కొక్కసారి వేగంగా, మరొకసారి నిదానంగా వుంటుంది. అప్పుడే మార్క్స్ పరిణామాత్మక మార్పు అంతిమంగా గుణాత్మకంగా మారుతుంది అని సూత్రీకరించినా, మనమిపుడు ఏ దశలో ఉన్నామో కచ్చితంగా చెప్పలేము. కాని కోల్పోయిన మనుషుల్లో రెండు తరాల వాళ్ళున్నారు. కొందరు డెబ్భై, ఎనభై సంవత్సరాలలో మరణిస్తే నరేంద్రనాథ్, బుర్ర రాములు, బాలగోపాల్ యాభై ఐదవ ఏట చనిపోయారు. కొందరు స్వాతంత్రోద్యమ స్ఫూర్తి పొంది, అరవైయవ దశాబ్ద చివరి కాలంలో వచ్చిన ఉద్యమాలు ముఖ్యంగా విప్లవ ఉద్యమాల ప్రభావంతో మరింత పదునైన ఆలోచనలను, ఆచరణను సానబెట్టారు. అరవైయవ దశాబ్ద విప్లవ ఉద్యమాల స్ఫూర్తితో కొత్త ఆచరణకు, ఆలోచనలకు దారి వేసిన కొత్త తరం వారు మరొకరు. ఇందులో ఒక తరం నుంచి ఇంకో తరానికి అందిన వారసత్వం కూడా ఉంది.

ఈ శతాబ్దం ప్రారంభం కావడమే సంక్షోభంతో ప్రారంభమైంది. 9/11 సంఘటనను బూచీగా చూపి అన్ని దేశాల రాజ్య వ్యవస్థలు నియంతృత్వం వైపు ప్రయాణిస్తున్నాయి. ప్రపంచీకరణ అంటే పెట్టుబడి అంతటా విస్తరించడం. అది విస్తరించడానికి రాజ్యాధికారం సహకరించాలి. నిజానికి ఒక దేశంలోని రాజ్యవ్యవస్థ తమ వనరులను, తమ

పెట్టుబడిని రక్షిస్తూ, ప్రజల సార్వభౌమ అధికారానికి ప్రాతినిధ్యం వహిస్తూ తమ భవిష్యత్తును తామే రూపొందించుకోవాలి. అది సిద్ధాంతం. ప్రపంచీకరణ ఈ సిద్ధాంతాన్నే కూలదోసింది. దీనితో జాతీయభావాలు, ఆశయాలు, ఆదర్శాలు కూడా లేకపోవడంతో, రాజకీయ నాయకత్వం ప్రధాన రాజకీయ సంస్కృతి పూర్తిగా దిగజారిపోయింది. ఏ రాజకీయాలు గత రెండు మూడు తరాలకు విశ్వాసాన్ని కలిగించాయో, ఆ రాజకీయాలను ప్రశ్నిస్తూ సమాజాన్ని మరింత వేగంగా మార్చాలన్న ప్రత్యేక ప్రత్యామ్నాయ రాజకీయాలు కొత్త విశ్వాసాలను కొత్త ఆదర్శాలను ముందుకు తీసుకొచ్చాయి. ఈ పరిణామం నుంచి పైన పేర్కొన్న వ్యక్తులందరూ పుట్టుకొచ్చారు. వీళ్ళందరూ వాళ్ళ సమాజిక నేపథ్యంలో కాని వృత్తి పరంగా కాని మధ్యతరగతికి చెందినవారు. ప్రశ్నల్లా ప్రపంచీకరణ నేపథ్యంలో రూపొందుతున్న మధ్యతరగతి ఇలాంటి మనుషులని సృష్టించుకోగలదా? ఎందకో ఇది సాధ్యం కాదేమో అనిపిస్తుంది. వైద్యరంగం నుంచి ఒక రాజగోపాలన్, న్యాయవృత్తి నుంచి ప్రత్తిపాటి, కణ్ణబిరాన్, విద్యారంగం నుంచి బుర్ర రాములు, ఆర్.ఎస్.రావు, జయశంకర్, ఇక నరేంద్రనాథ్, బాలగోపాల్ వాళ్ళ వాళ్ళ రంగాలనే మార్చుకున్నారు. నరేంద్రనాథ్ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లాంటి ప్రతిష్ఠాత్మకమైన వ్యవస్థలో శిక్షణ పొంది, గ్రామాలకు చేరుకున్నారు. బాలగోపాల్ ఎక్కడ ప్రారంభమై ఎక్కడికి చేరుకున్నాడో ఆలోచిస్తేనే ఆశ్చర్యంగా వుంటుంది. శంకరన్ గారి ప్రయోగం ఒక భిన్న ప్రయోగం. రాజ్యాధికారంలో భాగంగా ఉంటూ తన సర్వస్వాన్ని పేదలకొరకు వెచ్చిస్తూ రాజ్యాన్ని, రాజ్య అధికారాన్ని మానవీకరించ ప్రయత్నించాడు. ఆయన జీవిత చివరి దశలో రాజ్యంం పట్ల చాలా నిరాశపడ్డాడు. పద్మభూషణ్‌ను తిరస్కరించాడు. జీవితాలతో ప్రయోగాలు చేసిన వాళ్ళు వీరు. ఈ వరసలో విశ్వాసాల కొరకు ప్రాణాలిచ్చిన వారిని చేరిస్తే మరింత ఉజ్వలమైన చరిత్ర దర్శనమిస్తుంది.

ఇప్పుడున్న పరిస్థితుల్లో విద్యారంగం నుంచి, వైద్య రంగం నుంచి న్యాయవృత్తి నుంచి ఇంత ఎత్తుగా ఎదిగి తమ జీవితాలను విలువల కొరకు, విశ్వాసాల కొరకు అంకితం చేస్తారా? మా లాంటి వాళ్ళమే కొంత రాజీపడి బతుకుతున్నట్లు అనిపిస్తుంది. ఇంత మంది మధ్య కలసి పనిచేసినా మా పరిస్థితే ఇలా వుంటే, వీళ్ళందరు లేని సామాజిక స్థితిని ఊహిస్తేనే కష్టంగా వుంది. నిజానికి వీళ్ళందరూ ఒకే స్థాయిలో పనిచేసిన మనుషులు కారు. ఒకే ఆశయం కొరకు కూడా పనిచేయలేదు. కాని వాళ్ళ వాళ్ళ వ్యక్తిగత జీవితంలో అత్యున్నతమైన విలువలను పాటించారు. వాళ్ళ వాళ్ళ రాజకీయ అభిప్రాయాలతో అందరికీ అంగీకారం లేకపోవచ్చు. వాళ్ళమీద ఎన్ని విమర్శలు, వివాదాలున్నా వాళ్ళ వ్యక్తిగత జీవన సరళిని, నిజాయితీని ప్రశ్నించడం కష్టం. ఈ నిజాయితీకి మూలం వాళ్ళు తమ వ్యక్తిగత జీవితాలను సమూహంలో భాగంగా చూశారు. ఇలాంటి ప్రక్రియను అడ్డుకోవడానికి నూతన ఆర్థిక విధానం వ్యక్తిని సమాజం నుంచి విడగొట్టడం తన ప్రధాన లక్ష్యంగా ఎన్నుకున్నది. మనిషి స్వప్రయోజనం కొరకు బ్రతుకుతాడా అనే దగ్గర ప్రారంభమై, మనిషి స్వార్థపరుడు అనే దాకా లాగి, స్వార్థం ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు ప్రయోజనాన్ని చేకూరుస్తుంది అని ప్రతిపాదిస్తున్నది. నిజమైన ప్రమాదం ఈ ప్రతిపాదన పునాదిలో ఉంది. ఈ పునాదిని ప్రశ్నించకుండా విపరీతమైన గందరగోళాన్ని సృష్టించి, మధ్యతరగతి యువతరాన్ని స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా, సాహసంగా ఆలోచింపనీయడం లేదు. అందుకే ఇప్పటి తరం నుంచి ఇలాంటి వ్యక్తులు తయారౌతారా అన్న ప్రశ్నను మళ్ళీ మళ్ళీ అడగవలసి వస్తుంది.

ఈ వ్యాస ఉద్దేశం నిరాశకాదు – 'దీని ఉద్దేశం మనమిప్పుడు సీరియస్‌గా ఆలోచించవలసిన తరుణమని, ఒకసారి గద్దర్ ఈ అంశాన్ని చర్చిస్తూ 1930వ దశకం చాలా మంది గొప్ప మేధావులు, కవులు, రచయితలు కనిపిస్తారు. ఆ స్థాయిలో ఉన్న వ్యక్తులు ఇప్పుడు ఎందుకు లేరు అని అడిగినప్పుడు, బహుశా ఆలాంటి సున్నితమైన, సునిశితమైన మనుషులు ఉద్యమ ఆచరణలో వున్నారేమో! అని నాకు అనిపించింది. అంతిమంగా విజ్ఞానం మనిషి ఆచరణలోనే ఫలవంతమవుతుందన్న మార్క్స్ రాజకీయ సైద్ధాంతిక చట్రం ప్రయాణంలో సమాజాన్ని విశ్లేషిస్తున్న వారికంటే సమాజాన్ని మారుస్తున్నవారే కీలకం. విజ్ఞాన సృష్టి, ఆశయాల పునాది, ఆచరణ నిబద్ధత వ్యక్తిగత నిజాయితీ ఇవన్నీ పరస్పర ఆధారిత అంశాలే. ఇప్పటి విశ్వ విద్యాలయ మేధావుల ఆలోచనా క్రమంలో ఇవేవీ

ఇమడవు. తమ వ్యక్తిగత ప్రజ్ఞ. చెప్పిన విషయాన్ని ఎంతో సంక్లిష్టంగా మార్చి చెప్పడం, బయట సమాజంతో ఎలాంటి సృజనాత్మక సంబంధాలు లేకపోవడంతో తాము స్ఫూర్తి పొందలేక విద్యార్థులకు స్ఫూర్తిని అందించలేక పోవడం కూడా విశ్వవిద్యాలయాల భావ దారిద్ర్యానికి కారణం కావచ్చు. నిజానికి ఆందోళన కలిగిస్తున్న అంశం రాజకీయ జీవన పతనం. రెండు కళ్ళు, రెండు నాలుకలు, పైన ఒక మాట లోపల మరొక ఆట. చెప్పిన దానికి కట్టుబడి ఉండకపోవడం మన రాజకీయాలలో సర్వత్రా వ్యాపించింది. మన రాష్ట్రంలో రెండు ప్రాంతాల నాయకులు ముఖ్యంగా తెలంగాణ ప్రాంత రాజకీయాలు విసుగు పుట్టించి, అపహాస్యాన్ని కలిగిస్తున్నాయి. రాజకీయ జీవన పతనం అన్ని జీవన రంగాలను ప్రభావితం చేస్తున్నది. ఈ పతనంలో భాగం కాకుండా దానికి ఎదురు నిలిచి, దాన్ని ప్రశ్నించి ప్రత్యామ్నాయం కొరకు వెతికిన వారు ఈ వ్యాసంలో ప్రస్తావించిన వ్యక్తులు. వీళ్ళంతా ఉద్యమాలతో స్ఫూర్తి పొందారు. త్యాగాలతో మరింత పట్టుదలగా పనిచేశారు. ఎక్కడా వెనకడుగు వేయలేదు. అప్పటి అస్తిత్వ ఉద్యమాల ఆవిర్భావంతో చరిత్ర ఒక మలుపు తిరిగినా, చీలికలు పీలికల వలన సమష్టి కృషి పక్కకు పెట్టి, కనీసం స్నేహితులుగానన్నా కొనసాగలేకపోతున్నారు. చాలా చాలా చిన్న విషక్ష్మీఆలు, ఇగోలు, పరస్పర అసూయలు నాకు తెలిసిన సంస్థల్లో కూడా చూస్తున్నాం. భావాలలో, విశ్వాసాలలో బేధాభిప్రాయాలుండడం ఒక రకంగా ఆరోగ్యకరమే కాని వ్యక్తిగత విషక్ష్మీఆలు, ప్రయోజనాలు బలీయమైనప్పుడు వాటిని సైద్ధాంతిక తేడాలుగా చిత్రీకరించడం విచిత్రమైన పరిణామం. నేను వ్యక్తిగతంగా అభిమానించిన సంస్థలలో కూడా ఇలాంటి విభేదాలు రావడం చాలా విషాదం. ఇలాంటి సంస్కృతి ఉదాత్తమైన మనుషులను, ఉన్నతమైన విలువలను సమాజానికి అందించగలదా? ఈ వ్యక్తిగత మరణాలు ఒకవైపు తెలుగు సమాజం విషాధమైతే ప్రధాన స్రవంతి రాజకీయాల దిగజారుడుతో బాటు అన్ని ప్రజా సంస్థలలో నెలకొంటున్న అప్రజాస్వామిక సంస్కృతి నరేంద్రనాథ్, బాలగోపాల్, కణ్ణబిరాన్, శంకరన్, రాజగోపాలన్, బుర్ర రాములు, ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు, ఆర్.యస్. రావు, జయశంకర్ లాంటి ఉదాత్తమైన వ్యక్తులను రాబోయే తరం ఎలా ఉండబోతున్నది. భవిష్యత్ తరాల మాటేమిటి అన్న ప్రశ్న కూడా వుంది. ఆశయాలతో కూడిన ప్రజా సంస్థల్లో కూడా అంతర్గత సంస్కృతి, ప్రధాన రాజకీయ జనజీవన సంస్కృతి ప్రభావం నుంచి తప్పించుకోలేకపోతున్నదా? తప్పించుకోకపోతే ఇంత సంస్కారవంతమైన ఉదాత్త వ్యక్తులను మధ్యతరగతి వ్యక్తులను ఎలా సృష్టించగలం? జీవిత కాలం ఈ విశిష్ట వ్యక్తులు పాటించిన విలువలను వ్యవస్థీకరించగలదా అన్నదే ఈనాడు తెలుగు సమాజం ముందున్న సవాలు. విలువలు సామాజిక సంబంధాలలో భాగం కాకపోతే సమాజం నైతికంగా, రాజకీయంగా పేదరాలుగానే వుండిపోతుంది.

ఆంధ్రజ్యోతి దినపత్రిక
29 జూన్, 2011

**– ప్రొ. జి. హరగోపాల్**

తెలంగాణ వేరైతే దేశానికి ఆపత్తా, తెలంగాణ వేరైతే తెలుగుబాస మరుస్తారా
రూపాయికి పైసలు నూరు కాకపోతాయా? కోర్టు అమలు అధికారము
ఐపిసి మారుతుందా? ప్రాజెక్టులు కట్టుకున్నా ఆగనంటుందా?
పోచంపాడు వెలసి కూడా పొలములెండిపోతాయా?

**– కాళోజీ**

ట్యాంక్‌బండ్‌పై జయశంకర్ విగ్రహాన్ని పెట్టాలి.
భూమి పుత్రుడు జయశంకర్‌కు మరణం లేదు

**– నజ్మా హెప్తుల్లా**




శ్రీ కృష్ణ కమిటీ తన సంవత్సర కాల పరిశోధనలో ఏం తేల్చిందో.. ఎన్ని అబద్ధాలు చెప్పిందో.. ప్రజలను ఏవిధంగా మోసం చేసిందో.. అనే అన్ని అంశాలను ప్రముఖుల వ్యాసాలు, అభిప్రాయాలు మరియు పత్రికల విశ్లేషణలతో కూడిన పుస్తకం

**ప్రజల్ని విస్మరించిన శ్రీ కృష్ణ నివేదిక 2011**

తెలంగాణ రిసోర్స్ సెంటర్, హిమాయత్ నగర్, హైదరాబాద్.




శ్రీ కృష్ణ కమిటీ తన సంవత్సర కాల పరిశోధనలో చేసిన అధ్యాయనాన్ని 8వ అధ్యాయంగా ఒక మోసపూరిత రహస్య నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. ఆ నివేదికలో ఏముంది? అనే అన్ని అంశాలను ప్రముఖుల వ్యాసాలు, అభిప్రాయాలు మరియు పత్రికల విశ్లేషణలతో కూడిన పుస్తకం

**ప్రజల్ని విస్మరించిన శ్రీ కృష్ణ నివేదిక 2011**

తెలంగాణ రిసోర్స్ సెంటర్, హిమాయత్ నగర్, హైదరాబాద్.




శ్రీ కృష్ణ కమిటీ రహస్య నివేదికైనా 8వ అధ్యాయం అమలులో భాగమే 177 జీవో : హక్కులను కాలరాసే ఆ జీవో పూర్వాపరాల సంకలనమే మా **'అణచివేత ఉరఫ్ 177 జీవో'**

తెలంగాణ రిసోర్స్ సెంటర్, హిమాయత్ నగర్, హైదరాబాద్.




తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు దశకు వచ్చిన ప్రతిసారి ఏదో ఒక సాకుతో వాయిదా వేయిస్తూ హైదరాబాదును కేంద్రపాలిత ప్రాంతం చేయమని, దేశానికి రెండవ రాజధాని చేయమని వెర్రి కూతలు కూస్తున్న సీమాంధ్ర రాజకీయ నాయకుల వాదనలకు సరియైన సమాధానం ఈ హమారా హైదరాబాద్

**తెలంగాణ విద్యార్థి గొంతుక ప్రచురణలు**

ప్రతులకు : సహచర, దిశ బుక్ షాపులు

సీమాంధ్రుల స్వార్థ చింతన ఎంత దూరం పోతోందంటే ... తెలుగు వాళ్లంతా ఒకే రాష్ట్రంలో ఉండాలంటారు ... కానీ విడిపోతే మాత్రం హైదరాబాద్ మాకు కావాలంటున్నారు. ఇదెక్కడి తర్కం? హైదరాబాద్‌కు దాదాపుగా 500 ఏళ్ల చరిత్ర ఉంది. ఎట్ల డెవలప్‌మెంట్ అయ్యిందిది? కుతుబ్‌షాహీల నుంచి ... నిజాం ప్రభువుల దాకా గొప్ప చరిత్ర ఉంది. అయితే ఇప్పటి చట్టం చెబుతున్నది ఏంటంటే ... ఇప్పుడు చంద్రబాబు నాయుడు , రాజశేఖర్ రెడ్డి స్థానికులట ... జయశంకర్ స్థానికేతరుడు. ఇక్కడి వాళ్లు పరాయి వాళ్లయిన ఘోర సన్నివేశమిది. నిజానికి హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది 5 శతాబ్దాల కాలంలో తెలంగాణవాసులే. తమ రక్తం, చెమటతో దీనిని నిర్మించుకున్నారు.

– ప్రొ॥ జయశంకర్





ప్రొ. జయశంకర్ భౌతికకాయంపై శ్రద్ధాంజలి ఘటిస్తూ తెలంగాణ సాధనకోసం కృషి చేస్తామని ప్రమాణం చేస్తున్న తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు

TELANGANA RESOURCE CENTRE
"CHANDRAM", 490, St. No. 11, Himayatnagar, Hyderabad-500 029.
Telanganaresource@gmail.com; Mobile : 9030626288